

'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే
నాకు అసలైన పండుగ రోజు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+32 పేజీల ఆదివారం అనుబంధం

వెల: ₹ 7.00

సంపుటి: 17
సంచిక: 162

ఆదివారం 1-9-2024



సొసైటీ...
చట్టమూ
మారాలి
భయపెట్టేలా
ఉండాలి.
- IIలో



కడుపులో
వాయు
గుండం
- IIలో

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

సొసైటీ... చట్టమూ మారాలి

భయపెట్టేలా ఉండాలి

- ఈషా రెబ్బా



కోల్‌కతాలో వైద్యురాలిపై హత్యాచారం.... వెలుగులోకి రానివి ఇంకా ఎన్నో... ఏం చేస్తే నేరాలు తగ్గుతాయి? 'చట్టం మారాలి... అమ్మాయిలు నిర్భయంగా ఉండేలా సమాజం మారాలి' అంటున్నారు ఈషా రెబ్బా. అంతేకాదు... నెగటివిటీని ఇంధనంలా చేసుకుని అమ్మాయిలు ముందుకు సాగాలని కూడా అంటున్నారు. ఇంకా 'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు విషయాలను ఈ విధంగా పంచుకున్నారు.

■ రిపోర్ట్ చేయనివి ఎన్నో!

హత్యాచారాలు జరిగినప్పుడు ర్యాలీలు, ధర్నాలు, కొవ్వొత్తులతో నిరసన... ఇలా చాలా చేస్తుంటాం. ఈ అన్యాయాలకు మన కోపాన్ని ఆ విధంగా ప్రదర్శిస్తాం. కానీ ఒకటి జరిగిన కొన్ని రోజుల్లోనే ఇంకోటి. ఈ మధ్యే కోల్‌కతాలో ఒక ఘటన జరిగింది. ఆ తర్వాతా కొన్ని వెలుగులోకి వచ్చాయి. ఏం చేస్తే ఇవి ఆగుతాయి? ఆగడానికి పరిష్కారమే లేదా? అనే భయం ఉంది. ఇలాంటి వార్తలు విన్నా, చూసినా చాలా ఆవేదన. రేప్ అనేది చాలా పెద్ద క్రైమ్. మన దగ్గర రేప్ కేసుల సంఖ్య చాలా ఎక్కువ. ఇలాంటి దారుణాలు ఇంతకు ముందు కూడా జరిగాయి. ఇప్పుడు సోషల్ మీడియా వల్ల బాగా తెలుస్తున్నాయి. ఇవన్నీ రిపోర్ట్ చేసిన కేసులు... రిపోర్ట్ చేయనివి ఎన్నో! మన న్యాయ వ్యవస్థని మరింత కఠినంగా మార్చుకోవాలి. అలా ఉంటే అయినా ఇలాంటి ఘటనలు కాస్త తగ్గుతాయని నా అభిప్రాయం.

■ భయపెట్టాలి

రేప్ జరగడానికి కారణాలు ఏమై ఉంటాయని మొన్న సర్వే చేశారు. అందులో ఓ క్యాబ్ డ్రైవర్‌తో పాటు ఎక్కువ శాతం మంది చెప్పిన సమాధానం... అమ్మాయిలు పొట్టి బట్టలు వేసుకోవడం. ఇంకొంత మంది ఇంకేదో కారణం. వాళ్ల ఆలోచనా విధానం ఎలా ఉందో చూడండి. మన రాజకీయ నాయకులు కూడా కొందరు ఇంకా ఓల్డ్ స్కూల్ స్టయిల్‌లోనే ఆలోచిస్తున్నారు. వాళ్లు కూడా సమస్య బట్టల్లోనే ఉందంటారు. కొన్ని దేశాల్లో ఇన్వెస్టిగేషన్ చాలా త్వరగా అవుతుంది. వెంటనే ఉరి తీసే దేశాలు ఉన్నాయి. లా స్ట్రిక్ట్‌గా ఉండటం అంటే చంపేయమని కాదు. ఇన్వెస్టిగేషన్ త్వరగా, క్లియర్‌గా చేయడం. తప్పు చేశాడని రుజువు అయిన వెంటనే శిక్షించాలి. అమెరికాలో ట్రాఫిక్ సిగ్నల్ జంప్ చేయాలంటేనే భయపడతారు. పాయింట్స్ తగ్గిపోతాయేమో అని. చిన్న చిన్న విషయాల్లో అంత కఠినంగా ఉన్నారంటే ఆలోచించండి. అనుకున్న వెంటనే చట్టం అయిపోదు. మన లా రేపిస్ట్‌ల మీద అంత కఠినంగా లేదు. ఇలాంటి తప్పు చేస్తే శిక్ష ఇంత భయంకరంగా ఉంటుందని తెలిసేలా చేయాలి. ఇలా చేస్తే ఆగిపోతాయని నేను అనను. అలా అయినా ఎంతో కొంత భయం కలుగుతుందేమో. ముందు భయపెట్టాలి. ఇంట్లోవాళ్లు హెల్మెట్ పెట్టుకో అంటున్నా పెట్టుకోరు చాలా మంది. కానీ 2000 రూపాయలు జరిమానా విధిస్తారంటే ఆ భయంతో అయినా పెట్టుకుంటారు. సో.. 'లా' భయపెట్టేలా ఉండాలి.

■ అమ్మాయిలకు బోలెడు ఆంక్షలు

హీరోయిన్ అనే కాదు ఏ అమ్మాయి అయినా తన శరీరం... తన ఇష్టం. అబ్బాయిలు వాళ్లకు నచ్చినట్టు కూర్చుంటారు. నచ్చిన చోటుకి వెళ్తారు. నచ్చిన టైమ్‌లో వెళ్తారు. మాక్కూడా ఆ స్వాతంత్ర్యం కావాలి. అమ్మాయిలకు బోలెడన్ని ఆంక్షలు.. ఇలా కూర్చోవాలి... అలా కూడదు. ఇలా మాట్లాడాలి... అలా కూడదు. చిన్నప్పటి నుంచి ఇలా పరిమితులు పెట్టిన వాతావరణంలోనే దాదాపు అందరం పెరిగి ఉంటాం. అమ్మాయిలందరూ నిర్భయంగా ఉండే సమాజం ఏర్పాటు జరగాలి.

■ కంఫర్ట్ జోన్‌లో ఉండకూడదు

నేను ఇంట్రావర్ట్‌ని. నాకు తెలిసిన అతి కొద్ది మంది దగ్గర మాత్రమే హైపర్ ఎనర్జీతో ఉండగలను. కానీ నాకు యాక్టింగ్ అంటే చాలా ఇష్టం. యాక్టింగ్ అంటే రోజూ ఓ వంద మంది ఉంటారు సెట్‌లో. కానీ చేయాలి. మనల్ని మనం ఎప్పుడూ కంఫర్ట్ జోన్‌లో పెట్టుకుని ఉండకూడదు. మనకున్న భయాలను ఫేస్ చేస్తూ ముందుకెళ్లడమే. ఉదాహరణకు నాకు నీళ్లంటే చాలా భయం. దాంతో నీళ్లల్లో దిగేదాన్ని కాదు. కానీ ఎన్నాళ్లని అలా దాటేస్తాను? ధైర్యం తెచ్చుకున్నాను. స్విమ్మింగ్ నేర్చుకున్నాను. ఇప్పుడు ఆ భయం పోగొట్టుకున్నాను. ప్రతి భయాన్ని అధిగమిస్తామో లేదో ఖచ్చితంగా చెప్పలేం. కానీ ప్రయత్నం మాత్రం చేయాలి. చిన్న చిన్న భయాల్ని అధిగమిస్తేనే జీవితంలో పెద్ద పెద్ద సవాళ్లని, సమస్యలను ఎదుర్కోవచ్చు.

■ లీవ్ ఇస్తే బెటరే

ఆడవాళ్లకు గవర్నమెంట్ అధికారికంగా పీరియడ్ లీవ్ ఇచ్చినా ఇవ్వకపోయినా, ఒకవేళ నొప్పి తీవ్రంగా ఉంటే మనమే సెలవు పెడతాం. అయితే గవర్నమెంట్ ఇస్తే ఇంకా బాగుంటుంది. కొంత మంది తట్టుకోలేనంత నొప్పితో బాధ పడుతుంటారు. కొంతమంది నడవలేరు కూడా. ఒకవేళ సెలవు పెడితే జీతం కట్ అవుతుంది లేదా ఆల్రెడీ ఆ నెలకు సరిపడా లీవ్స్ తీసేసుకోవడం వల్ల మళ్లీ లీవ్ అంటే ఆలోచించాలి. అందుకే ఆ ఇబ్బందిని భరిస్తూనే పనులకు వెళ్తుంటారు. ఆ మూడు రోజులు సెలవు రోజులుగా పరిగణిస్తే బాగుంటుందని నా అభిప్రాయం.

■ నిన్ను నువ్వు నమ్మాలి

మన జీవితంలో ప్రతి స్టేజీలో ఎవరో ఒకరు మనల్ని 'నువ్వు చేయలేవు అనో, నీ వల్ల కాదు' అనో అంటారు. వాళ్లకు పూర్తిగా తెలియదు కదా మన గురించి. అందుకే నీ పని నువ్వు చేసుకుంటూ ముందుకెళ్లడమే. ఎందుకంటే అనేవాళ్లు ఎప్పుడూ అక్కడే ఆగిపోతారు. నిన్ను నువ్వు నమ్మాలి... కష్టపడాలి. నెగటివిటీని మనల్ని కిందకు తోసేలా కాకుండా పైకి తీసుకెళ్లే ఇంధనంలా వాడుకోవాలి.

– డి.జి. భవాని

వెరీ హ్యాపీ

కెరీర్ పరంగా నేను చాలా హ్యాపీ. మంచి కథలన్నీ వస్తున్నాయి. కోవిడ్ తర్వాత కథల్లో వైవిధ్యం పెరిగింది. రియలిస్టిక్‌గా ఉండే కథలు, అన్ని జానర్స్ కథలు చెప్పడానికి ఓటీటీ ఉంది. అన్ని రకాల పాత్రలు చేయడానికి యాక్టర్స్‌కి ఇది మంచి టైమ్ అని చెప్పొచ్చు. కోవిడ్ ముందు, కోవిడ్ తర్వాత వచ్చే కథల్లో తేడా తెలుస్తోంది. సినిమాల్ని, కథల్ని చూడటంలో ప్రేక్షకుల్లో చాలా మార్పు వచ్చింది. సబ్ టైటిల్స్‌తో అన్ని భాషల్లో సినిమాలను చూస్తున్నారు. అన్ని సినిమాలు అన్ని భాషల్లో డబ్ చేస్తున్నారు. సో... సినిమా బాగుంటేనే థియేటర్స్‌కి వస్తున్నారు. అలా థియేటర్స్‌కి రప్పించాలంటే కచ్చితంగా ఏదో కొత్త ఎక్స్‌పీరియన్స్ అందించాలి.



నేటి 'సాక్షి' ఈపేపర్‌లో 'సినిమా' పేజీ

'సాక్షి' ఈపేపర్‌లో ప్రతిరోజూ ఓ స్పెషల్ ఫ్యామిలీ పేజీ

✻ హోమ్‌లెస్

'ఎవరితోనూ కలవలేను, ఎవరికీ చెందిన దానిని కాను అనే భావనతో జీవితమంతా గడిపాను' అంటోంది 'హోమ్‌లెస్' రచయిత్రి కె. వైశాలి. అస్తవ్యస్తంగా పలకడం, రాయడం అనే డిస్‌లెక్సియా, డిస్‌గ్రాఫియా సమస్యలను అధిగమించి తన అనుభవాలను అక్షర రూపంగా మార్చి పుస్తకంగా తీసుకొచ్చింది. ఈ ఏడాది సాహిత్య అకాడమీ యువ పురస్కార్ (ఇంగ్లీష్) అవార్డును గెలుచుకున్న వైశాలి 22 ఏళ్ల వయసులో ముంబైలోని తన ఇంటి నుంచి బయటకు వచ్చి, హైదరాబాద్‌లో ఎలాంటి వసతులూ లేని హాస్టల్ రూమ్‌లో ఉంటూ తనలో చెలరేగే సంఘర్షణలకు సమాధానాలు వెతుక్కుంది. దేశంలో పెరుగుతున్న డిస్‌లెక్సియా బాధితులకు ఈ పుస్తకం ఒక జ్ఞాపిక అని చెబుతుంది. తనలాంటి సమస్యలతో బాధపడుతున్నవారిని కలుసుకుని, వారి అభివృద్ధికి కృషి చేస్తోంది.



కె. వైశాలి

ఓ గూటికి చేరిన చెదిరిన అక్షరం

'సాహిత్య అకాడమీ యువ పురస్కారం అందుకోవడం అంటే నేను ప్రతి ఒక్కరికీ సమర్థురాలిగానే కనిపిస్తాను' అంటూ 'హోమ్‌లెస్' పుస్తకం గురించి వైశాలి రాసిన వాక్యాలు మనల్ని ఆలోచింపచేస్తాయి. బయటకు చెప్పుకోవడం చిన్నతనంగా భావించే వ్యక్తిగత సమస్యలపై వైశాలి ఒక పుస్తకం ద్వారా తనను తాను పరిచయం చేసుకుంటుంది. వ్యక్తిగత జీవితం, సమాజం పట్టించుకోని మానసిక వైకల్యాలు ఉన్న పిల్లలకు వసతి కల్పించడంలో విఫలమయ్యే విద్యావ్యవస్థలోని లోపాలు, నిబంధనలను ధిక్కరించే వారి పట్ల సమాజం చూపే అసహనం వంటి అంశాలెన్నింటినో వైశాలి కథనం మనకు పరిచయం చేస్తుంది.

''నా బాల్యంలో డిస్‌లెక్సియా, డిస్‌గ్రాఫియాల (అస్తవ్యస్తంగా పలకడం, రాయడం) ప్రభావాన్ని అధిగమించడానికే ఎన్నో ప్రయత్నాలు చేయాల్సి వచ్చింది. ఈ కథను చెప్పడానికి నా బాల్యంలోని అన్ని అంశాలనూ అనేకసార్లు గుర్తుచేసుకున్నాను. పదే పదే పునశ్చరణ చేసుకున్నాను.

బాధపెట్టిన బాల్యం

నాలో ఉన్న న్యూరో డైవర్జన్స్ నన్ను నిరాశపరచేవి. వాటి వల్ల ఎవరితోనూ కలిసేదాన్ని కాదు. ఎప్పుడూ ఒంటరిగానే ఉండేదానిని. నాలోని రుగ్మతలను ఇంట్లో రహస్యంగా ఉంచేవాళ్లు. నిర్ధారించని రుగ్మతల కారణంగా భయంతో నా రాతలు ఎవరికీ తెలియకుండా దాచేదాన్ని. నాలోని ఆందోళనలను, రుగ్మతలను నేనే పెంచి ఉంటానా? నేను ఇంపోస్టర్ సిండ్రోమ్ (తమ ప్రవర్తన, తెలివి తేటలపై తమకే అనుమానాలు ఉండటం)తో బాధపడుతున్నానా?.. ఇలా ఎన్నో సందేహాలు ఉండేవి.

అద్దెలేని హాస్టల్ గదిలో..


ఇరవై ఏళ్ల వయస్సులో చదవడం, రాయడం, అర్థం చేసుకోవడం ప్రారంభించాను. నాదైన మార్గం అన్వేషించడానికి మా ఇంటిని వదిలేశాను. అటూ ఇటూ తిరిగి హైదరాబాద్ చేరుకున్నా. నా దగ్గర డబ్బుల్లేవు. మొత్తానికి మురికిగా, ఈగలు దోమలు ఉండే ఓ హాస్టల్‌లో గది ఇవ్వడానికి ఒప్పుకున్నారు అక్కడి యజమాని. ఆ హాస్టల్ గదికి తలుపులు కూడా సరిగ్గా లేవు. అలాంటి చోట నా అనుభవాల నుంచి ఒక పుస్తకం రాస్తూ, నా పరిస్థితిని చక్కదిద్దుకోవడానికి ప్రయత్నించాల్సి వచ్చింది. డిస్‌లెక్సియా బాధితురాలిని, స్వలింగ సంపర్కం, ప్రేమలో పడటం, బాధాకరంగా విడిపోవడం, చదువులో ఫెయిల్, అనారోగ్యం, నిరాశ, జీవించడం అంటే ఏంటో అర్థం కాని ఆందోళనల నుంచి నన్ను నేను తెలుసుకుంటూ చేసిన ప్రయాణమే హోమ్‌లెస్ పుస్తకం.

కోపగించుకున్నా.. కుటుంబ మద్దతు

ఢిల్లీలో జరిగిన పుస్తకావిష్కరణకు మా అమ్మ హాజరైంది. ఆమె నాకు ఇచ్చిన ఆసరా సామాన్యమైనది కాదు. అయితే, మొదట నా పుస్తకంలోని రాతల వల్ల అమ్మ మనస్తాపం చెందింది. కానీ, నేనెందుకు అలా నా గురించి బయటకు చెప్పాల్సి వచ్చిందో ఓపికగా వివరించాను. అవార్డు రావడంతో నాపై ఉన్న కోపం పోయింది'' అని ఆనందంగా వివరిస్తుంది వైశాలి.

సమాజంలో మార్పుకు

అనిశ్చితి, దుఃఖం, గజిబిజిగా అనిపించే వైశాలి మనస్తత్వం నుంచి పుట్టుకు వచ్చిన ఈ పుస్తక ప్రయాణం ఒక వింతగా అనిపిస్తుంది. సైమన్, ఘుస్టర్, యోడా ప్రెస్ సంయుక్తంగా వైశాలి పుస్తకాన్ని మన ముందుకు తీసుకువచ్చాయి. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ సెక్రటరీ ప్రొఫెసర్ మనీష్ ఆర్ జోషీ రాసిన అభినందన లేఖ వైశాలికి ఎంతో ఓదార్పు నిచ్చింది. 'డిస్‌లెక్సిక్ వ్యక్తుల గురించిన విధానాలు, చట్టం, మార్గదర్శకాలపై నా పుస్తకం ప్రభావం చూపగలదని ఆశాజనకంగా ఉంది. గదిలో ఒంటరిగా కూర్చుని రాసుకున్న పుస్తకం సమాజంలో మార్పుకు దారితీస్తుందని తెలిసి ఆశ్చర్యంగా, ఆనందంగా ఉంది' అని చెబుతుంది వైశాలి. తన పుస్తకం తనలాంటి సమస్యలు ఉన్న వారితో ఓ 'గూడు'ను కనుగొన్నట్టు చెబుతుంది వైశాలి.



డిస్‌లెక్సియా, డిస్‌గ్రాఫియా అంటే...
చిన్నారికి బాగా తెలిసినదే అయినా ఒక మాటను పలికేటప్పుడో లేదా చదివేటప్పుడో తక్కున పలకలేక అస్తవ్యస్తంగా పలకడాన్ని 'డిస్‌లెక్సియా' అని చెప్పవచ్చు. డిస్‌గ్రాఫియా అంటే ఇలాంటి సమస్యే రాయడంలో ఎదురు కావడం.

హెల్త్

● చ'లో ఫోడ్‌మ్యాప్'

కడుపులో వాయు గుండం



లో ఫోడ్‌మ్యాప్ ఆహారంతో కింది నుంచి గ్యాస్‌పోవడం, కడుపు ఉబ్బరంగా ఉండటం, కడుపులో ఇబ్బంది / నొప్పి, విసర్జక అలవాట్లలో మార్పురావడం వంటి కొన్ని సమస్యలకు అడ్డుకట్ట వేయవచ్చు. లో ఫోడ్‌మ్యాప్ ఆహారం అంటే ఏమిటో తెలుసుకునేముందు అసలు 'ఫోడ్‌మ్యాప్' ఆహారం అంటే ఏమిటో చూద్దాం.

ఫోడ్‌మ్యాప్ అనేది పిండిపదార్థాలు ఎక్కువగా ఉండే కొన్ని రకాల ఆహారాల ఇంగ్లిష్ పేర్లకు ఉన్న ముందక్షరాలతో ఏర్పడ్డ పదం (ఏక్రోనిమ్).

ఎఫ్ అంటే... ఫెర్మెంటబుల్ (అంటే పులియడం వల్ల గ్యాస్‌కు ఆస్కారమిచ్చే ఆహారాలు)

ఓ అంటే... ఓలిగోశాకరైడ్స్ (గోధుమ, ఉల్లి, వెల్లుల్లి, బీన్స్‌లో ఉండే ఒకరకం పీచుపదార్థం)

డి అంటే... డై శాకరైడ్స్ (అంటే పాలు, పాల ఉత్పాదనల్లో ఉండే ల్యాక్టోజ్ వంటివి వాటిల్లో ఉండి సరిగా అరగక కడుపులో ఇబ్బంది కలిగించేవి)

ఎమ్ అంటే... మోనో శాకరైడ్స్ (అంటే కొన్ని రకాల పండ్లతో పాటు బాగా ప్రాసెస్ అయిన ఆహారాల్లో ఉండే ఫ్రక్టోజ్ వంటి చక్కెరలు)

ఏ అంటే... అండ్ (వాటితో పాటు లేదా మరియు అని అర్థం)

పీ అంటే... పాలియాల్స్ (అంటే చాక్లెట్లు (క్యాండీ), బబుల్‌గమ్ వంటి వాటికి కలిపే షుగర్ ఆల్కహాల్స్ వంటి పదార్థాలు... ఇవి కొన్ని రకాల పండ్లు, శాకాహారాల్లో స్వాభావికంగానే ఉండేవి).

ఈ ముందు అక్షరాలతో కలిపి ఏర్పడ్డ పదమే ఫోడ్‌మ్యాప్. ఈ తరహా ఫోడ్‌మ్యాప్ ఆహారాలకు మూడు రకాల స్వభావాలుంటాయి. వాటి కారణంగా అవి జీర్ణవ్యవస్థపై ప్రతికూలమైన ప్రభావం చూపుతాయి. ఆ స్వభావాలేమిటంటే...

1. చిన్నపేగుల్లోకి అవి అంత బాగా జీర్ణం కావు. (ఇంకిపోవు / శోషణకు గురికావు).

2. పేగుల్లో జీర్ణమయ్యే క్రమంలో చాలా ఎక్కువ నీళ్లను తీసుకుంటాయి.

3. చాలా త్వరగా పులిసిపోయే గుణమున్న కారణంగా అక్కడ ఎక్కువ బ్యాక్టీరియా పుట్టడానికి కారణమవుతాయి.

ఆ పదార్థాలకు ఉన్న ఈ గుణాల కారణంగా కింది నుంచి గ్యాస్‌పోవడం, కడుపు ఉబ్బరంగా ఉండటం, కడుపులో ఇబ్బంది / నొప్పి, విసర్జక అలవాట్లలో మార్పురావడం వంటి ప్రతికూలతలకు కారణమవుతాయి. ముఖ్యంగా పులిసిపోవడం వల్ల గ్యాస్ ఎక్కువగా ఉత్పన్నం కావడం, ఎక్కువగా బ్యాక్టీరియా పుట్టటం దంతో కడుపు ఉబ్బరం, నొప్పి వంటి సమస్యలకు కారణమవుతాయి. ఇక అప్పటికే ఇరిటబుల్ బవెల్ సిండ్రోమ్ (ఐబీఎస్), కడుపు ఉబ్బిపోవడం / కడుపుబ్బరం (బ్లోటింగ్), కడుపునొప్పి, డయేరియా సమస్యలు ఉన్నవారు ఫోడ్‌మ్యాప్ ఆహారం తీసుకోవడం వల్ల పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారే అవకాశముంది. అందుకే ఫోడ్‌మ్యాప్ ఆహారాలకు వీలైనంత దూరంగా ఉంటే వాటికి బదులు... లో (తక్కువ) ఫోడ్‌మ్యాప్ ఆహారాలు తీసుకోవడం ఆ ఇబ్బందులను గణనీయంగా తగ్గిస్తుంది. అయితే ఆ సమస్యలకు లో-ఫోడ్‌మ్యాప్ ఆహారాలు శాశ్వత పరిష్కారం కావుగానీ ఆ ఇబ్బందులను తగ్గించడానికి సహాయపడతాయి. ఇక మొదట్లో లోఫోడ్‌మ్యాప్ ఆహారాలను తీసుకుంటూ పరిస్థితిని చక్కబెడుతూ... అవసరాన్ని బట్టి క్రమంగా హై-ఫోడ్‌మ్యాప్‌కు వెళ్లవచ్చు. వివిధ రకాల ఆహార పదార్థాలను తీసుకోవడం వల్ల జీర్ణవ్యవస్థ ఆరోగ్యాన్ని సమర్థంగా కాపాడుకోవచ్చు.

లో-ఫోడ్‌మ్యాప్ ఆహారాల్లో భాగంగా తీసుకోవాల్సినవి...

కాయధాన్యాల్లో : వరి అన్నం, దంపుడు బియ్యం, జొన్నలు, ఓట్స్, క్వినోవా, చిరుధాన్యాలు

పప్పుధాన్యాల్లో: ఎర్ర పప్పు, పెసరపప్పు, శనగ పప్పు, మినుములు

పండ్లలో: నారింజ, అరటి, కీవీ, నిమ్మ, ద్రాక్ష, నేరేడు, బత్తాయి, స్ట్రాబెర్రీ, బొప్పాయి, కర్బూజ, పైనాపిల్, పియర్

నాన్ వెజిటేరియన్ ప్రోటీన్లలో: గుడ్లు, చికెన్, చేపలు

నట్స్, నూనెగింజల్లో: బాదం, వాల్‌నట్, వేరుశనగలు, పొద్దుతిరుగుడు గింజలు, గుమ్మడిగింజలు, అవిశెగింజలు

పానియాల (బీవరేజెస్)లో : పాలు లేకుండా టీ, కాఫీలు, గ్రీన్ టీ, ఇక్కడ పేర్కొన్న పండ్లతో తయారు చేసిన పండ్లరసాలలో

సుగంధద్రవ్యాలూ, మసాలా దినుసుల్లో : మిరియాలు, అల్లం, ఆవాలు (ఇవన్నీ సాధారణంగా చెప్పిన ఆహారాలు. అయితే వీటి వాడకం వ్యక్తి నుంచి వ్యక్తికి మారుతుంది. వీటిల్లోనూ సరిపడని వాటికి దూరంగా ఉండటం అవసరమవుతుంది).

తీసుకోకూడని ఆహారాలు

తృణధాన్యాలూ, కాయధాన్యాల్లో : గోధుమతో తయరయ్యే ఉత్పాదనలు (ఉదాహరణకు బొంబాయి రవ్వ, మైదా, నూడుల్స్, వర్మిసెల్లీ), బార్లీ.

పప్పు ధాన్యాల్లో : పైన పేర్కొన్నవి గాక ఇతర పప్పులు, బీన్స్ (రాజ్మా, ఛోలే, లోబియా)

శాకాహారాల్లో (వెజిటబుల్స్) : ఉల్లి, వెల్లుల్లి, క్యాబేజీ, కాలీఫ్లవర్, బీట్‌రూట్, మొక్కజొన్న

పండ్లలో : ఆపిల్, మామిడి, పుచ్చకాయ, చెర్రీస్, అంజీర్, దానిమ్మ

పాలఉత్పాదనల్లో : పాలు, పెరుగు, యోగర్ట్, పనీర్, జున్ను, కస్టర్డ్, ఐస్‌క్రీమ్

పానీయాల్లో : ఆల్కహాల్, సాఫ్ట్ డ్రింక్స్, కొబ్బరినీళ్లు

తీపి పదార్థాల్లో : తేనె, కార్న్ సిరప్ వీటితో పాటు అన్ని రకాల బేకరీ ఐటమ్స్, బిస్కెట్లు, చాక్లెట్లు, ప్యాక్ చేసినవీ అలాగే నిల్వ పదార్థాలకు దూరంగా ఉండాలి.

అలాగే తమకు ఏ ఆహారం సరిపడుతోందో, ఏది సరిపడటం లేదో తెలుసుకోడానికి 'ఫుడ్ డైరీ'లో నమోదు చేసుకుంటూ, తమకు సరిపడటం లేదని గుర్తించినవాటికి దూరంగా ఉండాలి.





ఎన్. లక్ష్మి
సీనియర్ కన్సల్టెంట్ న్యూట్రిషనిస్ట్

● ప్రసవం దాకా వేదన

ఇంతలా వాంతులా?



గర్భం దాల్చిన మహిళల్లో వాంతులు మామూలుగా మొదటి మూడు నెలలు (ఫస్ట్ ట్రైమిస్టర్) లోనే అవుతుంటాయి. ఇది చాలా సాధారణం. దీన్నే మామూలుగా 'మార్నింగ్ సిక్‌నెస్' అని చెబుతుంటారు. కానీ కొందరిలో వాంతులు, వికారం చాలా సుదీర్ఘకాలం పాటు అవుతూ ఉంటూ ఇబ్బంది పెడుతుంటాయి. ఇలా ఆగకుండా వాంతులు అవుతూ ఉండే కండిషన్‌ను వైద్య పరిభాషలో 'హైపర్ ఎమిసిస్ గ్రేవిడేరమ్' అంటారు. ఈ 'హైపర్ ఎమిసిస్ గ్రేవిడేరమ్' అన్నది మామూలు 'మార్నింగ్ సిక్‌నెస్' కంటే తీవ్రమైన రూపం. దీని తీవ్రత ఎంతంటే... సాధారణంగా మూడునాలుగు నెలల పాటు అయ్యే ఈ వాంతులు కొందరిలో దాదాపు ప్రసవ సమయం వరకూ అవుతూనే ఉంటాయి.

ఇలా ఆదేపనిగా వాంతులు అవుతుండటం వల్ల గర్భిణుల్లో డీహైడ్రేషన్‌తో పాటు ఎలక్ట్రోలైట్ ఇంబాలెన్సెస్ చోటు చేసుకుంటాయి. అంటే ఎంతో నీరు వెళ్లిపోవడంతో పాటు దేహంలోని జీవక్రియలకూ, నరాల నుంచి జరగాల్సిన కమ్యూనికేషన్‌లకు కీలకమైన సోడియమ్, పొటాషియమ్ వంటి లవణాలను కోల్పోతారు. ఉండాల్సిన బరువు కంటే తక్కువకు తగ్గిపోతారు.

కారణాలు: హైపర్ ఎమిసిస్ గ్రేవిడేరమ్‌కు అనేక అంశాలు కారణమవుతాయి. గర్భం దాల్చాక వచ్చే హార్మోనల్ మార్పులే (ముఖ్యంగా హ్యూమన్ కోరియానిక్ గొనాడోట్రాపిన్ (హెచ్‌సీజీ), ఈస్ట్రోజెన్ వంటివి) ఇందుకు ప్రధాన కారణం. కుటుంబ చరిత్రలో ఇది కనిపించేవారిలో ఈ సమస్య కొన్ని తరాలపాటు కొనసాగే అవకాశముంది. థైరాయిడ్, గ్యాస్ట్రో ఇంటస్టినల్ సమస్యలున్నవారిలో, మైగ్రేన్ ఉన్నవారిలో, ప్రయాణాల్లో వాంతులు అయ్యేవారిలో... అంటే మోషన్ సిక్‌నెస్ ఉన్నవారిలో ఇలా జరగడం ఎక్కువని కొన్ని అధ్యయనాల్లో తేలింది.

దుష్ప్రభావాలు...

మూడో నెల (ఫస్ట్ ట్రైమిస్టర్) దాటాక కూడా ఆదేపనిగా వాంతులు అవుతున్న గర్భవతుల్లో ఈ సమస్యను గుర్తించి సరైన చికిత్స అందించకపోతే కొన్ని రకాల సమస్యలు వచ్చే అవకాశముంది. మామూలుగా మహిళలు గర్భందాల్చగానే కొంత బరువు పెరుగుతారు. ఇలా పెరిగే బరువు 7 కిలోల కంటే తక్కువైనప్పుడు బిడ్డ పూర్తిగా నెలలు నిండకముందే పుట్టడం (ప్రీ-టర్మ్ బేబీ), తక్కువ బరువుతో పుట్టడం జరగవచ్చు. అలాగే మాటిమాటికి వాంతుల కారణంగా పోషకాలను కోల్పోయి, కీలకమైన మైక్రో-న్యూట్రియెంట్స్ లోపాల కారణంగా కొందరిలో కాలేయం, కిడ్నీ సమస్యలకు దారితీసే అవకాశం ఉంది. ఇక చాలా అరుదుగా కొందరిలో వెర్నిక్ ఎన్‌సెఫలోపతీ (వెట్ బ్రెయిన్) వంటి మెదడు కాంప్లికేషన్లు, విటమిన్-కె కోల్పోవడం వల్ల బిడ్డ కండరాలు చక్కగా పెరగకపోవడం చాలాచాలా అరుదుగా పిండంలో అబ్‌నార్మాలిటీస్ వచ్చే ఎంబ్రియోపతీ వంటి కండిషన్లూ ఏర్పడే అవకాశముంది.

చికిత్స: ఇలాంటి పేషెంట్స్‌కి డాక్టర్లు ఓరల్ రీహైడ్రేషన్ సొల్యూషన్ ఇస్తారు. తీవ్రత మరీ ఎక్కువగా ఉన్నవారికి సెలైన్ పెడతారు. వాంతులు, వికారం ఫీలింగ్‌ను ఆపడం కోసం యాంటీ నాసియా మందులు ఇస్తారు. కోల్పోతున్న పోషకాలను భర్తీ చేయడం కోసం న్యూట్రిషనల్ సప్లిమెంట్లను ట్యూబ్ ద్వారా పంపుతారు. ఇక జీవనశైలి మార్పులు సూచిస్తూ... చిన్నచిన్న మోతాదుల్లో చాలా ఎక్కువసార్లు తినాలనీ, ఘాటైన వాసనలకు దూరంగా ఉండాలనీ సూచిస్తారు. దేహం కీలకమైన ద్రవాలు (బాడీఫ్లుయిడ్స్), రక్తం కోల్పోతున్న కండిషన్ అయిన హైపోవోలేమియా, మూత్రంలో చాలా ఎక్కువగా కీటోన్ బాడీస్ వెళ్లిపోయే కీటోన్‌యూరియా వంటి కండిషన్లలో సెలైన్ ఇస్తూ కోల్పోయేవాటిని ఇంట్రావీనస్ మార్గంలో భర్తీ చేస్తారు. అలాగే విటమిన్-బి 6నూ భర్తీ చేయాల్సి రావచ్చు. అవసరాన్ని బట్టి యాంటీ హిస్టమైన్స్, డోపమైన్ యాంటగొనిస్ట్స్, సెరిటోనిన్ యాంటగొనిస్ట్స్, చాలా అరుదుగా గ్లూకోకార్టికాయిడ్స్ వంటి చికిత్సలు అవసరమవుతాయి. అన్నిటికంటే ముఖ్యంగా గర్భధారణకు ముందునుంచే మహిళలు ఫోలిక్ యాసిడ్ మాత్రలను వేసుకుంటూ ఉండటం లేదా పాలకూర వంటి ఆకుకూరలను ఎక్కువగా తీసుకుంటూ ఉండటం వారికి చాలా మేలు చేస్తుందని గుర్తించాలి.



డా. స్వప్న సముద్రాల
సీనియర్ గైనకాలజిస్ట్ అండ్ ఆబ్‌స్టెట్రీషియన్

ఆగితే నెలసరి... వ్యాయామం తప్పనిసరి

మహిళల్లో నెలసరి ఆగిపోయాక (మెనోపాజ్ తర్వాత) వచ్చే సమస్యలకు తేలికపాటి వ్యాయామమే మంచి పరిష్కారమని అంటున్నారు స్పెయిన్‌లోని యూనివర్సిటీ ఆఫ్ గ్రెనడాకు చెందిన పరిశోధకులు. వారి అధ్యయనంలో భాగంగా మెనోపాజ్ వచ్చిన కొందరు మహిళకు ఓ 20 వారాల వ్యాయామ కార్యక్రమాన్ని రూపొందించారు. మెనోపాజ్ వచ్చిన మహిళలను బాధించే సమస్యలైన ఒంట్లోంచి వేడి ఆవిర్లు వెలువడటం, రాత్రివేళలలో విపరీతమైన చెమటలు పట్టడం వ్యాయామం తర్వాత చాలావరకు తగ్గినట్లు ఈ అధ్యయనంలో తేలింది. నిజానికి ఈ సమస్యలకు హార్మోన్లతో చికిత్స ఇవ్వాల్సి రావచ్చు. కానీ వ్యాయామం తోనే సమస్యలు తగ్గడం మహిళలకు రిలీఫ్ ఇచ్చే ఓ పెద్ద శుభవార్తే.



నిద్రతో గుండె పదిలం



నిద్రకు సంబంధించిన కొన్ని జాగ్రత్తలతో గుండెపోటును ఎలా నివారించవచ్చో చూద్దాం. ● తక్కువ నిద్రపోయేవారిలో రక్తపోటు పెరిగే అవకాశాలు ఎక్కువ. తగినంత నిద్రపోయేవారితో పోలిస్తే తక్కువ నిద్రపోయేవారు 70 శాతం ఎక్కువగా జబ్బుపడతారు ● నిద్రలేకపోవడం వల్ల రోగనిరోధక శక్తి తగ్గుతుంది. ప్రతిరోజూ కనీసం ఎనిమిది నుంచి తొమ్మిది గంటల నిద్ర అవసరం ● మధ్యాహ్నం పూట తీసే చిన్న నిద్ర (పవర్ న్యాప్) గుండెకూ, మెదడుకూ మంచిది. భోజనం తర్వాత ఓ చిన్న కునుకు తీయడం వల్ల వ్యక్తిగత సామర్థ్యాలూ, జ్ఞాపకశక్తి పెరుగుతాయి. అయితే పవర్ న్యాప్ కేవలం అరగంటకు మించకూడదు. అంతకంటే ఎక్కువైతే అదీ ప్రమాదకరమే. నిద్రకూ, గుండెజబ్బులకూ ఉన్న సంబంధాలను గ్రహించి పైన పేర్కొన్న సూచనలు పాటిస్తే గుండె ఆరోగ్యంగా, పదిలంగా ఉంటుంది.


'ప్రభుత్వ ఉద్యోగులు పదవీ విరమణ నాటికి సొంత ఇల్లు కలిగి ఉండేటట్లు చూడటం ప్రభుత్వాల కనీస బాధ్యత'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 17 సంచిక: 162

SUNDAY Special ఆదివారం 1-9-2024

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



రుబీనాకు కాంస్యం

పారిస్ పారాలింపిక్స్ క్రీడల్లో భారత్ ఖాతాలో ఐదో పతకం చేరింది. మహిళల 10 మీటర్ల ఎయిర్‌పిస్టల్ ఎస్‌హెచ్1 కేటగిరీలో రుబీనా ఫ్రాన్సిస్ కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది.

10లో

కెమెరాలు అమర్చారు

'నేను నటించిన ఓ మలయాళ సినిమా షూటింగ్ సమయంలో క్యారవాన్‌లో కెమెరాలు అమర్చి నటీమణులు దుస్తులు మార్చుకుంటున్న దృశ్యాలను చిత్రీకరించారు. నేను క్యారవాన్‌లోకి వెళ్లకుండా హోటల్‌కు వెళ్లి దుస్తులు మార్చుకున్నాను' అని నటి రాధిక తెలిపారు.

10లో





'సత్వర న్యాయం'తోనే భరోసా

మహిళలపై నేరాలకు సంబంధించిన కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం లభిస్తేనే భరోసా లభిస్తుందని ప్రధాని మోదీ చెప్పారు.

- వివరాలు 6లో



'అరేబియా'లో తుపానా?

ఆగస్ట్‌లో అరేబియా సముద్రంలో తుపాను పుట్టి భారత వాతావరణ శాఖ అధికారులను సైతం సంభ్రమాశ్చర్యాలకు గురిచేసింది.


- వివరాలు 6లో



44లో, 60లో మీదపడే ముదిమి

వృద్ధాప్యం జీవనకాలంలో రెండు కీలక సందర్భాల్లో ఒక్కసారిగా మీదపడుతుందట. 44వ ఏట ఒకసారి, 60వ ఏట రెండోసారి!


- వివరాలు 6లో



హరియాణా ఎన్నికలు అక్టోబరు 5న

హరియాణా అసెంబ్లీ ఎన్నికల తేదీని ఈసీఐ మార్చింది. అక్టోబరు 1న కాకుండా 5న అసెంబ్లీ ఎన్నికలు ఉంటాయని శనివారం ప్రకటించింది.

- వివరాలు 6లో



వర్ష బీభత్సం



రాష్ట్రంలో విస్తారంగా వానలు ● మరో రెండు రోజులు భారీ వర్షాలు ● హైదరాబాద్‌లో రేపు స్కూళ్లకు సెలవు

18.83 సెంటీమీటర్లు

ఖమ్మం జిల్లా ఎర్రుపాలెంలో అత్యధిక వర్షపాతం

జోరు వాన

ఉత్తర బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావంతో వర్షాలు.. పలు జిల్లాల్లో అలుగు పోస్తున్న చెరువులు.. ఉప్పొంగుతున్న వాగులు

రహదారులు, కల్వర్టులపై వరదతో స్తంభించిన రాకపోకలు.. నీట మునిగిన పంటలు

2లో



ఖమ్మం జిల్లా నరసింహాపురం చెరువు వరదలో చిక్కుకున్న వ్యక్తిని కాపాడుతున్న స్థానికులు



నారాయణపేట జిల్లా అభంగాపూర్ - బండగొండ మధ్యలో వాగు దాటుతున్న ప్రజలు

ఊళ్లు.. నీళ్లు.. కోస్తా కకావికలం



విజయవాడ రాజీవ్‌గాంధీ పార్కు సమీపంలో వరదనీటిలో చిక్కుకుపోయిన లారీ, బస్సు

ముంచెత్తిన వాన.. ఏకమైన దారులు, ఏరులు

విజయవాడలో ఇళ్లపై కొండ చరియలు విరిగిపడి ఐదుగురు మృత్యువాత.. మంగళగిరిలో తలపై కొండరాయి పడటంతో వృద్ధురాలు మృతి

పెదకాకాని వద్ద వాగులో కొట్టుకుపోయిన కారు.. ఓ టీచర్, ఇద్దరు విద్యార్థుల మృతి

3లో



విజయవాడ సున్నపు బట్టీల సెంటర్ సమీపంలో కొండచరియలు విరిగిపడటంతో మృతి చెందిన మహిళ

14 జిల్లాలకు రెడ్ అలర్ట్

రాష్ట్రంలోని 14 జిల్లాలకు వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ ప్రకటించింది. ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి, జోగుళాంబ గద్వాల, కామారెడ్డి, కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, నల్లగొండ, పెద్దపల్లి, వనపర్తి, నారాయణపేట్, నిర్మల్ జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని హెచ్చరించింది. ఆయా జిల్లాల కలెక్టర్లు, ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సూచించింది. రాష్ట్రంలోని మరో 10 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్, ఎనిమిది జిల్లాలకు ఎల్లో అలర్ట్‌ను జారీ చేసింది.

అప్రమత్తంగా ఉండండి

సీఎస్ శాంతికుమారికి సీఎం రేవంత్ ఆదేశం

సీజనల్ వ్యాధులపై జాగ్రత్త

వైద్య సిబ్బందికి మంత్రి దామోదర సూచన

- వివరాలు 2లో

హైదరాబాద్- విజయవాడ రాకపోకలు నిలిపివేత

విజయవాడ- హైదరాబాద్ జాతీయ రహదారిపై జగ్గయ్యపేట, నందిగామ మధ్యలో తోపుచర్ల వద్ద వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో హైవేపై వాహనాల రాకపోకలను నిలిపివేశారు. హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్లే వాహనాలు సూర్యాపేట నుంచి ఖమ్మం మీదుగా తిరువూరు, లేదా మైలవరం నుంచి ఇబ్రహీంపట్నం చేరుకుని అక్కడి నుంచి విజయవాడకు వెళ్లాల్సి ఉంటుందని పోలీసులు సూచించారు.



మీ భద్రతకు మాది భరోసా

ఎలాంటి వేధింపులైనా ధైర్యంగా ఫిర్యాదు చేయండి

మహిళల భద్రత కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం

'మీతో సాక్షి'తో మహిళా భద్రత విభాగం డీజీ శిఖా గోయల్

మహిళా పాఠకులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు

రాష్ట్రంలో మహిళలు, చిన్నారుల భద్రత కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవడంతోపాటు అతివలకు అన్ని వేళలా అండగా ఉంటామని మహిళా భద్రత విభాగం డీజీ శిఖాగోయల్ భరోసా ఇచ్చారు. సమస్య ఏదైనా డయల్ 100కు కాల్ చేస్తే నిమిషాల వ్యవధిలోనే పోలీసులు వస్తారని హామీ ఇచ్చారు. రకరకాల వేధింపులు ఎదుర్కొంటున్న వారిలో కొందరు నేటికీ ఫిర్యాదు చేసేందుకు భయపడుతున్న నేపథ్యంలో వారి సమస్యలను నేరుగా శిఖాగోయల్ దృష్టికి తీసుకెళ్లేందుకు 'మీతో సాక్షి' శీర్షికన ఆగస్టు 27 నుంచి 3 రోజులపాటు సాక్షి నిర్వహించిన ప్రత్యేక క్యాంపెయిన్‌కు అనూహ్య స్పందన వచ్చింది. మహిళలు పలు సమస్యలను 'సాక్షి' దృష్టికి తీసుకురాగా వాటిలో కొన్నింటికి శిఖాగోయల్ సమాధానాలిచ్చారు.

- వివరాలు 12లో

టీపీసీసీ చీఫ్‌గా మహేశ్‌కుమార్‌గౌడ్!

సోనియా సూచన మేరకు తుది నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం

ఆయన నియామక పత్రంపై ఏఐసీసీ చీఫ్ ఖర్గే సంతకం చేశారన్న పార్టీ వర్గాలు.. ఏ క్షణమైనా ఏఐసీసీ అధికారిక ప్రకటన



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ కాంగ్రెస్‌కు కొత్త సారథిగా ప్రస్తుత పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్‌ను నియమిస్తూ ఏఐసీసీ కీలక నిర్ణయం తీసుకున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. తెలంగాణ సారథితోపాటు పశ్చిమ బెంగాల్‌కు ప్రస్తుత తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపా దాస్ మున్షీ, కేరళకు ఏఐసీసీ సంస్థాగత వ్యవహారాల

మిగతా 3వ పేజీలో ▶

'సాగర్' చుట్టూ స్కైవాక్ వే

ప్రపంచస్థాయి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి: సీఎం రేవంత్

హైదరాబాద్–నాగార్జునసాగర్ రహదారి 4 వరుసలుగా విస్తరణ

రాష్ట్రంలోని బౌద్ధ ఆధ్యాత్మిక ప్రాంతాలతో టూరిజం సర్క్యూట్

నాగార్జునసాగర్ బుద్ధవనంలో అంతర్జాతీయ స్థాయి మ్యూజియం

గోల్కొండ చుట్టూ ఉన్న రహదారుల విస్తరణకు నిర్ణయం



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ నడిబొడ్డున హుస్సేన్‌సాగర్ చుట్టూ టూరిజం డెస్టినేషన్‌సర్కిల్‌గా అభివృద్ధి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. అక్కడ స్కైవాక్ వే నిర్మించాలని.. ప్రపంచస్థాయి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో కొత్త పర్యాటక విధానం తీసుకొస్తున్న నేపథ్యంలో ఫణిగిరి, నేలకొండపల్లి, నాగార్జునసాగర్ బౌద్ధ క్షేత్రాలతోపాటు హుస్సేన్‌సాగర్‌లోని బుద్ధ విగ్రహాన్ని కలిపి ఒక పర్యాటక సర్క్యూట్‌గా అభివృద్ధి చేయాలని సంకల్పించినట్లు సీఎం రేవంత్ తెలిపారు. బౌద్ధులను ఆకట్టుకునేలా నాగార్జునసాగర్ రిజర్వాయర్‌లోని బుద్ధవనంలో అంతర్జాతీయ స్థాయి మ్యూజియం ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు.

పర్యాటక కేంద్రంగా బుద్ధవనం..: కేంద్రం ప్రకటించిన స్వదేశీ దర్శన్ 2.0 పథకంలో భాగంగా బుద్ధవనం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే కేంద్రానికి డీపీఆర్‌ను

మిగతా 3వ పేజీలో ▶

వలయాకారంలో డిజైన్

హుస్సేన్‌సాగర్ చుట్టూ ట్యాంక్‌బండ్, తెలంగాణ అమరుల జ్యోతి, నెక్లెస్‌రోడ్డు, సంజీవయ్య పార్కు వరకు వలయాకారంలో స్కైవాక్ వే డిజైన్ సిద్ధం చేయాలని అధికారులకు సీఎం సూచించారు. ఈ ప్రాంతాన్ని భవిష్యత్తులో ప్రపంచ పర్యాటక హబ్‌గా రూపొందించాలని ఆదేశించారు. అనుభవమున్న కన్సల్టెన్సీలు, నిపుణులతో అంతర్జాతీయ స్థాయి నమూనాలను తయారు చేయించాలన్నారు. పర్యాటకులు ఆహ్లాదంగా గడిపేలా ఫుడ్‌కోర్టులు, వివిధ స్టాళ్లను ఏర్పాటు చేయాలని.. ఈ ప్రాంతాన్ని సిటీలో సుందరంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు.



కన్నీళ్లకే కన్నీళ్లొచ్చే..

'అన్నంలో పురుగులు.. పిల్లలకు కడుపు నిండా భోజనం లేదు. ఇంత జరుగుతున్నా సీఎంలో స్పందన లేదు. ఫెయిల్యూర్ సీఎం వల్లే ఈ కష్టాలు.. విద్యార్థుల కన్నీళ్లు చూస్తుంటే ఏడుపొస్తోంది' అంటూ మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. వీరిద్దరూ శనివారం పాల్మాకుల కేజీబీవీని సందర్శించారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాలికలు తమ ఇబ్బందులు ఏకరువు పెడుతూ సబితను పట్టుకుని విలపించారు.

అన్నం, పప్పులో పురుగులొస్తున్నా సీఎంకు పట్టదా?

12లో

కేసీఆర్.. ఏ ముఖం పెట్టుకొని వస్తావ్?

- మీ పాలనలో మీరిచ్చిన ఏ హామీలు అమలు చేశారు?
- రామగుండం సభలో కేసీఆర్‌పై డిప్యూటీ సీఎం భట్టి ధ్వజం
- జెన్‌కో, సింగరేణి ఆధ్వర్యంలో 800 మెగావాట్ల పవర్ ప్లాంట్ నిర్మిస్తాం.. ప్రతీ అసెంబ్లీ సెగ్మెంట్‌లో అంబేడ్కర్ నాలెడ్జ్ సెంటర్లు ఏర్పాటు చేస్తామని హామీ



సింగరేణి కార్మికుడి వేషధారణలో భట్టి

సాక్షి, పెద్దపల్లి: రూ.లక్ష రుణమాఫీ చేస్తానని చెప్పి రైతులను మోసం చేసిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్.. ఇచ్చిన హామీ మేరకు నెలరోజుల్లోనే రూ.2లక్షల లోపు రుణాలను మాఫీ చేసిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించేందుకు ఇవాళ ఏ ముఖం పెట్టుకొని ప్రజల్లోకి వస్తారని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. 'డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామని చెప్పి ఇవ్వలేకపోయిన మీరు.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతీ నియోజకవర్గంలో 3,500 ఇళ్లు ఇవ్వాలని బడ్జెట్ కేటాయిస్తే.. మీ మాదిరిగా వాటిని ఎగ్గొట్టాలని చెప్పడానికి వస్తారా? జాబ్ కేలెండర్ ప్రకటించి ఉద్యోగాలు ఇస్తుంటే అవి తప్పు అని చెప్పడానికి వస్తారా? దళితులకు మూడు ఎకరాల భూ పంపిణీ అని చెప్పి ఇవ్వలేదని చెప్పడానికి వస్తారా? .. అని కేసీఆర్‌ను నిలదీశారు. 'నీవు, నీ కొడుకు

మిగతా 3వ పేజీలో ▶

న్యూస్‌రీల్

హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించండి



రాష్ట్రంలో పాలన గాడితప్పి ప్రజారోగ్యం పడకేసిందని బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. తెలంగాణ మొత్తం విషజ్వరాల బారిన పడినందున వెంటనే ప్రభుత్వం హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు.

- వివరాలు 3లో ▶

కేంద్రం మనువాదాన్ని ప్రజలపై రుద్దుతోంది



కేంద్ర ప్రభుత్వం ఆర్‌ఎస్‌ఎస్ మనువాద భావజాలాన్ని ప్రజలపై బలవంతంగా రుద్దుతోందని ఐఎఫ్‌టీయూ జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ అపర్ణ ఆరోపించారు. నిర్భయ చట్టం తెచ్చుకున్నా మహిళలపై లైంగిక వేధింపులకు అడ్డుకట్ట పడట్లేదన్నారు.

- వివరాలు 11లో ▶

ఉత్తమ్ నోటిని ప్రక్షాళన చేయాలి



బూతులు మాట్లాడటంలో సీఎంతో పోటీ పడుతున్న మంత్రి ఉత్తమ్ నోటిని ప్రక్షాళన చేయాలని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. కేసీఆర్‌ను ఉద్దేశించి 'డెకాయిట్' అని మంత్రి చేసిన వ్యాఖ్యలపై ఆయన మండిపడ్డారు.

- వివరాలు 3లో ▶

పంచాయతీలు, వార్డుల్లో రిజర్వేషన్లు మారుతాయి



త్వరలో జరిగే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్లు మారుతాయని రాష్ట్ర ఎన్నికల కమిషన్ రాజకీయ పార్టీలకు స్పష్టం చేసింది. గుర్తింపు పొందిన పార్టీలతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి శనివారం సమావేశమయ్యారు.

- వివరాలు 12లో ▶

ఇదండీ సంగతి



మాటి మాటికి నోరు జారుతున్నారని అధిష్టానం సైగలకే పరిమితం చేసింది!



నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండలంలోని కొంపెల్లిలో వరి చేలను ముంచెత్తిన వరద



ములుగు జిల్లాలోని పస్రా తాడ్వాయి మధ్య కొండపర్తిస్టేజీ సమీపంలో జాతీయ రహదారిపై కూలిన చెట్లు



సూర్యాపేట జిల్లా కోదాడ మున్సిపల్ కార్యాలయంలోకి చేరిన వర్షపు నీరు



మధిర మండలం పాలవాగు వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న వరద. (ఇన్‌సెట్)లో ఎర్రుపాలెం మండలం మీనవోలు సమీపాన వరదలో చిక్కుకున్న ఆర్టీసీ బస్సు

జోరు వాన

రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వానలు.. పలుచోట్ల కుండపోత

ఒక్కరోజులో రాష్ట్రవ్యాప్తంగా 2.33 సెంటీమీటర్ల సగటు వర్షపాతం నమోదు

సాక్షి, హైదరాబాద్/ సాక్షి నెట్‌వర్క్: రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. పలు జిల్లాల్లో భారీ నుంచి అత్యంత భారీగా వానలు పడుతున్నాయి. వాగులు, వంకలు ఉప్పొంగుతున్నాయి, చెరువులు అలుగుపోస్తున్నాయి. రహదారులపై నీరు చేరడంతో రాకపోకలు స్తంభించిపోయాయి. బంగాళాఖాతంలో అల్పపీడనం బలపడి వాయుగుండంగా మారిందని.. ఆదివారం విశాఖపట్నం సమీపంలో తీరం దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. దీని ప్రభావంతో ఆది, సోమవారాల్లో రాష్ట్రవ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షాలు పడతాయని హెచ్చరించింది. ఈ మేరకు 14 జిల్లాలకు రెడ్ అలర్ట్, పది జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.

ఎర్రుపాలెంలో 18.83 సెంటీమీటర్లు

శనివారం రాష్ట్రవ్యాప్తంగా చాలా చోట్ల భారీ వర్షాలు కురిశాయి. అత్యధికంగా ఖమ్మం జిల్లా ఎర్రుపాలెంలో 18.83 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. మధిరలో 16.38, బోమన్‌దేవిపల్లిలో 13.75, వరంగల్ జిల్లా రెడ్లవాడలో 12.35, యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరులో 10.43 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. రాష్ట్ర ప్రణాళిక విభాగం గణాంకాల మేరకు.. రాష్ట్రవ్యాప్తంగా 45 చోట్ల 5 సెం.మీ. కంటే ఎక్కువ వర్షాలు కురిశాయి. మొత్తంగా శనివారం ఒక్కరోజే రాష్ట్రవ్యాప్తంగా 2.33 సెం.మీ. సగటు వర్షపాతం నమోదైంది.

సీజన్ సగటులో అధిక వర్షపాతం

నైరుతి సీజన్‌లో ఆగస్టు చివరినాటికి రాష్ట్రంలో 57.59 సెం.మీ. సగటు వర్షపాతం నమోదుకావాల్సి ఉండగా.. ఈసారి 66.37 సెం.మీ. కురిసింది. మహబూబ్‌నగర్, జోగుళాంబ గద్వాల, వనపర్తి, నారాయణపేట్ జిల్లాల్లో అత్యధిక వర్షపాతం.. జయశంకర్ భూపాలపల్లి, కరీంనగర్, వికారాబాద్, నాగర్‌కర్నూల్, ఖమ్మం, ములుగు జిల్లాల్లో అధిక వర్షపాతం నమోదైంది. మిగతా జిల్లాలన్నీ సాధారణ వర్షపాతానికి కాస్త అటు ఇటుగా ఉన్నాయి.

పలు జిల్లాల్లో విస్తారంగా వానలు..

రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నిజామాబాద్, కరీంనగర్, మహబూబ్‌నగర్ లలోని పలు ప్రాంతాల్లో చెరువులు, కుంటలు నీటితో కళకళలాడుతున్నాయి. ఏకబిగిన వర్షాలతో రోడ్లు జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లోని కాలనీలు నీట మునిగాయి. ములుగు జిల్లా ఎస్‌ఎస్ తాడ్వాయి మండలం నార్లాపూర్‌కు చెందిన పుట్ట మహేశ్ (17) పశువులను మేపడానికి వెళ్లి పిడుగుపాటుతో మృతి చెందాడు.



సూర్యాపేట జిల్లా నాగారం మండల పరిధిలోని ఫణిగిరి గ్రామంలో శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయం చుట్టూ ఉన్న గుట్టలపై శనివారం వర్షపు నీరు జాలువారి జలపాతంలా కనువిందు చేసింది.

- ములుగు జిల్లా జగ్గన్నగూడెం సమీపంలోని బొగ్గుల వాగు, పస్రా-ఎస్‌ఎస్ తాడ్వాయి మండలాల మధ్య జలగలంచవాగు పొంగిపొర్లడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. పస్రా- తాడ్వాయి మధ్య కొండపర్తి సమీపంలో జాతీయ రహదారిపై చెట్లు విరిగిపడడంతో రాకపోకలు నిలిచిపోయాయి. మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారులోని మున్నేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. వరంగల్ జిల్లా ఖానాపురం మండలంలో పాకాల వాగు ఉప్పొంగడంతో.. వందల ఎకరాల్లో పొలాలు నీటమునిగాయి.
- ఖమ్మం జిల్లా మధిర పట్టణం జలదిగ్బంధమైంది. బస్సులు, వాహనాల్లో ఉన్న ప్రయాణికులు ఎక్కడికక్కడ చిక్కుకుపోయి ఆందోళనలో పడ్డారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పర్యటనలో ఉన్న డిప్యూటీ సీఎం భట్టి.. భారీ వర్షాల నేపథ్యంలో హుటాహుటిన మధిరకు బయలుదేరారు. అధికారులతో పరిస్థితిని సమీక్షించారు. ఎర్రుపాలెం మండలం మీనవోలు–పెగళ్లపాడు మధ్య రహదారిపై చేరిన వరదలో ఆర్టీసీ బస్సు చిక్కుకుపోయింది. పోలీసులు స్థానికుల సాయంతో ప్రయాణికులను సురక్షితంగా బయటికి తీసుకొచ్చారు. ఇక్కడి నక్కలవాగులో భవానిపురానికి చెందిన మలిశెట్టి సాంబశివరావు(19) గల్లంతయ్యాడు.
- కామారెడ్డి జిల్లా బాన్సువాడ డివిజన్‌లో భారీ వర్షం కురిసింది. పట్టణంలో ప్రధాన రహదారిపై నీరు చేరి వాహనాలు నీట మునిగాయి.
- ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. యాదాద్రి జిల్లా రాజాపేటలో, అడ్డగూడూరు మండలం చౌళ్లరామారంలో పెద్ద సంఖ్యలో చెట్లు నేలకూలాయి. సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో పొలాలు నీటమునిగాయి.
- ఉమ్మడి పాలమూరు జిల్లాలో కుండపోత వర్షం కురిసింది. నారాయణపేట జిల్లా బండగొండలో ఇద్దరు యువకులు వాగులో పడి కొట్టుకుపోగా.. స్థానికులు గమనించి కాపాడారు. మహబూబ్‌నగర్ జిల్లాలో దుందుభి, వర్నె వాగు ఉధృతంగా పారుతున్నాయి. జడ్చర్లలో ఏరియా ఆస్పత్రి జలదిగ్బంధమైంది వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలం దావాజీపల్లి సమీపంలో కేఎల్‌ఐ కాల్వకు గండిపడటంతో పొలాలు నీటమునిగాయి. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం వెనచర్లలో ఓ ఇంటి పైకప్పు కూలింది.
- జగిత్యాల జిల్లా కేంద్రంలోని వెంకటాద్రినగర్ వద్ద బ్రిడ్జిపై నుంచి వరద పారుతోంది. అధికారులు ప్రజలను జేసీబీ సహాయంతో వాగును దాటిస్తున్నారు.

గ్రేటర్ సిటీకి ముసురు

హైదరాబాద్ మహానగరానికి ముసురు పట్టింది. శుక్రవారం రాత్రి నుంచి శనివారం రాత్రి వరకు కూడా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. దీనితో రోడ్లన్నీ చిత్తడిగా మారాయి. ట్రాఫిక్ చాలా నెమ్మదిగా సాగింది. లోతట్టు ప్రాంతాల్లోని కాలనీలు జలమయం అయ్యాయి. భారీ వర్షాలు కురుస్తాయన్న హెచ్చరికల నేపథ్యంలో.. హైదరాబాద్ జిల్లా పరిధిలో పాఠశాలలకు సోమవారం సెలవు ప్రకటించారు. విస్తారంగా వానలతో హిమాయత్‌నగర్, గండిపేట జంట జలాశయాల్లోకి వరద పెరిగింది. దీనితో మూసీ పరీవాహక ప్రాంతాల వారిని అధికార యంత్రాంగం అప్రమత్తం చేసింది. 59 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను ముందస్తుగా తరలించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

అప్రమత్తంగా ఉండండి: సీఎం రేవంత్




రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగాన్ని అప్రమత్తం చేయాలని ప్రభుత్వ సీఎస్ శాంతికుమారిని సీఎం ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. రాష్ట్రానికి భారీ వర్ష సూచన నేపథ్యంలో శనివారం ఆయన సీఎస్‌తో సమీక్షించారు. రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్, వైద్యారోగ్య, పోలీసు శాఖలు అప్రమత్తంగా ఉండేలా చూడాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని.. లోతట్టు ప్రాంతాల ప్రజలను సహాయక శిబిరాలకు తరలించాలని ఆదేశించారు. జలాశయాల గేట్లు ఎత్తేసే నేపథ్యంలో దిగువ ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు.

ఉన్నతాధికారులతో సీఎస్ సమీక్ష



భారీ వర్షాల నేపథ్యంలో ప్రాణ, ఆస్తి నష్టం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని.. అన్ని జిల్లా కలెక్టరేట్లు, జీహెచ్‌ఎంసీ, సచివాలయంలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని సీఎస్ శాంతికుమారి అధికారులను ఆదేశించారు. శనివారం ఆమె డీజీపీ జితేందర్, ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కొన్ని ప్రాంతాల్లో క్లౌడ్ బరస్ట్ అయ్యే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించిందని.. ఎలాంటి ఆకస్మిక విపత్తు ఎదురైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని సూచించారు. వాగులు, వంకలు, చెరువులు పొంగుతున్న ప్రాంతాల్లో ప్రత్యేకంగా అధికారిని నియమించి.. జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. వర్షాల పరిస్థితికి అనుగుణంగా జిల్లాల్లో పాఠశాలలకు సెలవు ప్రకటించే విషయంపై కలెక్టర్లు నిర్ణయం తీసుకోవాలని సూచించారు.

బొగత జలపాతం సందర్శన నిలిపివేత



వాజేడు: ఎగువన కురుస్తున్న వర్షాలతో ములుగు జిల్లా వాజేడు మండలం పరిధిలోని బొగత జలపాతం ఉధృతంగా ప్రవహిస్తోంది. కాగా, భారీ వర్షాల నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆదివారం నుంచి జలపాతం సందర్శనను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు రేంజర్ శ్రీనివాస్ శనివారం తెలిపారు. మళ్లీ ఎప్పుడు అనుమతిస్తారనేది మీడియా ద్వారా తెలియజేయనున్నట్లు వెల్లడించారు.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్త

వైద్య సిబ్బందికి మంత్రి దామోదర సూచన



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ.. తమ శాఖ ఉన్నతాధికారులను అప్రమత్తం చేశారు. వర్షాలు తగ్గే వరకు డాక్టర్లు, నర్సులు, ఇతర సిబ్బంది అంతా హెడ్‌క్వార్టర్స్‌లోనే ఉండాలని ఆదేశించారు. ఎవరికీ సెలవులు మంజూరు చేయొద్దని డీఎంఈ వాణి, టీవీవీపీ కమిషనర్ రవీందర్ నాయక్‌ను ఆదేశించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. వైద్య శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, బాధితులకు అండగా నిలవాలని కోరారు. డెంగీ, చికున్ గున్యా, మలేరియా తదితర వ్యాధుల కట్టడిపై శనివారం ఆయన అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. కాగా, రాష్ట్రంలో డెంగీ, చికున్ గున్యా, మలేరియా కేసులు నియంత్రణలోనే ఉన్నాయని అధికారులు మంత్రికి నివేదించారు.

డెంగీ: రాష్ట్రంలో జనవరి 1 నుంచి ఆగస్టు 30 వరకు పరీక్షించిన మొత్తం 1,06,356 నమూనాలలో రిపోర్ట్ అయిన డెంగీ కేసులు 6,242 అని అధికారులు తేల్చారు. డెంగీ హైరిస్క్ తొలి పది జిల్లాల్లో హైదరాబాద్‌లో (2,073), సూర్యాపేట (506), మేడ్చల్ మల్కాజ్‌గిరి (475), ఖమ్మం (407), నిజామాబాద్ (362), నల్లగొండ (351), రంగారెడ్డి (260), జగిత్యాల (209), సంగారెడ్డి (198), వరంగల్ (128) కేసులు నమోదయ్యాయి.

చికున్ గున్యా: ఈ ఏడాదిలో ఇప్పటి వరకు పరీక్షించిన 3,127 నమూనాలలో రిపోర్ట్ అయిన వాటిలో చికున్ గున్యా కేసులు 167. చికున్ గున్యా హైరిస్క్ జిల్లాల్లో హైదరాబాద్ (74), మహబూబ్‌నగర్ (20), వనపర్తి (17), రంగారెడ్డి (16), మేడ్చల్ (11) కేసులు నమోదయ్యాయి.

మలేరియా: జనవరి 1 నుంచి ఆగస్టు 30 వరకు మొత్తం 22,80,500 నమూనాలు పరీక్షిస్తే మలేరియా పాజిటివ్‌గా 197 కేసులు నమోదయ్యాయి.



మహబూబాబాద్ జిల్లా గార్ల సమీపంలో రోడ్డు కమ్ చెక్‌డ్యాం పైనుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న పాకాల ఏరు



నాగార్జునసాగర్ సమీపంలో ఉధృతంగా ఎత్తిపోతల జలపాతం



నారాయణపేట జిల్లా ఊట్కూరు మండలం మల్లేపల్లిలో వరదలో కొట్టుకుపోతున్న కారులో యువకులను రక్షిస్తున్న స్థానికులు

మళ్లీ కృష్ణమ్మ పరవళ్లు

బంగాళాఖాతంలో అల్పపీడన ద్రోణి ప్రభావంతో పశ్చిమ కనుమల్లో విస్తారంగా వర్షాలు

- ఆల్మట్టి, నారాయణపూర్ డ్యామ్‌లకు పోటెత్తుతున్న కృష్ణమ్మ
- శ్రీశైలం ప్రాజెక్టుకి 4.1 లక్షల క్యూసెక్కుల వరద..
- 10 గేట్లు ఎత్తివేత.. సాగర్‌కు 3.87 లక్షల క్యూసెక్కులకు పెరిగిన ప్రవాహం..
- 26 గేట్ల ఎత్తివేత.. ప్రకాశం బరాజ్‌కి మరింత పెరిగిన ఉధృతి
- సముద్రంలోకి 3.31 లక్షల క్యూసెక్కుల వరద విడుదల



శ్రీశైలం నుంచి దిగువన నాగార్జునసాగర్‌కు బిరబిరా వెళ్తున్న కృష్ణమ్మ



సాగర్ ప్రాజెక్టు 26గేట్ల ద్వారా దిగువకు విడుదలవుతున్న వరద

సాక్షి, హైదరాబాద్/దోమలపెంట/నాగార్జునసాగర్/కడెం: బంగాళాఖాతంలో అల్పపీడన ద్రోణి ప్రభావంతో పశ్చిమ కనుమల్లో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో కృష్ణమ్మ మళ్లీ పోటెత్తింది. ఎగువన ఆల్మట్టి నుంచి ప్రకాశం బరాజ్ వరకు పరవళ్లు తొక్కుతోంది. శ్రీశైలం ప్రాజెక్టుకి భీకర వరద పోటెత్తింది. శనివారం సాయంత్రం 6 గంటలకు వరద ప్రవాహం 4,10,581 క్యూసెక్కులకు పెరగడంతో 212.38 టీఎంసీల నిల్వలను కొనసాగిస్తూ 8 గేట్లను 12 అడుగులు, మరో 2 గేట్లను 10 అడుగుల మేరకు పైకెత్తి 3,12,390 క్యూసెక్కులను కిందికి విడుదల చేస్తున్నారు. కుడిగట్టు విద్యుత్ కేంద్రం ద్వారా 30,227 క్యూసెక్కులు, ఎడమ గట్టు విద్యుత్ కేంద్రం ద్వారా 37,882 క్యూసెక్కులు కలిపి మొత్తం 68,109 క్యూసెక్కులను విద్యుదుత్పత్తి ద్వారా విడుదల చేస్తున్నారు. ఇంకా పోతిరెడ్డిపాడు ద్వారా 25,000, హంద్రీ నీవా ద్వారా 1,688, కల్వకుర్తి లిఫ్ట్ ద్వారా 2,400 క్యూసెక్కులు కలిపి కాల్వకు మొత్తం 29,088 క్యూసెక్కులను విడుదల చేస్తుండటంతో శ్రీశైలం ప్రాజెక్టు మొత్తం అవుట్‌ఫ్లోలు 4,09,587 క్యూసెక్కులకు పెరిగాయి.

సాగర్ 26 గేట్లు ఎత్తివేత..

దిగువన ఉన్న నాగార్జునసాగర్ ప్రాజెక్టులోకి 3,87,653 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుండగా, 308.76 టీఎంసీల నిల్వలను కొనసాగిస్తూ వచ్చిన వరదను వచ్చినట్టు వదిలేస్తున్నారు. సాగర్ 20 గేట్లను 10 అడుగుల మేర, మరో 6 గేట్లను 5 అడుగులమేర పైకెత్తి 3,43,810 క్యూసె క్కులను కిందికి విడుదల చేస్తున్నారు. ప్రధాన విద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తి ద్వారా మరో 29,313 క్యూసెక్కుల ను కిందికి విడుదల చేస్తున్నారు. కుడికాల్వకు 5,496, ఎడమ కాల్వకు 6,634, ఏఎంఆర్‌పీకి 1,800, ఎల్‌ఎల్‌సీకి 600 క్యూసెక్కులను విడుదల చేస్తుండటంతో సాగర్ నుంచి మొత్తం అవుట్‌ఫ్లోలు 3,87,653 క్యూసెక్కులకు పెరిగాయి. దీంతో దిగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టుకు 2,70,349 క్యూసెక్కుల వరద వస్తుండగా, 3,10,395 క్యూసెక్కులను కిందికి విడుదల చేస్తున్నారు. పులిచింతలకు దిగువన నదీ పరీవాహక ప్రాంతం (బేసిన్)లో విస్తారంగా కురుస్తున్న వర్షాలు ఈ ప్రవాహానికి తోడు కావడంతో ప్రకాశం బరాజ్‌కి వరద ఉధృతి పెరిగింది. బరాజ్‌కి 3,31,829 క్యూసెక్కులు వస్తుండగా, గేట్లు ఎత్తి 3,18,160 క్యూసెక్కులను సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు 184 టీఎంసీల కృష్ణా జలాలు సముద్రంలో కలిశాయి.

ఆల్మట్టికి భారీ వరద..

పశ్చిమ కనుమల్లో భారీ వర్షాలు కురుస్తుండడంతో ఎగువన కృష్ణా ప్రధాన పాయ ఉధృతంగా ప్రవహిస్తోంది. ఆల్మట్టిలోకి వస్తున్న 1.75 లక్షల క్యూసెక్కుల వరద వచ్చింది వచ్చినట్టే కిందికి విడుదల చేస్తున్నారు. దాని దిగువన నారాయణపూర్ డ్యామ్‌లోకి 1.85 లక్షల క్యూసెక్కులు చేరుతుండగా.. 1.78 లక్షల క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు. దాంతో జూరాల ప్రాజెక్టులోకి వరద భారీగా పెరిగింది. జూరాల ప్రాజెక్టులోకి 3.30 లక్షల క్యూసెక్కులు చేరుతుండగా.. విద్యుదుత్పత్తి చేస్తూ, గేట్లు ఎత్తి 3.27 లక్షల క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు. ఇక కృష్ణా ప్రధాన ఉపనది తుంగభద్రలో నిలకడగా వరద కొనసాగుతోంది. తుంగభద్ర డ్యామ్‌లోకి 34,983 క్యూసెక్కులు చేరు తుండటంతో నీటి నిల్వ 94.55 టీఎంసీలకు చేరుకుంది.

శనివారం సాయంత్రం 6 గంటలకు కృష్ణా బేసిన్‌లో ప్రధాన ప్రాజెక్టుల్లోకి వరద ప్రవాహాలు, నీటి నిల్వలు ఇలా

ప్రాజెక్టు పేరు	గరిష్ట నిల్వ సామర్థ్యం (టీఎంసీల్లో)	ప్రస్తుత నీటి నిల్వ	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	అవుట్‌ఫ్లో
ఆల్మట్టి	129.72	122.27	1,75,000	1,70,000
నారాయణపూర్	37.64	32.06	1,25,000	1,45,750
తుంగభద్ర	105.79	94.55	34,983	10,351
జూరాల	9.66	8.05	3,30,000	3,27,143
శ్రీశైలం	215.81	215.81	4,10,581	4,09,587
నాగార్జునసాగర్	312.05	308.76	3,87,653	3,87,653
పులిచింతల	45.77	38.09	2,70349	3,10,395
ప్రకాశం బరాజ్	3.07	3.07	3,31,829	3,31,829

అప్రమత్తంగా ఉండాలి: మంత్రి ఉత్తమ్



భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ ప్రకటించిన నేపథ్యంలో క్షేత్ర స్థాయిలోని నీటిపారుదల శాఖ ఇంజనీర్లు అప్రమత్తంగా ఉండాలని ఆ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. ముందస్తు అనుమతి తీసుకోకుండా ఎవరూ హెడ్‌క్వార్టర్స్‌ను విడిచి వెళ్లరాదని, సెలవులు తీసుకోరాదని సూచించారు. జలాశయాలు, చెరువుల వద్ద వరద పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తూ రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు.



నిండా నీటితో కడెం ప్రాజెక్ట్

కడెం ప్రాజెక్టు ఏడు గేట్లు ఎత్తివేత

ఎగువన కురుస్తున్న వర్షాలతో నిర్మల్ జిల్లాలోని కడెం ప్రాజెక్ట్‌కు శనివారం 22,696 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. దీంతో ప్రాజెక్టు అధికారులు ఏడు వరద గేట్లు ఎత్తి 57,821 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు.

క్లుప్తంగా...

‘దేవాదుల’పై మంత్రులకు అవగాహన లేదు

- కడియం శ్రీహరి మంత్రిగా ఉన్నప్పుడే ప్రాజెక్టుకు రూపకల్పన
- ఉత్తమ్‌కుమార్‌రెడ్డే పెద్ద డెకాయిట్... మంత్రిగా కోట్లు కొల్లగొడ్తున్నడు
- మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ వినయభాస్కర్, మాజీ ఎమ్మెల్యేల ధ్వజం



సాక్షి ప్రతినిధి, వరంగల్: దేవాదుల ప్రాజెక్టు మీద కాంగ్రెస్ మంత్రులకు అవగాహన లేదని, ఆ ప్రాజెక్టుపై ఆ పార్టీ నేతలు చిల్లర మాటలు మాట్లాడుతున్నారని ప్రభుత్వ మాజీ చీఫ్‌విప్, బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్ ధ్వజమెత్తారు. బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, తాటికొండ రాజయ్య, నన్నపనేని నరేందర్, నాగుర్ల వెంకన్నలతో కలసి వినయభాస్కర్ మాట్లాడారు. సమైక్య రాష్ట్రంలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని కేసీఆర్ ప్రశ్నించినందుకే దేవాదుల ప్రాజెక్టుకు పునాదులు పడ్డాయన్నారు. ఆ సమయంలో నీటిపారుదల శాఖ మంత్రిగా కడియం శ్రీహరి ఉన్నారని అయితే ఆయన ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలో చేరి ఏరోటికాడి పాట ఆ రోటికాడ పాడుతున్నారని ఆరోపించారు. పార్టీలు మారొచ్చు గానీ మాట మార్చకూడదని కడియంకు హితవు పలికారు. కేసీఆర్‌ను డెకాయిట్ అంటూ ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడారని, ఆయనే అతి పెద్ద గజదొంగని సుదర్శన్‌రెడ్డి అన్నారు. రెండు శాఖలకు మంత్రిగా ఉంటూ కోట్లాది రూపాయలు కొల్లగొడుతున్న ఉత్తమ్ కుమార్ రెడ్డి జైలుకు పోక తప్పదని హెచ్చరించారు.

సంపన్నుల ఆస్తులను జాతీయం చేయాలి

ఏఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి తిరుమలై రామన్

సాక్షి, హైదరాబాద్: దేశంలోని వనరులను యథేచ్ఛగా దోచుకుంటున్న సంపన్నులు ముకేశ్ అంబానీ, అదానీ తదితర బడా పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తల ఆస్తులను జాతీయం చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జాతీయ ప్రధాన కార్యదర్శి తిరుమలై రామన్ డిమాండ్ చేశారు. శనివారం హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్‌లో జరిగిన ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర సమితి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామన్ మాట్లాడుతూ, కార్పొరేట్ సంపన్నులు దేశాన్ని అన్ని రకాలుగా దోచుకుని తమ ఆర్థిక స్థితిగతులను మెరుగుపరుచుకుంటున్నారని, కానీ దేశ ఆర్థికాభివృద్ధిలో మాత్రం వారి పాత్ర శూన్యమని అన్నారు. కార్పొరేట్ శక్తుల విధానాల కారణంగా ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేసి బహుళజాతి కంపెనీలకు రెడ్ కార్పెట్ వేసిన పాలకుల తీరు సిగ్గుచేటని, దీని మూలంగానే యువతకు ఉపాధి అవకాశాలు దక్కడం లేదని పేర్కొన్నారు. దేశంలో రోజు రోజుకూ నిరుద్యోగం పెరుగుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడం దుర్మార్గమన్నారు. కార్పొరేట్ పన్ను తగ్గించడం వల్ల పారిశ్రామికవేత్తలు, అత్యంత ధనికుల లాభాలు గత మూడు సంవత్సరాల్లో 57 శాతం పెరిగాయని వెల్లడించారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, వలి ఉల్లా ఖాద్రీ, ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర మాట్లాడుతూ, పాలకులు యువజన రంగానికి పెద్దపీట వేయాలని పిలుపునిచ్చారు.

ఊళ్లు.. నీళ్లు.. కోస్తా కకావికలం

సాక్షి, అమరావతి, నెట్‌వర్క్: ఎడతెరిపి లేని అతి భారీ వర్షాలకు రాష్ట్రం అతలాకుతలమైంది. శుక్రవారం రాత్రి నుంచి కుండపోతగా కురుస్తున్న వర్షాలకు కోస్తా జిల్లాలు వణికిపోయాయి. వర్షపు నీరు వాగులా మారి రోడ్లపై ప్రవహిస్తుండడంతో విజయవాడ నగరం పూర్తిగా స్తంభించింది. మచిలీపట్నంలోనూ అదే పరిస్థితి నెలకొంది. విజయవాడ మొగల్రాజపురంలో ఇళ్లపై కొండ చరియలు విరిగిపడ్డ ఘటనలో ఐదుగురు మృతి చెందగా మంగళగిరిలో కొండరాయి తలపై పడి ఓ వృద్ధురాలు మరణించింది. గుంటూరు జిల్లా పెదకాకాని మండలం ఉప్పలపాడు సమీపంలోని మురికివాగులో కారు కొట్టుకుపోవడంతో ఓ టీచర్, ఇద్దరు విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొండ చరియలు విరిగి పడడంతో అమ్మవారి దేవస్థానం కార్యాలయాలు ధ్వంసమయ్యాయి. వర్షాల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం సెంట్రల్ కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసింది. భూపరిపాలన కమిషనర్ జయలక్ష్మి నేతృత్వంలో 19 మంది అధికారులతో కమిటీని నియమించింది. విడవకుండా కురిసిన అతి భారీ వర్షాలు మచిలీపట్నం, విజయవాడను స్తంభింపజేశాయి. అన్ని ప్రధాన రోడ్లు, వీధులు, సందులు, ఖాళీ స్థలాలు వరద ప్రవాహంతో నిండిపోవడంతో ఎక్కడికక్కడ రాకపోకలు నిలిచిపోయాయి. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు విజయవాడ సున్నపుబట్టీల సెంటర్ వద్ద శనివారం ఉదయం 7 గంటల సమయంలో కొండ చరియలు ఇళ్లపై విరిగి పడటంతో ఐదుగురు మృత్యువాత పడ్డారు. మృతుల్లో ముగ్గురు మహిళలు, ఒక విద్యార్థి ఉన్నారు. నలుగురు స్వల్ప

ముంచెత్తిన వాన..

గాయాలతో సురక్షితంగా బయటపడ్డారు. నాలుగు ఇళ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. మృతులను నవుడు మేఘన (25), బోలెం లక్ష్మీ(49), పుర్కట్ లాలో (38), జంపాన అన్నపూర్ణ (55), కమ్మరి సంతోషాచారి (18)గా గుర్తించారు. మరికొందరు శిథిలాల కింద ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. గుడ్లవల్లేరుకు చెందిన యశ్వంత్ అనే విద్యార్థి కనిపించడం లేదని కుటుంబ సభ్యులు శనివారం రాత్రి ఘటన స్థలం వద్ద ఆందోళన వ్యక్తం చేశారు. కొండ రాళ్లను తొలగించి యశ్వంత్ ఆచూకీ నిర్ధారించాల్సిందిగా పోలీసులను కోరారు. ప్రస్తుతం వాతావరణం అనుకూలించడం లేదని, పెద్ద రాళ్లను తొలగించటం సాధ్యం కాదని పోలీసులు తెలిపారు. ఆదివారం ఉదయం పెద్ద రాళ్లను తొలగిస్తే తప్ప నిర్ధారణకు రాలేమన్నారు. మరోసారి కొండ చరియలు విరిగి పడే సూచనలు కనిపిస్తుండటంతో సహాయ బృందాలు పలు ఇళ్లలో ప్రజలను ఖాళీ చేయించాయి. కాయకష్టం చేసుకుని జీవించే వారంతా ఈ ఘటనతో బిక్కుబిక్కుమంటున్నారు. మరోవైపు ఇంద్రకీలాద్రిపై కొండ చరియలు విరిగిపడ్డ ఘటనలో సమాచార కేంద్రం, డోనార్ సెల్ ధ్వంసమయ్యాయి. ఆ సమయంలో భక్తులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. నలుగురు సిబ్బంది భోజనానికి వెళ్లడంతో ప్రాణాలతో బయటపడ్డారు. వర్షాలతో హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై రాకపోకలు స్తంభించాయి. ఆర్టీసీ, ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఆటోనగర్ రోడ్డులో పలు వాహనాలు నీటి ఉధృతికి మొరాయించాయి. ఉమ్మడి కృష్ణా జిల్లాలో వరి, మొక్కజొన్న, పత్తి మిరప పైర్లు నీట మునిగిపోయాయి. పసుపు, అరటి, కూరగాయ తోటలు ముంపుబారిన పడ్డాయి. మెట్ట రైతులకు భారీ నష్టం వాటిల్లింది. జి.కొండూరు మండలం కుంట ముక్కల సబ్ స్టేషన్‌లోకి నీరు చేరడంతో సరఫరాకు అంతరాయం ఏర్పడింది. గురుకుల పాఠశాల ప్రహరీ గోడ కూలి వాగు నీరు చేరడంతో విద్యార్థులను ట్రాక్టర్ల ద్వారా సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

కలకత్తా–చెన్నై రహదారిపై ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. కాజా టోల్‌గేట్ వద్ద నాలుగు అడుగుల మేర వరద ప్రవాహంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. నాగార్జున యూనివర్సిటీ లైబ్రరీలోకి రెండు అడుగుల మేర వర్షపు నీరు చేరింది. ప్రకాశం బ్యారేజి నుంచి దిగువకు 3,40,950 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు వదులుతున్నారు. బస్సు సర్వీసులు తగ్గించి నడుపుతున్నారు. పెదకాకాని మండలం ఉప్పలపాడు వద్ద వాగులో కారు కొట్టుకుపోయిన ఘటనలో నంబూరు ప్రైవేట్ విద్యాసంస్థలో గణితం ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న నడుంపల్లి రాఘవేంద్రరావు(39), విద్యార్థులు పసుపులేని సాదీస్ (6), కోడూరి మాన్విత్(9) మృత్యువాత పడ్డారు. మధ్యాహ్నం స్కూల్ నుంచి బయలుదేరిన వీరంతా ఒకే కారులో కలసి ప్రయాణిస్తుండగా ఈ విషాదం చోటు చేసుకుంది. వర్షాలకు మంగళగిరి కొత్తపేట ఒకటో వార్డులో కొండ చరియ విరిగి పడటంతో రూకా నాగరత్నమ్మ (85) తీవ్ర గాయాల పాలై మృతి చెందింది.

ఉత్తమ్ నోటిని ప్రక్షాళన చేయాలి

మాజీ మంత్రి హరీశ్‌రావు

- బూతులు మాట్లాడటంలో రేవంత్‌తో ఉత్తమ్ పోటీ
- ప్రాజెక్టుల పేరిట అడ్వాన్సులు దండుకుంది కాంగ్రెస్సే
- పేదల నుంచి విద్యుత్ బిల్లుల వసూలు దుర్మార్గం



సాక్షి, హైదరాబాద్: బూతులు మాట్లాడటంలో ముఖ్యమంత్రి రేవంత్‌తో పోటీ పడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నోటి ని ప్రక్షాళన చేయాలని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. తమ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను ఉద్దేశించి.. ‘డెకాయిట్’అని మంత్రి ఉత్తమ్ చేసిన వ్యాఖ్యలపై ఆయన మండిపడ్డారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ‘బూతులు మాట్లాడటం, అన్‌పార్లమెంటరీ భాషను ఉపయోగించడంలో రేవంత్ కంటే తాను వెనుకబడి లేనని ఉత్తమ్ నిరూపించాలనుకుంటున్నారు. పేరు ఉత్తమ్ కానీ మాటతీరు మూసీ ప్రవాహం. గత కాంగ్రెస్ పాలనలో జలయజ్ఞం పేరిట ఈపీసీ కాంట్రాక్టు విధానం, మొబిలైజేషన్ అడ్వాన్సుల రూపంలో రూ.వేల కోట్ల ప్రజాధనాన్ని దోచుకున్నారు. ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని రూ.17 వేల కోట్ల నుంచి రూ.40 వేల కోట్లకు పెంచారు. గతంలో ఉత్తమ్ మంత్రిగా ఉన్న ప్రభుత్వం 2010లో రూ.40,300 కోట్లకు డీపీఆర్‌ను సవరించి పంపించింది. జూన్ 2014 వరకు రూ.1,420 కోట్లు మొబిలైజేషన్ అడ్వాన్సుల పేరిట కాంగ్రెస్ ప్రభు త్వం ప్రజాధనాన్ని ‘డెకాయిటీ’చేస్తే అందులో ఉత్తమ్ భాగస్వామిగా ఉన్నారు’అని హరీశ్‌రావు మండిపడ్డారు.

మానవాభివృద్ధి సూచికల్లో అగ్రగామి

‘తెలంగాణ అవతరించిన తొమ్మిదేళ్లలో వ్యవసాయ రంగం అభివృద్ధి, ఇతర మానవాభివృద్ధి సూచికల్లో దేశంలోనే తెలంగాణను కేసీఆర్ అగ్రగామిగా నిలబెట్టారు. ఆహార పంటల ఉత్పత్తిలో 16.42 శాతం వృద్ధిరేటు సాధించి పంజాబ్, హరియాణా, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర లాంటి పెద్ద వ్యవసాయ రాష్ట్రాలను తెలంగాణ వెనక్కి నెట్టింది. తెలంగాణలో 2014–15లో పంటల సాగు విస్తీర్ణం 1.29 కోట్ల ఎకరాలు కాగా.. 2022–23 నాటికి 2.21 కోట్ల ఎకరాలకు పెరిగింది. కాళేశ్వరాన్నిపూర్తి చేయడంతో పాటు కాంగ్రెస్ అర్ధాంతరంగా వదిలేసిన అనేక ప్రాజెక్టులను పూర్తి చేశాం. వ్యవసాయ రంగంలో తెలంగాణను దేశంలోనే ప్రథమ స్థానంలో నిలబెట్టిన కేసీఆర్‌ను విమర్శించడం దారుణం’అని హరీశ్‌రావు అన్నారు. కేసీఆర్ ప్రభుత్వం సాధించిన విజయాలను తమవిగా చెప్పుకోవడం కాంగ్రెస్‌కు కొత్తేమీ కాదన్నారు.

విద్యుత్ బిల్లుల వసూలు దుర్మార్గం

‘గృహజ్యోతి’పథకాన్ని ఈ ప్రభుత్వం పూర్తిగా అటకెక్కించిందని హరీశ్‌రావు ‘ఎక్స్’లో విమర్శించారు. పేదలకు 200 యూనిట్ల వరకు గృహ విద్యుత్‌ను ఉచితంగా ఇస్తున్నామంటూ డబ్బా కొట్టుకుని, మరో వైపు ముక్కుపిండి బిల్లులు వసూలు చేస్తున్నారని, జీరో బిల్లులు రావడం లేదనే సాకుతో పేదల నుంచి బిల్లులు వసూలు చేయడం దుర్మార్గమని విమర్శించారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన ఆరు గ్యారంటీలు, 13 హామీల్లో ఒక్కటి కూడా సంపూర్ణంగా అమలు కాలేదని మండిపడ్డారు.

మా టార్గెట్ పాతబస్తీ...

- ఎంఐఎం ఆనవాళ్లు లేకుండా చేస్తాం
- పాతబస్తీని కైవసం చేసుకోవడమే బీజేపీ లక్ష్యం
- మోసాల్లో కేసీఆర్‌ను మించిన కాంగ్రెస్ ప్రభుత్వం
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్. చిత్రంలో గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, గంట రవికుమార్

నయీంనగర్ (హనుమకొండ): ‘మా టార్గెట్ పాతబస్తీ. ఓల్డ్ సిటీని న్యూ సిటీగా మార్చాలని పోరాడుతున్నాం... ఎంఐఎం ఆనవాళ్లు లేకుండా చేస్తాం. పాతబస్తీని కైవసం చేసుకోవడమే బీజేపీ లక్ష్యం’అని కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్ అన్నారు. సంఘ విద్రోహులకు అడ్డాగా మారిన పాతబస్తీని అన్నివిధాలా అభివృద్ధి చేస్తామనే విషయాన్ని మైనారిటీ మోర్చా నాయకులంతా ముస్లింలకు వివరించాలని సూచించారు. హనుమకొండలో శనివారం జరిగిన పార్టీ సభ్యత్వ నమోదు సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. అబద్ధాలు, మోసాలు చేయడంలో కాంగ్రెస్ పార్టీ కేసీఆర్‌ను మించిపోయిందన్నారు. ‘వెయ్యి ఎకరాల్లో జూ ఏర్పాటు చేస్తారట. మరో వెయ్యి ఎకరాల్లో హెల్త్ హబ్ ఏర్పాటు చేస్తారట. వేలాది ఎకరాల్లో ఫోర్త్ సిటీని నిర్మిస్తారట. అసలు ఉన్న భూములన్నీ కేసీఆర్ అమ్ముకున్నడు... మరి ఈ ప్రభుత్వం యాడ నుండి తీసుకొస్తది.?’అని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ పాలనలో బీజేపీ కార్యకర్తలపై చేసిన అరాచకాలను మర్చిపోలేమని, బీజేపీ అధికారంలోకి వచ్చి ఉంటే ఈపాటికే కేసీఆర్ కుటుంబాన్ని జైల్లో వేసేవాళ్లమని చెప్పారు. రాక్షస పార్టీ బీఆర్‌ఎస్‌తో బీజేపీ పొత్తు పెట్టుకునే ప్రసక్తే లేదని, ఇదంతా కాంగ్రెస్ చేస్తున్న తప్పుడు ప్రచారమన్నారు. కాంగ్రెస్‌లోనే బీఆర్‌ఎస్ విలీనం ఖాయమని, మాట ముచ్చట కూడా పూర్తయ్యిందని బండి సంజయ్ వ్యాఖ్యానించారు.

‘సాగర్’ చుట్టూ స్కైవాక్ వే!

▶ మొదటి పేజీ తరువాయి

సమర్పించింది. రూ.25 కోట్ల అంచనాలతో బుద్ధవనంలో బుద్ధిస్ట్ డిజిటల్ మ్యూజియం అండ్ ఎగ్జిబిషన్, డిజిటల్ ఆర్కైవ్స్‌ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. వీటితోపాటు తాజాగా అంతర్జాతీయ బౌద్ధ మ్యూజియాన్ని ఈ ప్రణాళికలో చేర్చింది. అందులో భాగంగా నాగార్జునసాగర్ బుద్ధవనాన్ని పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దుతారు. నాగార్జునసాగర్ డ్యామ్‌అందాలతోపాటు పరిసరాల్లోని బుద్ధవనాన్ని అంతర్జాతీయ బౌద్ధక్షేత్రంగా అభివృద్ధి చేయాలని సంకల్పించారు. నాగార్జునసాగర్‌సందర్శనకు వెళ్లే పర్యాటకులు బ్యాక్ వాటర్ వరకు బోట్‌లో విహరించే సదుపాయాన్ని పునరుద్ధరించాలని నిర్ణయించారు. ఈ క్రమంలో దేశ విదేశీ పర్యాటకులను ఆకర్షించేందుకు అనువైన టూరిజం ప్యాకేజీలు రూపొందించాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఇక హైదరాబాద్ నుంచి నాగార్జునసాగర్ వరకు నాలుగు వరుసల రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించాలని ఆర్ అండ్ బీ అధికారులను సీఎం ఆదేశించారు. తద్వారా ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పర్యాటకులు వెళ్లి రావడానికి వీలుంటుందని అభిప్రాయపడ్డారు. కాగా, బుద్ధవనం మెంటార్‌గా మాజీ ఐపీఎస్ సి.ఆంజనేయరెడ్డిని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు పర్యాటకశాఖ ముఖ్య కార్యదర్శి వాణి ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు.

గోల్కొండ చుట్టూ రహదారుల విస్తరణ...

గోల్కొండ కోట చుట్టూ ఉన్న రహదారులు ఇరుకుగా ఉన్నాయని, వాటిని విశాలంగా అభివృద్ధి చేయాలని సీఎం నిర్ణయించారు. ఆక్రమణలుంటే తొలగించాలని, అక్కడున్న స్థానికులు, దుకాణదారులు నిరాశ్రయులు కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మరో చోట పునరావాసం కల్పించే చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

‘జూ’లు తర్వాత.. ముందు ప్రజా సమస్యలు తీర్చండి

ఎక్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కోరిన మాజీ మంత్రి కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: ఓ వైపు గురుకులాల్లో సరైన సౌకర్యాలు కల్పించాలని తెలంగాణ ఆడబిడ్డలు వీధుల్లో పోరాటం చేస్తుంటే.. ఇంకో వైపు హైదరాబాద్‌లో మరో ‘జూ’ను నిర్మించాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రయత్నాలు చేస్తున్నారని ఎక్స్ వేదికగా మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థినుల సమస్యల పరిష్కారం కంటే ‘జూ’పార్కు నిర్మాణానికే ఈ సీఎం ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. ‘‘సీఎం గారూ.. ముందు ప్రజల సమస్యలను తీర్చే అంశాలకు ప్రాధాన్యం ఇవ్వండి. అసలు ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థినులను కనీస సౌకర్యాలు కూడా కల్పించకుండా ఎందుకు శిక్షిస్తున్నారు? విధ్వంసకర రాజకీయాలను మాని ఉజ్వల భవిష్యత్తును నిర్మించే అంశాలపై మీరు ఎప్పుడు దృష్టి పెడతారు?’’అని నిలదీశారు. పాలమాకుల స్కూల్‌ను సందర్శించి విద్యార్థుల సమస్యలు తెలుసుకొని వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చిన మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డితో పాటు బీఆర్‌ఎస్ నేత కార్తీక్ రెడ్డికి కేటీఆర్ ధన్యవాదాలు తెలిపారు.

వచ్చే ముందు మేనిఫెస్టోలు తెచ్చుకోండి

- పదేళ్లలో మీరేం చేశారో.. 8 నెలల్లో మేమేం చేశామో చర్చిద్దాం
- భువనగిరి కాంగ్రెస్ ఎంపీ చామల



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంపై మాజీ సీఎం కేసీఆర్ కదనభేరి మోగిస్తారన్న వార్తలను తాము స్వాగతిస్తున్నామని, అయితే ఆయన కదనభేరి మోగించే ముందు 2014, 2018 ఎన్నికల సందర్భంగా విడుదల చేసిన బీఆర్‌ఎస్ మేనిఫెస్టోలను తీసుకురావాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆ రెండు ఎన్నికల సమయంలో బీఆర్‌ఎస్ పక్షాన ప్రజలకు ఏమేమీ హామీలు ఇచ్చారో, ఎన్ని నెరవేర్చారో, కాంగ్రెస్ పార్టీ 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు ఎలాంటి హామీలిచ్చిందో, 8 నెలల్లో ఎన్ని నెరవేర్చిందో.. చర్చిద్దామని చామల వ్యాఖ్యానించారు. తన నియోజకవర్గంలో అయినా, లక్ష్మీనరసింహ స్వామి కొలువైన యాదాద్రిలో అయినా చర్చకు రావాలని సవాల్ చేశారు. శనివారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీపీసీసీ నేతలు చరణ్‌కౌశిక్ యాదవ్, గజ్జి భాస్కర్, శ్రీకాంత్‌యాదవ్, వేణు, బండారి శ్రీకాంత్, వచన్‌కుమార్‌లతో కలసి ఆయన మాట్లాడుతూ.. దళిత సీఎం నుంచి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రుల వరకు ఎన్ని హామీలను బీఆర్‌ఎస్ తుంగలో తొక్కిందో తెలంగాణ ప్రజలకు తెలుసునని అన్నారు. రెండు పార్టీల హామీలపై చర్చించిన తర్వాత రాష్ట్ర విభజన హామీలను అమలు చేయని బీజేపీ ప్రభుత్వంపై కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లు పోరాడాల్సిన అవసరాన్ని గురించి కూడా చర్చిద్దామని అన్నారు. చెరువుల పునరుద్ధరణ గురించి హరీశ్‌రావు మాట్లాడడం దెయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉందని ఎద్దేవా చేశారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆవేశంగా ఏదో మాట్లాడుతున్నారని, ఎవరి భవంతులు కూలగొడితే వారికి సంతోషంగా ఉంటుందో.. ఆ భవంతులు కూలగొట్టే సమయంలో ఆయనకు కుర్చీ వేసి కూర్చోబెడతామని పేర్కొన్నారు.

హైదరాబాద్ ఇమేజ్‌ను దెబ్బతీసే కుట్ర

- బీఆర్‌ఎస్ నేత రాకేశ్‌రెడ్డి
- హైడ్రాతో కమీషన్లు దండుకోవడమే రేవంత్ లక్ష్యం



సాక్షి, హైదరాబాద్: హైడ్రా పేరిట హైడ్రామా సృష్టించి భారీ కమీషన్లు దండుకోవడమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యమని బీఆర్‌ఎస్ నేత ఏనుగుల రాకేశ్‌రెడ్డి విమర్శించారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ని దెబ్బతీసేందుకు రేవంత్‌రెడ్డి కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. హైడ్రాను అడ్డుపెట్టుకుని రేవంత్‌రెడ్డికి అందే డబ్బులను ఢిల్లీకి పంపడంతో పాటు, రియల్ ఎస్టేట్ వ్యాపారం అమరావతికి తరలివెళ్లేలా కుట్రలు జరుగుతున్నాయన్నారు. శనివారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ, హైడ్రా ఏర్పాటుకు తాము వ్యతిరేకం కాదని, కానీ పేదల ఇళ్లు కూల్చడాన్ని మాత్రమే తాము వ్యతిరేకిస్తున్నామని అన్నారు. హైడ్రా పేరిట బడా బాబులకు ఒక రూలు, బడుగు జీవులకు మరో రూలు అన్నట్లుగా అధికారులు వ్యవహరిస్తున్నారన్నారు. రేవంత్‌రెడ్డి సోదరుడికి హైడ్రా నోటీసులు ఇవ్వడంలో ఎందుకు కాలయాపన జరుగుతోందని ప్రశ్నించారు. కేవలం రెండు నెలల క్రితమే ఏర్పాటైన హైడ్రా.. హైదరాబాద్, తెలంగాణలో చెరువులు, కుంటల ఆక్రమణలను ఎలా సర్వే చేసిందని నిలదీశారు. హైడ్రా కూల్చివేతలతో నిరాశ్రయులవుతున్న పేదలకు పరిహారం చెల్లించాలని రాకేశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. పేదలు నివసిస్తున్న అస్మత్ పేట, అల్వాల్, సరూర్‌నగర్, బోయిన్‌పల్లి, రాజీవ్‌నగర్, ఖాజాగూడలో పేదల ఇళ్ల కూల్చివేతకు నోటీసులు ఇవ్వడాన్ని ఖండించారు. గతంలో కాంగ్రెస్ హయాంలో పి.జనార్దన్‌రెడ్డి, దివంగత సీఎం వైఎస్ పేదలకు ఇండ్లు, ఇళ్లస్థలాలు ఇచ్చిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.

సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేశాం

ఎస్సీ వర్గీకరణ తీర్పుపై జి.చెన్నయ్య, రమేష్‌బాబు



కాచిగూడ: ఎస్సీ వర్గీకరణ తీర్పుపై సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేసినట్టు మాల మహానాడు అధ్యక్షుడు జి.చెన్నయ్య, మాల సంఘాల జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ గోపోజు రమేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. తీర్పును పునఃసమీక్షించాలని తెలుగు రాష్ట్రాల తరఫున సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశామన్నారు. ఎస్సీలను వర్గీకరించే అధికారం రాష్ట్రాలకు లేదని, ఇది ఆర్టికల్ 341కు వ్యతిరేకమని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీలకు క్రీమీలేయర్ వర్తించదని, గతంలో ఇందిరాసహానీ కేసు విషయంలో తేటతెల్లమైందన్నారు. విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ కల్పించే విషయంలో పార్లమెంట్‌కే పూర్తి అధికారం ఉందని, ఎస్సీలను జాబితా నుంచి తొలగించాలన్నా, చేర్చాలన్నా, వర్గీకరించాలన్నా... పూర్తి అధికారం పార్లమెంట్‌కే ఉందని చెప్పారు.

టీపీసీసీ చీఫ్‌గా మహేశ్‌కుమార్‌గౌడ్!

▶ మొదటి పేజీ తరువాయి

ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ నియామకానికి ఆమోదం తెలుపుతూ సంబంధిత పత్రంపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సంతకం చేసినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

రెండు నెలలుగా కసరత్తు..: ముఖ్యంగా తెలంగాణకు సంబంధించి పీసీసీ అధ్యక్ష నియామకంపై గడిచిన రెండు నెలలుగా కసరత్తు జరుగుతుండగా, వివిధ సామాజిక కోణాల్లో అభ్యర్థుల ఎంపికపై చర్చలు జరిగాయి. పది రోజుల కిందటే మరో దఫాలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలను ఢిల్లీకి పిలిపించి ఖర్గే, ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ చర్చించారు. ఈ సందర్భంగా బీసీ సామాజికవర్గ నేతకే పీసీసీ పదవిని కట్టబెట్టాలనే తుది నిర్ణయానికి వచ్చారు. బీసీల్లో ప్రధాన పోటీదారులుగా ఉన్న మహేశ్‌కుమార్‌గౌడ్‌తోపాటు పార్టీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ, గౌడ్‌ల అభ్యర్థిత్వాలపై చర్చించారు. వారి అభ్యర్థిత్వాలపై రాష్ట్ర నేతల్లో భిన్నాభిప్రాయాలు ఉండటంతో నిర్ణయాధికారాన్ని అగ్రనేత సోనియా గాంధీకి కట్టబెట్టారు. ఆమె సూచనల మేరకు విద్యార్థి దశ నుంచి పార్టీకి సేవలందిస్తూ రాష్ట్ర నేతలందరితో సన్నిహిత సంబంధాలుగల మహేశ్‌కుమార్ గౌడ్ వైపు ఏఐసీసీ మొగ్గు చూపినట్లు తెలిసింది. దీనికి సంబంధించిన అధికార ప్రకటన ఏ క్షణమైనా ఉంటుందని ఏఐసీసీ వర్గాలు చెబుతున్నాయి.

కేసీఆర్.. ఏ ముఖం పెట్టుకొని వస్తావ్?

▶ మొదటి పేజీ తరువాయి

పదేళ్ల తెలంగాణను దోచుకొని విదేశాల్లో దాచుకున్నారు’ అని విమర్శించారు. పెద్దపల్లి జిల్లా రామగుండంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగసభలో మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్‌తో కలిసి భట్టి మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వాన్ని బద్నాం చేయడానికి వాట్సాప్ గ్రూప్‌ల ద్వారా తప్పుడు ప్రచారం చేసి పబ్బం గడుపుకోవాలని చూస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేసి, ఉద్యోగుల భర్తీ కోసం జాబ్ కాలండర్ ప్రకటించడంతోపాటు, ప్రతీ నియోజకవర్గంలో యువతకు పోటీ పరీక్షలకు తర్ఫీదు ఇచ్చేందుకు అంబేడ్కర్ నాలెడ్జ్ సెంటర్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు.



బహిరంగ సభలో మాట్లాడుతున్న భట్టి. చిత్రంలో పొన్నం, శ్రీధర్‌బాబు, హర్కర వేణుగోపాల్, జీవన్‌రెడ్డి

జెన్‌కో, సింగరేణి ఆధ్వర్యంలో 800 మెగావాట్ల పవర్ ప్లాంట్

రామగుండం థర్మల్ బీ పవర్ ప్లాంట్‌ను పరిశీలించిన మంత్రులు, అక్కడ అధికారులతో వివిధ పనులపై సమీక్షించారు. అనంతరం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. పాత ఆర్టీఎస్–బీ ప్లాంట్ స్థలంలోనే 800 మెగావాట్ల సూపర్ క్రిటికల్ పవర్ ప్లాంట్‌ను జెన్‌కో, సింగరేణి సంయుక్త సహకారంతో స్థాపిస్తామని వెల్లడించారు. ప్రాజెక్టు ఏర్పాటుకు అవసరమైన భూమి, ఇతర సౌకర్యాల కల్పనకు ప్రజాప్రతినిధులు, అధికారులు సహకరించి, త్వరగా ప్రతిపాదనలు పంపిస్తే పవర్‌ప్లాంట్ పనులు ప్రారంభిస్తామని తెలిపారు. 2031నాటికి గరిష్టంగా తెలంగాణకి 27,059 మెగావాట్ల విద్యుత్, 2034–35 నాటికి 31,809 మెగావాట్లకు పైగా విద్యుత్ డిమాండ్ ఉంటుందని అంచనా వేశామని వివరించారు. ఇందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పీఎం కుసుమ్ పథకం కింద రాష్ట్రంలో మరో 4వేల మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని వివరించారు. ఇందులో ప్రత్యేకంగా మహిళా సంఘాలకు ప్రాధాన్యత కల్పిస్తామని భట్టి చెప్పారు పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మక్కాన్‌సింగ్, విజయరమణారావు, గడ్డం వివేక్, వినోద్, ప్రేమ్‌సాగర్‌రావు, సింగరేణి సీఎండీ ఎన్.బలరాం, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్‌రావు పాల్గొన్నారు.

జెన్‌కో ఆధ్వర్యంలోనే నిర్మించాలి

- రామగుండంలో కొత్త విద్యుత్ ప్లాంట్‌పై పవర్ జేఏసీ స్పష్టీకరణ
- సింగరేణి, జెన్‌కో సంయుక్త ఆధ్వర్యంలో వద్దని విజ్ఞప్తి
- డిప్యూటీ సీఎం భట్టి ప్రకటనపై స్పందిస్తూ ప్రకటన

సాక్షి, హైదరాబాద్: రామగుండంలో కాలం చెల్లిన బి-థర్మల్ విద్యుత్ కేంద్రం స్థానంలో ప్రతిపాదిత 800 మెగావాట్ల కొత్త థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని సింగరేణి సంస్థ, తెలంగాణ విద్యుదుత్పత్తి సంస్థ(జెన్‌కో)ల సంయుక్త ఆధ్వర్యంలో నిర్మిస్తామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు చేసిన ప్రకటనను తెలంగాణ పవర్ ఎంప్లాయిస్ జేఏసీ వ్యతిరేకించింది. ఈ ప్రతిపాదనను విరమించుకోవాలని విజ్ఞప్తి చేసింది. కొత్త విద్యుత్ కేంద్రం నిర్మాణాన్ని స్వాగతిస్తున్నామని, అయితే జెన్‌కో ఆధ్వర్యంలోనే నిర్మించాలని కోరుతూ జేఏసీ చైర్మన్ సాయిబాబు, కన్వీనర్ రత్నాకర్‌రావు, కో చైర్మన్ శ్రీధర్ శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. థర్మల్ విద్యుత్ కేంద్రాల నిర్మాణం, నిర్వహణలో అత్యంత నిపుణులైన ఇంజనీర్లు జెన్‌కోలో ఉన్నారని జేఏసీ తెలిపింది. జెన్‌కో వద్ద సరిపడ స్థలం, నీరు, బొగ్గు లభ్యత, రైల్వే కనెక్టివిటీ సదుపాయాలు ఉన్నాయని పేర్కొంది. 800 మెగావాట్ల కొత్త థర్మల్ విద్యుత్ కేంద్రానికి రూ.6672 కోట్ల అంచనా వ్యయం కానుండగా, అందులో 70శాతం.. రూ.4670 కోట్లను రుణంగా పొందవచ్చని తెలిపింది. మిగిలిన 30శాతం రూ.2001.6 కోట్లను జెన్‌కో మూలధన పెట్టుబడిగా పెట్టాల్సి ఉంటుందని తెలియజేసింది. జెన్‌కో 2023–24లో రూ.579 కోట్ల లాభాలను ఆర్జించిందని, 2024–25లో రూ.650 కోట్లు, 2025–26లో రూ.800 కోట్ల లాభాలను ఆర్జించనుందని తెలిపింది. కేటీపీఎస్ 7వ దశ, భద్రాద్రి, యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాలపై పెట్టిన మూలధన పెట్టుబడులకు ప్రతిఫలంగా 2025 ఏప్రిల్ నుంచి రూ.1895.96 కోట్ల రాబడులను పొందనుందని వెల్లడించింది. దీంతో మూలధనం పెట్టుబడులపై వచ్చే మొత్తం రాబడులు రూ.2550 కోట్లకు చేరుతాయని పేర్కొంది. ఈ నేపథ్యంలో మూలధన పెట్టుబడి వాటా విషయంలో జెన్‌కోకి ఎలాంటి ఇబ్బందులు లేవని స్పష్టం చేసింది. జెన్‌కో ఆధ్వర్యంలో కొత్త విద్యుత్ కేంద్రం నిర్మిస్తే ప్రత్యక్షంగా 560 మందికి, పరోక్షంగా 4వేల మంది స్థానికులకు ఉద్యోగావకాశాలు లభిస్తాయని తెలిపింది.

హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించండి

బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పాలన గాడితప్పి ప్రజారోగ్యం పడకేసి తెలంగాణ మొత్తం విషజ్వరాల బారిన పడినందున.. వెంటనే ప్రభుత్వం హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం హైడ్రాను తెరపైకి తెచ్చిందని, కానీ దీనిద్వారా అసలైన సమస్యలను పక్కదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. హైదరాబాద్‌లో చెరువులను పరిరక్షించాల్సిందేనని, కానీ ఈ ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరగాలని డిమాండ్ చేశారు. కబ్జాల వివరాలు బయట పెట్టాలని, ప్రజల ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వంపై ఉందన్నారు. దేవాదాయ భూములు, అసైన్డ్ భూములపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పేద, మధ్య తరగతి ప్రజలు అన్ని అనుమతులు తీసుకుని కట్టుకున్నాక.. వాటిపై ప్రతాపం చూపొద్దన్నారు. ప్రజల్ని మభ్య పెట్టేందుకు రేవంత్ రెడ్డి పూటకో మాట మాట్లాడుతున్నారని విమర్శించారు. రుణమాఫీ చేయలేదు.. తులం బంగారం లేదు.. నిరుద్యోగ భృతి ఇవ్వ లేదని ఎద్దేవా చేశారు. ఎన్నికలకు ముందు అలవికాని హామీలిచ్చి.. గద్దెనెక్కాక ప్రజలను గోస పెడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలు, అవినీతి, అప్పుల్లో కూరుకుపోయి దివాలా తీస్తున్నాయని తెలిపారు. రాహుల్ గాంధీ కటాకట్ కటాకట్ డబ్బులు వేస్తామని చెప్పారు.. ఇప్పుడు తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలు ఫటాఫట్ దివాలా తీశాయని లక్ష్మణ్ ఎద్దేవా చేశారు. తెలంగాణను ఢిల్లీకి ఏటీఎంగా మార్చారని ఆరోపించారు. కోర్టులకు రాజకీయ రంగు పులమడం కాంగ్రెస్‌కే చెల్లిందన్నారు. వడ్డీతో సహా చెల్లిస్తామన్న.. ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్యలను స్వాగతిస్తున్నామని, అన్ని విషయాలకు కోర్టులు, న్యాయ వ్యవస్థ ఉన్నాయని ఒక ప్రశ్నకు సమాధానంగా లక్ష్మణ్ చెప్పారు. అధికారంలోకి రాకపోవడంతో బీఆర్‌ఎస్ నేతలకు పిచ్చి ముదిరిందని, ఇప్పటికే ఆ పార్టీ ఖేల్‌ఖతం.. దుకాణం బంద్ అయ్యిందన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లు కొత్తగా కలిసేది ఏముంది? వాళ్లు ఎప్పుడో కలిశారు కదా? అని ఆయన వ్యాఖ్యానించారు. ప్రజా సమస్యలపై రాబోయే రోజుల్లో బీజేపీ ఉద్యమ బాట పడుతుందని, త్వరలోనే కార్యాచరణ ప్రణాళిక ప్రకటిస్తుందని లక్ష్మణ్ వెల్లడించారు.



నేనే ద్వారమును : నా ద్వారా ఎవడైన లోపల ప్రవేశించిన యెడల వాడు రక్షింపబడినవాడై, లోపలికి పోవుచు బయటికి వచ్చుచు మేత మేయుచునుండును.

– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, శ్రావణ మాసం,
తిథి: బ.చతుర్దశి తె.4.43 వరకు (తెల్లవారితే సోమవారం), తదుపరి అమావాస్య,
నక్షత్రం: ఆశ్లేష రా.10.42 వరకు, తదుపరి మఖ, **వర్జ్యం:** ఉ.10.52 నుండి 12.32 వరకు,
దుర్ముహూర్తం: సా.4.35 నుండి 5.23 వరకు, **అమృతఘడియలు:** రా.9.02 నుండి 10.43 వరకు.

సూర్యోదయం : 5.48
సూర్యాస్తమయం : 6.13
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

మెహబూబా ముఫ్తీ (మాజీ సీఎం)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

ఇల్లు వెతుక్కుంటూ వచ్చారు తారిఖ్ హమీద్!

"హమీద్ జీ... మీరేనా?!" అన్నాను గొప్ప ఆశ్చర్యాన్ని ధ్వనింపజేస్తూ.

ఫెళ్లున... శ్రీనగర్ శివార్లన్నీ మార్మోగేలా... హృదయపూర్వకం అనిపించే ఒక భారీ నవ్వు నవ్వారు హమీద్.

"నిక్షేపంగా నేనే ముఫ్తీజీ! ఆర్టికల్ 370ని మాత్రమే మోదీజీ రద్దు చేయగలిగారు. కాంగ్రెస్ వాళ్లు పీడీపీ వాళ్ల ఇళ్లకు వెళ్లకుండా నిషేధం ఏమీ విధించలేదు..." అన్నారు.

"రండి, కూర్చోండి" అన్నాను.

"హా... ముఫ్తీజీ" అంటూ ఒక దీర్ఘమైన నిట్టూర్పుతో సోఫాలో కూలబడి... "ఇప్పుడు నేనడుగుతాను చెప్పండి. మీరు మీరేనా?!" అన్నారు హమీద్!

"మీరు ఎవరినైతే వెతుక్కుంటూ వచ్చారో వారే కదా మీ ఎదురుగా ఉన్నారు హమీద్‌జీ..." అన్నాను నవ్వుతూ.

"కానీ ముఫ్తీజీ... నేననుకోవటం... మీరు మీలోని ఉత్తేజాన్ని జమ్మూ లోయలో పడేసి వచ్చి... ఖంబర్ ప్రాంతంలోని ఈ కొండలు, ఆపిల్ తోటల మధ్య ఉన్న మీ ఎన్నారై చిన్న సోదరి గారి ఇంట్లో నిస్తేజంగా కూర్చుండి పోయారని!" అన్నారు హమీద్!



"నేను నిస్తేజంగా ఏమీ లేను హమీద్‌జీ. కాస్త నిస్సత్తువగా ఉన్నానంతే..." అన్నాను.

మరొకసారి ఫెళ్లున నవ్వారు హమీద్.

"రాజకీయాల్లో నిస్సత్తువ అనేది ఉంటుందా ముఫ్తీజీ! సీఎం కాగలిగిన వారెవరైనా ఎన్నికల్లో నిలబడటం లేదంటే వారు నిస్తేజంగా ఉండి ఉండాలి. లేదా వారు నిస్పృహ చెంది ఉండాలి" అన్నారు.

"అలాగే అనుకోండి హమీద్‌జీ. నేను నిస్పృహలోనే ఉన్నాను. అందుకే పోటీ చేయటం లేదు" అన్నాను.

"పోటీ చేయండి. మీ నిస్పృహ పోతుంది అని చెప్పటానికే ఇంత దూరం ప్రయాణించి వచ్చాను" అన్నారు హమీద్!

పోటీ చేస్తే పోయే నిస్పృహ గురించి ఆయన మాట్లాడుతున్నారు. పోటీ చేస్తే వచ్చే నిస్పృహ గురించి నేను ఆలోచిస్తున్నాను.

"హమీద్‌జీ... పీడీపీ గెలిస్తే నేను సీఎంని కావచ్చు. కాంగ్రెస్ గెలిస్తే మీరు సీఎం కావచ్చు. నేషనల్ కాన్ఫరెన్స్ గెలిస్తే ఫరూక్ అబ్దుల్లా సీఎం కావచ్చు. డీపీఏపీ గెలిస్తే గులామ్ నబీ ఆజాద్ సీఎం కావచ్చు. మనలో ఎవరు సీఎం అయినా కూడా యూనియన్ టెరిటరీ సెటప్‌లో ఉన్న జమ్మూ–కశ్మీర్ రాష్ట్రానికి చేయగలిగింది ఏమీ ఉండదు. ఫరూక్ అబ్దుల్లా అన్నారు కదా... ఒక ప్యూన్‌ని ట్రాన్స్‌ఫర్ చేయించుకోవాలన్నా సీఎం వెళ్లి లెఫ్టినెంట్ గవర్నర్ ముందు చేతులు కట్టుకుని నిలబడాలని! ప్యూన్‌నే ట్రాన్స్‌ఫర్ చేయించుకోలేకపోతే... ఖైదీలను విడిపించుకోగలమా? ఎఫ్.ఐ.ఆర్.లను రద్దు చేయించగలమా? వేర్పాటువాదులతో చర్చలు జరపగలమా? ఇక సీఎం అయి మనం జమ్మూ–కశ్మీర్‌కి చేసేదేముంటుంది?" అన్నాను.

"అలాగని అందరం కలిసి జమ్మూకశ్మీర్‌ని పూర్తిగా బీజేపీకి వదిలేద్దామా ముఫ్తీజీ. పదేళ్ల తర్వాత తొలిసారి జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికలివి..." అన్నారు హమీద్.

"వదిలేద్దాం అనటం లేదు. పట్టుకుని ఏం చేయగలం అంటున్నాను" అన్నాను.

"చూశారా, మళ్లీ నిస్పృహ! ఫరూక్ అబ్దుల్లా మొదట ఏమన్నారు? ఆర్టికల్ 370ని తిరిగి తెచ్చేవరకు ఎన్నికల్లో కంటెస్ట్ చేయననే కదా! కానీ ఇప్పుడు చేస్తున్నారు! గులాం నబీ ఆజాద్‌కు ఆరోగ్యం బాగోలేదు. అయినా అభ్యర్థుల జాబితాలను విడుదల చేస్తున్నారు. కాంగ్రెస్‌కు మాత్రం తలనొప్పులు లేవా! మాలో ఎవరికీ లేని నిస్పృహ మీలో మాత్రం ఎందుకు?" అన్నారు హమీద్!

హమీద్ స్టేట్ కాంగ్రెస్ ప్రెసిడెంట్. నాన్నగారితో కలిసి పీడీపీని స్థాపించారు. పదహారేళ్లు పీడీపీలోనే ఉన్నారు. ఆరేళ్ల క్రితం కాంగ్రెస్‌లోకి వెళ్లిపోయారు.

"ఆలోచించండి ముఫ్తీజీ! ఎన్నికల్లో నిలబడకపోతే మీరు మీ పార్టీనే కాదు, మన జమ్మూకశ్మీర్‌ను కూడా వదిలేసినట్లు..." అన్నారు హమీద్, సోఫాలోంచి లేస్తూ!

ఇదొక నిశ్శబ్ద విధ్వంసం!



జనతంత్రం

వర్ధెల్లి మురళి

విశాఖ నగరం సమీపంలోని భీమ్లిలో అదొక ప్రభుత్వ పాఠశాల. ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ శుక్రవారం నాడు ఆ బడిని సందర్శించారు. ఓ తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులను పలకరించారు. 'మీరు ముందుగా ఏ భాషలో మాట్లాడుకుంటారు... తెలుగులోనా, ఇంగ్లీషులోనా?' అని అడిగారు. అక్కడున్న విద్యార్థినులు తడుముకోకుండా 'ఇంగ్లీషులోనే' అని సమాధానమిచ్చారు. ఇంగ్లీష్ నేర్చుకోవడం ఆసక్తికరంగా ఉన్నదని కూడా వారు చెప్పారు. ప్రభుత్వ బడుల్లో చదువుకుంటున్న పేద వర్గాల పిల్లల గుండెల్లో గూడు కట్టుకున్న ఆకాంక్షలకు ఈ ఘటన అద్దం పట్టింది.

అంతకు ముందు రోజు గిడుగు రామమూర్తి పంతులు జయంతి సభ విజయవాడలో జరిగింది. ఆ సభలో రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఆ సభలో మాట్లాడిన ముఖ్యమంత్రి తెలుగు భాషతోనే జీవితమని మరోసారి చెప్పుకొచ్చారు. జీతం కోసం ఇంగ్లీషు కూడా నేర్పిస్తామని తన ఉభయ భాషాభిమానాన్ని కూడా వెల్లడించారు. ఇక్కడ ప్రజలు అర్థం చేసుకోవలసిన ధర్మ సూక్ష్మం ఒకటున్నది. జీతం కోసం నేర్చుకునే ఇంగ్లీష్ ప్రైవేట్ స్కూళ్లకు, 'జీవితం' కోసం నేర్చుకునే తెలుగు ప్రభుత్వ స్కూళ్లకు ప్రత్యేకం.

తొంభై శాతానికి పైగా ప్రైవేట్ స్కూళ్లలో ఇంగ్లీషు మీడియమే ఉంటుందన్న సంగతి జగమెరిగిన సత్యమే! కనుక తెలుగు భాషను రక్షించి పోషించవలసిన బాధ్యత ప్రభుత్వ బడుల్లో చదువుకునే పిల్లలది, కష్టజీవులైన వారి తల్లిదండ్రులది. మనకు స్వతంత్రం వచ్చిన దగ్గర్నుంచీ ఈ బాధ్యతను వారు తమ భుజాల మీద మోస్తూనే వస్తున్నారు. మన తెలుగు జాతిలోని సంపన్న శ్రేణివారు, ఉన్నతోద్యోగులు, క్రీమీ లేయర్‌లోని ఓ పదిమంది కూడిన ప్రతిచోట ఏ భాషలో మాట్లాడుకుంటారు? నిస్సందేహంగా ఇంగ్లీషులోనే! వారు ఇంగ్లీషులోనే పలకరించుకుంటారు. ఇంగ్లీషులోనే తుమ్ముతారు, ఇంగ్లీషులోనే దగ్గుతారు. తెలుగు భాషా సంస్కృతులను రక్షించవలసిన అవసరాన్ని సామాన్య ప్రజలకు వారే గుర్తు చేస్తుంటారు.

కొద్దిమంది పండితుల చేతుల్లోనే బందీ అయిన తెలుగు సాహిత్యాన్ని విముక్తం చేసి సామాన్య ప్రజలకు అర్థమయ్యే వ్యవహారిక భాషలో రచనలు జరగాలని ఉద్యమించి గెలిచిన యోధుడు గిడుగు రామమూర్తి పంతులు. ఆయన నుంచి తీసుకోవలసిన స్ఫూర్తి ఏమిటి? ఉన్నత స్థానాలను అధిరోహించే అవకాశాలను కల్పిస్తున్న ఇంగ్లీషు మీడియాన్ని సంపన్న శ్రేణికే పరిమితం చేయకుండా సమస్త ప్రజలకు అందుబాటులోకి తేవాలని చెప్పడం కాదా? అటువంటి సంకల్పమే గదా పంతులు గారికి ఇవ్వదగిన నిజమైన నివాళి!

మనకు కొంతమంది స్వయం ప్రకటిత తెలుగు పెద్దలున్నారు. వృద్ధనారీ పతివ్రతల వంటివారు. తెలుగు మీడియంలోనే చదువుకోవాలని పదేపదే గుర్తు చేస్తుంటారు. ఆ పిలుపు ప్రభుత్వ బడులకూ, బడుగు వర్గాలకే వర్తిస్తుందని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఈ వర్గాలను ఉత్తేజితం చేయడం కోసం తమ జీవితమే వారికొక సందేశమని చెబుతారు. తెలుగులోనే చదువుకోవడం వల్ల తాము దిగ్గజాలుగా ఎదిగామనీ, 'మీరు కూడా తెలుగులోనే చదవండి, మా అంతటివారు అవుతార'ని ఊదరగొడుతుంటారు. అసలు పరభాషా మాధ్యమంలో చదువుకున్నంత మాత్రాన మాతృభాష అంతరించిపోతుందనే వాదనే నిర్హేతుకమైనది. సురవరం ప్రతాపరెడ్డి, దాశరథి సోదరులు, పీవీ నరసింహారావు, కాళోజి నారాయణరావు, డాక్టర్ సి. నారాయణరెడ్డి, వట్టికోట ఆళ్వార్ స్వామి తదితరులంతా ఉర్దూ మీడియంలో చదివి తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసినవారే. మన తాజా తెలుగు పెద్దలతో పోల్చితే మహాదిగ్గజాలే.

ఇదొక్క ఇంగ్లీషు మీడియం గొడవ మాత్రమే కాదు. నాణ్యమైన విద్య, సరైన వసతులు, పర్యవేక్షణ, బోధనా పద్ధతులు... వగైరాలన్నింటిలోనూ ప్రభుత్వ పాఠశాలల ప్రమాణాలు పడిపోతూ వస్తున్నాయి. గత మూడు దశాబ్దాలుగా ఈ పరిణామం వేగవంతమైంది. ఇందుకు ప్రధాన కారణం మన పాలకులు. పేద, మధ్యతరగతి పిల్లలకు ఉచితంగా నాణ్యమైన విద్యను అందించడానికి పెట్టుబడి పెట్టడం మన 'సంస్కరణోత్తర' రాజకీయ వేత్తలకు ఇష్టంలేదు. ఈ కేటగిరీలో ముందు వరసన నిలిచిన రాజకీయవేత్త చంద్రబాబు. విద్య, వైద్యం మాత్రమే కాదు... ప్రజలకు ఏదీ ఉచితంగా ఇవ్వకూడదనే ఫిలాసఫీ ఆయనది. 'మనసులో మాట' అనే పేరుతో ఆయన రచించిన పుస్తకం నిండా ఈ ఫిలాసఫీయే ఉంటుంది. ఐదేళ్లకు పూర్వం విభజిత రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కూడా ఆయన ఈ తత్వధారను వారబోస్తూనే వచ్చారు. 'ఉచిత విద్యను అందించడం ప్రభుత్వ బాధ్యత కాదు, ప్రభుత్వ స్కూళ్లలో సదుపాయాలుండవు. డబ్బులున్న వాళ్లు ప్రయివేటు స్కూళ్లలో చదువుకోండి. అక్కడ ఇంగ్లీష్ మీడియం ఉంటుంది. అన్నీ బాగుంటాయ'ని ఆయన ఉద్బోధించేవారు.

నాణ్యమైన విద్య, సరైన వసతులు, పర్యవేక్షణ, బోధనా పద్ధతులు... వగైరాలన్నింటిలోనూ ప్రభుత్వ పాఠశాలల ప్రమాణాలు పడిపోతూ వస్తున్నాయి. గత మూడు దశాబ్దాలుగా ఈ పరిణామం వేగవంతమైంది. ఇందుకు ప్రధాన కారణం మన పాలకులు. పేద, మధ్యతరగతి పిల్లలకు ఉచితంగా నాణ్యమైన విద్యను అందించడానికి పెట్టుబడి పెట్టడం మన 'సంస్కరణోత్తర' రాజకీయ వేత్తలకు ఇష్టంలేదు. ఈ కేటగిరీలో ముందు వరసన నిలిచిన రాజకీయవేత్త చంద్రబాబు. విద్య, వైద్యం మాత్రమే కాదు... ప్రజలకు ఏదీ ఉచితంగా ఇవ్వకూడదనే ఫిలాసఫీ ఆయనది. 'మనసులో మాట' అనే పేరుతో ఆయన రచించిన పుస్తకం నిండా ఈ ఫిలాసఫీయే ఉంటుంది. ఐదేళ్లకు పూర్వం విభజిత రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కూడా ఆయన ఈ తత్వధారను వారబోస్తూనే వచ్చారు. 'ఉచిత విద్యను అందించడం ప్రభుత్వ బాధ్యత కాదు, ప్రభుత్వ స్కూళ్లలో సదుపాయాలుండవు. డబ్బులున్న వాళ్లు ప్రయివేటు స్కూళ్లలో చదువుకోండి. అక్కడ ఇంగ్లీష్ మీడియం ఉంటుంది. అన్నీ బాగుంటాయ'ని ఆయన ఉద్బోధించేవారు.

వైఎస్ జగన్ ప్రభుత్వం విద్యా సంస్కరణలు ప్రారంభించిన తర్వాత చంద్రబాబుతో పాటు ఆయన మీడియా కూడా విమర్శల వర్షం కురిపిస్తూనే వచ్చింది. ఒకేసారి ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెడితే పిల్లలకు అర్థం కాకుండా పోతుందని గగ్గోలు పెట్టారు. కానీ, బైలింగ్వల్ పాఠ్య పుస్తకాల ప్రయోగంతో ఈ సమస్యను ప్రభుత్వం అవలీలగా అధిగమించిందని విద్యారంగ నిపుణులు పలువురు కొనియాడారు. చంద్రబాబు ప్రభుత్వం రాగానే ప్రభుత్వ స్కూళ్ల వైభవం అంతరించిపోతుందన్న అంచనా ప్రజల్లో చాలామందికి ముందే ఉన్నది. కనుకనే ఈ సంవత్సరం పెద్ద ఎత్తున ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులు టీసీలు తీసుకుని ప్రైవేట్ బడుల్లో చేరిపోయారు. పూర్తి వివరాలు రాలేదు గానీ, ఈ సంఖ్య మూడు లక్షలకు పైగానే ఉండొచ్చని అంచనా.

వైఎస్ జగన్ ప్రభుత్వం విద్యా సంస్కరణలు ప్రారంభించిన తర్వాత చంద్రబాబుతో పాటు ఆయన మీడియా కూడా విమర్శల వర్షం కురిపిస్తూనే వచ్చింది. ఒకేసారి ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెడితే పిల్లలకు అర్థం కాకుండా పోతుందని గగ్గోలు పెట్టారు. కానీ, బైలింగ్వల్ పాఠ్యపుస్తకాల ప్రయోగంతో ఈ సమస్యను ప్రభుత్వం అవలీలగా అధిగమించిందని విద్యారంగ నిపుణులు పలువురు కొనియాడారు. చంద్రబాబు ప్రభుత్వం రాగానే ప్రభుత్వ స్కూళ్ల వైభవం అంతరించిపోతుందన్న అంచనా ప్రజల్లో చాలామందికి ముందే ఉన్నది. కనుకనే ఈ సంవత్సరం పెద్ద ఎత్తున ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులు టీసీలు తీసుకుని ప్రైవేట్ బడుల్లో చేరిపోయారు. పూర్తి వివరాలు రాలేదు గానీ, ఈ సంఖ్య మూడు లక్షలకు పైగానే ఉండొచ్చని అంచనా.

ప్రజలు ఊహించినట్టుగానే చంద్రబాబు ప్రభుత్వం సర్కారు బళ్లపై దాడిని ప్రారంభించింది. 'అమ్మ ఒడి' ఇవ్వలేదు. 'వసతి దీవెన' లేదు, 'విద్యా కానుక' లేదు. 'మధ్యాహ్న భోజనం', 'గోరు ముద్దలు' గాడి తప్పాయి. ఇంగ్లీష్ ప్రమాణాలు పెంచేందుకు ఉద్దేశించిన 'టోఫెల్' పరీక్షను తొలగించారు. వెయ్యి స్కూళ్లలో అమలవుతున్న సీబీఎస్ఈ సిలబస్‌ను ఎత్తేశారు. ఉచితంగా లభించాల్సిన అంతర్జాతీయ స్థాయి ఐబీ సిలబస్‌ను అటకెక్కించారు. కార్పొరేట్ స్కూళ్లకు మేలు చేయడం కోసమే ఇటువంటి చర్యలు చేపడుతున్నారనే ఆరోపణలు బలపడుతున్నాయి. నేడో రేపో ఇంగ్లీష్ మీడియానికి కూడా వీడ్కోలు చెప్పనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే విద్యామంత్రి లోకేశ్‌కు విశాఖ బాలికలు తమ గుండెచప్పుడును వినిపించారు.

పేద ప్రజానీకం బిడ్డలకు కూడా అత్యున్నత ప్రమాణాలు కలిగిన నాణ్యమైన విద్య అందాలన్న లక్ష్యంతో జగన్ ప్రభుత్వం విద్యా సమీక్షా కేంద్రాల (వీఎస్‌కే)ను ఏర్పాటు చేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో చేరికలు, విద్యార్థులు – ఉపాధ్యాయుల హాజరు, మధ్యాహ్న భోజనం నిర్వహణ, స్టూడెంట్ కిట్స్ పంపిణీ, ట్యాబులు, ఐఎఫ్‌పీల నిర్వహణ వగైరా అంశాలపై నిరంతర పర్యవేక్షణ చేయడం ఈ వీఎస్‌కేల పని. ఇప్పుడా పనులేవీ వీఎస్‌కేలు చేయవలసిన అవసరం లేదని ప్రభుత్వం ఆదేశించింది. ఈ ఒక్క ఉదాహరణ చాలు, ప్రభుత్వ విద్యా వ్యవస్థను ఈ ప్రభుత్వం ఏం చేయనున్నదో తెలుసుకోవడానికి!

ప్రభుత్వ హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలల నిర్వహణ తీరుతెన్నులపై ఈ ఒక్క నెల రోజుల్లోనే డజన్‌కు పైగా విషాదకర వార్తలు వెలువడ్డాయి. నూజివీడు ట్రిపుల్ ఐటీలో చదువుతున్న విద్యార్థుల్లో 566 మంది కేవలం మూడు రోజుల్లోనే ఆస్పత్రి పాలయ్యారు. జ్వరం, కడుపునొప్పి, విరేచనాలు, వాంతులతో ఆ విద్యార్థులు తల్లడిల్లారు. విజయనగరంలోని ఓ ఆశ్రమ విద్యార్థులు 21 మంది ఆస్పత్రి పాలయ్యారు. శ్రీకాకుళం జిల్లాలో ఓ కేజీబీవీలో 20 మంది వాంతులు, విరేచనాలతో ఆస్పత్రిలో చేరారు. ప్రభుత్వ హాస్టళ్లలో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థుల ఆరోగ్యంపై ఈ ప్రభుత్వానికి ఎంత శ్రద్ధ ఉన్నదో ఈ సంఘటనలు చూస్తే అర్థమవుతుంది.

పేద ప్రజానీకం బిడ్డలకు కూడా అత్యున్నత ప్రమాణాలు కలిగిన నాణ్యమైన విద్య అందాలన్న లక్ష్యంతో జగన్ ప్రభుత్వం విద్యా సమీక్షా కేంద్రాల (వీఎస్‌కే)ను ఏర్పాటు చేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో చేరికలు, విద్యార్థులు – ఉపాధ్యాయుల హాజరు, మధ్యాహ్న భోజనం నిర్వహణ, స్టూడెంట్ కిట్స్ పంపిణీ, ట్యాబులు, ఐఎఫ్‌పీల నిర్వహణ వగైరా అంశాలపై నిరంతర పర్యవేక్షణ చేయడం ఈ వీఎస్‌కేల పని. ఇప్పుడా పనులేవీ వీఎస్‌కేలు చేయవలసిన అవసరం లేదని ప్రభుత్వం ఆదేశించింది. ఈ ఒక్క ఉదాహరణ చాలు, ప్రభుత్వ విద్యా వ్యవస్థను ఈ ప్రభుత్వం ఏం చేయనున్నదో తెలుసుకోవడానికి!

ప్రభుత్వ హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలల నిర్వహణ తీరుతెన్నులపై ఈ ఒక్క నెల రోజుల్లోనే డజన్‌కు పైగా విషాదకర వార్తలు వెలువడ్డాయి. నూజివీడు ట్రిపుల్ ఐటీలో చదువుతున్న విద్యార్థుల్లో 566 మంది కేవలం మూడు రోజుల్లోనే ఆస్పత్రి పాలయ్యారు. జ్వరం, కడుపునొప్పి, విరేచనాలు, వాంతులతో ఆ విద్యార్థులు తల్లడిల్లారు. విజయనగరంలోని ఓ ఆశ్రమ విద్యార్థులు 21 మంది ఆస్పత్రి పాలయ్యారు. శ్రీకాకుళం జిల్లాలో ఓ కేజీబీవీలో 20 మంది వాంతులు, విరేచనాలతో ఆస్పత్రిలో చేరారు. ప్రభుత్వ హాస్టళ్లలో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థుల ఆరోగ్యంపై ఈ ప్రభుత్వానికి ఎంత శ్రద్ధ ఉన్నదో ఈ సంఘటనలు చూస్తే అర్థమవుతుంది.

మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి అధికారి వరకు సంక్షేమ హాస్టల్స్‌ను నిరంతరం తనిఖీ చేసేలా ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని జగన్ ప్రభుత్వం తయారు చేసింది. ఆ కార్యక్రమాన్ని చాప చుట్టేసిన ఫలితమే ఈ నెల రోజుల్లో జరిగిన దుర్ఘటనలు. హాస్టల్స్‌లో వుండే విద్యార్థుల వసతి, వైద్య సౌకర్యాలపై జీవో నెంబర్ 46 కింద గత ప్రభుత్వం కొన్ని మార్గదర్శకాలను రూపొందించింది. ఉద్దేశపూర్వకంగానే కూటమి ప్రభుత్వం ఆ మార్గదర్శకాలను విస్మరించింది.

ఎందుకంటే పేద ప్రజలకు నాణ్యమైన విద్య అనేది ఈ ప్రభుత్వం ఎజెండా కాదు. ఉచితంగా ఉత్తమ విద్యను అందజేయడం ఈ ప్రభుత్వ ఫిలాసఫీ కాదు. అది జగన్ ప్రభుత్వ ఫిలాసఫీ, జగన్ ప్రభుత్వం ఎజెండా. పేద వర్గాల ప్రజలను సాధికార శక్తులుగా మలచడానికి జగన్ ప్రభుత్వం ప్రారంభించిన నాణ్యమైన ఉచిత విద్యపై కూటమి సర్కార్ దాడిని ప్రారంభించింది. నిశ్శబ్దంగా ఒక మహా విధ్వంసానికి శ్రీకారం చుట్టింది. జగన్ ప్రభుత్వం విద్యారంగంలో నిశ్శబ్ద విప్లవాన్ని ప్రారంభిస్తే, బాబు సర్కార్ అదే రంగంలో నిశ్శబ్ద విధ్వంసాన్ని మొదలుపెట్టింది.

vardhelli1959@gmail.com

దేశ ప్రగతిలో తనదైన ముద్రవేస్తూ...

సందర్భం



పి. సతీష్

'బ్రాండ్ ఫైనాన్స్ ఇన్సూరెన్స్–2024' వారి తాజా నివేదిక ప్రకారం భారత జీవిత బీమా (ఎల్ఐసీ) సంస్థ, బలమైన బ్రాండ్‌గా ప్రపంచంలో మొదటి స్థానం కైవసం చేసుకుంది. ఫార్చ్యూన్ ప్రపంచ సూచీ–2023లో 107వ ర్యాంక్ పొందడమే గాక, మొత్తం ప్రీమియం ఆదాయంలో ప్రపంచంలో 10వ అతిపెద్ద సంస్థగా నిలిచింది. ఇప్పటికే క్లెయిమ్‌ల చెల్లింపు తదితర విషయాలలో ప్రపంచ నంబర్ 1గా ఇది ఉండటం గమనార్హం. 2024 సెప్టెంబర్ 1 నాటికి భారతీయ జీవిత బీమా సంస్థ 68 ఏళ్ళు పూర్తిచేసుకుని, 69వ ఏట అడుగు పెడుతున్న శుభ సందర్భంలో ఇటువంటి ఫలితాలు ప్రభుత్వ బీమా రంగానికి మరింత ఊతం ఇస్తాయి.

జీవిత బీమా రంగంలో పట్టాదారుల సొమ్ము, భద్రత ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో సురక్షితం కాదని, వారి సొమ్ముకు పూర్తి రక్షణ కావాలంటే జాతీయం చేయడం ఒక్కటే పరిష్కారమని అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో 1951 నుంచి 1956 వరకు ఉద్యమాలు నడిచాయి. ఫలితంగా జవహర్‌లాల్ నెహ్రూ ప్రభుత్వం 1956 జనవరి 19న జీవిత బీమా రంగాన్ని జాతీయీకరణ చేస్తూ ఆర్డినెన్సు తీసుకువచ్చింది.

అయిదు కోట్ల రూపాయల ప్రభుత్వ మూలధనంతో 1956 సెప్టెంబర్ 1న ప్రారంభమైన ఎల్ఐసీ నేడు రూ. 53 లక్షల కోట్ల మేర ఆస్తులు సమకూర్చుకున్నది. ఇప్పుడు ఏడాదికి 3.5 లక్షల కోట్ల నుండి 4 లక్షల కోట్ల వరకు దేశాభివృద్ధికి పెట్టుబడులు ఇచ్చే పరిస్థితి ఈ సంస్థ పని తీరుకు అద్దం పడుతోంది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం వనరుల సేకరణ పేరుతో ఎల్ఐసీలో 25 శాతం వాటాలు అమ్మి, రెవెన్యూ లోటును పూడ్చుకునే ఉద్దేశంతో ఉన్నది. దేశ అంతర్గత వనరుల సమీకరణలో ఎల్ఐసీ వాటా 25 శాతం పైమాటే!

ఏదైనా బీమా కంపెనీ పనితీరుకు దాని క్లెయిమ్‌ల పరిష్కార శాతమే కొలబద్ద. ఆ విషయంలో 99 శాతంతో ఎల్ఐసీ ప్రపంచంలోనే మొదటి స్థానంలో నిలిచింది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో రెండు కోట్ల క్లెయిమ్స్ చెల్లించి ప్రపంచంలోనే అత్యుత్తమ బీమా సంస్థగా ఘనత సాధించింది. ఎల్ఐసీ చట్టం, 1956లోని సెక్షన్ 37 ప్రకారం ఎల్ఐసీ పాలసీలకు ప్రభుత్వ గ్యారంటీ లభి



స్తుంది. ఎల్ఐసీ జాతీయీకరణ ముందు ప్రైవేట్ బీమా కంపెనీల అక్రమాలను చూసి ప్రభుత్వం ఎల్ఐసీ పాలసీలకు ప్రభుత్వ గ్యారెంటీ మంజూరు చేసింది. దీని ప్రకారం ఎల్ఐసీలో పాలసీదారులు దాచుకున్న మొత్తాలకు, బోనస్‌లకు కేంద్ర ప్రభుత్వం అదనంగా గ్యారంటీ ఇస్తుంది. కానీ ఇంతవరకూ ఎల్ఐసీ ఈ గ్యారెంటీని ఉపయోగించుకోలేదు. 2008 ప్రపంచ ఆర్థిక సంక్షోభం ధాటికి ఏఐజీ వంటి బీమా కంపెనీలను అమెరికా ప్రభుత్వం ఆదుకోక తప్పలేదంటే మన ఎల్ఐసీ ఎంత పటిష్ఠమైనదో తెలుస్తోంది.

గత 24 ఏళ్ళుగా 23 ప్రైవేటు బీమా కంపెనీల పోటీని ఎదుర్కొంటూ నేటికీ దాదాపు 70 శాతానికి పైగా మార్కెట్ షేర్‌తో మార్కెట్ లీడర్‌గా కొనసాగుతున్నది. ఎల్ఐసీ సంస్థలో పనిచేసే 14 లక్షల ఏజెంట్‌లలో 48 శాతం పైబడి గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి పొందుతున్నారు. 2024 మార్చి నాటికి మహిళా ఏజెంట్ల సంఖ్య మూడు లక్షల పైమాటే. ఈ విధంగా మహిళా ఉపాధికి సంస్థ వెన్నుదన్నుగా నిలుస్తోంది. 1960లలో పేద భారత దేశంలో తాను అందించే పాలసీలలో కేవలం బీమాపై మాత్రమే కాకుండా, సేవింగ్స్ అంశంపై కూడా ఎల్ఐసీ దృష్టి పెట్టింది. పిల్లల చదువులకూ, యువతుల పెళ్లిళ్లకూ అందివచ్చేలా మధ్యంతర, తుది చెల్లింపులు, బీమా రక్షణ ఉండే పాలసీలను రూపొందించింది.

గత బడ్జెట్ సెషన్‌లో అనేకమంది పార్లమెంట్ సభ్యులు పార్లమెంట్‌లో బీమాపై జీఎస్టీ భారాన్ని తగ్గించమని అభ్యర్థించినా, జయంత్ సిన్హా నేతృత్వంలో పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ బీమా ప్రీమియంపై జీఎస్టీ భారం తగ్గించమని సిఫార్సు చేసినా, ప్రభుత్వం ఏమాత్రం స్పందించలేదు. అయితే, దేశవ్యాప్తంగా ఈ విషయంపై వస్తున్న విశేష స్పందన నేపథ్యంలో వచ్చే జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో దీనిపై నిర్ణయం తీసుకుంటామని ఆర్థికమంత్రి ప్రకటించారు. బీమా ప్రీమియమ్‌లపై జీఎస్టీ భారాన్ని తగ్గిస్తే సంస్థ పాలసీదారులకు ఇంకా మెరుగైన ఆర్థిక ప్రయోజనాలు అందించగలదు. ఎల్ఐసీని ఆర్థికంగా బలోపేతం చేస్తే, అది దేశ ఆర్థిక వ్యవస్థకు బలం చేకూర్చి, అంతిమంగా దేశానికీ, పాలసీదారులకూ ఎంతో ప్రయోజనకరం అవుతుంది.

వ్యాసకర్త ఎల్ఐసీ ఉద్యోగుల సంఘ నాయకులు
మొబైల్: 94417 97900

(నేడు ఎల్ఐసీ ఆవిర్భావ దినోత్సవం)

ప్రజా ఉద్యమ సాహితీమూర్తి

తెలంగాణ నిజామాబాద్ జిల్లాలోని ఓ పల్లెటూరులో జన్మించిన కోటూరు ముత్యం... ఉత్తరాంధ్ర ఉద్యమాలపై అదీనూ మహత్తర శ్రీకాకుళ విప్లవ పోరాటంపై అద్భుతమైన రచనలు చేశారు. భూమి, భుక్తి, విముక్తి కోసం సాగిన ఈ గిరిజన విప్లవ పోరాటపు మూలాలను ఏళ్లకు ఏళ్ళు శ్రమించి, శోధించి భవిష్యత్ తరాలకు అందించారు.

దేశమంతటా, ఆ మాట కొస్తే ప్రపంచమంతటా కల్లోలాలు చెలరేగుతుండగా... జాతులు విముక్తినీ, దేశాలు స్వాతంత్ర్యాన్నీ, ప్రజలు విప్లవాన్నీ కోరుకుంటూన్న కాలంలో హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో ముత్యం కాలుపెట్టారు. పీడీఎస్‌యూ ముత్యంగా రూపొందారు. ప్రపంచ మానవాళి విముక్తి కోసం రూపొందింపబడ్డ మార్క్సిస్ట్ సిద్ధాంతానికి ఆకర్షితులై దాన్ని లోతుగా ఆకళింపు చేసుకున్నారు.



డా॥ కె. ముత్యం

ఆర్ట్స్ కాలేజీ విద్యార్థి సంఘానికి అధ్యక్షుడుగా హోరా హోరీ పోరులో మతోన్మాదులను మట్టి కరిపించే విజయానికి కారణమయ్యారు. ప్రగతిశీల, విప్లవ రాజకీయాలకు ఓయూ క్యాంపస్‌లో, జంటనగరాల్లో ఊపు తీసుకొచ్చారు. 1984 పీడీఎస్‌యూ మొట్ట మొదటి చీలికను ఎదుర్కొన్నది. 'తిరుగుబాటు', 'విజృంభణ'లుగా చీలిపోయింది. వి. శంకర్ ఒక వర్గానికి, కటకం పాపయ్య మరో వర్గానికి నాయకులుగా ఉన్నారు. అప్పుడు పాపయ్య వర్గానికి జంట నగరాల కమిటీకి ముత్యం అధ్యక్షులుగా, నేను ప్రధాన కార్యదర్శిగా మిగతా మిత్రులతో కలిసి విద్యార్థి ఉద్యమాన్ని నిర్మించాము. కామ్రేడ్ ముత్యం తదనంతర కాలంలో బెనారస్ విశ్వవిద్యాలయంలో పీహెచ్డీ పూర్తి చేసుకుని తిరిగి వచ్చిన తర్వాత వివిధ కాలేజీల్లో లెక్చరర్‌గా, ప్రొఫెసర్‌గా బోధనా వృత్తిని సాగించారు. తన మొత్తం జీవితాన్ని సాహిత్య సృజనకు, అందులోనూ ఉద్యమ సాహిత్య సృష్టికి, ప్రచారానికే వెచ్చించారు.

నలభై ఏళ్లుగా నాకు తెలిసిన ముత్యమన్న జీవితం నేటి తరానికే కాక భవిష్యత్తు తరాలకు ఎంతో స్ఫూర్తిదాయకమైనది. ఆగస్టు 20న ఆయన భౌతికంగా మనకు దూరమైనా ఆయన చేసిన రచనలు, పరిశోధనలు, చిత్రించిన డాక్యుమెంటరీ (అరుణోదయ కానూరి తాతపై) చిత్రాలు సదా చిరస్మరణీయంగా ఎప్పటికీ వెలుగొందుతూనే ఉంటాయి. కామ్రేడ్ ముత్యమన్నకు కన్నీటి విప్లవ జోహార్లు!

– కె. గోవర్ధన్ । సీపీఐ(ఎమ్ఎల్) న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యుడు

(నేడు హైదరాబాద్‌లో ముత్యం సంతాప సభ)

క్లుప్తంగా...

అంబేడ్కర్ వర్సిటీ ప్రవేశాల గడువు 30

సాక్షి, హైదరాబాద్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం డిగ్రీ/పీజీ కోర్సుల్లో చేరడానికి గడువును సెప్టెంబర్ 30 వరకు పొడిగించినట్లు విశ్వవిద్యాలయం అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. విశ్వవిద్యాలయంలో 2022-23, 2023-24 విద్యా సంవత్సరాల్లో డిగ్రీలో చేరిన ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులు కూడా ట్యూషన్ ఫీజును చెల్లించాలని స్పష్టం చేశారు. అంతకుముందు చేరి.. సకాలంలో ఫీజు చెల్లించలేకపోయిన వారు కూడా సెప్టెంబర్ 30వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో చెల్లించాలని పేర్కొన్నారు. పూర్తి సమాచారం కోసం, ఆన్‌లైన్‌లో నమోదు తదితర అంశాలపై సమీపంలోని అధ్యయన కేంద్రంలో సంప్రదించాలని లేదా విశ్వవిద్యాలయం హెల్ప్‌డెస్క్ నంబర్లు 73829 29570/580, 040-23680222/333/444/555 లో సంప్రదించాలని సూచించారు.

అక్టోబర్ 31 వరకు కాళేశ్వరం కమిషన్ గడువు

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల నిర్మాణంలో అవకతవకలు, లోపాలపై ఏర్పాటు చేసిన జస్టిస్ పినాకి చంద్రఘోష్ విచారణ కమిషన్ గడువును రాష్ట్ర ప్రభుత్వం మరో రెండు నెలలు పొడిగించింది. ఆగస్టు 31తో కమిషన్ గడువు ముగిసిపోగా, అక్టోబర్ 31 వరకు పొడిగిస్తూ నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా గత బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఏడాది జూన్ 30తో కమిషన్ గడువు ముగియగా, అప్పట్లో ఆగస్టు 31 వరకు పొడిగించారు. తాజాగా రెండోసారి కమిషన్ గడువును పొడిగించడం గమనార్హం. అక్టోబర్ 31 నాటికి విచారణ నివేదిక సమర్పించాలని కమిషన్‌కు ప్రభుత్వం సూచించింది.

గ్రూప్-1 ఉద్యోగార్థులకు ఇంగ్లిషులో పాఠ్యాంశాల ప్రసారం: టీశాట్ సీఈవో

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా చేపడుతున్న గ్రూప్-1 ఉద్యోగార్థుల కోసం ఇంగ్లిషులోనూ డిజిటల్ పాఠ్యాంశాలను ప్రసారం చేస్తున్నట్లు టీశాట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష కోసం టీశాట్ సుమారు 1,200 గంటలు తెలుగులో పాఠ్యాంశాలు ప్రసారం చేసిందని అదేవిధంగా ఇంగ్లిషు మీడియంలో పరీక్ష రాసే అభ్యర్థుల కోసం 50 గంటలపాటు పాఠ్యాంశాలను సెప్టెంబర్ 1 నుంచి అక్టోబర్ 20వ తేదీ వరకు ప్రసారం చేయనున్నట్లు తెలిపారు. టీశాట్ నిపుణ చానెల్‌లో తెల్లవారుజాము 4 గంటల నుంచి 5 గంటల వరకు, తిరిగి అదే రోజు రాత్రి 7 గంటల నుంచి 8 గంటల వరకు విద్య చానెల్‌లో పునఃప్రసారం అవుతాయని వెల్లడించారు.

బీఈడీ తొలిదశ సీట్ల కేటాయింపు

సాక్షి, హైదరాబాద్: బీఈడీ ప్రవేశాలలో తొలిదశ కింద 9817 సీట్లు కేటాయించినట్లు ఎడ్‌సెట్ కన్వీనర్ ప్రకటించారు. కన్వీనర్ కోటాలో మొత్తం 14,211 సీట్లు ఉంటే.. దాదాపు 16,841 మంది వెబ్ ఆప్షన్లు ఇవ్వగా.. తొలిదశ కింద 9817 సీట్లు కేటాయించినట్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సీట్లు పొందిన విద్యార్థులు ట్యూషన్ ఫీజును ఆన్‌లైన్‌లో చెల్లించవచ్చని వెల్లడించారు. చెల్లించిన ఫీజు రసీదు, జాయినింగ్ లెటర్‌తో కేటాయించిన కళాశాలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో వెళ్లి సెప్టెంబర్ 2 నుంచి 5వ తేదీలోగా తనిఖీ చేయించుకోవాలని సూచించారు. తనిఖీ అనంతరం సీటు కేటాయింపు ఉత్తర్వులు కళాశాలలోనే ఇస్తారని స్పష్టం చేశారు. తరగతులు సెప్టెంబర్ 9వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని వెల్లడించారు.

బషీరాబాద్ ఎస్‌ఐపై బదిలీ వేటు

- దళిత మహిళను వేధించాడని ఎస్‌ఐపై ఆరోపణలు
- నూతన ఎస్‌ఐగా గఫార్‌కు బాధ్యతలు


ఎస్‌ఐ రమేశ్

బషీరాబాద్: కొడుకు కేసులో ఓ దళిత మహిళను నిత్యం పోలీస్ స్టేషన్‌కు పిలిపించి వేధింపులకు గురి చేస్తున్నాడనే ఆరోపణలతో వికారాబాద్ జిల్లా బషీరాబాద్ ఎస్‌ఐ రమేశ్‌పై వేటు పడింది. ఈ విషయంలో ఎస్‌ఐపై డీఎస్పీ ఆధ్వర్యంలో ఓవైపు విచారణ జరుగుతుండగానే... అతన్ని జిల్లా క్రైమ్ రికార్డ్ బ్యూరో(డీసీఆర్‌బీ)కి బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. దళిత మహిళను తీవ్రంగా కొట్టాడంటూ ఆగస్టు 16న రమేశ్‌పై పలు పత్రికల్లో వార్తలు ప్రచురితమయ్యాయి. దీంతో దళిత సంఘాల ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన నిర్వహించి, ఎస్‌ఐపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్పీకి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా ఎస్‌ఐపై చేసిన విచారణ నివేదికను రెండు రోజుల్లో ఎస్పీకి అందజేస్తానని డీఎస్పీ బాలకృష్ణారెడ్డి తెలిపారు. జిల్లా స్పెషల్ బ్రాంచిలో పనిచేస్తున్న గఫార్‌ను బషీరాబాద్ నూతన ఎస్‌ఐగా నియమించగా, శనివారం ఆయన బాధ్యతలు చేపట్టారు.

అధికారులపై కేసులు షురూ!

చెరువుల భూముల్లో నిర్మాణాలకు అక్రమంగా అనుమతులిచ్చిన ఆరుగురు అధికారులపై చర్యలు

- సైబరాబాద్ ఈవోడబ్ల్యూలో క్రిమినల్ కేసులు నమోదు చేసిన పోలీస్ కమిషనర్
- 'హైడ్రా' ఫిర్యాదు మేరకు నిర్ణయం.. త్వరలో మరికొందరిపైనా చర్యలు

సాక్షి, హైదరాబాద్: నాలాలు, చెరువుల్లో అడ్డగోలుగా నిర్మాణాలకు అనుమతులు ఇచ్చిన అధికారులపై చర్యలు మొదలయ్యాయి. ప్రగతినగర్ ఎర్రకుంట చెరువు, ఈర్ల చెరువు ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్)లో భవన నిర్మాణాలకు అనుమతులు ఇచ్చిన ఆరుగురు అధికారులపై క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. అక్రమాలకు సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని హైడ్రా (హైదరాబాద్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అండ్ అసెట్స్ ప్రొటెక్షన్ ఏజెన్సీ) కమిషనర్ ఏవీ రంగనాథ్ ఇటీవల సైబరాబాద్ పోలీసు కమిషనర్ అవినాశ్ మహంతికి ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సైబరాబాద్ ఆర్థిక నేరాల నియంత్రణ విభాగం (ఈఓడబ్ల్యూ)లో ఆరుగురు అధికారులపై కమిషనర్ కేసులు నమోదు చేశారు. ప్రజా ఆస్తుల నష్టం, నివారణ చట్టం (పీడీపీపీఏ)-1984, భారతీయ న్యాయ సంహిత చట్టాల కింద ఈ కేసులు నమోదు చేశారు.

పోలీసుశాఖ తరహాలో హైడ్రా విశ్లేషణ..

హైడ్రా ఒకవైపు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లను ఆక్రమించి నిర్మించిన భవనాలను కూలుస్తూనే.. మరోవైపు ఆయా నిర్మాణాలకు అనుమతులు ఇచ్చిన అధికారులపై చర్యలకు సిద్ధమైంది. ఈ క్రమంలో పోలీసు శాఖ తరహాలో సమగ్ర పరిశీలన చేపట్టింది. దరఖాస్తు దశ నుంచి అనుమతుల వరకు నిర్మాణదారులు సమర్పించిన డాక్యుమెంట్లు, ప్రభుత్వ అధికారులు ఇచ్చిన నివేదికలను క్షుణ్నంగా పరిశీలించింది. నిర్మాణదారులతో కుమ్మక్కైన అధికారులు సాంకేతిక లొసుగులను ఆసరా చేసుకుంటున్నట్టు గుర్తించింది. కొన్ని విభాగాల్లో కిందిస్థాయి ఉద్యోగులు అభ్యంతరం తెలిపినా కొందరు పైస్థాయి అధికారులు అక్రమంగా అనుమతులు ఇచ్చినట్టు తేల్చింది. సదరు అధికారుల పేర్లు, వివరాలు, తప్పిదాలకు ఆధారాలను, సాంకేతిక అంశాలను సేకరించాక.. బాధ్యులపై సంబంధిత పోలీసు కమిషనర్లకు ఫిర్యాదు చేస్తోంది.

అధికారుల అరెస్టులు ఉంటాయా?

ఈ వ్యవహారంలో క్రిమినల్ కేసులు నమోదైన అధికారులను అరెస్టు చేస్తారా? లేదా? అన్నదానిపై చర్చ జరుగుతోంది. సాధారణంగా ఈ తరహా కేసులలో అరెస్టుల విషయంలో.. సంబంధిత విచారణాధికారి (ఐఓ)దే అంతిమ నిర్ణయమని ఒక ఉన్నతాధికారి తెలిపారు. నిందితులు విచారణకు రాకుండా తప్పించుకుంటారని, పరారవుతారని, అజ్ఞాతంలోకి వెళ్లిపోవచ్చని విచారణాధికారి భావిస్తే.. సెక్షన్ 409 కింద అరెస్టు చేసి, జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలిస్తారని తెలిపారు. లేకపోతే అధికారులకు నోటీసులు జారీ చేసి, విచారణ కొనసాగిస్తుంటారని వివరించారు.

త్వరలో మరికొందరిపైనా కేసులు

హైడ్రా దూకుడుగా ముందుకెళ్తున్న నేపథ్యంలో.. త్వరలోనే మరికొందరు అధికారుల అవినీతి చిట్టా బయటకొస్తుందనే చర్చ జరుగుతోంది. త్వరలోనే మరికొందరు అధికారులపైనా క్రిమినల్ కేసులు నమోదవుతాయని హైడ్రా స్పష్టం చేయడం గమనార్హం. ఇప్పటివరకు 10 వేల మంది ఆక్రమణదారులు, నిర్మాణ సంస్థలపై కేసులు నమోదయ్యాయి. గండిపేట, హిమాయత్‌సాగర్ జలాశయాల పరిధిలో నిర్మాణాలు జరుగుతున్నా పట్టించుకోని సీనియర్ ఇంజనీర్లపైనా హైడ్రా విచారణ జరపనున్నట్టు తెలిసింది. ఇప్పటికే ఒక ఇంజనీర్‌పై క్రమశిక్షణ చర్యలకు సిఫారసు చేయగా.. మరికొందరిపై చర్యలు ఉంటాయని సమాచారం. మరోవైపు గండిపేట జలాశయం సూపరింటెండింగ్ ఇంజనీర్‌పై క్రమశిక్షణ చర్యల కోసం హైడ్రా సంబంధిత విభాగానికి సిఫార్సు చేసింది.

కేసులు నమోదైన అధికారులు వీళ్లే..

- రామకృష్ణారావు, నిజాంపేట మున్సిపల్ కమిషనర్
- సుధాంశు, చందానగర్ జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్
- పూల్ సింగ్ చౌహాన్, బాచుపల్లి ఎమ్మార్వో
- శ్రీనివాసులు, మేడ్చల్-మల్కాజిగిరి ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్
- సుధీర్‌కుమార్, హెచ్‌ఎండీఏ అసిస్టెంట్ ప్లానింగ్ ఆఫీసర్
- రాజ్‌కుమార్, హెచ్‌ఎండీఏ సిటీ ప్లానర్

1864 స్కూళ్లను మూసేస్తారా?

- విద్యార్థులు లేరనే సాకుతో సర్కారు కుట్ర
- 2.5 లక్షల మంది విద్యార్థులు విద్యకు దూరం
- టీచర్ల నియామకం సహా అన్నింటా విఫలం
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజం



సాక్షి, హైదరాబాద్: పాఠశాల విద్యను నిర్లక్ష్యం చేస్తూ పేద, మధ్య తరగతి విద్యార్థులను కాంగ్రెస్ ప్రభుత్వం చదువుకు దూరం చేస్తోందని భారత రాష్ట్ర సమితి(బీఆర్‌ఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులు లేరనే సాకుతో ఈ ఏడాది 1,864 పాఠశాలలను మూసివేసే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి పేద, మధ్య తరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించకుండా మూసివేయాలని చూడటం సిగ్గుచేటు అని విమర్శించారు. విదేశీ పర్యటనలో ఉన్న కేటీఆర్ ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గత ఏడాదితో పోలిస్తే 2024-25 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య సుమారు 2.4 లక్షలు తగ్గడం ప్రమాదకర సంకేతమని పేర్కొన్నారు. ఎనిమిది నెలల్లోనే ప్రభుత్వ విద్యను కాంగ్రెస్ సర్కార్ అస్తవ్యస్తం చేసిందని, విద్యార్థుల సంఖ్య ఎందుకు తగ్గిందో సమీక్ష చేయకుండా ప్రభుత్వం నిద్రావస్థలో ఉందని నిందించారు. సీఎం రేవంత్‌రెడ్డికి విద్యా వ్యవస్థపై ఏమాత్రం పట్టింపు లేకపోవడం దారుణమని కేటీఆర్ విమర్శించారు

25వేల టీచర్ పోస్టులను భర్తీ చేయాలి

రాష్ట్రంలో ఖాళీగా ఉన్న సుమారు 25 వేల ఉపాధ్యాయ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు లేకపోవడం, స్కూళ్లలో మౌలిక వసతుల లేమి, నాణ్యమైన ఆహారం ఇవ్వకపోవడం, పాఠశాలలు, సంక్షేమ వసతిగృహాల్లో అపరిశుభ్రత, భద్రత లేకపోవడం.. వెరసి ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించేందుకు తల్లిదండ్రులు భయపడే పరిస్థితి ఏర్పడిందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు తగ్గడం, ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేందుకు అవసరమైన చర్యలపై సూచనల కోసం విద్యావేత్తలు, మంత్రులతో కమిటీ వేయాలని సూచించారు. విద్యారంగ సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం వెంటనే దృష్టి పెట్టకపోతే బీఆర్‌ఎస్ ఉద్యమిస్తుందని కేటీఆర్ హెచ్చరించారు.

పరిశోధనల హబ్‌గా హైదరాబాద్

- మెటీరియల్స్ అభివృద్ధిలో స్వావలంబన సాధించాలి
- డీఆర్‌డీవో మాజీచైర్మన్ సతీశ్‌రెడ్డి సూచన
- ఐకాన్ భారత్ అంతర్జాతీయ సదస్సు ప్రారంభం



సాక్షి,హైదరాబాద్: సబ్‌మెరైన్ల తయారీలో వినియోగించే పదార్థాల అభివృద్ధి కోసం హైదరాబాద్‌లో ఎన్నో పరిశ్రమలు పనిచేస్తున్నాయని ఇప్పుడు పరిశోధనలు, అభివృద్ధికి భాగ్యనగరం కేంద్రంగా ఉందని రక్షణరంగ పరిశోధన అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) మాజీ చైర్మన్ జి.సతీశ్‌రెడ్డి పేర్కొన్నారు. టీ-హబ్ వేదికగా 'వేదజ్ఞానం, ఆధునిక సాంకేతికత'పై శ్రీవీటీ సంస్థ రజతోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న 'ఐకాన్ భారత్'అంతర్జాతీయ సదస్సును సతీశ్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సదస్సు ద్వారా విజ్ఞానం, ఆవిష్కరణల్లో భారత్‌ను 'విశ్వ గురువు'గా చేసేందుకు కృషి చేస్తున్నారని చెప్పారు. ప్రాచీన శాస్త్రీయతకు ఆధునికతను కలిపే చక్కటి వేదిక ఇదని సతీశ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆత్మ నిర్భరత సాధించాలంటే ముందుగా మెటీరియల్స్, తయారీరంగంలో నూతన సాంకేతికత విషయంలో స్వావలంబన సాధించాలని పిలుపునిచ్చారు. దేశీయంగా కీలకమైన మెటీరియల్స్ అభివృద్ధి చేయడంలో ఎంతో ముందున్నందుకు గర్వంగా ఉందన్నారు. సబ్‌మెరైన్ల తయారీలో, ఐఎన్‌ఎస్ విక్రాంత్ వంటి విమానాల తయారీలో 80% ముడి పదార్థాలు భారత్‌లోనే తయారయ్యాయని గుర్తు చేశారు. దేశీయ ఉత్పత్తి, ఆవిష్కరణలను ప్రోత్సహించడమే లక్ష్యంగా భారత్ ముందుకు సాగుతోందని చెప్పారు. శ్రీవీటీ నిర్వహిస్తున్న పరిశోధనల ద్వారా వివిధ మెటీరియల్స్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిందని, గత 25 ఏళ్లుగా ఈ వర్సిటీ దేశంలోని వివిధ సంస్థలతో కలసి పని చేసిందని చెప్పారు. ఈ సదస్సుకు గౌరవ అతిథిగా బిట్స్ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ రాంగోపాల్‌రావు హాజరయ్యారు. సదస్సులో టీ-హబ్ సీఈవో శ్రీనివాస్ మహంకాళీ, సీఎస్‌ఐఆర్ మాజీ డీజీ డాక్టర్ శేఖర్ మండే తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీ వైద్యానికి ప్రాణం బలి

- ఆర్‌ఎంపీ ఇంజక్షన్‌తో ఇన్ఫెక్షన్
- ఆస్పత్రిలో శస్త్రచికిత్స.. యువకుడు మృతి
- మృతుని కుటుంబ సభ్యుల ఆందోళన


రవితేజ

మంచిర్యాల క్రైం: ఒక ఆర్‌ఎంపీ వైద్యుడు ఇచ్చిన ఇంజక్షన్ వికటిస్తే.. మరో ఆర్‌ఎంపీ వైద్యుడు సిఫారసు చేసిన ఆస్పత్రిలో జరిగిన శస్త్రచికిత్సతో యువకుడి ప్రాణమే పోయింది. దీంతో వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ కుటుంబ సభ్యులు ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. బాధితుల కథనం ప్రకారం.. మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం వేంపల్లి గ్రామానికి చెందిన దొనోజుల బుచ్చయ్య, లావణ్య దంపతుల కుమారుడు రవితేజ (22) హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఉద్యోగంలో చేరి శిక్షణ పొందుతున్నాడు. ఆగస్టు 28న జ్వరం రావడంతో హైదరాబాద్‌లోని ఓ ఆర్‌ఎంపీ వైద్యుడి వద్దకు వెళ్లగా ఇంజక్షన్ చేసి పంపించాడు. కానీ ఇంజక్షన్ ఇచ్చిన ప్రాంతంలో గడ్డకట్టి వాపు రావడంతో రవితేజకు జ్వరం ఎక్కువైంది. దీంతో ఆగస్టు 30న రైల్లో మంచిర్యాలకు చేరుకుని స్థానికంగా ఉన్న మరో ఆర్‌ఎంపీ వైద్యుడిని ఆశ్రయించాడు. ఇంజక్షన్ ఇచ్చిన ప్రాంతంలో ఇన్ఫెక్షన్ అయిందని, పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లమని ఆ ఆర్‌ఎంపీ సిఫారసు చేశాడు. ఆ ఆస్పత్రి వైద్యులు రవితేజను పరీక్షించి ఇంజక్షన్‌తో ఏర్పడిన గడ్డను తొలగించడానికి శస్త్రచికిత్స చేశారు. అనంతరం రవితేజకు మూత్రం నల్లగా రావడంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. ఆగస్టు 30వ తేదీ సాయంత్రం కుటుంబ సభ్యులు మంచిర్యాలలోని మరో ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా.. పరీక్షించిన వైద్యులు అప్పటికే రవితేజ మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో కుటుంబ సభ్యులు వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ శస్త్రచికిత్స చేసిన ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని బాధితులతో ఆందోళన విరమింపజేశారు. కాగా, జిల్లా కేంద్రంలోని ఆర్‌ఎంపీ జోక్యం చేసుకుని మృతుని కుటుంబ సభ్యులకు ఆర్థిక న్యాయం చేసేందుకు కృషి చేసినట్లు సమాచారం. రవితేజ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఆస్తి వివాదం.. తల్లికి కొరివి పెట్టని మాస్టారు నిర్వాకం

- భార్యకు తల కొరివి పెట్టిన భర్త
- నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండలం హాసకొత్తూర్‌లో ఘటన

కమ్మర్‌పల్లి: చదువు సంస్కారం నేర్పాల్సిన ఓ ఉపాధ్యాయుడే కన్నతల్లి మరణించినా తల కొరివి పెట్టకపోవడం చర్చనీయాంశంగా మారింది. నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండలం హాసకొత్తూర్ గ్రామానికి చెందిన కల్లెడ గంగారాం, రుక్కుంబాయి(68) దంపతులకు ఓ కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. వీరందరికీ వివాహాలు అయ్యాయి. కొడుకు జిల్లాలోని వేల్పూర్ మండలం పచ్చల నడుకుడ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూ భార్య, పిల్లలతో ఆర్మూర్‌లో నివాసముంటున్నాడు. తల్లిదండ్రులతో గత కొన్నేళ్లుగా ఆస్తి వివాదాలు ఉన్నాయి. పలుమార్లు కుల సంఘంలో పంచాయితీ కూడా జరిగింది. శనివారం వేకువ జామున రుక్కుంబాయి మరణించడంతో సమాచారం ఉన్నా కొడుకు హాసకొత్తూర్‌కు రాలేదు. దీంతో కుల సంఘం సభ్యులు రుక్కుంబాయి భర్త గంగారాంతో చితికి నిప్పంటించి అంతిమ సంస్కారాలను పూర్తి చేయించారు. చివరికి బంధుమిత్రుల ఒత్తిడితో గ్రామానికి చేరుకున్న కొడుకు తల్లి అంతిమ యాత్రకే పరిమితమయ్యాడు. కాగా, తుంటి ఎముక విరిగి ఆరు నెలలుగా మంచానికే పరిమితమైన తల్లిని చూడడానికి కూడా ఒక్కసారైనా రాలేదని కుల సంఘం సభ్యులు తెలిపారు.

అనారోగ్యంతో గురుకుల విద్యార్థిని మృతి

- సకాలంలో స్పందించని సిబ్బంది


అంజలి

బాన్సువాడ: మైనారిటీ గురుకుల పాఠశాల సిబ్బంది సకాలంలో స్పందించకపోవడంతో ఓ విద్యార్థిని అనారోగ్యంతో మృతి చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. కామారెడ్డి జిల్లా జుక్కల్ మండలం పడంపల్లి గ్రామానికి చెందిన అంజలి (12) బోర్లం మైనారిటీ గురుకుల పాఠశాలలో ఏడవ తరగతి చదువుతోంది. గత నెల 29న పాఠశాలలో వాంతులు చేసుకోవడంతో రాత్రి డ్యూటీలో ఉన్న పాఠశాల సిబ్బంది మాత్రలు ఇచ్చారు. మాత్రలు వేసుకున్న అంజలి శుక్రవారం ఉదయం పూర్తిగా నీరసించిపోయింది. విషయం తెలుసుకున్న పాఠశాల సిబ్బంది ప్రార్థనకు రావొద్దని, వసతి గృహంలోనే పడుకోమని చెప్పారు. అదే రోజు సాయంత్రం మళ్లీ వాంతులు ఎక్కువకాగా, అంజలి తల్లి చౌత్రబాయికి సమాచారం అందించారు. చౌత్రబాయి వచ్చేసరికి రాత్రి కాగా, వెంటనే బాన్సువాడ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షలు చేసి జ్వరం బాగా ఉందని, ఫిట్స్ కూడా వచ్చాయని, నిజామాబాద్‌కు తీసుకెళ్లాలని సూచించారు. అంబులెన్సులో అంజలిని నిజామాబాద్‌కు తీసుకెళుతుండగా మార్గమధ్యలోనే మృతి చెందింది. పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బంది నిర్లక్ష్యంతోనే తన బిడ్డ ప్రాణాలు పోయాయని చౌత్రబాయి చెప్పారు. కాగా అంజలిది నిరుపేద కుటుంబం. డ్రైవరైన తండ్రి ఐదేళ్ల క్రితం లారీ టైరు మారుస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని చనిపోయాడు. ఇద్దరు ఆడపిల్లలను తల్లి పనికెళ్లి చదివిస్తోంది. పెద్ద కూతురైన అంజలి మృతి చెందడంతో చౌత్రబాయి కన్నీరుమున్నీరవుతోంది. బాన్సువాడ సబ్‌కలెక్టర్ కిరణ్మయి శనివారం ఉదయం గురుకుల పాఠశాలను సందర్శించి వివరాలు తెలుసుకున్నారు.

కాలేజీలో చేరిన నాలుగో రోజే వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థిని ఆత్మహత్య

- విద్యార్థి సంఘాల ఆందోళన
- సీసీ ఫుటేజీల్లో లభ్యం కాని డేటా


రక్షిత

రుద్రూర్: నిజామాబాద్ జిల్లా రుద్రూర్ మండలం అక్బర్‌నగర్ లోని వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థిని లింగస్ వాడి రక్షిత (15) ఆత్మహత్యకు పాల్పడటం కలకలం రేపింది. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం హస్నాపూర్ గ్రామానికి చెందిన రక్షిత ఆగస్టు 27న వ్యవసాయ పాలిటెక్నిక్ కాలేజీలో ఫస్టియర్‌లో చేరింది. శనివారం ఉదయం నిద్ర లేచిన ఆమె బాత్ రూమ్‌కు వెళ్లి చాలా సేపటి వరకు తిరిగి రాలేదు. దీంతో తోటి విద్యార్థులు తలుపులు గట్టిగా బాదడంతో కింది భాగం విరిగిపడింది. అందులో నుంచి చూసిన విద్యార్థినులకు రక్షిత చున్నీతో ఉరివేసుకున్న దృశ్యం కన్పించింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు హాస్టల్ వార్డెన్, కేర్ టేకర్, అధ్యాపకులు, విద్యార్థుల ద్వారా వివరాలను సేకరించారు. రెండు గంటల అనంతరం మృతదేహాన్ని తరలించేందుకు అంబులెన్స్‌ను పిలిపించగా విద్యార్థి సంఘాల నాయకులు అడ్డుకున్నారు. పోలీసులు వారిని బలవంతంగా పక్కకు నెట్టి మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. సీసీ ఫుటేజీలో శుక్రవారం నాటి డాటా లేకపోవడంతో నిపుణులను పిలిపించి తీసుకుంటామని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ రావు చెప్పడంతో విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళన విరమించారు. కాగా, రక్షిత ఆత్మహత్య విషయమై కాలేజీ యాజమాన్యంపై అనుమానం ఉందని మృతురాలి తండ్రి విష్ణు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తమది వ్యవసాయ కుటుంబమని, నలుగురు సంతానంలో రక్షిత రెండో అమ్మాయని, రక్షితకు వ్యవసాయ విద్య అంటే ఎంతో ఇష్టమన్నారు.కాలేజీ యాజమాన్యాన్ని, ప్రిన్సిపాల్, హాస్టల్ వార్డెన్‌ను విచారించి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

తెలుగు వర్సిటీకి పాల్కురికి పేరే సమంజసం

- చరిత్రకారుల వినతి


మాట్లాడుతున్న ప్రొఫెసర్ తిరుమలి

పంజగుట్ట (హైదరాబాద్): తెలుగు విశ్వవిద్యాలయానికి ఆదికవి పాల్కురికి సోమనాథుడి పేరే సమంజసమని పలువురు చరిత్రకారులు, వక్తలు అభిప్రాయ పడ్డారు. తెలంగాణ ప్రాంతానికి అస్తిత్వం తీసుకొచ్చేందుకు కాకతీయ రాజులతో కలిసి ఎనలేని కృషి చేసిన వారిలో పాల్కురికి సోమనాథుడు ముందంజలో ఉంటారని వారు స్పష్టం చేశారు. సోమనాథ కళాపీఠం, పాల కుర్తి, జనగామ జిల్లా ఆధ్వర్యంలో శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో పీఠం కన్వీనర్ డాక్టర్ రాపోలు సత్యనారాయణ, ప్రొఫెసర్ ఐ.తిరుమలి, ప్రొఫెసర్ పిల్లలమర్రి రాములు, డాక్టర్ వి.వి.రావు విలేకరులతో మాట్లాడారు. తెలుగు యూనివర్సిటీకి సురవరం ప్రతాపరెడ్డి పేరు పెట్టాలనే ఆలోచనను తాము వ్యతిరేకించడం లేదని.. కానీ తెలుగు భాషకు పునాదులు వేసింది సోమనాథుడేనన్నారు. తెలంగాణ వచ్చాక పాఠ్యపుస్తకాల్లో తెలంగాణ చరిత్ర సరిగ్గా చూపడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ చరిత్రను బయటకు తీసుకొచ్చే ఒక యూనివర్సిటీ ఉండాలని.. సోమన పేరుతో ఒక పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

44లో 60లో మీదపడే ముదిమి

ముసలితనం. మనిషి జీవయాత్రలో అనివార్యమైన చివరి మజిలీ. అయినాసరే, దాని పేరు వింటేనే ఉలిక్కిపడతాం. తప్పదని తెలిసినా వృద్ధాప్యాన్ని తప్పించుకోవడానికి అనాదికాలంగా మనిషి చేయని ప్రయత్నం లేదు. ముదిమిని కనీసం వీలైనంత కాలం వాయిదా వేసేందుకు పడరాని పాట్లు పడేవాళ్లకు కొదవ లేదు! అలాంటి వాళ్లకు ఎంతగానో పనికొచ్చే సంగతొకటి వెలుగు చూసింది. మనిషికి వృద్ధాప్యం క్రమక్రమంగా సంక్రమించదట. జీవనకాలంలో రెండు కీలక సందర్భాల్లో ఒక్కసారిగా వచ్చి మీదపడిపోతుందట. 44వ ఏట ఒకసారి, 60వ ఏట రెండోసారి! అమెరికాలోని స్టాన్‌ఫర్డ్ వర్సిటీ, సింగపూర్‌లోని నాన్యాంగ్ టెక్నలాజికల్ వర్సిటీ చేసిన తాజా అధ్యయనంలో ఈ మేరకు తేల్చింది. ఆ రెండు సందర్భాల్లోనూ వృద్ధాప్య సంబంధిత మార్పులు ఒంట్లోని అణువణువులోనూ ఉన్నట్టుండి భారీగా చేటుచేసుకుంటాయని వెల్లడించింది.

ఇలా చేశారు...

25 నుంచి 75 ఏళ్ల వయసున్న 108 మందిని సైంటిస్టులు తమ అధ్యయనం కోసం ఎంచుకుంటున్నారు. ప్రపంచంలోని దాదాపు అన్ని దేశాలవారూ నివసించే కాలిఫోర్నియా నుంచి వీరిని ఎంపిక చేశారు. ప్రతి మూడు నుంచి ఆర్నెల్లకోసారి వారి రక్తం, మలం, చర్మం తదితర నమూనాలు సేకరించి పరిశీలించారు. మహిళల్లో 40ల అనంతరం తలెత్తే ముట్లుడిగే దశ వృద్ధాప్యాన్ని వేగవంతం చేస్తుందన్న వాదన ఉంది. కనుక స్త్రీ పురుషులకు వేర్వేరు డేటాబేస్‌ను నిర్వహించారు. ఒంట్లో ఆర్ఎన్ఏ, ప్రొటీన్ల వంటి జీవాణువులు తదితరాల్లో వయసు మీద పడే తీరుతెన్నులను ఏళ్ల తరబడి నిశితంగా పరిశీలించారు. ఫలితాలు వారిని ఆశ్చర్యపరిచాయి. ఈ కీలక జీవాణువులన్నీ ఆడా, మగా తేడా లేకుండా 44వ ఏట భారీ మార్పుచేర్పులకు లోనైనట్టు గమనించారు. 60వ ఏట కూడా మళ్లీ అలాంటి మార్పులే అంతటి తీవ్రతతో చోటుచేసుకున్నాయి. ఫలితంగా స్త్రీ పురుషులిద్దరిలోనూ 55వ ఏట నుంచీ వృద్ధాప్య ఛాయలు కొట్టొచ్చినట్టు బయటికి కన్పించడం గమనించారు.

40ల నుంచైనా మారాలి

అధ్యయన ఫలితాలు తమను నిజంగా అబ్బురపరిచాయని నాన్యాంగ్ వర్సిటీ మైక్రోబయోమ్ విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్ జియావో టావో షెన్ అన్నారు. ''ఉదాహరణకు కెఫీన్‌ను అరిగించుకునే సామర్థ్యం 40 ఏళ్ల దాటాక ఒకసారి, 60 నిండిన మీదట మరోసారి బాగా తగ్గుతుంది. మద్యాన్ని తీసుకున్నా అంతేనని మా పరిశోధనలో తేలింది'' అని ఆయన చెప్పుకొచ్చారు. అంతేగాక 40 దాటాక ఒంట్లో కొవ్వు పేరుకుపోవడం బాగా పెరుగుతుందని స్టాన్‌ఫర్డ్ వర్సిటీ జెనెటిక్స్ విభాగం చీఫ్ మైకేల్ స్నైడర్ గుర్తు చేశారు. ''ఆ దశలో కండరాలకు తగిలే గాయాలు ఓ పట్టాన మానవు కూడా. ఎందుకంటే ప్రొటీన్లు ఒంట్లోని కణజాలాలను పట్టి ఉంచే తీరు 44వ ఏట, 60వ ఏట చెప్పలేనంతగా మార్పులకు లోనవుతున్నట్టు తేలింది. ఫలితంగా చర్మం, కండరాలు, హృదయనాళాల వంటివాటి పనితీరు భారీ మార్పులకు లోనవుతోంది. వీటికి తోడు 60ల్లో మనుషుల్లో సాధారణంగా కండరాల క్షీణత ఒక్కసారిగా వేగం పుంజుకుంటుంది. దాంతో వారిలో హృద్రోగాలు, కిడ్నీ సమస్యలు, టైప్ 2 మధుమేహం వ్యాధుల రిస్కు ఎన్నో రెట్లు పెరుగుతోంది'' అని వివరించారు. ఈ సమస్యలను ఎదుర్కోవడానికి తమ అధ్యయనం కొత్త దారులు తెరుస్తుందని ఆశాభావం వెలిబుచ్చారు. ఈ అధ్యయన ఫలితాలను నేచర్ ఏజింగ్ జర్నల్‌లో ప్రచురించారు.

– సాక్షి, నేషనల్ డెస్క్



> మధ్యవయసు దాటాక మెల్లిమెల్లిగా ముసలితనం గుప్పెట్లోకి వెళ్తామన్నది నిజం కాదు. 40 ఏళ్ల దాటాక రెండు కీలక దశల్లో మనం ఆదమరిచి ఉన్నప్పుడు మనకు తెలియకుండానే ముదిమి ఒక్కసారిగా వచ్చి మీదపడుతుంది''
>
> – జియావో టావో షెన్, అసిస్టెంట్ ప్రొఫెసర్, నాన్యాంగ్ వర్సిటీ

> జీవనశైలిలో ఆరోగ్యకరమైన మార్పులు చేసుకుంటే వృద్ధాప్యాన్ని వీలైనంతగా వాయిదా వేసుకోవచ్చన్నది మా అధ్యయన ఫలితాల సారాంశం. మధ్య వయసు దాటాకైనా మద్యం మానేయాలి. లేదంటే కనీసం బాగా తగ్గించాలి. నీళ్లు బాగా తాగాలి. ముఖ్యంగా 40ల్లోకి, 60ల్లోకి ప్రవేశిస్తున్న దశలో క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి''
>
> – మైకేల్ స్నైడర్, జెనెటిక్స్ విభాగం చీఫ్, స్టాన్‌ఫర్డ్ వర్సిటీ

'సత్వర న్యాయం'తోనే భద్రతపై భరోసా

మహిళలు, చిన్నారులపై నేరాలు పెరగడం ఆందోళన కలిగిస్తోంది

- మహిళలపై నేరాల కేసుల్లో తీర్పులు త్వరగా రావాలి: ప్రధాని మోదీ
- సుప్రీంకోర్టు ఆధ్వర్యంలో జిల్లా న్యాయ వ్యవస్థపై సదస్సు ప్రారంభం

న్యూఢిల్లీ: మహిళలపై నేరాలకు సంబంధించిన కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం లభించాల్సిన అవసరం ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. వేగంగా న్యాయం చేకూర్చే పరిస్థితి ఉంటే భద్రత పట్ల మహిళలకు గొప్ప భరోసా దక్కుతుందని ఉద్ఘాటించారు. కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, హత్య, మహారాష్ట్రలో ఇద్దరు బాలికలపై లైంగిక దాడి ఘటనలు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నేపథ్యంలో ప్రధాని మోదీ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఢిల్లీలో శనివారం సుప్రీంకోర్టు ఆధ్వర్యంలో జిల్లా న్యాయ వ్యవస్థపై ప్రారంభమైన జాతీయ సదస్సులో ఆయన ప్రసంగించారు. భారత రాజ్యాంగానికి దేశ న్యాయ వ్యవస్థను ఒక సంరక్షకురాలిగా పరిగణిస్తుంటామని చెప్పారు. సుప్రీంకోర్టుతోపాటు మొత్తం న్యాయ వ్యవస్థ ప్రజల అంచనాలకు తగ్గట్టుగా పని చేస్తే సమాజానికి మేలు జరుగుతుందని అన్నారు. ప్రధానమంత్రి ఇంకా ఏం మాట్లాడారంటే...

క్రియాశీలకంగా మానిటరింగ్ కమిటీలు

''దేశంలో మహిళలు, చిన్నారులపై వేధింపులు, నేరాలు పెరిగిపోతుండడం ఆందోళన కలిగిస్తోంది. మహిళల భద్రత కోసం చట్టాల్లో కఠినమైన నిబంధనలు చేరుస్తున్నాం. 2019లో ఫాస్ట్‌ట్రాక్ ప్రత్యేక కోర్టుల పథకాన్ని ప్రారంభించాం. అడబిడ్డలపై జరిగే నేరాల విషయంలో తీర్పులు వేగంగా రావాలి. నేరగాళ్లకు శిక్షలు పడాలి. బాధితులకు సత్వర న్యాయం దక్కాలి. అలా జరిగితేనే జనాభాలో సగం మందికి వారి భద్రతపై ఒక భరోసా, నమ్మకం లభిస్తాయి. మహిళలపై నేరాలు అరికట్టే విషయంలో జిల్లా జడ్జి, మేజిస్ట్రేట్, ఎస్పీతో కూడిన జిల్లా మానిటరింగ్ కమిటీల పాత్ర చాలా కీలకం.

కింది కోర్టులే మొదటి మెట్టు

దేశంలో రాజ్యాంగాన్ని, చట్టాల స్ఫూర్తిని న్యాయ వ్యవస్థ చక్కగా పరిరక్షిస్తోంది. సుప్రీంకోర్టు పట్ల, న్యాయ వ్యవస్థ పట్ల దేశ ప్రజలు ఏనాడూ అపనమ్మకం వ్యక్తం చేయలేదు. న్యాయ వ్యవస్థపై వారికి ఎంతో విశ్వాసం ఉంది. దేశ న్యాయ వ్యవస్థకు జిల్లా న్యాయ వ్యవస్థ ఒక బలమైన పునాది అనడంలో సందేహం లేదు. బాధితులకు న్యాయం చేకూర్చడంలో కింది కోర్టులే మొదటి మెట్టు. కోర్టుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నాం. కోర్టులను ఆధునీకరిస్తున్నాం. పెండింగ్ కేసులను విశ్లేషించడానికి, భవిష్యత్తులో రాబోయే కేసులను అంచనా వేయడానికి కృత్రిమ మేధ(ఏఐ), ఆప్టికల్ క్యారెక్టర్ రికగ్నిషన్ వంటి నూతన సాంకేతికతలను ప్రవేశపెట్టాలని నిర్ణయించాం'' అని ప్రధాన మంత్రి మోదీ ఉద్ఘాటించారు. భారత సుప్రీంకోర్టు ఏర్పాటై 75 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా స్మారక పోస్టల్ స్టాంప్, నాణేన్ని ఆవిష్కరించారు.



ఢిల్లీలో జిల్లా న్యాయ వ్యవస్థపై జాతీయ సదస్సులో సీజేఐ జస్టిస్ చంద్రచూడ్, ప్రధాని మోదీ

బెయిల్ ఇవ్వడానికి అభ్యంతరమెందుకు: కపిల్ సిబల్

ఎలాంటి సంకోచాలు, పక్షపాతానికి తావులేకుండా తీర్పులు ఇచ్చేలా ట్రయల్ కోర్టులు, జిల్లా కోర్టులు, సెషన్స్ కోర్టులు బలోపేతం కావాలని సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబల్ చెప్పారు. క్షేత్రస్థాయిలోని కింది కోర్టులు ఒత్తిళ్లను తట్టుకొని స్థిరంగా నిలవకపోతే మొత్తం న్యాయ, రాజకీయ వ్యవస్థ సమగ్రత ప్రమాదంలో పడుతుందని అన్నారు. జిల్లా కోర్టులపై సదస్సులో ఆయన మాట్లాడుతూ... బెయిల్ ఒక నియమం, జైలు ఒక మినహాయింపు అంటూ ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ప్రస్తావించారు. కీలకమైన కేసుల్లో నిందితులకు బెయిల్ ఇవ్వడానికి ట్రయల్ కోర్టులు, జిల్లా కోర్టులు నిరాకరిస్తున్నాయని ఆక్షేపించారు. తన వృత్తి జీవితంలో కింది కోర్టులు బెయిల్ ఇవ్వగా చూసిన సందర్భాలు చాలా తక్కువగా ఉన్నాయని తెలిపారు. ఇది కేవలం తన ఒక్కడి అభిప్రాయం మాత్రమే కాదని చెప్పారు. బెయిల్‌ను కింది కోర్టులు ఒక మినహాయింపుగా భావిస్తుండడంతో పై కోర్టులపై విపరీతమైన ఒత్తిడి పెరుగుతోందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఇటీవల చెప్పారని గుర్తుచేశారు. కింది కోర్టుల్లో బెయిల్ రాకపోవడంతో నిందితులు హైకోర్టు, సుప్రీంకోర్టుకు వెళ్లాల్సి వస్తోందన్నారు. ఈ పరిస్థితిలో మార్పు రావాలని సూచించారు. జిల్లా కోర్టుల్లో మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేయాలని, న్యాయమూర్తుల వేతనాలు పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు.

జిల్లా కోర్టులే వెన్నెముక: జస్టిస్ చంద్రచూడ్

దేశంలో మొత్తం న్యాయ వ్యవస్థకు జిల్లా న్యాయ వ్యవస్థ వెన్నుముక అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ అభివర్ణించారు. చట్టబద్ధ పాలనకు జిల్లా జ్యుడీషియరీ అత్యంత కీలకమని చెప్పారు. జిల్లా కోర్టులను కింది కోర్టులు అని పిలవడం ఆపేయాలని సూచించారు. జిల్లా కోర్టులపై జాతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. జిల్లా న్యాయ వ్యవస్థలో కొన్నేళ్లుగా మహిళల భాగస్వామ్యం గణనీయంగా పెరుగుతోందని అన్నారు. న్యాయాన్ని పొందడానికి ప్రజలకు మొదటి వేదిక జిల్లా కోర్టులేనని తెలిపారు. న్యాయ వ్యవస్థలో టెక్నాలజీకి పెద్దపీట వేస్తున్నట్లు పేర్కొన్నారు. 2023–24లో 46.48 కోట్ల పేజీల కోర్టు రికార్డులను డిజిటల్ రూపంలోకి మార్చామని వెల్లడించారు. 3,500 కోర్టు కాంప్లెక్స్‌లను, 22,000 కోర్టు రూమ్‌లను కంప్యూటరీకరించడానికి ఈ–కోర్టుల ప్రాజెక్టును ప్రారంభించినట్లు చెప్పారు. న్యాయమూర్తులపై ఒత్తిడి అధికంగా ఉంటుందని, వారు మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని జస్టిస్ చంద్రచూడ్ సూచించారు.

హరియాణా ఎన్నికలు అక్టోబర్ 5న

1 నుంచి ఐదో తేదీకి మార్పు • ఓట్ల లెక్కింపు 8న

న్యూఢిల్లీ: హరియాణా అసెంబ్లీ ఎన్నికల తేదీని భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) మార్చింది. ముందుగా ప్రకటించిన అక్టోబర్ 1న కాకుండా 5వ తేదీన అసెంబ్లీ ఎన్నికలు ఉంటాయని శనివారం ప్రకటించింది. నాలుగో తేదీన జరగాల్సిన ఓట్ల లెక్కింపు 8వ తేదీన ఉంటుందని, జమ్మూకశ్మీర్ ఓట్ల లెక్కింపు అదే రోజున జరుగుతుందని వెల్లడించింది. బిష్ణోయ్ సామాజికవర్గం అసోజ్ అమావాస్య పండుగను జరుపుకోవడానికి పెద్ద సంఖ్యలో రాజస్తాన్‌లోని బికనేర్‌కు వెళతారని, వీరు ఓటింగ్‌కు దూరం కాకూడదనే ఉద్దేశంతోనే ఎన్నికలను అక్టోబర్ ఐదో తేదీకి మార్చామని ఈసీ తెలిపింది. అసోజ్ అమావాస్య అక్టోబర్ 2న వస్తోంది. దీని కోసం హరియాణాలోని సిర్సా, ఫతేహాబాద్, హిసార్‌ల నుంచి వేలాది బిష్ణోయ్ కుటుంబాలు బికనేర్‌కు వెళతాయి. గురు జంబేశ్వర్ స్మృత్యర్థం నిర్వహించే అసోజ్ అమావాస్య కోసం రాజస్తాన్‌లోని స్వగ్రామం ముకమ్‌కు చేరుకుంటాయి. మూడు నాలుగు శతాబ్దాలుగా ఈ సంప్రదాయం కొనసాగుతోంది. అందువల్ల హరియాణా ఎన్నికల తేదీని మార్చాలని ఆలిండియా బిష్ణోయ్ మహాసభ అధ్యక్షుడు తమను రాతపూర్వకంగా అభ్యర్థించారని ఈసీ వెల్లడించింది. ఓటింగ్ హక్కులు కాపాడటానికి, బిష్ణోయ్‌ల సంప్రదాయాలను గౌరవించడానికి ఎన్నికల తేదీని మార్చామని తెలిపింది. అయితే ఎన్నికలను వాయిదా వేయాలని మొదటగా కోరింది బీజేపీ కావడం గమనార్హం. సెప్టెంబరు 28, 29 శని, ఆదివారాలు వస్తున్నాయని, అక్టోబర్ 1వ తేదీ పోలింగ్ సెలవు, రెండో తేదీ గాంధీ జయంతి సెలవు ఉందని.. వరుస సెలవులు వస్తే ప్రజలు వెకేషన్‌కు, స్వస్థలాలకు వెళ్లిపోతారని, పోలింగ్ తగ్గుతుందని బీజేపీ ఈసీకి లేఖ రాసింది. అసోజ్ అమావాస్య ఉన్న విషయాన్ని కూడా ప్రస్తావించింది.

8న అమెరికా పర్యటనకు రాహుల్



న్యూఢిల్లీ: లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ సెప్టెంబరు 8 నుంచి 10వ తేదీ దాకా అమెరికాలో పర్యటించనున్నారు. వాషింగ్టన్ డి.సి., డల్లాస్‌లలో పలు ముఖాముఖి సమావేశాల్లో పాల్గొననున్నారు. అలాగే టెక్సాస్ యూనివర్సిటీలో విద్యార్థులతోనూ ఇష్టాగోష్టిలో పాల్గొంటారు. ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ చైర్మన్ సామ్ పిట్రోడా.. రాహుల్ అమెరికా పర్యటన వివరాలను శనివారం వెల్లడించారు. 'సెప్టెంబర్ 8న వాషింగ్టన్ డి.సి., 9, 10 తేదీల్లో డల్లాస్‌లో ఉంటారు. పలు కార్యక్రమాలు ఉంటాయి' అని పిట్రోడా తెలిపారు.

ఢిల్లీ సీఎస్‌గా ధర్మేంద్ర



సాక్షి, న్యూఢిల్లీ: 1989 బ్యాచ్ ఐఏఎస్ అధికారి ధర్మేంద్ర ఢిల్లీ ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. అరుణాచల్ ప్రదేశ్ ప్రస్తుత చీఫ్ సెక్రటరీగా ఉన్న ధర్మేంద్ర ఢిల్లీ సీఎస్‌గా సెప్టెంబర్ 1న బాధ్యతలు స్వీకరించనున్నారు. గతంలో కేంద్ర ప్రభుత్వం నుంచి రెండుసార్లు పొడిగింపులు అందుకున్న ఢిల్లీ ప్రస్తుత చీఫ్ సెక్రటరీ నరేష్ కుమార్ పదవీకాలం శనివారంతో ముగియడంతో కేంద్ర హోంశాఖ ఆయన స్థానంలో ధర్మేంద్రను నియమించింది. స్వతహాగా సివిల్ ఇంజనీర్ అయిన ధర్మేంద్ర 2022 ఏప్రిల్ నుంచి అరుణాచల్ ప్రదేశ్ ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్నారు. నరేష్ కుమార్ ప్రధాన కార్యదర్శిగా ఉన్న సమయంలో, ఆయన నేతృత్వంలోని ఢిల్లీ బ్యూరోక్రసీకి, అరవింద్ కేజ్రీవాల్ ప్రభుత్వానికి మధ్య తరచూ ఘర్షణలు చోటుచేసుకున్న విషయం తెలిసిందే.

రైతుల గోడు కేంద్రం వినాలి

ఒలింపియన్ వినేశ్ ఫొగాట్ వినతి

చండీగఢ్: ఒలింపిక్ క్రీడాకారిణి, మల్లయోధురాలు వినేశ్ ఫొగాట్ గత 200 రోజులుగా ఉద్యమిస్తున్న రైతన్నలకు సంఘీభావం ప్రకటించారు. శనివారం పంజాబ్, హరియాణా సరిహద్దులోని శంభు, ఖనౌరీ బోర్డర్ పాయింట్ల వద్ద పంజాబ్ రైతుల 'ఢిల్లీ చలో' నిరసనోద్యమం శనివారం 200వ రోజుకు చేరిన సందర్భంగా శంభు బోర్డర్‌తో పాటు ఖనౌరీ బోర్డర్ వద్దకు వచ్చి రైతులతో కలిసి నిరసన స్థలాల వద్ద బైఠాయించి వారికి వినేశ్ ఫొగాట్ మద్దతు పలికారు. రైతు కుటుంబంలో పుట్టిన వినేశ్ ఈ సందర్భంగా మాట్లాడారు. '' మీ కూతురు మీకు బాసటగా ఉంటుందని చెప్పేందుకే ఇక్కడికి వచ్చా. డిమాండ్లు ఇంకా నెరవేర్చనందుకే రైతుల నిరసనలు కొనసాగుతున్నాయి. 200 రోజులుగా ఉద్యమిస్తున్న వీళ్లను చూస్తే బాధేస్తోంది. రెజ్లర్లుగా మేం రైతులకు మావంతుగా ఏమీ చేయలేకపోయామని ఒక్కోసారి అనిపిస్తుంది. అంతర్జాతీయ స్థాయిలో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన మేము ఇక్కడ సొంత కుటుంబం కోసం ఏమీ చేయలేక నిస్సహాయులమయ్యాం. వీళ్ల బాధను ఇప్పటికైనా ప్రభుత్వం వినాలి. రైతన్న అన్నం పెట్టకపోతే మనమెలా బతుకుతాం?. ప్రభుత్వం అస్సలు పట్టించుకోకపోయినా నిస్వార్థంగా రైతులు పంటలు పండించి దేశానికి తిండి పెడుతున్నారు. వాళ్లది పెద్ద మనసు. ప్రభుత్వం కూడా తమది పెద్దమనసు అని చాటిచెప్పాలి. డిమాండ్లను నెరవేర్చాలి. హరియాణాలో రైతులు ఉద్యమిస్తే వారికీ నేను మద్దతు పలుకుతా. రైతుల కష్టాలను పరిష్కరించాల్సిందే. సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉంది. రైతుల ఉద్యమం వృథా కాకూడదు'' అని అన్నారు. హరియాణాలోని ఛర్ఖీ దాద్రీ జిల్లాకు చెందిన మీరు వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేస్తారా? అని విలేకరి ప్రశ్నించగా '' నాకు రాజకీయాల గురించి అస్సలు తెలియదు. నాకు రాజకీయ అనుభవం కూడా లేదు. నేను రాజకీయాల్లోకి రాబోను. ఇక్కడ రాజకీయాలు మాట్లాడొద్దు. ఇది రైతుల ఉద్యమస్థలి. ఇక్కడ రైతన్నల సమస్యల గురించే మాట్లాడదాం. చర్చిద్దాం '' అని ఆమె వ్యాఖ్యానించారు. నిరసనోద్యమం మొదలై 200 రోజులు పూర్తయిన సందర్భంగా సంయుక్త కిసాన్ మోర్చా, కిసాన్ మజ్దూర్ సంయుక్తంగా అక్కడే 'కిసాన్ మహాపంచాయత్' ఏర్పాటుచేశాయి.



గాజాలో 89 మంది మృత్యువాత

గాజా: గాజాలోని మధ్య, దక్షిణ ప్రాంతాలపై ఇజ్రాయెల్ బలగాలు 48 గంటల వ్యవధిలో జరిపిన దాడుల్లో 89 మంది చనిపోయారు. ఇజ్రాయెల్ ఆర్మీ చేపట్టిన దాడుల్లో శనివారం ఒక్క రోజే 48 మంది మృతి చెందినట్లు పాలస్తీనా ఆరోగ్య విభాగం తెలిపింది. అల్ అక్సా అరబ్ ఆస్పత్రిపైనా దాడికి దిగిందని, ఈ ఘటనలో ఇద్దరు చనిపోయినట్లు వివరించింది. రోగులు, వారి సంబంధీకులు పెద్ద సంఖ్యలో గాయపడ్డారని పేర్కొంది. కాగా, ఇజ్రాయెల్ ఆర్మీ తాత్కాలిక కాల్పుల విరమణ ప్రకటించిన నేపథ్యంలో శనివారం గాజాలో పోలియో వ్యాక్సినేషన్ డ్రైవ్ మొదలైంది. ఖాన్ యూనిస్ ఆస్పత్రిలో 10 మంది శిశువులకు టీకా వేశారని అధికారులు తెలిపారు. ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లోని జెనిన్ నగరాన్ని ఇజ్రాయెల్ ఆర్మీ చుట్టుముట్టింది. నాలుగు రోజులుగా ఇక్కడ దాడులు జరుపుతున్న ఆర్మీ నగరాన్ని మిగతా ప్రపంచంతో సంబంధాలు లేకుండా తెంచేసింది. మిలటరీ జీపులు, సాయుధ బలగాల వాహనాలు అక్కడ కనిపిస్తున్నాయి. ఎక్కడ చూసినా ధ్వంసమైన కాంక్రీట్ గోడలు, శిథిల భవనాలు దర్శనమిస్తున్నాయి.

సెప్టెంబర్‌లోనూ అధిక వర్షపాతం

ఆగస్టులో సాధారణం కంటే 16 శాతం ఎక్కువ: ఐఎండీ

న్యూఢిల్లీ: ఆగస్టులో మాదిరిగానే సెప్టెంబర్‌లోనూ సాధారణానికి మించి వర్షాలు కురిసే అవకాశముందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అంచనా వేసింది. ఆగస్టులో సాధారణానికి మించి 16 శాతం అధికంగా వర్షపాతం నమోదైందని తెలిపింది. అదేసమయంలో, వాయవ్య భారతంలో రికార్డు స్థాయిలో 253.9 మిల్లీమీటర్ల వర్షం పడిందని, 2001 సంవత్సరం తర్వాత ఆగస్టులో ఇంత భారీగా వానలు కురియడం ఇది రెండోసారని తెలిపింది. ఐఎండీ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ మహాపాత్ర శనివారం ఢిల్లీలో మీడియాకు ఈ వివరాలు వెల్లడించారు. 'దేశంలో ఆగస్టులో 248.1 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతం నమోదవ్వాల్సి ఉండగా, అంతకుమించి ఈసారి ఆగస్టులో 287.1 మి.మీ. వర్షం కురిసింది. అదేవిధంగా, జూన్ ఒకటో తేదీన మొదలైన రుతుపవన సీజన్‌లో దేశంలో సాధారణంగా 701 మి.మీ. వర్షం కురవాల్సి ఉండగా, ఈసారి ఏకంగా 749 మి.మీ. కురిసింది'అని ఆయన వివరించారు. 'ఆగస్టులో సాధారణంగా 16.3 రోజులపాటు అల్పపీడన వాతావరణం కొనసాగుతుంది. కానీ, అంతకుమించి 17 రోజుల్లో అల్పపీడనాల ప్రభావం ఉంది. ఆగస్టులో ఏర్పడిన ఆరు అల్పపీడనాల్లో రెండింటి కారణంగా ఉత్తర, మధ్యభారతంతోపాటు తూర్పు భారతంలోని కొన్ని ప్రాంతాలు, తమిళనాడు సహా దక్షిణ భారతంలో అతి భారీ వర్షాలు కురిశాయి. ఆగస్టు నెల మొత్తం రుతు పవనాల ప్రభావం కొనసాగింది'అని ఐఎండీ డీజీ మహాపాత్ర తెలిపారు. అయితే, హిమాలయాలు, ఈశాన్య ప్రాంతంలోని పలు జిల్లాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదైందన్నారు. ఈ సీజన్‌లో అల్పపీడనాల్లో అధిక భాగం దేశ దక్షిణ ప్రాంతంపైనే కేంద్రీకృతం కావడమే ఇందుకు కారణమని చెప్పారు.



వాయవ్య భారతంలో అతిభారీ వర్షాలు

వాయవ్య భారతం, చుట్టుపక్కల ప్రాంతాల్లో ఆగస్టులో మాదిరిగా సెప్టెంబర్‌లో భారీ వర్షాలు కురిసేందుకు అవకాశాలున్నాయని ఐఎండీ డీజీ మృత్యుంజయ వివరించారు. దేశంలోని మిగతా ప్రాంతాల్లో సాధారణానికి మించి వానలు పడొచ్చని అంచనా వేశారు. దేశవ్యాప్తంగా సెప్టెంబర్‌లో దీర్ఘకాలం సగటు 167.9 మి.మీ. మించి వర్షాలు పడొచ్చని చెప్పారు.

గృహనిర్బంధంలో వైద్యురాలి తల్లిదండ్రులు: అధిర్



కోల్‌కతా: ఆర్.జి.కర్ మెడికల్ కాలేజీ హత్యాచారానికి గురైన వైద్యురాలి తల్లిదండ్రులను పోలీసులు గృహనిర్బంధంలో ఉంచారని పశ్చిమబెంగాల్ కాంగ్రెస్ అధ్యక్షుడు అధిర్ రంజన్ చౌదరి ఆరోపించారు. అధిర్ శనివారం ట్రైనీ డాక్టర్ ఇంటికి వెళ్లి ఆమె తల్లిదండ్రులతో మాట్లాడారు. త్వరగా అంత్యక్రియలు పూర్తిచేయడానికి పోలీసులు హతురాలి తండ్రికి డబ్బు ఇవ్వజూపారని ఆరోపించారు. 'డాక్టర్ తల్లిదండ్రులను పోలీసులు గృహనిర్బంధంలో ఉంచారు. రకరకాల కారణాలు చెబుతూ వారిని గడప దాటనీయడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు వైద్యురాలి అంత్యక్రియలను తక్షణం పూర్తిచేయాలంటూ తండ్రికి డబ్బు ఇవ్వజూపారు' అని అధిర్ అన్నారు. ఆగస్టు 9న వేకువజామున ఆర్.జి.కర్ ఆసుపత్రి సెమినార్ హాల్‌లో పీజీ ట్రైనీ డాక్టర్ మృతదేహం లభించిన విషయం తెలిసిందే. ఆమెను రేప్ చేసి హత్య చేశారని పోస్టుమార్టమ్‌లో తేలింది. అప్పటినుంచి బెంగాల్‌లో జూనియర్ డాక్టర్లు సమ్మెను కొనసాగిస్తున్నారు. సమ్మె చేస్తున్న డాక్టర్లను కలవడానికి అధిర్ రంజన్ చౌదరి శనివారం ఆర్.జి.కర్ ఆసుపత్రికి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు ఆయన్ని అడ్డుకున్నారు.

అరేబియా సముద్రంలో తుపానా?

వాతావరణ శాఖ అధికారులే అవాక్కైన వైనం

గత 48 ఏళ్లలో ఎన్నడూ చూడలేదని వ్యాఖ్య

న్యూఢిల్లీ: ఆగస్టు నెలలో అరేబియా సముద్రంలో తుపాను పుట్టి భారత వాతావరణ శాఖ అధికారులను సైతం సంభ్రమాశ్చర్యాలకు, ఒకింత ఆందోళనకు గురిచేసింది. ఎందుకంటే అరేబియా సముద్రంలో ఆగస్టు నెలలో తుపాన్లు ఏర్పడటం చాలా అరుదైన విషయం. అరేబియా సముద్ర పశ్చిమ ప్రాంత జలాలు ఎల్లప్పుడూ చల్లగా ఉంటాయి. చల్లని జలాలు అనేవి తుపాన్లు ఏర్పడేందుకు అనువైన వాతావరణం కాదు. అరేబియా ద్వీపకల్ప భూభాగాల నుంచి వీచే పొడిగాలులు సైతం ఇక్కడ తుపాన్లను ఏర్పర్చలేవు. అయితే తాజాగా గుజరాత్ తీరాన్ని దాటుతూ తుపాను ఏర్పడటం వాతావరణ శాఖ అధికారులను సైతం ఆలోచనల్లో పడేసింది. చివరిసారిగా 1976లో అరేబియా సముద్రంలో తుపాను ఏర్పడింది. అది కూడా ఒడిశా మీదుగా ఏర్పడిన అల్పపీడనం చివరకు పశ్చిమ–వాయవ్య దిశగా కదిలి చివరకు అరేబియా సముద్రంలో తుపానుగా రూపాంతరం చెందింది. తర్వాత అది అలాగే వెళ్లి ఒమన్ తీరం వద్ద బలహీనపడింది.

అరేబియాలో తుపాన్లు ఎందుకు రావంటే?

వర్షాకాల సీజన్‌లో అరేబియా సముద్ర జలాల ఉపరితల ఉష్ణోగ్రత 26 డిగ్రీల సెల్సియస్‌కన్నా తక్కువకు పడిపోతుంది. దీంతో జూలై, సెప్టెంబర్‌లో తుపాన్లు ఏర్పడటం కష్టం. అల్పపీడనం ఏర్పడినపుడు గాలులు గంటకు 52–61 కి.మీ.ల వేగంతో వీస్తాయి. అదే తుపాను ఏర్పడితే గంటకు 63–87 కి.మీ.ల వేగంతో వీస్తాయి. తుపాను ఏర్పడాలంటే సముద్ర ఉపరితల ఉష్ణోగ్రత కచ్చితంగా 26.5 డిగ్రీల సెల్సియస్‌ను మించి ఉండాలి. అయితే అరేబియా జలాలు ఇంత వేడి ఉండవు. అదే బంగాళాఖాతంలో ఉండే వాతావరణం తుపాన్లు ఏర్పడటానికి అత్యంత అనువుగా ఉంటుంది. చారిత్రకంగా బంగాళాఖాతం, అరేబియాసముద్రాన్ని కలిపి హిందూ మహాసముద్ర ఉత్తరప్రాంతంగా పరిగణిస్తారు. హిందూ మహాసముద్రం ఉత్తరాన 1976 తర్వాత తుపాను ఏర్పడటం ఇదే తొలిసారికావడం విశేషం. 1891 ఏడాది నుంచి చూస్తే ఇప్పటిదాకా ఈ ప్రాంతంలో ఆగస్టునెలలో కేవలం నాలుగుసార్లే తుపాన్లు ఏర్పడ్డాయి. అరేబియా సముద్రప్రాంతంతో పోలిస్తే బంగాళాఖాతంలో తుపాన్లు వచ్చే అవకాశాలు నాలుగు రెట్లు ఎక్కువ. మే, నవంబర్ మధ్యలో ఇవి విజృంభిస్తాయి.



భూతాపం కారణమా?

మితిమీరిన కాలుష్యం, విచ్చలవిడిగా పెరిగిపోయిన మానవ కార్యకలాపాలు, పారిశ్రామికీకరణ, శిలాజ ఇంధనాలను మండించడంతో భూతాపోన్నతి కారణంగా వాతావరణ మార్పులు సంభవిస్తున్నాయి. దీంతో అరేబియా సముద్రంలో తుపాన్లకు ఈ భూతాపోన్నతికి సంబంధం ఉందేమోనని శాస్త్రవేత్తలు అనుమానిస్తున్నారు. భూతాపం కారణంగా ఇది సంభవించినా ఆశ్చర్యపడాల్సిన పనిలేదని భారత భూవిజ్ఞాన మంత్రిత్వ శాఖ మాజీ కార్యదర్శి మాధవన్ రాజీవన్ అభిప్రాయపడ్డారు. ''దశాబ్దాలుగా ప్రాంతీయ వాతావరణంపై శాస్త్రవేత్తలకు ఉన్న అంచనాలను ఈ కొత్త పరిస్థితులు తలకిందులు చేస్తున్నాయి. వాతావరణ మార్పుల్లో కొత్త ధోరణులు అరేబియా సముద్రప్రాంతంపై మరింత లోతైన అధ్యయనం అవసరమని చాటిచెప్తున్నాయి. శతాబ్దాలుగా కొనసాగే వర్షాకాల సీజన్, అల్ప పీడనాలు, తుపాన్ల సీజన్లపై మనకున్న అవగాహనను మరింతగా అప్‌డేట్ చేసుకోవాల్సిన సమయమొచ్చింది. వాతావరణంలో తరచూ ఇలాంటివే సంభవిస్తే మన ఉష్ణమండల ప్రాంత పరిస్థితుల్లోనూ మార్పులు గణనీయంగా రావొచ్చు. ఇలాంటి తుపాన్లు ఏర్పడటానికి దారితీసిన పరిస్థితులను వాతావరణ శాస్త్రవేత్తలు మరింత లోతుగా అధ్యయనం చేయాలి'' అని రాజీవన్ వ్యాఖ్యానించారు.

ఎయిమ్స్ ఐసీయూలో ఏచూరి



సాక్షి, న్యూఢిల్లీ: సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అస్వస్థతకు గురయ్యారు. శ్వాసకోశ సంబంధిత వ్యాధితో ఏచూరి ఆగస్టు 19న ఢిల్లీలోని ఎయిమ్స్ ఆసుపత్రిలో చేరారు. న్యూమోనియాను పోలిన ఛాతీ ఇన్‌ఫెక్షన్‌తో ఆయన బాధపడ్డారు. 72 ఏళ్ల ఏచూరి ఆరోగ్య సమస్య ఏమిటనేది ఎయిమ్స్ వెల్లడించలేదు. వైద్య బృందం ఏచూరికి మెరుగైన వైద్య చికిత్స అందిస్తున్నట్లు సీపీఎం కేంద్ర కమిటీ శనివారం ఓ ప్రకటనలో తెలిపింది. ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఐసీయూ)లో ఉన్నారని, కోలుకుంటున్నారని తెలిపింది. సీతారాం ఏచూరి ఇటీవలే కాటరాక్ట్ ఆపరేషన్ చేయించుకున్నారు.

హారిస్‌లో అన్నీ లోపాలే: ట్రంప్



వాషింగ్టన్: డెమొక్రటిక్ మహిళా అభ్యర్థి కమలా హారిస్‌పై తరచూ వ్యక్తిగత దూషణలకు పాల్పడే రిపబ్లికన్ అధ్యక్ష అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ మరోసారి ఆమెపై నోరు పారేసుకున్నారు. గురువారం సీఎన్ఎన్ వార్తాసంస్థకు ఆమె ఇచ్చిన ఇంటర్వ్యూను ప్రస్తావిస్తూ ట్రంప్ విమర్శలకు దిగారు. '' సీఎన్ఎన్‌కు హారిస్ ఇచ్చిన ఇంటర్వ్యూలు మీరంతా చూసే ఉంటారు. ఆమె సాదాసీదా ఇంటర్వ్యూ ఇచ్చినా బాగానే ఉండేదేమో. మామూలు ఇంటర్వ్యూలు అద్భుతంగా లేకపోయినా ఎంతోకొంత బాగానే ఉంటాయి. కానీ తాజా ఇంటర్వ్యూ చెత్తగా ఉంది. అందులో అన్నీ లోపాలే. అసలు హారిస్‌లోనే లోపాలున్నాయి. ఇలాంటి లోపాలున్న బైడెన్ ఇప్పటికే రేస్ నుంచి తప్పుకున్నారు'' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. '' గత రాత్రి ప్రసారమైన ఆమె ఇంటర్వ్యూను చూశారా?. ఈమెకు మన దేశానికి అధ్యక్షురాలు అయ్యే అర్హత ఉందా? నాకైతే ఆమె అలా కనిపించట్లేదు'' అని ట్రంప్ అన్నారు.

సాక్షి కరీంనగర్

ఆదివారం । 1 । సెప్టెంబర్ । 2024

కొలువుల భర్తీపై కసరత్తు

- శాఖల వారీగా ఖాళీలపై ఆరా
- ఆశల పల్లకిలో నిరుద్యోగులు



జిల్లాలో ఉద్యోగులు ఇలా ..

మొత్తం ఉద్యోగులు	7,771
గెజిటెడ్ అధికారులు	585
నాన్‌గెజిటెడ్ అధికారులు	6,035
నాల్గో తరగతి ఉద్యోగులు	1,151

కరీంనగర్ అర్బన్: ప్రభుత్వ ఖాళీలపై మరోసారి ఆరా తీస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఖాళీ కొలువులపై నివేదికలివ్వాలని ఆదేశించడంతో శాఖలవారీగా వివరాలను రాబడుతున్నారు. గతంలోనే కొత్త జోనల్ వ్యవస్థకు చట్టబద్ధత లభించగా తదనుగుణంగానే నియామక ప్రక్రియ జరగనుంది. సీఎం రేవంత్‌రెడ్డి మరో 35వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇవ్వాలని ప్రకటించడంతో తదనుగుణ చర్యలు ముమ్మరం చేశారు. ప్రతీ శాఖలో ఉన్న సాంక్షన్ స్ట్రెంత్ ఎంత, ఉన్నవారెంత, ఖాళీలెన్ని అనే కోణాల్లో నివేదికలను రూపొందిస్తున్నారు. భారీస్థాయిలో ఉద్యోగాల ప్రకటన ఉండటంతో నిరుద్యోగుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. జిల్లావ్యాప్తంగా వెయ్యి నుంచి 1,200 వరకు ఖాళీలు ఉండనుండగా అతి త్వరలోనే పూర్తి లెక్క తేలనుంది.

అన్ని శాఖల్లోనూ ఖాళీలు

ప్రభుత్వ విభాగాల్లో దాదాపు అన్నింటా ఖాళీలే. పాత జిల్లాకేంద్రం ప్రకారమే 25శాతం ఖాళీ పోస్టులు వెక్కిరించాయి. ఇక జిల్లాల విభజన అనంతరం 35–40 శాతం వరకు ఖాళీలున్నాయని అధికారులు చెబుతున్నారు. ప్రధానంగా విద్య, పోలీస్, రెవెన్యూ, ఉద్యాన, మత్స్య, వ్యవసాయ మార్కెటింగ్, మార్క్‌ఫెడ్, సహకార, రిజిస్ట్రేషన్, పౌరసరఫరాల సంస్థ శాఖల్లో ఎక్కువ ఖాళీలున్నట్లు గుర్తించారు. అలాగే విద్య, వ్యవసాయ, పశుసంవర్ధక, పట్టు పరిశ్రమ, ట్రెజరీ, సర్వేలాండ్ రికార్డ్స్, స్త్రీ శిశుసంక్షేమ శాఖ, డీపీఆర్వో, వైద్యశాఖల్లో ఖాళీలున్నాయి. క్రీడల్లో అడ్మినిస్ట్రేటివ్, కోచింగ్, రీజినల్ స్పోర్ట్స్ స్కూల్స్, టీచింగ్, హాస్టల్, మెడికల్ స్టాఫ్ అంతా కలిపి 34 పోస్టులు ఖాళీ ఉన్నాయి. మున్సిపల్‌లో అన్ని కేటగిరీల్లో 270, వ్యవసాయ శాఖలో 18 ఏఈవో, పంచాయతీరాజ్‌లో 15 టైపిస్టు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రెవెన్యూ శాఖకు సంబంధించి టైపిస్ట్ నుంచి తహసీల్దార్ వరకు 40కి పైగా పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

వయోపరిమితి పెరిగేనా

తాజాగా ఉద్యోగాల నియామకాలకు వయోపరిమితి పెంచాలనే డిమాండ్ నిరుద్యోగుల నుంచి వినిపిస్తోంది. నిరుద్యోగుల అభ్యర్థన మేరకు 2017లో ప్రభుత్వం పదేళ్ల మేర పొడిగించింది. 34 ఏళ్ల నుంచి 44 ఏళ్లకు పొడిగిస్తూ సడలింపు ఇచ్చింది. అలాగే ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు అదనంగా మరో 5 ఏళ్లు పొడిగించింది. పోలీస్ కొలువులకూ మూడేళ్ల వయోపరిమితి పెంచారు.

కొత్త జోన్ల ప్రకారమే..

ఇక నియామకాల్లో ఏ స్థాయి పోస్టులైనా 95శాతం పోస్టులు స్థానికులకే. స్థానికేతర పోస్టుల్లో గల మూస ధోరణికి అడ్డుకట్ట వేయగా ఇక స్థానికులను ఉద్యోగాలు వరించనున్నాయి. కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాలు రాజన్న జోన్‌లో చేర్చగా పెద్దపల్లి జిల్లాను కాళేశ్వరం, జగిత్యాలను బాసర జోన్‌లో చేర్చారు. గతంలో నియామక ప్రక్రియలో జిల్లా స్థాయి పోస్టులకు సంబంధించి 80 శాతం స్థానికత, 20 శాతం ఓపెన్ కేటగిరి ఉండేది. జోనల్ స్థాయిలో 70శాతం స్థానికత, 30శాతం ఓపెన్ కేటగిరి, రాష్ట్ర స్థాయి పోస్టుల్లో 60శాతం స్థానికత, 40శాతం ఓపెన్ కేటగిరిలో పోస్టులను భర్తీ చేసేవారు. కాగా ఇక జిల్లా, జోనల్, రాష్ట్రస్థాయి పోస్టులన్నింటికి 95శాతం స్థానికత 5శాతం స్థానికేతరులకు కేటాయించారు.

నవరాత్రి దీక్షలు చేపట్టండి

- ప్రశాంతంగా ఉత్సవాలు జరుపుకుందాం
- కరీంనగర్‌ను ఆదర్శంగా నిలుపుదాం
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్
- వినాయక చవితి ఉత్సవాల నిర్వహణపై సీపీ ఆధ్వర్యంలో సమీక్ష



మాట్లాడుతున్న కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్

కరీంనగర్‌టౌన్: వినాయక చవిత ఉత్సవాల నిర్వాహకులు తప్పనిసరిగా 9 రోజులపాటు ఉపవాస దీక్షలు చేపట్టాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. భక్తిశ్రద్ధలతో పూజిస్తేనే కోరికలు నెరవేరుతాయని, అందుకు తానే నిదర్శనమన్నారు. శనివారం కమిషనరేట్ కార్యాలయంలో కమిషనర్ అభిషేక్ మహంతి ఆధ్వర్యంలో గణపతి ఉత్సవాల నిర్వహణపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. గణేశ్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని, పోలీసులు, అధికారులు పూర్తిగా సహకరించేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించి కరీంనగర్‌ను ఆదర్శంగా నిలుపుదామని పేర్కొన్నారు.

మండపాల వద్ద సౌకర్యాలు కల్పించాలి

గణేశ్ మండపాల వద్ద నిమజ్జనం పూర్తయ్యే వరకు అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను కోరారు. మండపాల నిర్వహణకు అయ్యే విద్యుత్ చార్జీలన్నీ తానే చెల్లిస్తానని తెలిపారు. నిమజ్జన ఉత్సవాల సమయంలో ప్రత్యేకంగా అంబులెన్స్‌లు ఏర్పాటు చేయాలని, భోజన సదుపాయాలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ఈ విషయంలో అవసరమైతే ప్రైవేటు ఆస్పత్రులు, హోటల్స్ అసోసియేషన్ నాయకుల సహకారం తీసుకోవాలన్నారు. నిమజ్జనం రోజు క్రేన్లు, సిబ్బందిని తగినంత నియమించి, ఉత్సవాలు విజయవంతమయ్యేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. సీపీ అభిషేక్ మహంతి మాట్లాడుతూ, ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాటు చేసే మండపాల సమాచారం, దరఖాస్తు పత్రాలను స్థానిక పోలీసులకు సమర్పించాలని కోరారు. సమావేశంలో కలెక్టర్ పమేలా సత్పతి, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, సుడా చైర్మన్ నరేందర్‌రెడ్డి, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పేయి తదితరులు పాల్గొన్నారు.

అత్యధిక సభ్యత్వాలు చేయించండి

కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో అత్యధికంగా బీజేపీ సభ్యత్వాన్ని నమోదు చేయించాలని కేంద్ర మంత్రి సంజయ్‌కుమార్ పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శనివారం కరీంనగర్ చైతన్యపురిలోని జిల్లా కార్యాలయంలో సభ్యత్వ నమోదు లో పాల్గొన్నారు. బీజేపీ సభ్యత్వం కావాలనుకునేవారు 88000 02024 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇవ్వాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, తాళ్లపల్లి శ్రీనివాస్, ఎర్రం మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

అనుక్షణం అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ అర్బన్: వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ దృష్ట్యా అన్ని శాఖల అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో అందుబాటులో,అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. చెరువులు, వాగులు, కుంటల్లోకి వచ్చి చేరుతున్న వరద ప్రవాహాన్ని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు తప్పనిసరిగా కార్యస్థానాల్లో ఉంటూ పరిస్థితులను నిశితంగా పరిశీలించి ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని సూచించారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని పేర్కొన్నారు. లో లెవెల్ వంతెనలు, కాజ్ వేలు, వరద ప్రవాహం ఏర్పడే ప్రాంతాల మీదుగా వాహనాల రాకపోకలను నిషేధిస్తూ ఇతర ప్రాంతాల మీదుగా దారి మళ్లించాలని అన్నారు. పట్టణ ప్రాంతాల్లో డ్రైనేజీలు, మ్యాన్ హోల్స్ కూరుకుపోయి వర్షపు జలాలు ఎక్కడికక్కడ నిలిచిపోయే అవకాశాలు ఉన్నందున, ముందస్తుగానే వాటిని శుభ్రం చేయించాలని ఆదేశించారు. ఆదివారం సెలవు రోజు కాగా విద్యార్థులు, యువత చెరువులు, నదుల వద్దకు వెళ్లకుండా నిలువరించాలని అధికారులకు నిర్దేశించారు.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం

కరీంనగర్ అర్బన్: భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. వర్షాలకు సంబంధించి బాధితులు కంట్రోల్ రూం టోల్ ఫ్రీ నంబర్ లేదా వాట్సాప్ నంబర్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు. కంట్రోల్ రూం సిబ్బంది 24గంటల పాటు అందుబాటులో ఉంటారని తెలిపారు.

టోల్ ఫ్రీ 0878-2997247
వాట్సాప్ 81251 84683

వరాల జల్లు

- నెలరోజుల్లో రూరల్ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటు
- పత్తిపాక రిజర్వాయర్, పాలకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ నిర్మిస్తాం
- పెద్దపల్లికి బస్‌డిపో, గోదావరిఖని డిపోకు కొత్త బస్సులు
- ఎల్లంపల్లి, ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టుల నిర్వాసితులకు పరిహారం
- జెన్‌కో, సింగరేణి ఆధ్వర్యంలో కొత్త విద్యుత్ కేంద్రం
- రామగుండం పర్యటనలో డిప్యూటీ సీఎం, మంత్రుల వెల్లడి



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వేదికపై మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్

సాక్షి,పెద్దపల్లి/గోదావరిఖని/రామగుండం: డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ శనివారం రామగుండం నియోజకవర్గంలో పర్యటించారు. ఈ ప్రాంతంపై వరాల వరద పారించారు. స్థానిక ఎమ్మెల్యేల వినతి మేరకు స్పందించిన మంత్రి వర్యులు.. పెండింగ్ పనులకు అతిత్వరలోనే మోక్షం కల్పిస్తామని భరోసా కల్పించారు. మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌తో కలిసి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తొలుత రామగుండం బీ థర్మల్ విద్యుత్ ప్లాంట్‌ను పరిశీలించారు. జెన్‌కో అధికారులతో సమీక్షించారు. ఆ తర్వాత సింగరేణి సెక్టార్– 2 వద్ద రూ.3 కోట్ల వ్యయంతో నిర్మించిన నైపుణ్య కేంద్రాన్ని ప్రారంభించారు. రామగుండం కార్పొరేషన్‌లో అమృత్ 2.0 టీయూఎఫ్‌డీఐసీ కింద చేపట్టే అభివృద్ధి పనులు, సింగరేణి రూ.5కోట్లతో చేపట్టిన 23కి.మీ. మేర అంతర్గత రోడ్ల నిర్మాణాలకు భట్టి విక్రమార్క శంకుస్థాపన చేశారు. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అధ్యక్షతన గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో నిర్వహించిన బహిరంగసభలో మాట్లాడారు. 211 మహిళా సంఘాలకు రూ.23.35కోట్ల బ్యాంకు లింకేజీ రుణాల చెక్కులు పంపిణీ చేశారు. మేడిపల్లి ఓపెన్‌కాస్ట్‌లో చేపట్టిన 500 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్ట్ ప్రతిపాదనలను ప్రత్యక్షంగా పరిశీలించారు. పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు విజయరమణారావు, గడ్డం వివేక్, వినోద్, ప్రేమ్‌సాగర్‌రావు, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్‌రావు, సింగరేణి సీఎండీ బలరాం, మేయర్ బంగి అనిల్‌కుమార్, కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్లు అరుణశ్రీ, శ్యామ్‌ప్రసాద్‌లాల్, సింగరేణి, ట్రాన్స్‌కో అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రూరల్ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటు: ఐటీ మంత్రి, శ్రీధర్‌బాబు

రామగుండంలో 100మందికి ఉపాధి కల్పించే రూరల్ టెక్నాలజీ సెంటర్ అనే సాఫ్ట్‌వేర్ సంస్థను నెలరోజుల్లో ఏర్పాటు చేస్తాం. పెద్దపల్లి – సుల్తానాబాద్ మధ్య దీనికోసం పదెకరాలు గుర్తించాం. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు, స్థానిక యువతకు శిక్షణ ఇచ్చేందుకు సింగరేణి ఆధ్వర్యంలో స్కిల్ సెంటర్ ప్రారంభించాం. సింగరేణి ఖాళీ స్థలాల్లో 3,500 డబుల్‌బెడ్రూమ్ ఇళ్లు నిర్మించి ఇస్తాం. దివంగత సీఎం వైఎస్సార్ హయాంలో 20 వేల ఇళ్ల పట్టాలు పంపిణీ చేశాం. మరో 6వేల పట్టాలు పంపిణీ చేయాల్సి ఉంది. రామగుండంను స్పోర్ట్స్ హబ్‌గా మార్చుతాం.

అదనపు బస్సులు కేటాయిస్తాం : రవాణా శాఖ మంత్రి , పొన్నం ప్రభాకర్

బీఆర్‌ఎస్ ప్రభుత్వం రామగుండాన్ని బొందల గడ్డగా మార్చింది. గోదావరిఖని ఆర్టీసీ బస్‌డిపోను ఆధునీకీకరిస్తాం. కొత్తగా 35 బస్సులు కేటాయిస్తాం . పెద్దపల్లిలో బస్‌డిపో ఏర్పాటు చేస్తాం.

ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ సందర్శన

తిమ్మాపూర్(మానకొండూర్): రామగుండం పర్యటన ముగించుకుని హైదరాబాద్‌కు వెళ్లే క్రమంలో మండలంలోని ఎల్‌ఎండీ కాలనీలో గల మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ కార్యాలయాన్ని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ సందర్శించారు. ఆఫీస్‌లోనే భోజనం చేశారు. అనంతరం రాత్రి 9.15 గంటలకు హైదరాబాద్‌కు పయనమయ్యారు. అంతకుముందు మొట్టమొదటిసారి క్యాంప్ ఆఫీస్‌కు వచ్చిన డిప్యూటీ సీఎంకు ఎమ్మెల్యేతో పాటు నాయకులు ఘనస్వాగతం పలికారు.

- మట్టి గణపతే.. మా దళపతి
- పర్యావరణ హిత వినాయక విగ్రహాలు
- ఏళ్ల తరబడి తయారు చేస్తూ పంపిణీ
- స్వచ్ఛంద సంస్థల సేవాభావం
- పలుచోట్ల మండపాల్లోనే భారీ విగ్రహాల తయారీ, ప్రతిష్ఠ



గతేడాది పెద్దపల్లిలో కొలువుదీరిన మట్టి గణేశుడు

ఆది దేవుడు వినాయకుడి నవరాత్రి ఉత్సవాల్లో పలువురు భక్తిభావంతో పాటు సామాజిక బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఏళ్ల తరబడిగా మట్టితో తయారు చేసిన గణేశ్ ప్రతిమలను ప్రతిష్ఠిస్తూ పర్యావరణ రక్షణకు పాటు పడుతున్నారు. వివిధ స్వచ్ఛంద సంస్థలు వేల కొద్ది మట్టి ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాయి. కొందరు చిన్న గణపతి నుంచి భారీ విగ్రహాలను నెలకొల్పుతున్నారు. ఈనెల 7న వినాయక చవితి సందర్భంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మట్టి గణపతుల తయారీ, విశేషాలపై..

కోల్‌కతా గంగ మట్టితో..

కరీంనగర్‌కల్చరల్: రాంనగర్ మిత్ర యూత్ ఆధ్వర్యంలో 26 ఏళ్లుగా కరీంనగర్ జిల్లా కేంద్రంలోని రాంనగర్‌లో వినాయక నవరాత్రోత్సవాలు నిర్వహిస్తున్నారు. కాగా 2022లో 26 అడుగుల మట్టి గణపతి, 2023లో 28 అడుగుల విగ్రహం ప్రతిష్ఠించారు. ఈసారి 30 అడుగుల మట్టి గణేశుని విగ్రహం రూపుదిద్దుకుంటోంది. కోల్‌కతా నుంచి గంగ మట్టి తెప్పించి, అక్కడి కళాకారులతో విగ్రహాన్ని తయారు చేయిస్తున్నామని యూత్ ఆర్గనైజర్ కోడూరి అఖిల్‌గౌడ్ తెలిపారు.



రాంనగర్‌లో రూపుదిద్దుకుంటున్న 30 అడుగుల మట్టి గణపతి

ఎకో నాయక..

పర్యావరణ హితం.. 'హమ్' లక్ష్యం

కరీంనగర్‌లోని హమ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 2014 నుంచి ఏటా 250 మట్టి గణపతి ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. పర్యావరణ హితమే లక్ష్యంగా అవగాహన కల్పిస్తున్నారు. వివిధ కళాశాలల విద్యార్థులతో ర్యాలీ తీసి ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో కలిగే అనర్థాలను ప్రజలకు వివరిస్తూ చైతన్యపరుస్తున్నారు.

మట్టివిగ్రహాలు పంపిణీ చేస్తున్న హమ్ స్వచ్ఛంద సంస్థ బాధ్యులు



మరో ఖైరతాబాద్



పెద్దపల్లిలో రూపుదిద్దుకుంటున్న గణపయ్య

పెద్దపల్లిరూరల్: 54 ఫీట్ల పే..ద్ద బొజ్జగణపయ్యను పెద్దపల్లిలో ఛత్రపతి యువసేన ఆధ్వర్యంలో నెలకొల్పుతున్నారు. ఖైరతాబాద్ తరహాలో ఇక్కడ ఏటేటా పెరుగుతూ దర్శనమివ్వనున్న భారీ గణేశుని ప్రతిమను తీర్చిదిద్దే పనులు సాగుతున్నాయి. జిల్లా కేంద్రంలోని కాలేజీ మైదానంలో మహామండపాన్ని నిర్మించారు. విగ్రహం ఏర్పాటు పనులను జూలై 19న ప్రారంభించారు. 2022లో 45 ఫీట్ల ఎత్తు, గతేడాది 47 ఫీట్లు, ఈ సారి 54ఫీట్ల విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారు. సహజ సిద్ధంగా దొరికే మట్టి, వెదురు, జనపనార, గడ్డి, కర్రలతో విగ్రహం రూపుదిద్దుకుంటోంది.

కోల్‌కతా కళాకారులతో..

పెద్దపల్లిలో ప్రతిష్ఠించనున్న 54 ఫీట్ల ఎత్తుగల గణేశుడి విగ్రహాన్ని కోల్‌కతా కళాకారులు తయారు చేస్తున్నారు. కొంత మట్టిని ప్రత్యేకంగా రాజస్తాన్ నుంచి తెప్పించాం. ఇందులో చెరువు మట్టిని వినియోగిస్తున్నాం.

– శివంగారి సతీశ్, ఛత్రపతి యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు



పర్యావరణ పరిరక్షణ.. ఉపాధి



మట్టి విగ్రహాలను తయారు చేస్తున్న మహిళలు

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ రామగుండం అన్నపూర్ణకాలనీకి చెందిన తెలంగాణ మహిళామిత్ర, శ్రీసరస్వతీ మహిళా మండలి వ్యవస్థాపకురాలు గోలివాడ చంద్రకళ మట్టి విగ్రహాల తయారీని కుటీర పరిశ్రమగా మార్చుకున్నారు. 19ఏళ్లుగా మట్టి వినాయకులను తయారు చేస్తూ.. చాలామందికి ఉపాధి కల్పిస్తున్నారు. విగ్రహాల తయారీకి గోదావరి మట్టిని వినియోగిస్తున్నారు. మట్టి విగ్రహాలను చేసి స్వచ్ఛంద సంస్థలు, ఎన్టీపీసీ, సింగరేణి సంస్థలకు హోల్ సేల్ ధరలకు విక్రయిస్తుంటారు.

ఆర్డర్లను బట్టి..



ఆర్డర్ ప్రకారం తయారు చేసి ఇస్తున్నాం. విగ్రహాల్లో పాల చెట్టు గింజలను పెడుతున్నాం . నిమజ్జనం చేసిన ప్రాంతంలో ఆ గింజలు మొలకెత్తి పర్యావరణాన్ని కాపాడతాయని చిన్న ప్రయత్నం. విగ్రహాల సైజును బట్టి రూ.20 నుంచి రూ.500 వరకు విక్రయిస్తాం. విగ్రహాలు అవసరమున్న వారు 83413 83334లో సంప్రదించాలి.

– గోలివాడ చంద్రకళ, తెలంగాణ మహిళా మిత్ర అధ్యక్షురాలు

స్నేహశీల యూత్ ఆధ్వర్యంలో..

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్ మండల కేంద్రంలోని స్నేహశీల యువజన సంఘం ఆధ్వర్యంలో ఏనిమిదేళ్లుగా మట్టి వినాయకులను ప్రతిష్ఠించి పూజలు చేస్తున్నారు. ప్లాస్టర్‌ఆఫ్ పారిస్ వినాయకులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. చెరువులు, వాగులలో నిమజ్జనం చేస్తే కలిగే అనర్థాలను తెలియజేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.



గతేడాది ముస్తాబాద్‌లో ప్రతిష్ఠించిన మట్టి గణపయ్య

పర్యావరణ రక్షకులు



శ్రీనిధి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మట్టి విగ్రహాల పంపిణీ

సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రంలోని 30వ వార్డు శివనగర్‌లో మున్సిపల్ వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్ స్నేహితులతో కలిసి శ్రీనిధి పరస్పర సంక్షేమ సంఘం ఏర్పాటు చేశారు. కొన్నేళ్లుగా శివనగర్, బీవైనగర్‌లలో 1,500 చొప్పున మట్టి వినాయకులను పంపిణీ చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు గోశికొండ హన్మంత్‌పంతులు తదితరులు ఈ భగవత్ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ఇప్పటి వరకు సుమారు 17 వేల విగ్రహాలను పంపిణీ చేశారు.

మట్టి గణపతులనే పూజిద్దాం..



గతేడాది ఎస్పీ అఖిల్ మహాజన్ చేతులమీదుగా విగ్రహాల పంపిణీ

సిరిసిల్లటౌన్: మట్టి వినాయక ప్రతిమలను కొలవడం సంప్రదాయమని సిరిసిల్లకు చెందిన మానేరు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు చింతోజు భాస్కర్ ప్రచారం చేస్తున్నారు. సంస్థ ఆధ్వర్యంలో గోదావరి పాలిమర్స్, సంతోష్ ఎలక్ట్రికల్ ప్రతినిధులు ఐదేళ్లుగా మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్నారు. ఏటా ప్రముఖుల చేతుల మీదుగా సేవా కార్యక్రమాలను చేపడుతున్నారు. స్థానిక శాలివాహన(కుమ్మరి) కళాకారులకు ఆర్డర్లు ఇస్తూ అటు కులవృత్తులకు, కళాకారులకు ప్రోత్సాహం ఇస్తున్నారు.

72 ఏళ్లుగా..



మార్కండేయ ఆలయంలో రూపుదిద్దుకుంటున్న మట్టి గణపతి

జగిత్యాలటౌన్: జగిత్యాలలోని కృష్ణానగర్ మార్కండేయ ఆలయంలో 1952 నుంచి మట్టి గణపతిని తయారు చేసి పూజలు చేస్తుండటం విశేషం. దాదాపు 72ఏళ్లుగా ఆలయ కమిటీ సభ్యులు, స్థానికులు పర్యావరణ పరిరక్షణపై చిత్తశుద్ధిని చాటుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు. అలాగే జగిత్యాల బైపాస్ రోడ్డులో గోల్డెన్ యూత్ ఆధ్వర్యంలో 40 అడుగుల విగ్రహం, వాణినగర్‌లోని ధర్మశాల ఆంజనేయ స్వామి ఆలయంలో భారీ మట్టి విగ్రహాన్ని ఏర్పాటు చేసి పూజలు చేస్తున్నారు. సత్యసాయి సేవా సమితి, విశ్వహిందూ పరిషత్ తదితర సంస్థలు మట్టి గణపతులను పంపిణీ చేస్తూ ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాయి.

ఏటా వెయ్యి విగ్రహాలు..

మెట్‌పల్లి(కోరుట్ల): మెట్‌పల్లిలోని లయన్స్ క్లబ్ సభ్యులు పదేళ్ల నుంచి ఏటా మట్టి విగ్రహాలను అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. పండుగకు కొన్ని రోజుల ముందే విగ్రహాల తయారీకి ఆర్డర్ ఇస్తారు. పండుగ రోజు స్థానిక పాత బస్టాండ్ వద్ద భక్తులకు అందజేస్తారు. పర్యావరణ హితం కోసం దీనిని కొనసాగిస్తామని క్లబ్ అధ్యక్షుడు ఇల్లెందుల శ్రీనివాస్ పేర్కొన్నారు. అలాగే స్నేహాలయ యూత్ సభ్యులు సైతం కొన్నేళ్లుగా మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తూ పర్యావరణ పరిరక్షణకు పాటు పడుతున్నారు.



మట్టి విగ్రహాలను అందిస్తున్న క్లబ్ సభ్యులు

ఆకట్టుకునే 'గడ్డి' వినాయకుడు

పెద్దపల్లిరూరల్: ఎక్కడా లేని తీరున పెద్దపల్లి పట్టణంలోని తెనుగువాడలో 48 ఏళ్లుగా గడ్డితో గణేశుడిని తయారు చేసి పూజిస్తున్నారు. విగ్రహాన్ని ప్రతిష్ఠించే చోటనే గడ్డి, వెదురు కర్ర, బట్టతో స్థానికులే తయారు చేస్తారు. వినాయకుని తొండం నుంచి నీరు వచ్చి భక్తులపై పడేలా ఏర్పాటు చేస్తారు. నిమజ్జనం సందర్భంగా నిర్వహించే శోభాయాత్రలో భక్తులు ఈ గణేశుడిని దర్శించి తలపై నీళ్లు పడడంతో సంతోషపడతారు.



గడ్డి వినాయకునికి భక్తుల పూజలు (ఫైల్)

క్లుప్తంగా

చికిత్స పొందుతూ ముగ్గురి మృతి

కరీంనగర్‌ క్రైం: స్థిరాస్తి గొడవలతో మనోవేదనకు గురైన ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేయగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. కరీంనగర్‌ వన్‌టౌన్‌ పోలీసుల వివరాల ప్రకారం.. కరీంనగర్‌ రూరల్‌ మండలంలోని వల్లంపహాడ్‌కు చెందిన కొప్పుల చంద్రకాంత్‌(37) భార్య, ఇద్దరు పిల్లలతో కరీంనగర్‌ శివాజీనగర్‌లో అద్దెకు ఉంటున్నాడు. స్థానికంగా కూరగాయలు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. తల్లికి చెందిన ఆస్తిలో కొంతభాగాన్ని అతని సోదరుడు రిజిస్ట్రేషన్‌ చేసుకున్నాడు. ఈ కారణంగా గొడవలు, పంచాయితీలు జరిగాయి. మనస్తాపానికి గురైన చంద్రకాంత్‌ గత నెల 24న కరీంనగర్‌ మార్కెట్‌ ఏరియాలో క్రిమిసంహారక మందు తాగాడు. అనంతరం విషయాన్ని భార్యకు చెప్పి, కరీంనగర్‌ ప్రభుత్వ ఆస్పత్రిలో చేరాడు. కుటుంబసభ్యులు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌, వరంగల్‌లోని పలు ఆస్పత్రులకు తరలించారు. చివరకు వరంగల్‌ ఎంజీఎంలో చికిత్స పొందుతూ శనివారం చనిపోయాడు. మృతుడి భార్య కీర్తన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

సింగరాయపల్లెకు చెందిన యువకుడు..

గంభీరావుపేట(సిరిసిల్ల): రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్సై రామ్మోహన్‌ వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా పాల్వంచ మండలం సింగరాయపల్లెకు చెందిన చిట్టిగారి దేవేందర్‌గౌడ్‌(30) శ్రీగాధలోని తన అత్తింటికి వచ్చాడు. గత నెల 30న బైక్‌పై మాచారెడ్డి చౌరస్తాకు వెళ్లి, తిరిగి వస్తున్నాడు. నర్మాల శివారులో వాహనం అదుపుతప్పి, కిందపడ్డాడు. ఈ ఘటనలో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు కుటుంబసభ్యులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామ్మోహన్‌ తెలిపారు.

దొంతాపూర్‌ వాసి..

సారంగాపూర్‌(జగిత్యాల): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్సై దత్తాద్రి వివరాల ప్రకారం.. ధర్మపురి మండలంలోని దొంతాపూర్‌కు చెందిన చిగిరి శంకరయ్య గత శుక్రవారం ద్విచక్రవాహనంపై జగిత్యాల వెళ్తున్నాడు. మార్గమధ్యలో లక్ష్మీదేవిపల్లి శివారులోని ఓ రెస్టారెంట్‌ వద్ద కుక్క పరిగెత్తుకు వచ్చి, ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శంకరయ్య కిందపడ్డాడు. అతని తలకు బలమైన గాయమవడంతో తీవ్ర రక్తస్రావమైంది. స్థానికులు బాధితుడిని జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కుటుంబసభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందాడు. మృతుడి కుమారుడు ప్రసాద్‌ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

అంజన్న దర్శనానికి రెండు గంటలు



సామాన్య భక్తులకు కనిపించని స్వామివారు



క్యూలైన్లలో వేచివున్న భక్తులు



క్యూలైన్‌పై రేకులు లేకపోవడంతో వర్షంలోనే భక్తులు



వై జంక్షన్‌ వద్ద నిలిచిపోయిన వాహనాలు

- అంతరాలయంలో పూజలు..
- సామాన్య భక్తులకు కనిపించని స్వామివారు
- వర్షంలో ఇబ్బందులు
- వందలాదిగా నిలిచిపోయిన వాహనాలు


కొండగట్టు(చొప్పదండి): జగిత్యాల జిల్లా కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి ఆలయానికి శనివారం వేలాది మంది భక్తులు తరలివచ్చారు. స్వామివారి దర్శనానికి రెండు గంటలు పట్టింది. అదే సమయంలో వర్షం పడటం, గోపురం సమీపంలోని క్యూలైన్‌పై రేకులు లేకపోవడంతో భక్తులు తడుస్తూ ఇబ్బంది పడ్డారు. వై జంక్షన్‌ సమీపంలో వాహనాలు వందలాదిగా నిలిచిపోయాయి. సమీపంలో ఇద్దరు పోలీసులు మాత్రమే ఉండటంతో వాటిని పంపించడం కష్టమైంది. సరైన పార్కింగ్‌ స్థలం లేక వాహనదారులు అవస్థలు పడ్డారు. అంతరాలయంలో పలువురు భక్తులు పూజలు చేయడంతో సామాన్య, ప్రత్యేక దర్శన టిక్కెట్ల భక్తులకు స్వామివారు కనిపించలేదు. చివరకు దేవున్ని చూడకుండానే వెనుదిరగాల్సిన వచ్చిందన్నారు. రద్దీ సమయాల్లో బ్రేక్‌ సమయం తీసుకొని, అంతరాలయ దర్శన టికెట్‌ ద్వారా వచ్చిన భక్తులను అనుమతించాలని పేర్కొన్నారు. ఆలయ ఈవో రామకృష్ణారావు, ఏఈవో అంజయ్య, అధికారులు ఉమామహేశ్వరరావు, హరిహరనాథ్‌, చంద్రశేఖర్‌, రాజేందర్‌రెడ్డి, సిబ్బంది అందుబాటులో ఉండి, సేవలందించారు.

‘జన్‌మన్‌రేగా’.. వివరాలు పక్కాగా

- ఉపాధిహామీ పథకంలో పారదర్శకతకు యాప్‌ తీసుకొచ్చిన కేంద్రం
- పని చేసిన రోజులు, కూలీ డబ్బులు తదితర సమాచారం
- ఫిర్యాదులకూ అవకాశం

కరీంనగర్‌ అర్బన్‌: ఉపాధిహామీ పథకానికి సంబంధించిన కూలీ డబ్బులు బ్యాంకు ఖాతాకు చేరలేదా? తక్కువ పని దినాలు నమోదు చేసి మోసం చేశారా? అయితే చింతించాల్సిన అవసరం లేదిక. అక్రమాలకు అడ్డుకట్ట వేస్తూ సదరు సమాచారం అరచేతికి చేర్చింది కేంద్ర ప్రభుత్వం. ఉన్న ఊరిలోనే ఉపాధి కల్పించి, వలసలను తగ్గించేందుకు ఉపాధిహామీ పథకాన్ని అమలు చేస్తోంది. గ్రామాల్లో పనులు చేపట్టి, నిర్దేశించిన మేర కూలీని ఉపాధి కూలీలకు చెల్లిస్తున్నారు. ఈ క్రమంలో అక్రమాల నిరోధానికి, పారదర్శకతకు ఆ డబ్బులను బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నారు. అయితే, కొందరి ఖాతాల వివరాలు ఎన్పీసీఐ(నేషనల్‌ పేమెంట్‌ కార్పొరేషన్‌ ఆఫ్‌ ఇండియా)కు సరిగా లింక్‌ కాకపోవడం, మరికొందరివి తప్పుగా ఇవ్వడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇలాంటి బాధితుల సంఖ్య వేలల్లో ఉంది. ఇంకొందరు తమ ఫోన్లకు వచ్చే ఖాతాల సందేశాలనూ చూసుకోవడం లేదు. దీంతో డబ్బు జమైందా లేదా తెలుసుకునేందుకు కార్యాలయాలకు పరుగు తీస్తున్నారు. ఈ సమస్యకు పరిష్కారానికి కేంద్రం జన్‌మన్‌రేగా అనే యాప్‌ను తీసుకువచ్చింది. ఫోన్‌లో గూగుల్‌ ప్లే స్టోర్‌ నుంచి దీన్ని డౌన్‌లోడ్‌ చేసుకోవాలి. యాప్‌ను ఓపెన్‌ చేసి, వర్కర్‌ అటెండెన్స్‌ పేమెంట్స్‌ ఆప్షన్‌పై క్లిక్‌ చేస్తే బ్లాగ్‌ తెరుచుకుంటుంది. రాష్ట్రం, జిల్లా, మండలం, పంచాయతీ, గ్రామం, ఉపాధిహామీ జాబ్‌ కార్డు, కుటుంబ గుర్తింపు సంఖ్య నమోదు చేస్తే వివరాలు కనిపిస్తాయి. కూలీ పేరుపై క్లిక్‌ చేయగానే పని చేసిన రోజులు, కూలీ మొత్తం, డబ్బులు ఏ బ్యాంకు ఖాతాకు జమయ్యా యో కనిపిస్తాయి. ఒకవేళ నగదు జమకాకపోతే కారణం తెలుపుతుంది. మరోవైపు పథకంలో చేపట్టే పనుల సమాచారం, స్థానికంగా అక్రమాలపై ఫిర్యాదుకు వీలు కల్పించారు. అన్ని భాషల్లో వివరాలు ఉండగా ఆయా భాషల్లోనే ఫిర్యాదు చేయొచ్చు. అయితే, ఈ యాప్‌పై అవగాహన కల్పించి, కూలీల్లో చైతన్యం తీసుకొస్తేనే ప్రయోజనం ఉంటుంది.





జన్‌మన్‌రేగా యాప్‌

రాజన్న సన్నిధి.. భక్తుల రద్దీ



ఆలయ ఆవరణలో భక్తులు



నవగ్రహాలకు పూజలు చేస్తున్న భక్తులు

వేములవాడ: వేములవాడ రాజన్న ఆలయంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. వీకెండ్‌ కావడంతో వివిధ ప్రాంతాల నుంచి 25 వేల మంది వచ్చారని ఆలయ అధికారులు తెలిపారు. ధర్మగుండంలో స్నానాలు చేసిన భక్తులు స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారని పేర్కొన్నారు. వారికి ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

శనిత్రయోదశి వేడుకలు

వేములవాడ రాజన్న ఆలయ అనుబంధ భీమేశ్వరస్వామి ఆలయంలో శనిత్రయోదశి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. భక్తులు నవగ్రహాలకు పూజలు చేశారు.

పోలీస్‌ ఆఫీసర్‌ ఫొటో పెట్టి, వాట్సాప్‌ కాల్‌

- డబ్బులు డిమాండ్‌ చేసిన సైబర్‌ నేరగాళ్లు



సైబర్‌ నేరగాళ్లు పెట్టిన ప్రొఫైల్‌ పిక్‌

చిగురుమామిడి(హుస్నాబాద్‌): ఓ పోలీస్‌ ఆఫీసర్‌ ఫొటోను ప్రొఫైల్‌ పిక్‌గా పెట్టి, వాట్సాప్‌ కాల్‌ చేశారు సైబర్‌ నేరగాళ్లు.. బాధితుడి నుంచి డబ్బులు డిమాండ్‌ చేశారు. చిగురుమామిడి ఎస్సై రాజేశ్‌ వివరాల ప్రకారం.. చిగురుమామిడికి చెందిన నిలిగొండ దశరథంకు పోలీస్‌ ఆఫీసర్‌ పిక్‌ ప్రొఫైల్‌గా ఉన్న నంబర్‌ నుంచి శనివారం ఉదయం వాట్సాప్‌ కాల్‌ వచ్చింది. నీ కూతుర్ని కిడ్నాప్‌ చేశాం.. డబ్బులు పంపాలని డిమాండ్‌ చేశారు. బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తాము సైబర్‌ టోల్‌ ఫ్రీ నంబర్‌ 1930కు ఫోన్‌ చేసి, సమాచారం ఇచ్చినట్లు ఎస్సై పేర్కొన్నారు. ఇది సైబర్‌ నేరగాళ్ల పనేనని తేలిందన్నారు. మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, కాల్స్‌, మెస్సేజెస్‌ విషయంలో అనుమానం వస్తే తమను సంప్రదించాలని కోరారు.

ఎఫ్‌ఎస్‌బీఎస్‌ ఇన్‌చార్జి డీడీగా శ్రీధర్‌

కరీంనగర్‌ అర్బన్‌: ఆబోతుల ఘనీకృత వీర్య కేంద్రం(ఎఫ్‌ఎస్‌బీఎస్‌) ఇన్‌చార్జి డిప్యూటీ డైరెక్టర్‌గా ప్రభుత్వం ఏడీ శ్రీధర్‌ను నియమించింది. డీడీహెచ్‌ మాచర్ల భిక్షపతి శనివారం ఉద్యోగ విరమణ చేశారు. ప్రస్తుతం శ్రీధర్‌ ఈవో డీఎల్‌డీఏగా విధులు నిర్వహిస్తుండగా ఇన్‌చార్జి డీడీగా కొనసాగనున్నారు.

6న ఉమ్మడి జిల్లాస్థాయి హ్యాండ్‌బాల్‌ టోర్నీ

రామడుగు(చొప్పదండి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ నెల 6న ఉమ్మడి జిల్లాస్థాయి హ్యాండ్‌బాల్‌ సబ్‌ జూనియర్స్‌ బాయ్స్‌ టోర్నీ నిర్వహించనున్నట్లు హ్యాండ్‌బాల్‌ అసోసియేషన్‌ ఉమ్మడి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బసరవేణి లక్ష్మణ్‌ ఒక ప్రకటనలో తెలిపారు. 14, 15వ తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు జట్టును ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. క్రీడాకారులు ఆధార్‌కార్డు, పుట్టిన తేదీ ధ్రువపత్రంతో 6వ తేదీ ఉదయం 9 గంటలకు స్కూల్లో సంఘం సంయుక్త కార్యదర్శి ప్రభాకర్‌, కోచ్‌ వెంకటేశ్‌, పీడీ రూపారాణిలకు రిపోర్టు చేయాలన్నారు. ఇతర వివరాలకు 94419 25807, 89789 95730, 95509 42180 ఫోన్‌ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

గంజాయి పట్టివేత

జమ్మికుంట(హుజూరాబాద్‌): జమ్మికుంట రైల్వేస్టేషన్‌ సమీపంలోని కొత్తపల్లిలో ఓ మహిళ వద్ద 450 గ్రాముల గంజాయి పట్టుకున్నట్లు ఎక్సైజ్‌ సీఐ మాధవి తెలిపారు. ఆమె వివరాల ప్రకారం.. జమ్మికుంట పట్టణానికి చెందిన ఎండీ.షమీమ్‌ శుక్రవారం రాత్రి మహారాష్ట్రకు గంజాయి తరలించేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఆమెపై కేసు నమోదు చేసి, తహసీల్దార్‌ రమేశ్‌ ఎదుట హాజరుపరిచి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు. ఎస్సై సౌమ్య, హెడ్‌ కానిస్టేబుల్‌ ఐలయ్య, సిబ్బంది ఉన్నారు.

వివాహానికి వెళ్తూ.. మృత్యుఒడికి

- రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి
- ఐదుగురికి గాయాలు
- బాధితులందరిదీ ఒకే కుటుంబం
- ఆగిపోయిన పెళ్లి



రాజమౌళి మృతదేహం

హుజూరాబాద్‌రూరల్‌: వివాహానికి వెళ్తున్న ఓ కుటుంబం రోడ్డు ప్రమాదానికి గురైంది. వీరిలో ఒకరు మృతిచెందగా ఐదుగురికి గాయాలయ్యాయి. దీంతో పెళ్లి ఆగిపోయింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. హుజూరాబాద్‌ మండలంలోని కాట్రపల్లికి తాడూరి రాజమౌళి, ధర్మయ్య, హనుమయ్య, తిరుపతి అన్నదమ్ములు. హనుమయ్య కొడుకు రవీందర్‌ వివాహం శనివారం కొత్తగట్టు మత్స్యగిరీంద్రస్వామి దేవాలయంలో జరగాల్సి ఉంది. తెల్లవారుజామున 4.30 గంటలకు ఈ నలుగురితోపాటు వీరి కుటుంబానికే చెందిన తాడూరి గంగాధర్‌ ఓ ఆటోలో బయలుదేరారు. సింగాపూర్‌ గ్రామం వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాజమౌళి(65) అక్కడికక్కడే మృతిచెందారు. ఆటోడ్రైవర్‌తోపాటు మిగతావారికి గాయాలయ్యాయి. స్థానికులు బాధితులను 108 వాహనంలో వరంగల్‌ ఎంజీఎంకు తరలించారు. క్షతగాత్రుల్లో ధర్మయ్య, హనుమయ్యల పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. పెళ్లి, కుమారుడి పెద్దనాన్న చనిపోవడం, మిగతా కుటుంబసభ్యులకు గాయాలవడంతో పెళ్లి నిలిచిపోయింది. ఈ ఘటన కాట్రపల్లిలో విషాదం నింపింది.

బాధిత కుటుంబానికి పరామర్శ

రోడ్డు ప్రమాద బాధిత కుటుంబసభ్యులను కాంగ్రెస్‌ హుజురాబాద్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి ఒడితెల ప్రణవ్‌ పరామర్శించి, ఓదార్చారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

ఇక ‘మీసేవ’లోనే ధ్రువపత్రాలు

- కొత్తగా అందుబాటులోకి 9 రెవెన్యూ సేవలు
- ఆదేశాలిచ్చిన ప్రభుత్వం

కరీంనగర్‌ అర్బన్‌: ధ్రువపత్రాల కోసం ఇక కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పనిలేదు. తహసీల్దార్‌ కార్యాలయాల చుట్టూ తిరిగే వారి సంఖ్య పెరుగుతుండటం, రోజుల తరబడి పడిగాపులు తప్పకపోవడంతో ప్రభుత్వం పరిష్కారానికి ఉపక్రమించింది. ప్రజల కష్టాలకు చెక్‌ పెడుతూ ధ్రువపత్రాలను మీసేవ కేంద్రాల్లోనే పొందేలా చర్యలు తీసుకుంది. కుల, ఆదాయ, రెసిడెన్స్‌, స్టడీ గ్యాప్‌ వంటి సర్టిఫికెట్లను కాగిత రహితంగా పొందేందుకు ఆదేశాలు జారీ చేసింది. కొత్తగా 9 రకాల సేవలు అందుబాటులోకి వచ్చాయి. తహసీల్దార్‌ కార్యాలయాల్లో కాకుండా వివిధ ధ్రువపత్రాలను ఆన్‌లైన్‌ ద్వారా అందించాలని భూ పరిపాలన ప్రధాన కమిషనర్‌ నిర్ణయించారు. సదరు వివరాలు ‘మీసేవ ఆన్‌ బోర్డ్‌’లో ఉంచాలని కలెక్టర్‌ను ఆదేశించగా తదనుగుణ చర్యలు చేపట్టారు. పౌరుల పేరు మార్పిడి, ఆదాయ, కుల తదితర ధ్రువపత్రాలు, లోకల్‌ క్యాండిడేట్‌, స్టడీ గ్యాప్‌ సర్టిఫికెట్‌, మైనారిటీ, క్రీమీలేయర్‌, నాన్‌ క్రీమీలేయర్‌, మార్కెట్‌ విలువ, ఖాస్రా, పహణీ వంటి ధ్రువపత్రాలు, ఆర్వోఆర్‌–1(బి) సర్టిఫైడ్‌ కాపీలు మీసేవ ద్వారా పొందొచ్చు. దరఖాస్తుతో కార్యాలయాలకు వెళ్లకుండా మీసేవలోనే దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. నిర్ణీత గడువులోగా సర్టిఫికెట్లు పొందవచ్చని అధికారులు పేర్కొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్‌ టీం

శంకరపట్నం(మానకొండూర్‌): తాళం వేసిన ఓ ఇంట్లో దొంగలు చొరబడి, బంగారు, వెండి ఆభరణాలు చోరీ చేశారు. బాధితుడి వివరాల ప్రకారం.. శంకరపట్నం మండలంలోని మొలంగూర్‌ పంచాయతీ పరిధి గుడాటిపల్లికి చెందిన గుర్రం సంజీవరెడ్డి శుక్రవారం సాయంత్రం ఇంటికి తాళం వేసి, భార్యతో కలిసి మనవడి బర్త్‌ డేకు కరీంనగర్‌లోని పెద్ద కుమారుడు శ్రీనివాస్‌ ఇంటికి వెళ్లాడు. రాత్రి అక్కడే ఉండి, శనివారం ఉదయం 11 గంటలకు గుడాటిపల్లికి వచ్చారు. ఇంటి తాళం పగులగొట్టి ఉండటంతో దొంగలు పడినట్లు భావించారు. లోపలికి వెళ్లి చూసేసరికి బీరువాలోని వస్తువులు చిందరవందరగా ఉన్నాయి. బీరువాలో దాచిన రెండున్నర తులాల బంగారు, 30 తులాల వెండి ఆభరాణాలు కనిపించకపోవడంతో దుండగులు ఎత్తుకెళ్లారని నిర్ధారించుకున్నారు. సంజీవరెడ్డి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. క్లూస్‌ టీం సీఐ శ్రీధర్‌, కేశవపట్నం ఎస్సై రవి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. క్లూస్‌ టీం సభ్యులు వేలిముద్రలు సేకరించారు.

అధిక వడ్డీలకు అప్పులిస్తున్న వ్యక్తికి జరిమానా

ఇల్లంతకుంట(మానకొండూర్‌): అధిక వడ్డీలకు అప్పులిస్తున్న ఓ వ్యక్తికి కలెక్టర్‌ సందీప్‌ కుమార్‌ ఝా రూ.2 లక్షల జరిమానా విధించారని సిరిసిల్ల రూరల్‌ సీఐ మొగిలి శనివారం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ఇల్లంతకుంట మండలంలోని పెద్దలింగాపూర్‌కు చెందిన మొల్లంకుల బాలయ్య అధిక వడ్డీలకు అప్పులిస్తున్నాడని పోలీసులకు గత ఏప్రిల్‌లో సమాచారం వచ్చింది. అతని ఇంట్లో తనిఖీలు నిర్వహించగా ప్రామిసరీ నోట్లు, చెక్కులు, డాక్యుమెంట్స్‌ లభ్యమయ్యాయి. వాటిని స్వాధీనం చేసుకొని, బాలయ్యపై కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం కలెక్టర్‌ జరిమానా విధించారని సీఐ పేర్కొన్నారు. ప్రజల అవసరాలను ఆసరాగా తీసుకొని, అధిక వడ్డీలకు అప్పులిచ్చేవారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఇల్లంతకుంట ఎస్సై శ్రీకాంత్‌ గౌడ్‌, పోలీసు సిబ్బంది ఉన్నారు.

లారీ కింద కూర్చుంటే.. ప్రాణం పోయింది

చొప్పదండి: వర్షం పడుతోందని ఓ యువకుడు లారీ కింద కూర్చున్నాడు.. డ్రైవర్‌ ఆ వాహనాన్ని వెనక్కి తీయడంతో అతని కాలు పైనుంచి వెళ్లగా.. పరిస్థితి విషమించి మృతిచెందాడు. ఎస్సై అనూష వివరాల ప్రకారం.. చొప్పదండి మండలంలోని చాకుంటకు చెందిన దాసరి సంజీవ్‌ శనివారం చొప్పదండికి వెళ్లి వస్తాయని ఇంట్లో చెప్పి, బయలుదేరాడు. చొప్పదండి శివారుకు చేరగానే భారీ వర్షంకురిసింది. దీంతో అతను సమీపంలోని పెట్రోల్‌ బంకులోకి వెళ్లాడు. అక్కడే ఉన్న ఓ లారీ కింద కూర్చున్నాడు. డ్రైవర్‌ గమనించకుండా వెనక్కి తీశాడు. టైర్లు సంజీవ్‌కుడి కాలు పైనుంచి వెళ్లడంతో విరిగింది. స్థానికులు వెంటనే అంబులెన్స్‌లో కరీంనగర్‌ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కుటుంబసభ్యులు వరంగల్‌ ఎంజీఎంకు తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి సోదరుడు అనిల్‌ ఫిర్యాదు మేరకు లారీడ్రైవర్‌పై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఇద్దరు ఎఫ్‌బీవోలకు పదోన్నతి



పదోన్నతి పొందిన ఎఫ్‌బీవోలతో డీఎఫ్‌వో బాలమణి

కరీంనగర్‌ అర్బన్‌: ఫారెస్ట్‌ బీట్‌ ఆఫీసర్ల(ఎఫ్‌బీవోలు)కు పదోన్నతి కల్పిస్తూ కన్జర్వేటర్‌ ఆఫ్‌ ఫారెస్ట్‌ ఉత్తర్వులు జారీ చేశారు. రాజన్న జోన్‌లో ఐదుగురికి, కామారెడ్డి జిల్లాలో ఇద్దరికి, మెదక్‌ జిల్లాలో ఒకరికి, కరీంనగర్‌ జిల్లా నుంచి ఇద్దరికి పదోన్నతి లభించింది. ఫారెస్ట్‌ సెక్షన్‌ ఆఫీసర్‌(ఎఫ్‌ఎస్‌వో)గా కరీంనగర్‌ ఎఫ్‌బీవో అజీముద్దీన్‌, గంగాధర ఎఫ్‌బీవో అనంతరాములు ప్రమోషన్‌ పొందారు. డీఎఫ్‌వో బాలమణిని శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు.

హోటళ్లు, టిఫిన్‌ సెంటర్లలో తనిఖీలు



తనిఖీలు చేస్తున్న డీఎఫ్‌ఎస్‌వో అనూష

మల్యాల(చొప్పదండి): మండలంలోని ముత్యంపేట దిగువ కొండగట్టులో శనివారం జిల్లా ఫుడ్‌ సేఫ్టీ అధికారి అనూష ఆధ్వర్యంలో పలు హోటళ్లు, టిఫిన్‌ సెంటర్లలో తనిఖీలు చేపట్టారు. కాలం చెల్లిన వస్తువులతోపాటు, చెడిపోయిన ఆహార పదార్థాలను బయట పడేశారు. హోటళ్ల నిర్వాహకులకు లైసెన్స్‌ లేనట్టుగా గుర్తించారు. వారం రోజుల్లో తీసుకోవాలని, లేనిపక్షంలో కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

నేటి నుంచి పశుగణన

పెద్దపల్లిరూరల్‌: దేశవ్యాప్తంగా పశుగణన ఆదివారం మొదలు కానుంది. ప్రతీ ఐదేళ్ల కోసారి చేపట్టే పశుగణన ఇప్పటివరకు 20 సార్లు పూర్తిచేశారు. ఆఖరుగా 2018 అక్టోబర్‌లో సర్వే నిర్వహించారు. ప్రస్తుతం 21వ పశుగణన చేపట్టారు. సెప్టెంబర్‌ 1 నుంచి దీనిని చేపట్టేందుకు జిల్లా అధికారులు సన్నద్ధమయ్యారు. మిందుకోసం జిల్లా వ్యాప్తంగా 73 మందిని ఎన్యుమరేటర్లుగా, 16 మందిని సూపర్‌వైజర్లుగా నియమించారు. వీరికి ఇప్పటికే శిక్షణ ఇచ్చినట్లు అధికారులు తెలిపారు.

పక్కాగా తేలనున్న లెక్క..

- ఆవులు ఎన్ని ఉన్నాయి? పశువులు, కోళ్లు, గొర్రెలు, మేకలు, బాతులు, గాడిదలు, గుర్రాలు, కుక్కలు, పందులతో పాటు ఇతర పెంపుడు జంతువుల లెక్కను తేల్చేందుకు ఆదివారం (సెప్టెంబర్‌ 1నుంచి) లెక్క పక్కాగా నిర్వహిస్తారు.
- సంకరజాతి, దేశీయజాతి పశుసంపద వివరాలను వేర్వేరుగా డిజిటల్‌ పద్ధతిన గణన చేయనున్నారు.
- ఐదేళ్ల కోసారి కేంద్రప్రభుత్వం ఆదేశాల మేరకు పశుసంవర్ధక శాఖ అధికారులు సర్వే చేసి సేకరించిన వివరాలను ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో నమోదు చేస్తారు.
- పశువుల రంగు, జాతి, పనిచేసే శక్తి, పాలు ఇచ్చే సామర్థ్యంతో వాటి ఆరోగ్య స్థితిగతులను పరిశీలించి సంపూర్ణ వివరాలను రూపొందించిన ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తారు.

(20వ పశుగణన ప్రకారం)

ఆవులు	55,946
గేదెలు	90,633
గొర్రెలు	5,49,286
మేకలు	96,449
పౌల్ట్రీ	9,88,540
ఇతర	83,796

పెద్దపల్లి జిల్లా సమాచారం :
మండలాలు 14
గ్రామ పంచాయతీలు 266

వివరాల నమోదుపై శిక్షణ

14 మండలాల్లో గల 266 గ్రామపంచాయతీల పరిధిలోని పశువుల సంఖ్య లెక్కించేందుకు ఇంటింటికీ సర్వే సిబ్బంది వెళ్లనున్నారు. ఇందుకోసం 73 మంది ఎన్యూమరేటర్లు, 16 మంది సూపర్‌వైజర్లను నియమించి శిక్షణ కూడా ఇచ్చారు. జిల్లాస్థాయి పశుసంవర్ధకశాఖ అధికారుల పర్యవేక్షణలో వీరంతా పశుగణన నిర్వహించనున్నారు. గతంలో పశుగణన కాగితాలపై చేయగా ఆఖరుగా (2018లో) ట్యాబ్‌ల ద్వారా పశుగణన పూర్తయింది. ఈసారి డిజిటల్‌ పద్ధతిన లెక్కించేందుకు అనుసరించాల్సిన పద్ధతులపై ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లకు శిక్షణ ఇచ్చారు.

గొర్రెల సంపద ఎంతో?

పశుగణనతో గొర్రెల లెక్క తేలనుంది. గతంలో నిర్వహించిన పశుగణన లెక్కల ప్రకారం జిల్లాలో 5,49,286 గొర్రెలు ఉన్నట్లు లెక్కతేల్చారు. గత ప్రభుత్వం గొల్ల, కురుమలకు రాయితీపై గొర్రెలు పంపిణీ చేసింది. వాటి సంపదను ఎంతమేర వృద్ధి చేశారనే లెక్క కూడా ఇప్పుడు చేపట్టే పశుగణనతో తేలనుంది. గొర్రెల పంపిణీ పథకంలో అవకతవకలు జరిగాయనే ఆరోపణలు వెల్లువెత్తగా ఆ పథకం అర్ధంతరంగానే నిలిచిపోయింది.



నాలుగు నెలల్లో పూర్తి



జిల్లాలో ఆదివారం మొదలయ్యే 21వ పశుగణన నాలుగు నెలల్లో పూర్తి చేస్తాం. ఈ సర్వేతో పశువుల సంఖ్య, సంతతి వారీగా పక్కాగా తెలుస్తుంది. ఈ వివరాలను నమోదు చేసేందుకు ప్రత్యేకంగా యాప్‌ రూపొందించారు. నమోదు ప్రక్రియపై ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లకు అవగాహన కల్పించాం. – బి.శంకర్‌, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి, పెద్దపల్లి

క్లుప్తంగా

శానిటేషన్ పనుల పరిశీలన



పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న కమిషనర్ చాహత్ బాజ్‌పేయ్

కరీంనగర్‌కార్పొరేషన్: నగరంలోని పలు డివిజన్‌లలో చేపట్టిన పారిశుధ్య పనులను శనివారం నగరపాలకసంస్థ కమిషనర్ చాహత్ బాజ్‌పేయ్ పరిశీలించారు. స్టోరేజీ బిన్స్, డీఆర్‌సీసీ, కంపోస్టింగ్ యూనిట్‌లను తనిఖీ చేశారు. అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

కృష్ణాష్టమి వేడుకలు



కరీంనగర్‌కల్చరల్: కోతిరాంపూర్ పోచమ్మవాడ అంగన్‌వాడీ సెంటర్‌లో శనివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. ప్రీస్కూల్ పిల్లలతో కృష్ణుడు, గోపిక వేషధారణ ఆకట్టుకున్నాయి. అంగన్‌వాడీ టీచర్లు స్వరూపరాణి, శ్యామల, సరిత, హేమలత, రజిత, పద్మ పాల్గొన్నారు.

మంత్రులకు స్వాగతం



స్వాగతం పలుకుతున్న నరేందర్‌రెడ్డి

కరీంనగర్ కార్పొరేషన్: పెద్దపల్లి జిల్లా పర్యటనకు వెళ్తున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబులకు నగర శివారు ఎన్‌టీఆర్ విగ్రహం వద్ద సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, తదితరులు పాల్గొన్నారు.

సదరం షెడ్యూల్ విడుదల

కరీంనగర్‌టౌన్: కరీంనగర్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఈనెలలో నిర్వహించే సదరం షెడ్యూల్‌ను శనివారం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వీరారెడ్డి విడుదల చేశారు. 9న ఆర్థో, 12న మానసిక రోగులు, 17న కంటి చూపు, 24న చెవుడు, మూగ విభాగాలకు శిబిరాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గతంలో మీసేవ స్లాట్ బుక్ చేసుకొని వేయిటింగ్ లిస్టులో ఉన్న వారి ఫోన్ నంబర్‌కు మెస్సేజ్ వస్తుందని, మెస్సేజ్ ప్రకారం శిబిరానికి హాజరుకావాలని తెలిపారు. అలాగే కొత్తగా స్లాట్ బుక్ చేసుకునేవారు మీసేవ కార్యాలయానికి వెళ్లి బుక్ చేసుకోవాలని సూచించారు. నిర్ధారించిన తేదీల్లో శిబిరానికి హాజరయ్యేవారు మెడికల్ రిపోర్టులు, మీసేవలో బుక్ చేసుకున్న రశీదు, పాస్‌పోర్టు సైజ్ ఫొటో, ఆధార్‌కార్డు జిరాక్స్‌తో రావాలని పేర్కొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

కరీంనగర్‌టౌన్: నగరంలోని రేకుర్తి 18వ డివిజన్‌లో శక్తి కేంద్రం ఇన్‌చార్జి జాడి బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభమైంది. బూత్ అధ్యక్షుడు, కో ఇన్‌చార్జి బోయిని శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ 18వ డివిజన్‌లో ప్రతీ బూత్‌కు 200 సభ్యత్వాలు తగ్గకుండా నమోదు చేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కడారి మహేశ్వర్ రెడ్డి, నాంపల్లి శంకర్, విష్ణుప్రసాద్‌రావు, గోదారి నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



కరీంనగర్‌రూరల్: ఉద్యోగ విరమణ పొందిన కరీంనగర్ మండలం దుర్శేడ్ గ్రామపంచాయతీ కార్యదర్శి వంగ సంజీవరెడ్డిని శనివారం నాయకులు, అధికారులు ఘనంగా సన్మానించారు. పంచాయతీ కార్యదర్శిగా సంజీవరెడ్డి చేసిన సేవలను పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సంజీవరావు,, ఎంపీవో జగన్మోహన్‌రెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు గాజుల వెంకటమ్మ, సుంకిశాల సంపత్‌రావు, సింగిల్‌విండో చైర్మన్ తోట తిరుపతి, కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్, ఎస్. తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ దొంగ పట్టివేత

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ బస్టాండ్‌లో శనివారం ఒక ప్రయాణికుడి సెల్‌ఫోన్ దొంగిలిస్తుండగా బస్టాండ్ సెక్యూరిటీ సిబ్బంది పట్టుకొని వన్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. వివరాల్లోకి వెళ్తే.. బస్టాండ్‌లో బస్సు కోసం వేచిచూస్తున్న ప్రయాణికుడు శ్రీనివాస్ జేబులో నుంచి చెన్నూర్‌కు చెందిన ఎం.సతీశ్ దొంగలిస్తుండగా బస్టాండు సెక్యూరిటీ సిబ్బంది అనంతరం అతడిని వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో అప్పగించారు. ఈ కార్యక్రమంలో సెక్యూరిటీ అధికారులు లక్ష్మీపతి, రమణ, కవితలు పాల్గొన్నారు.





నమో వేంకటేశ



నగరంలోని మార్కెట్ రోడ్డు వేంకటేశ్వరాలయంలో చివరి శ్రావణ శనివారం సందర్భంగా భక్తుల సందడి నెలకొంది. స్వామి వారు శేష వాహనంపై దర్శనమిచ్చారు. ఇంటిల్లిపాది గోత్రనామాలపై అర్చనలు నిర్వహించి, దీపాలు వెలిగించారు. ఆలయ ఈవో సుధాకర్, ఆలయ ధర్మకర్తలు చకిలం శ్రీనివాస్, చకిలం గంగాధర్, సిబ్బంది మహేందర్, శ్రీనివాస్ , భక్తులు తదితరులు పాల్గొన్నారు. – కరీంనగర్‌కల్చరల్

అర్హులందరికీ రుణమాఫీ వర్తింపచేయండి

• డీఏవో భాగ్యలక్ష్మి



నగునూరు రైతువేదికలో రుణమాఫీ దరఖాస్తులు పరిశీలిస్తున్న డీఏవో భాగ్యలక్ష్మి

కరీంనగర్‌రూరల్: ప్రభుత్వం ప్రకటించిన రూ.2లక్షల రుణమాఫీని అర్హులైన రైతులందరికీ వర్తింపచేసేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి అన్నారు. శనివారం కరీంనగర్ మండలం నగునూరు, దుర్శేడ్ రైతువేదికల్లో రుణమాఫీ కోసం చేపట్టిన కుటుంబ సభ్యుల నిర్ధారణ కార్యక్రమాన్ని డీఏవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. రుణమాఫీలోని సమస్యలను రైతులను అడిగి తెలుసుకున్నారు. సాంకేతిక సమస్యలు పరిష్కరించేందుకు ఏవోలు, ఏఈవోలు చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా 13,442 మంది రైతులకు వివిధ సమస్యలతో రుణమాఫీ కాలేదని తెలిపారు. ఇప్పటివరకు 1976 మంది రైతుల దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేశామని, ఇంకా 11,466 మంది వివరాలను నమోదు చేయాల్సి ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ రణధీర్‌రెడ్డి, ఏవో సత్యం, ఏఈవోలు ఉదయ్, సుచరిత, స్వర్ణలత, పైడితల్లి, మాజీ సర్పంచ్ పెంచాల లక్ష్మణ్‌రావు, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఏఎస్సై విజయమణి

విద్యానగర్: విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి జీవితంలో ఉన్నత శిఖరాలకు ఎదగాలని కరీంనగర్ మహిళా పోలీస్‌స్టేషన్ ఏఎస్సై విజయమణి అన్నారు. శనివారం నగరంలోని వాగేశ్వరీ డిగ్రీ కళాశాలలో భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 'మత్తు పదార్థాలు వీడండి.. బంగారు భవిష్యత్‌కు బాటలు వేయండి అంశంపై నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. డ్రగ్స్‌కు దూరంగా ఉంటూ చదువుపై శ్రద్ధ వహించి క్రమశిక్షణతో మెలగాలన్నారు. తప్పులు చేస్తూ కేసులపాలై జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు. మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా షీ టీమ్ అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి గణేశ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి తిరుపతి, నాయకులు గణేశ్, అరుణ్, హరీశ్, ఉమామహేశ్వర్, నితీషా, గీత, మయూరి, అక్షయ, శ్వేత, రుచితలతో పాటు షీ టీమ్ సభ్యులు స్వప్న, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న బండి సంజయ్

కరీంనగర్‌టౌన్: నగరంలోని 29వ డివిజన్ కాపువాడలో నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ శనివారం భూమిపూజ చేశారు. ఈ భవన నిర్మాణానికి రూ.15లక్షల ఎంపీ లాడ్స్ నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్లపు రమేశ్‌తో పాటు మున్నూరుకాపు సంఘానికి చెందిన పలువురు నాయకులు పాల్గొన్నారు. అంతకుముందు 13వ డివిజన్‌లోని పెద్దమ్మ కాలనీలో రూ.10 లక్షల ఎంపీ లాడ్స్ నిధులతో నిర్మించనున్న వడ్డెర కమ్యూనిటీ హాల్, హస్నాపూర్ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.

హెచ్‌ఐవీ రహిత జిల్లాగా మార్చేందుకు కృషిచేయాలి

కరీంనగర్‌టౌన్: హెచ్‌ఐవీ/ఎయిడ్స్ రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుజాత అన్నారు. శనివారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఓరియెంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఈనెల 1 నుంచి 31 వరకు స్క్రీనింగ్ కంపైన్, అవగాహన సదస్సులు సబ్ సెంటర్ పరిధిలోని గ్రామాల్లో నిర్వహించాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గర్భిణులకు హెచ్‌ఐవీ పరీక్షలు నిర్వహించాలన్నారు. పీహెచ్‌సీకి వస్తున్న రోగులకు కూడా వారి కేసు హిస్టరీ తెలుసుకొని హెచ్‌ఐవీ పరీక్షలు చేయాలని పేర్కొన్నారు. కమ్యూనిటీ లెవెల్‌లో పీపీటీసీటీ కౌన్సిలర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు అవగాహన సదస్సులు నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీపీఎం సురేందర్‌రెడ్డి, డాక్టర్ సనా జవేరియా, జె.సరస్వతి, బి.క్రైక, స్వామి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కరీంనగర్ కార్పొరేషన్: 19వ డివిజన్ పరిధి రేకుర్తి బుడగజంగాల కాలనీలో స్పెషల్ డెవలప్ మెంట్ నిధులు రూ.50 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు అభివృద్ధి పనులకు కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్ శనివారం శంకుస్థాపన చేశారు. భారీవర్షాలు పడితే బుడగజంగాల కాలనీ చెరువును తలపించేదన్నారు. డ్రైనేజీ నిర్మాణంతో సమస్య తీరుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల కనీస సౌకర్యాలకు ప్రాధాన్యతనిస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ 18, 19 డివిజన్‌ల ఇన్‌చార్జిలు బాలబద్రి శంకర్, పర్వతాల మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

సీఎం సహాయ నిధికి సంబంధించిన చెక్కులను కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్ బాధితులకు అందచేశారు. శనివారం నగరంలోని తన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో చెక్కులు అందచేశారు.

కూలిన పాండురంగ ఆలయ పైకప్పు



కరీంనగర్‌కల్చరల్: 49వ డివిజన్‌లోని భారత్ టాకీస్ చౌరస్తాలోని పురాతన పాండురంగ ఆలయ పైకప్పు, గోడలు శుక్రవారం కురిసిన భారీ వర్షానికి కూలాయి. డిప్యూటీ మేయర్ స్వరూపరాణి, కార్పొరేటర్ కమల్జిత్‌కౌర్ సోహన్‌సింగ్ పరిశీలించారు. ఏళ్లనాటి కట్టడం కావడంతో శిథిలావస్థకు చేరి కూలిందని స్థానికులు తెలపగా ఆలయంలోకి ఎవరూ వెళ్లొద్దని సూచించారు. ఆలయ పండితులు, భూయజమానితో మాట్లాడి పునర్నిర్మాణం చేపట్టేలా కార్యాచరణ రూపొందించాలని కోరారు.

పారిశుధ్య కిట్లు అందజేత

కరీంనగర్‌కార్పొరేషన్: శ్రీవెంకటేశ్వరకాలనీలో శనివారం పారిశుధ్య కార్మికులకు కార్పొరేటర్ తోట రాములు కిట్లు పంపిణీ చేశారు. ఆయిల్, సబ్బులు, రెయిన్‌కోట్, దుస్తులు తదితర వస్తువులతో కూడిన కిట్‌లను అందజేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, జవాన్ నాగరాజు, శ్రీవెంకటేశ్వరకాలనీ వాసులు పాల్గొన్నారు.

దుర్శేడ్ జీపీ ఇన్‌చార్జి కార్యదర్శిగా రాజమల్లయ్య

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం దుర్శేడ్ గ్రామపంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శిగా చేగుర్తి కార్యదర్శి రాజమల్లయ్యను నియమిస్తూ ఎంపీడీవో సంజీవరావు ఉత్తర్వులు జారీ చేశారు. దుర్శేడ్ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న సంజీవరెడ్డి శనివారం ఉద్యోగ విరమణ చేశారు. ఇన్‌చార్జి కార్యదర్శిగా రాజమల్లయ్య సోమవారం బాధ్యతలు చేపట్టనున్నారు.

సమాచారం

నేడు వోపా రజతోత్సవ వేడుకలు

కరీంనగర్‌రూరల్: విశ్వబ్రాహ్మణ అఫీషియల్స్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ జిల్లా శాఖ రజతోత్సవ వేడుకలు, కమ్యూనిటీ హాల్ ప్రారంభం, సర్వసభ్య సమావేశం ఆదివారం మొగ్దుంపూర్‌లో నిర్మించిన వోపా కమ్యూనిటీ హాల్‌లో జరుగుతుందని వోపా జిల్లా అధ్యక్షుడు కట్ట విష్ణువర్ధన్ తెలిపారు.

నేడు గురు వందనం

విద్యానగర్(కరీంనగర్): కలెక్టరేట్ ఆడిటోరియంలో ఆదివారం తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో గురు వందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కట్ట రాజేశ్వర్, తిరుపతిరావు తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రభుత్వ పాఠశాల్లో విధులు నిర్వహించే 60 మంది ఉపాధ్యాయులకు విశిష్ట ఉపాధ్యాయ పురస్కారాలు ప్రదానం జరుగుతుందన్నారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, జిల్లా విద్యాధికారితో పాటు సంఘం నాయకులు పాల్గొంటారని వారు తెలిపారు.

బ్లడ్ స్టోరేజీ

కరీంనగర్‌టౌన్: కరీంనగర్ రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్ స్టోరేజీ సెంటర్‌లో శనివారం వరకు ఏ–పాజిటివ్ 22, బీ పాజిటివ్ 02, ఓ పాజిటివ్ 29, ఏబీ పాజిటివ్ 02, ఓ నెగెటివ్ 01 యూనిట్ల రక్తం అందుబాటులో ఉందని రెడ్‌క్రాస్ సెక్రటరీ ఊట్కూరి రాధాకృష్ణారెడ్డి తెలిపారు. అత్యవసరంగా రక్తం కావాల్సిన వారు ఫోన్: 95025 02942 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

వివాదాస్పదమైన పెట్రోల్‌బంకు ప్రారంభం



సంఘం అధ్యక్షుడితో వాగ్వాదం చేస్తున్న నాయకులు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం దుర్శేడ్ ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్‌బంకు ప్రారంభోత్సవ కార్యక్రమం వివాదాస్పదంగా మారింది. ప్రొటోకాల్ పాటించలేదంటూ కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఆందోళన చేపట్టారు. సంఘం అధ్యక్షుడితో వాగ్వాదానికి దిగడంతో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. రెండేళ్ల క్రితం నష్టాలు రావడంతో మూసేసిన పెట్రోల్ బంకును ప్రస్తుతం కమర్షియల్ బంకుగా ఆధునీకరించారు. శనివారం సంఘం అధ్యక్షుడు తోట తిరుపతి పూజా కార్యక్రమం అనంతరం శిలాఫలకం ఆవిష్కరించేందుకు యత్నించగా ప్రొటోకాల్ పాటించలేదంటూ కాంగ్రెస్, బీజేపీ నాయకులు బాషవేణి మల్లేశం యాదవ్, మూల వెంకటేశంగౌడ్, ఊరడి శివారెడ్డి, దాది సుధాకర్ తదితరులు అడ్డుకున్నారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేకు సమాచారం ఇవ్వకుండా పెట్రోల్‌బంకు ఎలా ప్రారంభిస్తారంటూ వాగ్వాదానికి దిగారు. శిలాఫలకంలో సంఘం పాలకవర్గ సభ్యుల పేర్లు మాత్రమే ఉన్నాయని, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల పేర్లు పెట్టకుండా ప్రొటోకాల్ ఉల్లంఘించారని ఆరోపించారు. అయితే పాత పెట్రోల్‌బంకును పునఃప్రారంభిస్తున్నామని, ప్రొటోకాల్ సమస్య లేదంటూ సంఘం అధ్యక్షుడు తిరుపతి సర్దిచెప్పడంతో వివాదం సద్దుమణిగింది. అనంతరం డైరెక్టర్లతో కలిసి తిరుపతి పెట్రోల్‌బంకును ప్రారంభించి వాహనాల్లో పెట్రోల్,డీజిల్ పోశారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ సొసైటీ చైర్మన్ పెండ్యాల శ్యాంసుందర్‌రెడ్డి, సంఘం ఉపాధ్యక్షుడు నర్సయ్య, మాజీ అధ్యక్షులు వేణుమాధవరావు, రాజమల్లు, మాజీ ప్రజాప్రతినిధులు సంపత్‌రావు, శ్రీకాంత్, తిరుపతి, సీఈవో వేణుమాధవ్‌తో పాటు డైరెక్టర్లు పాల్గొన్నారు.

అలరించిన ఫ్రెషర్స్ డే



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

కరీంనగర్‌కల్చరల్: నగరంలోని తీగలగుట్టపల్లిలో గల ఎస్‌వీజేసీ కళాశాలలో శనివారం జరిగిన ఫ్రెషర్స్ డే అలరించింది. ఏసీపీ వెంకటరమణ హాజరై మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలకు ఉన్నత విద్య అందించేందుకు ఏ మాత్రం వెనుకాడరన్నారు. కార్యక్రమంలో ఎస్‌వీజేసీ విద్యాసంస్థల సెక్రటరీ ఊట్కూరి మహిపాల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ వెంకటవరప్రసాద్, రాంరెడ్డి, జాన్సన్ గ్లోబల్ స్కూల్ డైరెక్టర్ సింహాచలం హరికృష్ణ, కోరా స్కూల్ డైరెక్టర్ సంతోశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.



నగరంలోని 7వ డివిజన్ పరిధి హౌసింగ్‌బోర్డుకాలనీలో స్మార్ట్‌సిటీ పథకం కింద రోడ్లు నిర్మించారు. రోడ్ నం.2లోని మినీస్టేడియం చౌరస్తా వద్ద సీసీ రోడ్డు నిర్మాణం సరిగా లేక గుంతలా మారింది. వర్షం కురిసిన ప్రతీసారి సీసీ రోడ్డు అయినప్పటికీ చౌరస్తాలో రోడ్డుపైనే నీళ్లు నిలుస్తున్నాయి. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– పెండోట నర్సింహాచారి, హౌసింగ్‌బోర్డుకాలనీ, 7వ డివిజన్

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
ఓంప్రకాశ్, డీఈ, 7032989958

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 94400 77555

పెండింగ్ కేసులు పూర్తి చేయండి



వివరాలు తెలుసుకుంటున్న సీపీ అభిషేక్ మహంతి

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ రూరల్ పోలీస్‌స్టేషన్‌ను శనివారం సీపీ అభిషేక్ మహంతి తనిఖీ చేశారు. స్టేషన్ పరిధిలోని పెండింగ్ కేసులపై సమీక్షించారు. కేసులు త్వరగా పూర్తి చేయాలని, విసిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. గ్రామాలు, వార్డుల్లో వీధి రౌడీలుగా చలామణి అవుతూ గ్రూపులుగా ఏర్పడి సామాన్య ప్రజలను బెదిరింపులకు గురిచేసేవారు, శాంతిభద్రతలకు భంగం కలిగించేవారిని గుర్తించి రౌడీషీట్లు తెరవాలని సూచించారు. రౌడీ, హిస్టరీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజల్లో అవగాహన పెంచాలని పేర్కొన్నారు. గంజాయి, అక్రమ ఇసుక రవాణా, పేకాటపై ఉక్కుపాదం మోపాలన్నారు. రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎక్కువగా భూ ఆక్రమణలు జరిగినట్లు ఫిర్యాదులు అందాయని, ఫిర్యాదులపై స్పందించి నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకొని పలు కేసుల్లో బాధితులకు న్యాయం చేయడంలో కృషి చేస్తున్నందుకు కరీంనగర్ రూరల్ ఠాణా ఇన్‌స్పెక్టర్ ప్రదీప్‌కుమార్, సిబ్బందిని అభినందించారు.

అటెండర్ లచ్చయ్య సేవలు భేష్



అటెండర్ లచ్చయ్యను సన్మానిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ అర్బన్: ప్రతీ ఉద్యోగికి ఉద్యోగ విరమణ తప్పనిసరని కానీ ఉద్యోగ కాలంలో చేసిన సేవలే సంతృప్తినిస్తాయని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. ఉద్యోగ విరమణ చేస్తున్న రెవెన్యూ శాఖ అటెండర్ నేదునూరి లచ్చయ్యను శనివారం కలెక్టరేట్‌లో సన్మానించారు. సుదీర్ఘ కాలంగా విధుల పట్ల నిబద్ధతతో పని చేస్తూ అందరి మన్ననలు పొందారని ప్రశంసించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు 5 స్మార్ట్ టీవీలను విరాళంగా ఇవ్వడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో పవన్ కుమార్, ఆర్డీవో మహేశ్వర్, కలెక్టరేట్ ఏవో గడ్డం సుధాకర్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పొందిన పోలీసులకు వీడ్కోలు



సన్మానం చేస్తున్న అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ కమిషనరేట్‌లో పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన ఐదుగురు పోలీసు అధికారులు, సిబ్బందికి కమిషనరేట్ సమావేశ మందిరంలో అడిషినల్ డీసీపీ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో శనివారం వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఉద్యోగ విరమణ చేస్తున్న ఎస్సై జి సాంబయ్య, ఏఎస్సైలు అహ్మదుల్లఖాన్, ఐ.లక్ష్మారెడ్డి, కె.పోచయ్య, హెడ్‌కానిస్టేబుల్ డి.మల్లారెడ్డిలను సన్మానం చేశారు. ఎన్నో సవాళ్లతో కూడుకున్న పోలీస్ ఉద్యోగాన్ని సంపూర్ణంగా చేసి ఉద్యోగ విరమణ పొందడమే గొప్ప విజయం అన్నారు. ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రిజర్వు ఇన్‌స్పెక్టర్ కుమారస్వామి, కరీంనగర్ పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్సై సురేందర్, రిజర్వు ఎస్సై తిరుపతి ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



జ్యోతిప్రజ్వలన చేస్తున్న బ్రహ్మకుమారీలు

కరీంనగర్‌కల్చరల్: యువతలో పెరుగుతున్న మత్తు పదార్థాల వాడకం సమాజంలో భయంకరమైన పరిణామాలకు దారి తీస్తుందని బ్రహ్మకుమారీస్ మెడికల్ వింగ్ మెంబర్ ఉమారాణి అన్నారు. శనివారం కిమ్స్ డిగ్రీ, పీజీ, హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలో మద్యపానం, మదక ద్రవ్యాల విముక్తికై నిర్వహించిన నశా ముక్త్ భారత్ అభియాన్ జాగృతి యాత్రను ప్రారంభించారు. మాదకద్రవ్యాలు నేరుగా మెదడు, కేంద్ర నాడి మండల వ్యవస్థపై ప్రభావం చూపడమే కాక శరీరంలోని ఇతర వ్యవస్థలపై కూడా దుష్ప్రభావాలను చూపిస్తాయని తెలిపారు. ఈ జగృతి యాత్రలో సందేశాత్మక చిత్రాలు, ప్రాజెక్టర్ షోలు, ప్రసంగాల ద్వారా స్కూల్, కాలేజ్ విద్యార్థులు వ్యసనాలకు లోనుకాకుండా అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహిస్తామని కార్యక్రమ నిర్వాహకులు బీకే మనీషా తెలిపారు. కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమాధికారి సరస్వతి, కిమ్స్ విద్యాసంస్థల వైస్ ఛైర్మన్ సాకేత రామారావు, ప్రకృతి రిహాబిలేషన్ సెంటర్ చైర్మన్ కల్పన, జిల్లా శిశు సంక్షేమ అధికారి శాంత, రిటైర్డ్ తహసీల్దార్ కేశవరెడ్డి పాల్గొన్నారు.

'ధరల నియంత్రణలో బీజేపీ వైఫల్యం'

కరీంనగర్: నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణలో నరేంద్ర మోదీ ప్రభుత్వం వైఫల్యం చెందిందని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి అన్నారు. శనివారం నగరంలోని బద్దం ఎల్లారెడ్డిభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2014లో బీజేపీ అధికారంలోకి రావడానికి నరేంద్ర మోదీ అనేక మాయమాటలు చెప్పారని, అధికారంలోకి వచ్చాక నిత్యావసర వస్తువుల ధరలు నియంత్రిస్తామని అబద్ధాలు చెప్పారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ధరల నియంత్రణపై అజమాయిషీ చేయడం లేదని తెలిపారు.

పారిస్ పారాలింపిక్స్‌లో నేటి భారత షెడ్యూల్

రోయింగ్
మిక్స్‌డ్ పీఆర్3 డబుల్ స్కల్స్ (ఫైనల్ 'బి'): భారత్ (అనిత, నారాయణ కొంగనపల్లె) (మధ్యాహ్నం గం. 2:00 నుంచి)

షూటింగ్
మిక్స్‌డ్ 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ప్రోన్ ఎస్‌హెచ్1 (క్వాలిఫికేషన్): భారత్ (సిద్ధార్థ బాబు–అవని లేఖరా) (మధ్యాహ్నం గం. 1:00 నుంచి), మిక్స్‌డ్ 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ప్రోన్ ఎస్‌హెచ్2 (క్వాలిఫికేషన్): శ్రీహర్ష (మధ్యాహ్నం గం. 3:00 నుంచి)

ఆర్చరీ
పురుషుల కాంపౌండ్ (క్వార్టర్ ఫైనల్): రాకేశ్ కుమార్ X కేన్ స్వగుమిలాంగ్ (ఇండోనేసియా) (రాత్రి గం. 7:17 నుంచి)

బ్యాడ్మింటన్
పురుషుల సింగిల్స్ ఎస్‌ఎల్3 (సెమీఫైనల్): నితీశ్ కుమార్ X ఫుజిహారా (జపాన్) (రాత్రి గం. 8:10 నుంచి)

టేబుల్ టెన్నిస్
మహిళల సింగిల్స్ క్లాస్ 4 (ప్రిక్వార్టర్‌ఫైనల్): భవీనా పటేల్ X మార్థా వర్దిన్ (మెక్సికో) (రాత్రి గం. 9:15 నుంచి), మహిళల సింగిల్స్ క్లాస్ 3 (ప్రిక్వార్టర్‌ఫైనల్): సోనాల్‌బెన్ పటేల్ X అన్‌డెలా విన్సెటిచ్ (క్రొయేషియా) (అర్ధరాత్రి గం. 12:15 నుంచి)

అథ్లెటిక్స్
మహిళల 1500 మీటర్ల టి11 (హీట్): రక్షిత రాజు (మధ్యాహ్నం గం. 1:57 నుంచి), పురుషుల షాట్ పుట్ ఎఫ్40 (పతక పోరు): రవి రంగోలీ (మధ్యాహ్నం గం. 3:12 నుంచి), పురుషుల హై జంప్ టీ47 (పతక పోరు): నిషాద్ కుమార్, రామ్‌పాల్ (రాత్రి గం. 10:40 నుంచి), మహిళల 200 మీటర్లు టి35 (పతక పోరు): ప్రీతి పాల్ (రాత్రి గం. 11:27 నుంచి)

రుబీనా అదుర్స్



మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్‌లో కాంస్యం

పారాలింపిక్స్ పిస్టల్ ఈవెంట్లో భారత్‌కు తొలి పతకం

బ్యాడ్మింటన్‌లో సెమీస్ చేరిన నితీశ్, సుకాంత్

పారిస్ పారాలింపిక్స్‌లో భారత షూటర్ల జోరు కొనసాగుతోంది. వరుసగా రెండో రోజు మన గన్ గర్జించడంతో భారత్ ఖాతాలో మరో పతకం వచ్చి చేరింది. మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్‌లో భారత పారా షూటర్ రుబీనా ఫ్రాన్సిస్ కాంస్యంతో సత్తా చాటింది. చెదరని గురితో పోడియంపై చోటు దక్కించుకుంది. ఇతర క్రీడల్లోనూ శనివారం భారత్‌కు మిశ్రమ ఫలితాలు వచ్చాయి. బ్యాడ్మింటన్‌లో నితీశ్ కుమార్, సుకాంత్ కదమ్ సెమీఫైనల్‌కు దూసుకెళ్లి పతకాలకు చేరువయ్యారు.



పారిస్: పారాలింపిక్స్‌లో భారత షూటర్లు పతకాలతో అదరగొడుతున్నారు. శుక్రవారం రైఫిల్ విభాగంలో అవనీ లేఖరా, మోనా అగర్వాల్ పతకాలతో సత్తా చాటితే... శనివారం మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఎస్‌హెచ్1 విభాగంలో రుబీనా ఫ్రాన్సిస్ కాంస్య పతకంతో మెరిసింది. ఈ విభాగంలో పారాలింపిక్స్ పతకం నెగ్గిన తొలి భారత మహిళా షూటర్‌గా రికార్డుల్లోకెక్కింది. తుదిపోరులో 25 ఏళ్ల రుబీనా 211.1 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచి పతకం ఖాతాలో వేసుకుంది. వైల్డ్‌కార్డ్ ద్వారా పారిస్ పారాలింపిక్స్ బెర్త్ దక్కించుకున్న రుబీనా... క్వాలిఫయింగ్ రౌండ్‌లో ఏడో స్థానంలో నిలిచి ఫైనల్ చేరింది. ఇరాన్ షూటర్ జవాన్‌మార్డీ సారా 236.8 పాయింట్లతో స్వర్ణం చేజిక్కించుకుంది. సారాకు ఇది వరుసగా మూడో పారాలింపిక్ పసిడి కావడం విశేషం. అజ్గాన్ అయ్‌సెల్ (టర్కీ) 231.1 పాయింట్లతో రజత పతకం గెలుచుకుంది. స్థిరమైన గురితో సత్తాచాటిన రుబీనా... క్వాలిఫయింగ్ రౌండ్ కంటే ఎంతో మెరుగైన ప్రదర్శన చేసి పోడియంపై నిలిచింది. తుది పోరులో తొలి పది షాట్‌ల తర్వాత రుబీనా 97.6 పాయింట్లతో నిలిచింది. 14 షాట్‌ల తర్వాత నాలుగో స్థానంలో ఉన్న రుబీనా తదుపరి రెండు షాట్‌లలో మెరుగైన ప్రదర్శన చేసి మూడో స్థానానికి చేరింది. కాంస్యం గెలిచిన రుబీనాను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'ఎక్స్' వేదికగా అభినందించారు. గొప్ప సంకల్పం, అసాధారణమైన గురితో పతకం సాధించిన రుబీనా దేశాన్ని గర్వపడేలా చేసిందని పేర్కొన్నారు.

గగన్ నారంగ్ స్ఫూర్తితో..

మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌కు చెందిన మెకానిక్ కూతురైన రుబీనా... పుట్టుకతోనే కుడి కాలు లోపంతో జన్మించింది. తండ్రి స్నేహితుల ప్రోద్బలంతో షూటింగ్ కెరీర్ ప్రారంభించిన రుబీనా... ఆరంభంలో ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొంది. జబల్‌పూర్ అకాడమీలో షూటింగ్ ఓనమాలు నేర్చుకున్న ఫ్రాన్సిస్... ఒలింపిక్ పతక విజేత, హైదరాబాదీ షూటర్ గగన్ నారంగ్ ఘనతలు చూసి షూటింగ్‌పై మరింత ఆసక్తి పెంచుకుంది. కెరీర్ ఆరంభంలో షూటింగ్ రేంజ్‌కు వెళ్లేందుకు కూడా డబ్బులు లేని గడ్డు పరిస్థితులు ఎదుర్కొన్న రుబీనా... అకుంఠిత దీక్షతో ముందుకు సాగి 2017లో గగన్ నారంగ్ అకాడమీ 'గన్ ఫర్ గ్లోరీ'లో అడుగుపెట్టిన తర్వాత అంతర్జాతీయ స్థాయిలో నిలకడగా పతకాలు సాధించింది. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో ప్రపంచ రికార్డు స్కోరుతో బరిలోకి దిగి ఏడో స్థానంతో సరిపెట్టుకుంది.

బ్యాడ్మింటన్ సెమీస్‌లో నితీశ్, సుకాంత్

పారిస్ పారాలింపిక్స్‌లో భారత షట్లర్లు అదరగొట్టారు. పురుషుల సింగిల్స్ ఎస్‌ఎల్3లో నితీశ్ కుమార్, ఎస్‌ఎల్4లో సుకాంత్ కదమ్ సెమీఫైనల్‌కు దూసుకెళ్లి పతకానికి అడుగు దూరంలో నిలిచారు. శనివారం క్వార్టర్ ఫైనల్లో నితీశ్ 21–13, 21–14తో మాంగ్‌ఖాన్ బున్సన్ (థాయ్‌లాండ్)పై విజయం సాధించి గ్రూప్ 'ఎ'లో టాప్ ప్లేస్ దక్కించుకొని సెమీస్‌కు చేరాడు. గ్రూప్ నుంచి రెండో స్థానంలోనిలిచిన బున్సన్ కూడా సెమీస్‌కు చేరాడు. ఎస్‌ఎల్4 క్లాస్‌లో సుకాంత్ 21–12, 21–12తో టిమాత్రోమ్ సిరిపాంగ్ (థాయ్‌లాండ్)పై గెలిచి సెమీఫైనల్లో అడుగుపెట్టాడు. మిక్స్‌డ్ డబుల్స్ ఎస్‌ఎల్3లో సుహాస్ యతిరాజ్–పాలక్ కోహ్లి జంట 11–21, 17–21తో హిక్మత్–లియాని రాత్రి (ఇండోనేసియా) ద్వయం చేతిలో ఓడింది. మరో మ్యాచ్‌లో నితీశ్ కుమార్–తులసిమతి ద్వయం కూడా పరాజయం పాలైంది.

క్వార్టర్ ఫైనల్లో సరిత ఓటమి

భారత పారా ఆర్చర్ సరితా కుమారి క్వార్టర్‌ఫైనల్లో పరాజయం పాలైంది. శనివారం మహిళల కాంపౌండ్ క్వార్టర్స్‌లో సరిత 140–145తో టాప్ సీడ్ ఓజ్నూర్ కూర్ గిర్డి (కొరియా) చేతిలో ఓటమి పాలైంది. అంతకుముందు ఎలిమినేషన్ రెండో రౌండ్‌లో సరిత 141–135తో ఎలెనోరా సార్టీ (ఇటలీ)పై గెలిచింది. తొలి రౌండ్‌లో సరిత 138–124తో నూర్ అబ్దుల్ జలీల్ (మలేసియా)పై గెలిచింది. మరో మ్యాచ్‌లో భారత ఆర్చర్, రెండో సీడ్ శీతల్ దేవి 137–138తోమిరియానా జునీగా (చిలీ)పై చేతిలో ఓడింది.

రోయింగ్ రెపిచాజ్‌లో మూడో స్థానం

రోయింగ్ మిక్స్‌డ్ పీఆర్3 డబుల్ స్కల్స్‌లో అనిత, నారాయణ కొంగనపల్లె జంట రెపిచాజ్ ఈవెంట్‌లో మూడో స్థానంలో నిలిచి ఫైనల్ 'బి'లో అడుగుపెట్టింది. శనివారం పోటీలో ఈ జంట 7 నిమిషాల 54.33 సెకన్లలో లక్ష్యాన్ని చేరింది. ఉక్రెయిన్ (7 నిమిషాల 29.24 సెకన్లు), బ్రిటన్ (7 నిమిషాల 20.53 సెకన్లు) జోడీలు తొలి రెండు స్థానాల్లో నిలిచాయి. ఫైనల్ 'బి'లోని రోవర్లు 7 నుంచి 12వ స్థానం కోసం పోటీపడనున్నారు.

సైక్లింగ్‌లో నిరాశ

పారిస్ పారాలింపిక్స్‌లో భారత సైక్లిస్ట్‌లకు నిరాశ ఎదురైంది. అర్షద్ షేక్, జ్యోతి గడేరియా తమతమ విభాగాల్లో ఫైనల్‌కు చేరకుండానే వెనుదిరిగారు. పురుషుల 1000 మీటర్ల టైమ్ ట్రయల్ సీ1–3 విభాగంలో బరిలోకి దిగిన అర్షద్ శనివారం క్వాలిఫయింగ్ రౌండ్‌లో చివరి స్థానంతో రేసును ముగించాడు. మొత్తం 17 మంది పాల్గొన్న ఈ పోటీలో అర్షద్ 1 నిమిషం 21.416 సెకన్లలో లక్ష్యాన్ని చేరాడు. మహిళల 500 మీటర్ల టైమ్ ట్రయల్ సీ1–3 క్వాలిఫయింగ్ ఈవెంట్‌లో జ్యోతి గడేరియా 49.233 సెకన్లలో లక్ష్యాన్ని చేరి చివరి స్థానంలో నిలిచింది.

జొకోవిచ్‌కు షాక్

మూడో రౌండ్‌లో పాపిరిన్ చేతిలో ఓటమి ● గ్రాండ్‌స్లామ్ లేకుండా సీజన్ ముగింపు


పాపిరిన్


జొకోవిచ్

న్యూయార్క్: కెరీర్‌లో 25వ గ్రాండ్‌స్లామ్ గెలిచి ఆల్‌టైమ్ రికార్డును నమోదు చేసే లక్ష్యంతో యూఎస్ ఓపెన్ బరిలోకి దిగిన నొవాక్ జొకోవిచ్ (సెర్బియా) ఆ కల నెరవేరేందుకు మరికొంత ఆగాల్సిందే. పారిస్ ఒలింపిక్స్ స్వర్ణం తర్వాత అమిత విశ్వాసంతో ఈ టోర్నీ బరిలోకి దిగి గెలుపుపై ధీమా వ్యక్తం చేసిన జొకోవిచ్ అనూహ్యంగా మూడో రౌండ్‌లోనే వెనుదిరిగాడు. పురుషుల సింగిల్స్‌లో క్రితం రోజు 2022 చాంపియన్, ప్రపంచ మూడో ర్యాంకర్ అల్‌కరాజ్ నిష్క్రమించగా... జొకో ఆట మూడో రౌండ్లో ముగిసింది. భారత కాలమానం ప్రకారం శుక్రవారం అర్ధరాత్రి దాటాక జరిగిన పోరులో అతను 4–6, 4–6, 6–2, 4–6తో 28వ సీడ్ అలెక్సీ పాపిరిన్ (ఆస్ట్రేలియా) చేతిలో కంగుతిన్నాడు. 37 ఏళ్ల వెటరన్ స్టార్ 16 ఏస్‌లు సంధించినప్పటికీ అదేపనిగా 14 డబుల్ ఫాల్ట్‌లు చేశాడు. దిగ్గజానికి దీటుగా 15 ఏస్‌లు కొట్టిన పాపిరిన్ కేవలం 6 డబుల్ ఫాల్ట్‌లే చేశాడు. జొకో 40 విన్నర్లకే పరిమితమైతే... 25 ఏళ్ల ఆస్ట్రేలియన్ 50 విన్నర్లు కొట్టి మ్యాచ్‌ను తన చేతుల్లోకి తెచ్చుకున్నాడు. ఈ టోర్నీ చరిత్రలో పదిసార్లు ఫైనల్ చేరిన రెండో సీడ్ జొకోవిచ్ ఇందులో నాలుగు టైటిళ్లు (2011, 2015, 2018, 2023) సాధించాడు. 2007, 2010, 2012, 2013, 2016, 2021లలో రన్నరప్‌గా నిలిచాడు. ఇంతటి ఘనమైన రికార్డు ఉన్న సెర్బియన్ సూపర్‌స్టార్ 17 ఏళ్ల తర్వాత మూడో రౌండ్లో ఇంటిదారి పట్టాడు. యూఎస్ ఓపెన్ ఆడిన తొలినాళ్లలో రెండుసార్లు (2005, 2006) మాత్రమే అతను మూడో రౌండ్లో నిష్క్రమించాడు. ఈ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో రెండుసార్లు నాలుగో రౌండ్ మినహా ప్రతీసారి సెమీస్ లేదంటే ఫైనల్ చేరిన ఘనత జొకోవిచ్ సొంతం. మిగతా మ్యాచ్‌ల్లో నాలుగో సీడ్ జ్వెరెవ్ (జర్మనీ) 5–7, 7–5, 6–1, 6–3తో థామస్ ఎచెవెరి (అర్జెంటీనా)పై, ఆరో సీడ్ రుబ్లెవ్ (రష్యా) 6–3, 7–5, 6–4తో జిరి లెహెక (చెక్‌రిపబ్లిక్)పై గెలుపొందగా... ఎనిమిదో సీడ్ కాస్పర్ రూడ్ (నార్వే) 6–7 (1/7), 3–6, 6–0, 6–3, 6–1తో జన్‌చెంగ్ షాంగ్ (చైనా)పై, 12వ సీడ్ టేలర్ ఫ్రిట్జ్ (అమెరికా) 6–3, 6–4, 6–2తో ఫ్రాన్సిస్కా కొమెసన (అర్జెంటీనా)పై విజయం సాధించారు. తొమ్మిదో సీడ్ గ్రిగోర్ డిమిత్రోవ్ (బల్గేరియా) 6–3, 6–3, 6–1తో టాలన్ గ్రీక్‌స్పూర్ (నెదర్లాండ్స్)ను ఓడించాడు.

2002 తర్వాత 'బిగ్–3' ఫెడరర్, నాదల్, జొకోవిచ్ ఒక్క గ్రాండ్‌స్లామ్ టైటిల్ కూడా గెలవని సీజన్‌గా 2024 నిలువనుంది. వరుసగా 21 ఏళ్ల పాటు (2003–2023) ఈ ముగ్గురిలో ఎవరో ఒకరు కనీసం ఒక గ్రాండ్‌స్లామ్ అయినా నెగ్గారు.

2017 తర్వాత జొకోవిచ్ కనీసం ఒక్క గ్రాండ్‌స్లామ్ అయినా గెలవని సీజన్‌గా 2024 నిలిచింది. ఈ ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్, వింబుల్డన్ ఫైనల్‌లలో ఓడిన జొకోవిచ్ ఫ్రెంచ్ ఓపెన్‌లో గాయం కారణంగా క్వార్టర్ ఫైనల్‌కు ముందు తప్పుకున్నాడు.

మూడో రౌండ్లోకి యూకీ బాంబ్రి జోడీ

భారత టెన్నిస్ స్టార్లు రోహన్ బోపన్న, యూకీ బాంబ్రి పురుషుల డబుల్స్‌లో వారి భాగస్వాములతో మూడో రౌండ్లోకి దూసుకెళ్లారు. రెండో రౌండ్లో 2వ సీడ్ బోపన్న–ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) ద్వయం 6–2, 6–4తో కార్బలెస్ బేనా (స్పెయిన్)–ఫెడెరికొ కారియా (అర్జెంటీనా) జంటపై గెలిచింది. అల్బానో ఒలివెట్టి (ఫ్రాన్స్)తో జోడీకట్టిన యూకీ బాంబ్రి రెండో రౌండ్లో 4–6, 6–3, 7–5తో 15వ సీడ్ క్రాజిసెక్ (అమెరికా)–జీన్ జులియెన్ రోజర్ (నెదర్లాండ్స్) జంటపై విజయం సాధించింది. అయితే మరో భారత ఆటగాడు శ్రీరామ్ బాలాజీకి రెండో రౌండ్లో చుక్కెదురైంది. బాలాజీ–గైడో అంద్రియోజ్జి (అర్జెంటీనా) ద్వయం 6–7 (4/7), 4–6తో మైకేల్ వీనస్ (న్యూజిలాండ్)–నీల్ స్కప్‌స్కీ (బ్రిటన్) జంట చేతిలో ఓడింది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సినిమా


● అమ్మ శాలినీతో ఎన్టీఆర్

మా అమ్మ కల నెరవేరింది

– ఎన్టీఆర్

''మా అమ్మ (శాలినీ) స్వగ్రామం కుందాపురానికి నన్ను తీసుకొచ్చి ఉడుపి శ్రీకృష్ణ ఆలయంలో దర్శనం చేసుకోవాలనేది ఆమె చిరకాల కల.. అది ఎట్టకేలకు నెరవేరింది'' అన్నారు హీరో ఎన్టీఆర్. కర్ణాటకలోని ప్రసిద్ధి చెందిన ఉడుపిలోని శ్రీకృష్ణ ఆలయాన్ని ఎన్టీఆర్ శ్రావణ శనివారం సందర్భంగా దర్శించుకున్నారు. ఆయన వెంట తల్లి శాలినీ, భార్య లక్ష్మీ ప్రణతి, కన్నడ హీరో రిషబ్ శెట్టి, డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కూడా ఉన్నారు. ప్రముఖ వాగ్గేయకారుడు భక్త కనకదాసు దర్శించుకున్న కనక కిటికీ ద్వారా అందరూ నల్లనయ్య (శ్రీ కృష్ణుడు) విగ్రహాన్ని దర్శించారు. దర్శనం అనంతరం ఆలయం ఎదుట తన తల్లితో కలిసి దిగిన ఫొటోలను ఎన్టీఆర్ తన సోషల్ మీడియాలో పోస్ట్ చేసి... ''ఉడుపి శ్రీకృష్ణ ఆలయాన్ని సందర్శించడంతో అమ్మ (శాలినీ) కల ఎట్టకేలకు నెరవేరింది. అమ్మ పుట్టిన రోజు సెప్టెంబర్ 2. ఆమె బర్త్‌డేకి రెండు రోజుల ముందు ఈ ఆలయాన్ని దర్శించడం ఆమెకు నేనిచ్చిన అత్యుత్తమ బహుమతి. విజయ్ కిరగందూర్ సార్‌కి (హోంబలే ఫిలింస్ అధినేత) థ్యాంక్స్. నా ప్రియ మిత్రుడు ప్రశాంత్ నీల్‌తో కలిసి రావడం సంతోషంగా ఉంది. అలాగే నా ప్రియ మిత్రుడు రిషబ్ శెట్టి కూడా నాతో వచ్చి ఈ క్షణాలను మరింత ప్రత్యేకంగా మార్చారు'' అంటూ తన ఆనందం వ్యక్తం చేశారు ఎన్టీఆర్. కాగా ఎన్టీఆర్ హీరోగా నటించిన తాజా చిత్రం 'దేవర' మొదటి భాగం ఈ నెల 27న పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది.

రహస్య కెమేరాలు అమర్చారు

– రాధికా శరత్‌కుమార్

కేరళ రాష్ట్రం రిలీజ్ చేసిన హేమా కమిషన్ నివేదిక మలయాళ చిత్ర పరిశ్రమనే కాకుండా ఇతర పరిశ్రమలనూ కుదిపేస్తోందనే చెప్పాలి. ఇంతకు ముందు దగా పడ్డ నటీమణులు ఇప్పుడు తమ ఆవేదనను వివిధ మాధ్యమాల ద్వారా వ్యక్తం చేస్తున్నారు. తాజాగా రాధికా శరత్‌కుమార్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ – ''నేను నటించిన ఒక మలయాళ చిత్రం షూటింగ్ సమయంలో క్యారవేన్‌లో రహస్య కెమేరాలు అమర్చారు. నటీమణులు దుస్తులు మార్చుకుంటున్న దృశ్యాలను చిత్రీకరించి కొందరు నటులు సెల్‌ఫోన్‌లో చూసి, ఆనందించడం నా కంటపడింది. చాలా కోపం వచ్చింది. నేను క్యారవేన్‌కు వెళ్లకుండా హోటల్‌కు



వెళ్లి దుస్తులు మార్చుకున్నాను. ఆ తర్వాత వాహన ఇన్‌చార్జ్‌ని ఇంకోసారి ఇలా జరిగితే జాగ్రత్త అని హెచ్చరించాను. సినిమా రంగంలో సిస్టమ్ సరిగ్గా లేదు. నటీమణుల గది తలుపులను తట్టే పరిస్థితి పలు చిత్ర పరిశ్రమల్లో ఉంది. సినిమా ఇండస్ట్రీకి వచ్చే మహిళలు తమను తాము నిరూపించుకోవడానికి హార్డ్ వర్క్ చేస్తారు. ఎన్నో త్యాగాలు చేస్తారు. మేం అందరం అలా ఎదిగినవాళ్లమే. ఒక మహిళ ఏదైనా ఫిర్యాదు చేసినప్పుడు ఆధారాలు చూపించమని అడుగుతారు. అంటే... జరిగే ఘటనను మేం వీడియో తీయాలా? ఇప్పుడు మహిళలు తమ హక్కుల కోసం పోరాడుతున్నారు. కానీ ఈ విషయంపై కోలీవుడ్‌లో మాట్లాడుతున్న నటులెవరైనా ఉన్నారా? 'ఉల్లొళుకు' సినిమాలో ఊర్వశితో కలిసి పార్వతి బాగా నటించింది. ఆమెకు ఎందుకు అవార్డు రాలేదని మలయాళ ఇండస్ట్రీలో కొందరిని అడిగాను. 'పార్వతి అన్యాయాన్ని వ్యతిరేకిస్తుంది. సమస్యల గురించి మాట్లాడుతుంది' అన్నారు. అంత ప్రతిభ ఉన్న నటిని ఇలానా ట్రీట్ చేసేది అనిపించింది'' అన్నారు.

అవకాశాల కోసం అడ్జెస్ట్ అవుతారని...

2018లో 'మీటూ'లో భాగంగా తమిళ రచయిత వైరముత్తు గురించి చిన్మయి చేసిన ఫిర్యాదు గురించి ప్రస్తావించారు రాధిక. ఇంకా ఆమె మాట్లాడుతూ – ''నేను యూ ట్యూబ్‌లో ఓ వీడియో చూశాను. ఒక వ్యక్తి... అతను జర్నలిస్ట్ కాదు... అతను నటీమణులు అవకాశాల కోసం అడ్జెస్ట్ అవుతారు అన్నట్లుగా మాట్లాడాడు. నడిగర్ సంఘమ్ జనరల్ సెక్రటరీ విశాల్‌కి ధైర్యం ఉంటే.. వెళ్లి అతన్ని చెప్పుతో కొట్టమనండి. తనతో పాటు నేను కూడా వెళతాను'' అని ఘాటుగా స్పందించారు రాధిక.

నేను కాదు... సరస్వతి కనిపిస్తుంది

– నివేదా థామస్



''సింపుల్ అండ్ బ్యూటిఫుల్ స్టోరీతో రూపొందిన చిత్రం '35–చిన్న కథ కాదు'. ఈ సినిమాలో తల్లి పాత్ర చేయడానికి ఆలోచించలేదు. ఓ నటిగా అన్ని పాత్రలూ చేయాలి. ఈ మూవీలో నివేదా థామస్ కాకుండా నేను చేసిన సరస్వతి పాత్రే కనిపిస్తుంది'' అని హీరోయిన్ నివేదా థామస్ అన్నారు. ప్రియదర్శి, నివేదా థామస్, విశ్వదేవ్, గౌతమి, భాగ్యరాజ్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం '35–చిన్న కథ కాదు'. నంద కిశోర్ ఈమాని దర్శకత్వంలో రానా, సృజన్ యరబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 6న తెలుగు, తమిళ, మలయాళంలో విడుదలవుతోంది. ఈ సందర్భంగా నివేదా థామస్ మాట్లాడుతూ– ''నంద కిశోర్ '35–చిన్న కథ కాదు' కథని అద్భుతంగా రాశారు. విద్యా వ్యవస్థ గురించి గొప్పగా, భార్యాభర్త, పిల్లలు, టీచర్, స్టూడెంట్స్... ఇలాంటి బంధాల గురించి అందంగా చెప్పారు. ఈ సినిమా చూస్తున్నంత సేపూ కె. విశ్వనాథ్‌గారి సినిమా చూస్తున్న అనుభూతి కలుగుతుంది. ఈ సినిమాలో వెంకటేశ్వర స్వామిని కూడా ఓ పాత్రలా చూపించారు దర్శకుడు'' అన్నారు.

హేమాలాంటి కమిటీలు రావాలి: ''మలయాళ చిత్ర పరిశ్రమలో ఉండటాన్ని నేను గర్వంగా భావిస్తున్నాను. 'అమ్మ'లో నేను ఓ సభ్యురాలిని. హేమా కమిటీ నివేదికలో వెలుగు చూసిన అంశాలు బాధాకరం. ఆ విషయాల గురించి నేను నా కుటుంబ సభ్యులతో కూడా చర్చించాను. ఈ విషయంలో డబ్ల్యూసీసీ (ఉమెన్ ఇన్ సినిమా కలెక్టివ్)ని ప్రశంసించాలి. పని చేసే చోట మహిళలకు భద్రత కల్పించడం కనీస అవసరం. దీని గురించి నేనూ వినతి చేశాను. మలయాళ చిత్ర పరిశ్రమలోలాగే ఇతర ఇండస్ట్రీల్లోనూ హేమా లాంటి కమిటీలు వస్తే మంచిదే'' అన్నారు నివేదా థామస్.



మలయాళ ఇండస్ట్రీని నాశనం చేయకండి

– మోహన్‌లాల్

మలయాళ చిత్రపరిశ్రమలో మహిళలు ఎదుర్కొంటున్న లైంగిక దాడులకు సంబంధించి కేరళ ప్రభుత్వానికి హేమా కమిటీ నివేదిక సమర్పించిన విషయం తెలిసిందే. ఇప్పటివరకు 17 మంది మలయాళ సినీ ప్రముఖులపై కేసులు నమోదైనట్లుగా వార్తలు వస్తున్నాయి. ఇలా ఇండస్ట్రీలో జరుగుతున్న పరిణామాలను దృష్టిలో పెట్టుకుని 'అమ్మ' (అసోసియేషన్ ఆఫ్ మలయాళం మూవీ ఆర్టిస్ట్స్) అధ్యక్షుడు మోహన్‌లాల్, 'అమ్మ' కమిటీ సభ్యులు మూకుమ్మడిగా రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. అప్పట్నుంచి ఈ వివాదంపై మోహన్‌లాల్ మాట్లాడలేదు. హేమా కమిటీ నివేదిక, ఇండస్ట్రీలో జరుగుతున్న తాజా పరిణామాల గురించి కేరళలోని తిరువనంతపురంలో జరిగిన ఓ కార్యక్రమంలో మోహన్‌లాల్ ఈ విధంగా మాట్లాడారు.

ఏ పవర్ గ్రూప్‌లోనూ లేను: హేమా కమిటీ నివేదికను స్వాగతిస్తున్నాం. నేను కూడా కమిటీ ముందు హాజరై, నాకు తెలిసిన అన్ని విషయాలను పంచుకున్నాను. వాటిని ఇక్కడ చర్చించలేను. అలాగే కమిటీ నివేదికలో పేర్కొన్న ఏ పవర్ గ్రూప్‌లోనూ నేను లేను. అయినా నివేదికలో చాలా అంశాలు ఉన్నాయి. అన్నింటికీ 'అమ్మ'నే కారణం అంటూ మాట్లాడటం కరెక్ట్ కాదు. మలయాళ పరిశ్రమ అంతా కలిసి స్పందించాల్సి ఉంది (ఇండస్ట్రీలో ఉండే పలు విభాగాల దర్శక–నిర్మాతలు, నటీనటులు వంటి సంఘాలు). నిజంగా తప్పులు చేసిన వారిని కోర్టు శిక్షిస్తుంది. ప్రభుత్వం, పోలీసులు నివేదిక అంశాల పైనే పని చేస్తున్నారు.

అందుకే కేరళ నుంచి బయటకు వెళ్లాను: సమాజంలో సినిమా అన్నది ఓ భాగమే. హేమా కమిటీ నివేదిక ప్రస్తావనల పైనే దృష్టి సారిస్తూ మలయాళ పరిశ్రమను నాశనం చేయకండి. మద్రాసులో ఉండి నేను సినిమాలు చేసే సమయంలో సరైన సౌకర్యాలు కూడా లేవు. చిన్న పరిశ్రమగా మొదలైన మలయాళ ఇండస్ట్రీ ఎదుగుతోంది. ఇతర భాషల్లో మలయాళ చిత్ర పరిశ్రమ కళకు గుర్తింపు లభిస్తోంది. దక్షిణాది సినిమాలకు ప్రపంచవ్యాప్త గుర్తింపు లభిస్తోంది. ఇలాంటి తరుణంలో ఇండస్ట్రీ నాశనం కాకూడదు. చాలామంది ఉపాధి కోల్పోతారు. కొందరు 'అమ్మ' ఇలా చేయకూడదు.. అలా చేయకూడదు అంటున్నారు. 'అమ్మ' కోసం జరిగే ఎన్నికల్లో సభ్యులెవరైనా పోటీ చేయొచ్చు. 'అమ్మ' అధ్యక్ష పదవికి నేను రాజీనామా చేసిన తర్వాత మీడియాకు కావాలని దూరంగా ఉన్నానన్న వార్తలు అవాస్తవం. నా భార్య సర్జరీ, నేను హీరోగా చేసిన సినిమాకు చెందిన పనుల్లో బిజీగా ఉండి కేరళ నుంచి బయటకు వెళ్లాను.

సుబ్రహ్మణ్య సాహసాలు


● 'సుబ్రహ్మణ్య' పోస్టర్

ప్రముఖ నటుడు, డబ్బింగ్ ఆర్టిస్ట్ పి. రవిశంకర్ తనయుడు అద్వయ్ హీరోగా పరిచయం అవుతున్న చిత్రం 'సుబ్రహ్మణ్య'. ప్రవీణ కడియాల, రామలక్ష్మి సమర్పణలో పి. రవిశంకర్ దర్శకత్వంలో తిరుమల్ రెడ్డి , అనిల్ కడియాల నిర్మిస్తున్నారు. తెలుగు, కన్నడ, తమిళ, మలయాళ, హిందీ భాషల్లో విడుదల కానున్న ఈ సినిమా ప్రీ లుక్‌ను రిలీజ్ చేసింది చిత్రబృందం. ''ఈ సినిమాలో మంచి ఎమోషనల్ ట్రీట్ ఉంది. ముంబైలో పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. ముంబై, హైదరాబాద్, బెంగళూరు, చెన్నైల్లోని ప్రముఖ స్టూడియోస్‌లో వీఎఫ్‌ఎక్స్ పనులు మొదలయ్యాయి. తెలుగు, కన్నడ, తమిళ, మలయాళ, హిందీ భాషల్లో ఈ సినిమాను రిలీజ్ చేస్తాం'' అని దర్శక–నిర్మాతలు తెలిపారు.

మా జీవితాలను మార్చింది


● హరీష్ శంకర్, బండ్ల గణేశ్

– హరీష్ శంకర్

''సోషల్ మీడియా విస్తృతంగా వ్యాప్తి చెందిన ఈ రోజుల్లో 'గబ్బర్ సింగ్' రిలీజ్ అయి ఉంటే ఎంత బాగుండేదో అని నా మనసులో చిన్న వెలితి ఉండేది. ఆ వెలితి ఇప్పుడు తీరింది. అప్పుడు మిస్ అయిన డిజిటల్ హంగామాని మళ్లీ క్రియేట్ చేసి ఇస్తున్న మా అన్న గణేశ్‌కి, సత్యనారాయణకి థ్యాంక్స్. 'గబ్బర్ సింగ్' మా జీవితాలను మార్చేసిన సినిమా'' అని డైరెక్టర్ హరీష్ శంకర్ అన్నారు. పవన్ కల్యాణ్, శ్రుతీహాసన్ జంటగా నటించిన చిత్రం 'గబ్బర్ సింగ్'. బండ్ల గణేశ్ నిర్మించిన ఈ చిత్రం 2012 మే 11న విడుదలైంది. ఈ నెల 2న పవన్ కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా 'గబ్బర్ సింగ్' సినిమాని రీ రిలీజ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం ప్రెస్ మీట్‌లో హరీష్ శంకర్ మాట్లాడుతూ – ''గబ్బర్ సింగ్' డబ్బింగ్ సమయంలోనే ఈ మూవీ పక్కా బ్లాక్‌బస్టర్ అన్నారు పవన్ కల్యాణ్‌గారు. నా అభిమానులు కోరుకునేది ఇవ్వబోతున్నావ్'' అన్నారు. ''నన్ను నేను నమ్మలేని పరిస్థితిలో పవన్ కల్యాణ్‌గారు నమ్మి, నన్ను నిర్మాతగా నిలబెట్టారు. నేను, హరీష్, దేవిశ్రీ ప్రసాద్... అందరూ ప్రేమించి ఈ సినిమా చేశాం. ఏడేళ్లుగా నేను సినిమా తీయకపోవడం బాధగా ఉంది... మళ్లీ సినిమాలు తీస్తా'' అన్నారు బండ్ల గణేశ్. డిస్ట్రిబ్యూటర్ సత్యనారాయణ, నటుడు రమేశ్‌రెడ్డి మాట్లాడారు.

ఇంటి పేరు తుపాకీ


● విఘ్నేష్, గణేశ్, మార్కండేయ

సదన్, ప్రియాంకా ప్రసాద్ జంటగా పీఎల్ విఘ్నేష్ దర్శకత్వంలో పారమళ్ళ లింగయ్య నిర్మించిన చిత్రం 'ప్రణయ గోదారి'. త్వరలోనే ఈ చిత్రం రిలీజ్ కానుంది. ఈ సినిమాలోని ప్రత్యేక గీతం 'గు... గు... గ్గ..' పాటను కొరియోగ్రాఫర్ గణేశ్ రిలీజ్ చేసి, పాట బాగుందని, ఈ సినిమా పెద్ద విజయం సాధించాలనీ అన్నారు. 'నా ఇంటి పేరు తుపాకీ...' అంటూ మొదలై, 'గు... గు... గ్గ.. గురిగింజ రో నేను..' అంటూ సాగుతుందీ పాట. ఈ చిత్రం సంగీత దర్శకుడు మార్కండేయ ఈ పాట రాయగా, భార్గవి పిళ్లై పాడారు. ''ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి'' అన్నారు దర్శక–నిర్మాతలు.

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను



SC మాల/ M.Tech / Govt.Asst. ఇంజనీర్/జెన్‌కో/ 80,000/-PM / 5'10" ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 8341650195 [HA-16381]

యాదవ/కట్నం ప్రసక్తి లేదు/ B.Tech (సివిల్) /C.Govt. డిప్యూటీ మేనేజర్/ SBI /75000/-PM/5'8"ఎత్తు/28 సం॥ల వరునికి వధువు కావలెను. Ph : 9515755529 [HA-16381]

SC మాదిగ & క్రిస్టియన్/కట్నం ప్రసక్తి లేదు /B.Tech(సివిల్)/C.Govt.కస్టమ్స్ ఆఫీసర్ /14 Lakhs P.A/5'8"ఎత్తు/28సం॥ల వరునికి వధువు కావలెను. Ph: 9676995093 [HA-16381]

క్రిస్టియన్ మాదిగ/M.Tech, IIT/C.Govt. Asst. ఇంజనీర్/(CWC)/80,000/-PM/6' ఎత్తు/29 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 6305007091 [HA-16382]

విశ్వబ్రాహ్మణ/ B.Tech / C. Govt. Jr. ఇంజనీర్/DRDL/50,000/-PM/ 6' ఎత్తు /28 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9618007652 [HA-16382]

వెలమ/ B.Tech / Govt. Asst. ఇంజనీర్ / న్యూక్లియర్ పవర్ ప్లాంట్/ NPCLP/ 75000/-PM / 5'11" ఎత్తు / 28 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 8297439565 [HA-16382]

బెస్త, గంగపుత్ర/కట్నంప్రసక్తి లేదు/ M.Tech / Govt. మెకానికల్ ఇంజనీర్/ ఇరిగేషన్ Dept/ 80,000/-PM / 6' ఎత్తు / 29 సం॥ల వరునికి వధువు కావలెను. Ph: 9966760501 [HA-16382]

యాదవ/ కట్నంప్రసక్తి లేదు / CA/ అకౌంటెంట్/ 93000/-PM/ 5'10" ఎత్తు/28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. Ph: 7075953400 [HA-16382]

రజక/కట్నంప్రసక్తి లేదు /B.Tech/C. Govt. ఇన్‌కమ్ ట్యాక్స్ ఆఫీసర్/80,000/-PM/ 5'10" ఎత్తు/29 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 8341650195 [HA-16382]

హిందూమాల/కట్నంప్రసక్తి లేదు / 28/ 5'9"/ B.Tech / Govt.AEE / ఎలక్ట్రికల్ Dept/ 90,000/-PM/అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 6309258463 [HA-16382]


క్రిస్టియన్ మాల/32/5'9"/B.Tech, C. Govt. ఎంప్లాయి/ 2 Lakhs PM. అందమైన వరుడికి తగిన వధువు కావలెను. Ph: 8919759359 [HA-16386]

SC మాదిగ కట్నం ప్రసక్తి లేదు 29/5'10" B.Tech (Civil), Assistant Commercial Tax Officer (ACTO) 1.50 Lakhs P/M వెల్ సెటిల్డ్ వరుడికి తగిన వధువు కావలెను. అర్జెంట్. 8074766368 [H-796631]

కుల పట్టింపు లేదు: Age: 35 లోపు విడో డాక్టర్ అమ్మాయి కావాలి. ఆసక్తి కలిగినవారు సంప్రదించండి. డైరెక్ట్ పేరెంట్ ✆ : 9705135074. [Z-1080808]

Muslim: Healthy and Rich, retired Principal, Seeks Educated Employee & Beautiful Bride. CNB. Ph: 9391143795 [H-796631]

వరుడు కావలెను



రెడ్డి విడో కుల, ఆస్తి పట్టింపు లేదు/ డిగ్రీ, ఎత్తు 5.4/ సొంత బిజినెస్‌లు గల అందమైన వధువుకు వరుడు కావలెను. 1st/2nd (ఇల్లరికం OK) అన్ని కులాల వారికి సంబంధాలు చూడబడును. ఫోన్: 9032598676 [H-796631]

కుల, ఆస్తి పట్టింపులేదు, జాబ్, వ్యాపారం, ఫ్లాట్స్, 5L/ PM, కోట్ల ప్రాపర్టీ గల, అందమైన సాంప్రదాయ వధువుకి 1వ, 2వ వరుడు కావలెను. ఇల్లరికం, ఓకె ముఖాముఖి కల్పించి త్వరగా కుదుర్చబడును. Ph: 8309968531 [H-796339]

36yrs/రెండవ పెళ్లి కుల పట్టింపు లేదు Govt.ఎంప్లాయ్ 2,50,000/- (pm)వెల్ సెటిల్డ్ వధువుకి తగిన వరుడు కావలెను (మంచి ఫ్యామిలీ అయి ఉండాలి) సంప్రదించండి : 9032445378 [H-796686]

రెడ్డి/45yr/కుల పట్టింపు లేదు/ఫెయిర్/ Govt. ఎంప్లాయ్/3,50,000/- (PM), వెల్ సెటిల్డ్ & 4 సొంత ఇల్లులు కలిగిన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం OK) సంప్ర : 8374802603 [H-796686]

SC మాల & క్రిస్టియన్/ B.Tech(EEE)/ Govt. AEE / ట్రాన్స్‌కో/10 Lakhs PA / 5'4" ఎత్తు / 25 సం॥ల అందమైన వెల్ సెటిల్డ్ వధువుకు వరుడు కావలెను. Ph: 9676995093 [HA-16381]

వడ్డెర/B.Tech/C.Govt.బ్యాంక్ క్లర్క్ & క్యాషియర్/ SBI / 45000/-PM / 5'4" ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8341650195 [HA-16381]

K.C. రెడ్డి మ్యారేజ్ బ్యూరో ప్రై॥ లి॥

రెడ్డి మ్యారేజ్ బ్యూరో India, Abroad Matches Fast Settlement: Deals with all regions in A.P. & Telangana (For Reddy's only) Cont: K.C. Reddy, Hyderabad. Ph: 9849321309 / 9347807015. PLEASE CHECK MY WHATSAPP STATUS. Email: kcreddy43@gmail.com, Facebook.com/ kcreddymarriagebureau

వధువు కావలెను

Reddy/B.Tech/IIT/Very Handsome Boy/1994/5'11"/1Cr/yr/10Cr. * Cont: K.C. Reddy- Mar-Bureau-Pvt Ltd-Hyd.Ph: 9347807015/ 9849321309

Reddy/B.Tech(IIT)/MS/)Ph.D/Very Handsome and So Brilliant/ 1996/ 6'/ 25 Cr; Ex→ Employee→ Amazon, Apple, IBM, Microsoft/ Ph: 9849321309

Reddy/ B.Tech / MBA / Builder Business. Hyd/Handsome Boy/ 1995 /5'11"/100Cr. * Cont: K.C. Reddy-Hyd. Ph: 9347807015/9849321309

Reddy/ Good Business / B.Tech/ Handsome Boy / 1990 /5'10"/20L/M income/25Cr (Property) Hyd * Cont : K.C. Reddy-Hyd- Ph: 9849321309

Reddy/B.Tech/MS/H1/USA/Handsome Boy / 1997/5'9" / 100K / 60Cr * 1991/ 5'11"/ 140K/200Cr. * Cont: K.C. Reddy- Mar-Bureau-Hyd.Ph: 9347807015

Reddy/USA - Citizen / Handsome Boy/1995/5'10"/BS/MBA(USA)230K /70Cr *1995/5'9"/100K/200Cr *Cont: K.C.Reddy-Hyd. Ph: 9849321309

Reddy/Industrialist/B.Tech/MBA/ 1995/6'/100 Cr *1994/5'11"/200Cr * Cont: K.C.Reddy- Mar - Bureau-Hyd- Ph: 9347807015/9849321309

Reddy/MBBS/MD/Handsome Boy/ Parents Doctors/ 1995/ 5'10"/ 400 Cr- *Cont : K.C. Reddy - Hyd. Ph: 9347807015/9849321309

Reddy/ Divorcee /Business / Hyd-Builder/Handsome Boy/ B.Tech/ MS/ 1994/5'10"/300Cr *Cont: K.C. Reddy-Hyd-Ph: 9347807015/ 9849321309

Reddy/Divorcee/B.Tech/MS/H1/USA/ Handsome Boy/1990/5'9"/300K/Rich Family- * Cont. K.C. Reddy- Hyd- Ph: 9347807015/ 9849321309

వరుడు కావలెను

Reddy/CATHOLIC / Most Beautiful/ B.Tech/MS /2000/5'5"/10Cr * Cont: K.C. Reddy-Marriage Bureau-Hyd. Ph: 9347807015/9849321309

Reddy/B.Tech/(OU Campus) Most Beautiful / 1997/ 5'4"/ 25L/yr/Rich Family- * Cont : K.C. Reddy-Hyd-Ph: 9849321309/9347807015

Reddy/ B.Tech / MBA / Most Beautiful / The only Daughter/ 1995 /5'3"/ 50Cr/ * Cont: K.C. Reddy-Hyd-Ph: 9347807015/9849321309

Reddy/MBBS/MD/Radiology/Most Beautiful/1994/5'10"/ 50Cr * Cont : K.C.Reddy- Mar-Bureau-Hyd-Ph: 9849321309/ 9347807015

Reddy/Divorcee/ MBBS / MD/Most Beautiful/Own Hospital/ 1995/ 5'8"/ 40Cr * Cont : K.C.Reddy-Hyd. Ph: 9347807015/9849321309

Reddy/B.Tech / MS / USA / Most Beautiful /1985/5'6"/50Cr * Cont: K.C. Reddy-Marriage Bureau-Pvt. Ltd-Hyd. Ph: 9849321309/9347807015

Reddy/BBA/MS/Most Beautiful (USA - Citizen) 1996/5'3"/115K/ 30Cr * Cont : K.C. Reddy-Hyd-Ph: 9849321309/ 9347807015

Reddy/MBBS/MD/Most Beautiful /1998/5'7"/50 * Cont. K.C. Reddy-Mar-Bur- Pvt.Ltd.Hyd. Ph: 9849321309/ 9347807015

Reddy/B.Tech/MS / H1/USA Most Beautiful/1996/5'5"/15Cr *1989/5'6"/ 170K/30Cr * Cont : K.C. Reddy-Hyd-Ph: 9347807015/9849321309

Reddy/ CANADA / PR / Most Beautiful/B.Tech/MBA/1989/5'5"/30Cr * Cont: K.C.Reddy- Marriage Bureau-Hyd.Ph: 9849321309/9347807015

[D-552]

యాదవ/B.Tech / C.Govt. బ్రాంచ్ మేనేజర్ / కెనరా బ్యాంక్ /60,000/-PM / 5'5"ఎత్తు/25సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9966760501 [HA-16382]

క్రిస్టియన్ మాల/25 / 5'4" / B.Tech / C. Govt. Asst. మేనేజర్/కెనరా బ్యాంక్ /60,000/-PM / అందమైన వధువుకు వరుడు కావలెను. Ph : 6309258463 [HA-16382]

అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి)

రెడ్డిలకు మాత్రమే. D.V. కోటిరెడ్డి, 690, Road No:-3, Banjara Hills (TV-9, Opp: Colony) (IOC Petrol Bunk Side Road) Hyd. +91 9848011818 / +91 9393311818 (Tuesday Holiday) Timings : 10 am - 6 pm. www.avinashreddy.com, e-mail: avinash11818@gmail.com

వధువు కావలెను

రెడ్డి Business, BE, 27, 6' 1", Very Rich Family, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, ME, MS, 27, 5' 10", Developer, 15 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Canada, BE (BITS), MS (USA), 30, 6', 140 K, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 32, 5' 11", SWE, 295 K, H1, USA, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

వరుడు కావలెను

రెడ్డి LLM, 24, 5' 5", Associate, 19 L P/A, 100 Crores, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Citizen, BS, 28, 5' 6", SWE, 50 Crores, USA, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MBA, 25, 5' 5", Wipro, 25 Crores, Hyderabad, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 27, 5' 6", SWE, Amazon, 200 K, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.



రెడ్డి BE, MS, 28, 6', Systems Analyst, 300 K, H1, USA, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Australia, BE, MS, 30, 5' 8", Business Analyst, 90 K, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 29, 5' 11", SWE, 6 Crores, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MBA, 31, 5' 8", Analyst, 175 K, 15 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 30, 5' 6", Project Manager, 33 L P/A, 10 Crores, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 25, 5' 6", SWE, H1, 2 Crores, USA, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, 29, 5' 4", PG Doctor, 25 Crores, Hyderabad, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 26, 5' 4", SWE, 9.4 L P/A, 3 Crores, Hyderabad, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

LETTER

వడ్డెర/B.Tech / C.Govt. క్లర్క్ / SBI / 40,000/-PM / 5'4" ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 7075953400 [HA-16382]

రెడ్డి/ఆస్తి కుల పట్టింపు లేదు/విడో/35y/ డిగ్రీ/5'3"/3 కోట్ల ప్రాపర్టీ కలిగి పిల్లలు లేని ఒంటరి వధువుకు వరుడు కావలెను. మీ ఫోటోలు వాట్సాప్‌లో సెండ్ చేయండి. Ph: 9133640971 [HA-16386]

రెండో పెళ్లి/విడో/50y/ గుంటూరు/ లెక్చరర్/ Own House-Rents/కోట్ల ప్రాపర్టీ గల పిల్లలు లేని ఏ బాదరబందీలేని ఏకైక వధువుకు FC/BC వరుడు కావలెను (పిల్లలున్నా OK). Ph: 8519803423 [HA-16386]

రెడ్డి/కుల పట్టింపు లేదు/26/5'4"/B.Tech/సిద్ద స్థిరాస్తి కలిగి తండ్రి లేని ఏకైక వధువుకు మిడిల్ క్లాస్ వరుడు కావలెను మీ ఫోటోలు వాట్సాప్‌లో సెండ్ చేయండి. 9885463158 [HA-16386]

కమ్మ కాపు/31yr/కుల పట్టింపు లేదు/Govt. ఎంప్లాయ్/40K (PM), వెల్ సెటిల్డ్ ఫ్యామిలీ 3 సొంత ఇల్లులు & బిజినెస్ కలిగిన వధువుకి వరుడు కావలెను (1st, 2nd & మ్యాచ్ OK ఇల్లరికం OK) సంప్ర : 9640133485 [H-796686]

రెడ్డి/30yr/5'5"/ఫెయిర్ / కుల పట్టింపు లేదు/ PG/Govt.ఎంప్లాయ్ 50K (PM), వెల్ సెటిల్డ్ బిజినెస్ & సొంత ఇల్లు కలిగిన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం OK) సంప్ర : 9133672661 [H-796686]

రెడ్డి/కుల పట్టింపు లేదు/రెండవ పెళ్లి/విడో/ సొంత ఇల్లులు/ రెంట్స్/పిల్లలు లేరు/సొంత ప్రాపర్టీ/ఎలాంటి బాదర బందీలేని వధువుకు వరుడు కావలెను. (అర్జెంట్) (ఇల్లరికం OK) (నో బ్రోకర్స్) 7799083500, 7386660643 (1st, 2nd matches) [H-796686]

రెడ్డి 2nd విడో (కుల/ఆస్తి) ప్రసక్తి లేదు 32Y/ డిగ్రీ/ సొంత ఇల్లు/ప్రాపర్టీస్, బిజినెస్ గల వధువుకు 1వ, 2వ వరుడు కావలెను. (ఇల్లరికం OK) అన్ని వయస్సుల వారికి సంబంధాలు కలవు. ఫోన్: 9666327616 [H-796631]


వైశ్య: విడో/5'3"/ గ్రానైట్ బిజినెస్/1L/PM/ సొంత ఇల్లు/ మిర్చి బిజినెస్/ ఎవ్వరూలేని వధువుకి వరుడు కావలెను. పిల్లలులేరు. కుల ఆస్తి ప్రసక్తి లేదు. Ph: 7702278724 [H-796339]

రెడ్డి: విడో/50y/5'5"/V.Fair/Govt Retd Teacher/ సొంత ఇల్లు & రెంట్స్/ బిజినెస్/28 ఎకరాల పండ్లతోటలు, పిల్లలులేని వధువుకు వరుడు కావలెను. కుల ఆస్తి ప్రసక్తి లేదు. Ph: 7093717220 [H-796339]

పద్మశాలి: విడో/ 50y/ డిగ్రీ/సొంత ఇల్లు / సొంతబిజినెస్/ 8 ఎకరాల ల్యాండ్ గల వధువుకి కుల ఆస్తి పట్టింపు లేని వరుడు కావలెను. Ph: 9705499686 [H-796339]

యాదవ/ఎర్రశాఖ/అప్పర్ మిడిల్ క్లాస్/ 37Y/ 5'4"ఎత్తు/M.ఫార్మసీ వధువుకి Hydలో జాబ్ కలిగిన లక్ష రూ॥PM ఆపై ఆదాయం కలిగిన యాదవ వరుడు మాత్రమే కావలెను. డైరెక్ట్ Father నెంబర్: 9989597799 [H-796623]

వేదికలు



మాల మాదిగ స్పెషల్ IAS, IPS, IFS, IRS, గ్రూప్-I, II, PG, డాక్టర్స్, బ్యాంక్ PO, Govt. ఆఫీసర్స్, USA, UK. Ph: 7396915712 [HA-16386]

కావ్య మ్యారేజ్ లింక్స్! 1వ, 2వ లేట్ మ్యారేజెస్, డైవర్సీ, విడోస్, విడోయర్స్, పెన్షనర్లకు అన్ని కులాల వారికి ఫాస్ట్ సెటిల్‌మెంట్ ఫ్రీలకు ఫ్రీ. ఫోన్: 7702526428 [H-796631]

తోడు నీడ 1st & 2nd మ్యారేజ్ క్విక్ మ్యారేజ్ బ్యూరో ద్వారా అన్ని కులాల వారికి సంబంధాలు కుదర్చబడును. సంప్రదించండి : Ph: 9550725751 [HA-569]

Brahmin, Padmashali పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 9032378894/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-16385]

Christian పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 7032712544 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-16385]

Kamma, Kapu పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 9032378894 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-16385]

Madiga - Mala పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 7032712544 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-16385]

Reddy పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 9949233422 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-16385]

ధ్రువ మ్యారేజెస్. అన్ని కులాల వారికి 1వ, 2వ, లేటు, విడో, డైవర్సీ వారికి తగిన సంబంధాలు చూపబడును. Age: 18–70 సం.లు. Ph: 7702955854 [HA-15785]

Doctors, Software, NRI, Rich Persons కు Late Matches కు, అన్ని ప్రాంతాల వారికి వ్యక్తిగత శ్రద్ధతో Fast గా సెటిల్‌మెంట్ చేయబడును. పూర్ణమ్యాట్రిమోని, తిరుపతి, 7093722724. [T-2957]

శుభమస్తు మ్యారేజ్ బ్యూరో TM Est : 1995, గౌడ, ఈడిగ, శెట్టి బలిజ, 1st/ 2nd దేశ/విదేశ సంబంధాలకై సం॥ S.రాములు గౌడ్, లింగాల కాంప్లెక్స్, DSNR, Hyd. వ్యవస్థాపకురాలు: స్వర్గీయ S.శారదాగౌడ్, Ph: 8790690909 [H-796339]

పెళ్లి ప్రయత్నాలు చేస్తున్నారా! Software, డాక్టర్స్, NRI, Govt., అన్ని ప్రాంతాల వారికి ప్రత్యేక శ్రద్ధతో పెళ్లి సంబంధాలు చూడబడును. పూర్ణమ్యాట్రిమోని, తిరుపతి ✆ 7093722724 [T-3486]

★

Free Registration బ్రాహ్మణ మరియు అన్ని కులాల SWE, Govt. Doctors, MNC Matches, Late & 2nd Matches కై సంప్రదించండి. 9704656103, 9494809254 (Whatsapp) [HA-986]

జనగామలో పర్యటించిన జస్టిస్ సూరేపల్లి నంద



సోమేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న జస్టిస్ నంద

జనగామ: రాష్ట్ర హైకోర్టు జస్టిస్ సూరేపల్లి నంద శనివారం జనగామ జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన మహిళా బార్ అసోసియేషన్, రక్తదాన శిబిరం, మెడికల్ క్యాంపు, బ్యాడ్మింటన్ కోర్ట్, రెస్ట్ రూమ్, ఈ–లైబ్రరీని ఆమె ప్రారంభించారు. అనంతరం పాలకుర్తి శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకున్నారు. అలాగే పోతన స్మారక మందిరాన్ని సందర్శించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి రవీంద్ర శర్మ, సీనియర్ సివిల్ జడ్జి విక్రం, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సుచరిత, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి సందీప తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఐఆర్‌ఎఫ్ ర్యాంకింగ్స్‌లో కేఎల్‌హెచ్‌కు 22వ ర్యాంకు



సాక్షి, హైదరాబాద్: దేశంలోని అత్యుత్తమ ప్రమాణాలు పాటించే విద్యా సంస్థలకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఎన్‌ఐఆర్‌ఎఫ్ ర్యాంకింగ్స్‌లో కేఎల్‌హెచ్ హైదరాబాద్ క్యాంపస్ 22వ ర్యాంకు సాధించిందని కెఎల్ డీమ్డ్ వర్సిటీ ఉప కులపతి డాక్టర్ పార్థసారథి వర్మ హర్షం వ్యక్తం చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ, నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్–24లో తమ హైదరాబాద్ క్యాంపస్ అత్యుత్తమ పనితీరును కనబరిచినందుకు ఈ ర్యాంకును కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ ప్రకటించిందని ఆయన చెప్పారు. దేశంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కలిపి 6,517 ఉన్నత విద్యాసంస్థలు పోటీ పడగా కేఎల్‌హెచ్ వర్సిటీ 22వ ర్యాంకును దక్కించుకుందని ఆయన చెప్పారు. కేఎల్‌హెచ్ హైదరాబాద్ క్యాంపస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ కోటేశ్వర రావు, వర్సిటీ అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ జె. శ్రీనివాసరావు మాట్లాడుతూ అజీజ్‌నగర్, బోరంపేట, కొండాపూర్ క్యాంపస్‌లలో అత్యాధునిక కోర్సులను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు.

త్వరలోనే కొత్త ఆర్‌వోఆర్

- ఆర్‌వోఆర్‌పై ముగిసిన ప్రజాభిప్రాయ సేకరణ
- అన్ని వర్గాల ప్రజలూ అభిప్రాయాలను వెల్లడించారు
- జిల్లా స్థాయిల్లో వచ్చిన సూచనలను కలెక్టర్లు నివేదిస్తారు
- క్రోడీకరించిన తర్వాత కొత్త చట్టం అమలు: మంత్రి పొంగులేటి



సాక్షి, హైదరాబాద్: రికార్డ్ ఆఫ్ రైట్స్ (ఆర్‌వోఆర్)–2024 చట్టం ముసాయిదాపై ప్రజాభిప్రాయ సేకరణ ముగిసిందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. ఈ అభిప్రాయ సేకరణలో మేధావులు, రిటైర్డ్ రెవెన్యూ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, రైతుల నుంచి సామాన్యుల వరకు అందరూ తమ సల హాలు, సూచనలను ప్రభు త్వానికి ఇచ్చారని ఆయన తెలిపారు. ఈ అభిప్రాయాలన్నింటినీ క్రోడీకరించి కొత్త ఆర్‌వోఆర్ చట్టాన్ని అందుబా టులోకి తెస్తామని, ఇందుకు అవసరమైన కసరత్తును త్వరి తగతిన పూర్తి చేస్తామని శనివారం ఒక ప్రకటనలో ఆయన వివరించారు. రాష్ట్రంలో భూమి సమస్యలకు శాశ్వత పరి ష్కారమే లక్ష్యంగా, భవిష్యత్ తరాలను దృష్టిలో పెట్టుకుని, తెలంగాణ ప్రజల దశాబ్దాల ఆకాంక్షకు అనుగుణంగా కొత్త చట్టాన్ని తెస్తామని స్పష్టం చేశారు. ''తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక భూ సమస్యలు పరిష్కారమవుతాయని అనుకుంటే గత పాలకుల తొందరపాటు నిర్ణయాలతో కొత్త సమస్యలు ఉత్పన్నమయ్యాయి. బీఆర్‌ఎస్ ప్రభుత్వం తెచ్చిన ఆర్‌వోఆర్ చట్టం లోపభూయిష్టంగా ఉండడంతో రైతులు, భూముల యజమానులు పడిన కష్టాలు అన్నీ ఇన్నీ కావు. తప్పుల తడకగా సేకరించిన వివరాలతో నిర్వహించిన ధరణి పోర్టల్‌కు 30 లక్షల మంది రైతులు బాధితులుగా మారారు. అటువంటి పరిస్థితులను పునరావృతం కానివ్వం. తాము రూపొందించిన ఆర్‌వోఆర్ ముసాయిదా చట్టంపై విస్తృత స్థాయిలో ప్రజాభిప్రాయ సేకరణ జరిపాం. జిల్లా స్థాయిలో వర్క్‌షాప్‌లు నిర్వహించాం. ఆ వర్క్‌షాప్‌లలో వచ్చిన సూచనలను కలెక్టర్లు నివేదిక రూపంలో పంపుతారు. ప్రజల నుంచి ప్రభుత్వానికి లిఖితపూర్వకంగా, ఈమెయిల్ రూపంలో వచ్చిన సూచనలను కూడా వాటితో క్రోడీకరిస్తాం. అమలు చేసే అధికారులకు అవగాహన ఉండేలా, రైతులకు అర్థమయ్యే రీతిలో అవినీతి రహిత చట్టాన్ని తీసుకురాబోతున్నాం. గత ప్రభుత్వ హయాంలో అత్యంత రహస్యంగా ఉంచిన ధరణి పోర్టల్‌ను మా ప్రభుత్వం ఒక పబ్లిక్ డాక్యుమెంట్‌గా ప్రజలందరికీ అందుబాటులో ఉంచబోతోంది.' అని ఆ ప్రకటనలో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు.



పీవోడబ్ల్యూ భారీ ర్యాలీ

కేంద్రం మనువాదాన్ని ప్రజలపై రుద్దుతోంది

- ఐఎఫ్‌టీయూ జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ అపర్ణ ఆరోపణ
- 7వ రాష్ట్ర మహాసభల సందర్భంగా వీఎస్‌టీ నుంచి ఇందిరాపార్కు వరకు పీవోడబ్ల్యూ ర్యాలీ

కవాడిగూడ: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆర్‌ఎస్‌ఎస్ మనువాద భావజాలాన్ని దేశ ప్రజలపై బలవంతంగా రుద్దుతోందని ఐఎఫ్‌టీయూ జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ అపర్ణ ఆరోపించారు. ఈ అంశం మహిళలపై అత్యంత ప్రభావం చూపుతుందన్నారు. శనివారం ప్రగతిశీల మహిళా సంఘం (పీవోడబ్ల్యూ) 7వ తెలంగాణ రాష్ట్ర మహాసభల సందర్భంగా వీఎస్‌టీ నుంచి ఇందిరా పార్కు వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఇందిరా పార్కు ధర్నా చౌక్‌లో భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అపర్ణ మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో మహిళల గొంతు నొక్క డానికి ప్రభుత్వాల నిర్ణయాలు దోహదపడుతున్నాయని ఆక్షేపించారు. అందుకే మహిళల సమావేశాలు కూడా అనుమతి తీసుకొని నిర్వహించుకోవల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

మహిళలపై లైంగిక హింస కట్టడిలో ప్రభుత్వాలు విఫలం..

దేశవ్యాప్తంగా మహిళలపై లైంగిక హింస పెరిగిందని.. నిర్భయ చట్టం తెచ్చుకున్నా లైంగిక వేధింపులకు అడ్డుకట్ట పడటంలేదని అపర్ణ వాపోయారు. కోల్‌కతాలో ఓ జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, హత్యోదంతం విషయంలో ప్రభుత్వాలు రాజకీయాలు చేస్తూ సరైన చర్యలు తీసుకోవట్లేదని ఆమె ఆరోపించారు. ఉపాధి హామీ పథకంలో అవినీతి పెరిగిందని... మహిళలకు సరైన వేతనాలు కూడా ఇవ్వట్లేదన్నారు. దీనికి వ్యతిరేకంగా దేశవ్యాప్త ఐక్య పోరాటాలను నిర్మించాలని పిలుపునిచ్చారు.

మహిళల కోసం ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు తేవాలి: సంధ్య

పీవోడబ్ల్యూ 7వ మహాసభలను ఆది, సోమవారాల్లో నిర్వహిస్తున్నామని పీవోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు జి. సంధ్య తెలిపారు. 1974లో పీవోడబ్ల్యూ ఆవిర్భవించిన నాటి నుంచి నేటి వరకు మహిళల హక్కుల సాధన కోసం రాజీలేని పోరాటం చేస్తున్నామని చెప్పారు. నేడు పురుషాధిక్యం పెరిగిందని.. మహిళలను అన్ని రంగాల్లో అణచివేసే కుట్ర జరుగుతుందని ఆమె ఆరోపించారు. మహిళా హక్కుల రక్షణ కోసం తెచ్చిన చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని.. ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీవోడబ్ల్యూ జాతీయ నాయకురాలు వి. సంధ్య, పీవోడబ్ల్యూ ఏపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మి, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి అందె మంగ, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు అరుణ, నాయకులు జి. అనసూయ, డాక్టర్ పిట్ల సరిత, ఎం. జ్యోతి, ఆర్ సీత, జె.హరిత, కావేరి పాల్గొన్నారు.

బీసీ నేత సంజయ్ ఆరోగ్యం విషమం

- 'గాంధీ'నుంచి అపోలో ఆస్పత్రికి తరలింపు



సంజయ్‌కుమార్‌ను అపోలో ఆస్పత్రికి తరలిస్తున్న బీసీ సంఘ నేతలు

గాంధీ ఆస్పత్రి (హైదరాబాద్): కులగణన చేపట్టాలని, కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలన్న డిమాండ్‌తో ఏడు రోజులుగా ఆమరణ దీక్ష చేపట్టిన బీసీ సంఘ నేతల్లో ఒకరైన జక్కని సంజయ్ కుమార్ ఆరోగ్యం విషమించింది. దీంతో ఆయనను మెరుగైన వైద్యానికి శనివారం రాత్రి 10.30 గంటల సమయంలో గాంధీ ఆస్పత్రి నుంచి సికింద్రాబాద్‌లోని అపోలో ఆస్పత్రికి తరలించారు. గాంధీ ఆస్పత్రి వైద్యులు పట్టించుకోవడం లేదని.. మూడు రోజులుగా హెల్త్ బులెటిన్ విడుదల చేస్తామని ప్రకటించి, ఇప్పటివరకు విడుదల చేయలేదని పలువురు బీసీ సంఘ నేతలు ఆరోపించారు. శనివారం రాత్రి తీవ్ర అస్వస్థతకు గురైన సంజయ్‌కుమార్‌కు వైద్యపరీక్షలు నిర్వహించేందుకు గాంధీ ఆస్పత్రి వైద్యులు అందుబాటులో లేకపోవడంతో.. ఆయన ప్రాణాలకు ప్రమాదం ఉందని గమనించి అపోలో ఆస్పత్రికి తరలించామని వారు వెల్లడించారు.

పాత పింఛను విధానమే అమలు చేయండి

- ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డికి ఉద్యోగుల జేఏసీ వినతి
- షేర్‌మార్కెట్‌పై పింఛను ఆధారపడటం ఎండమావిలో నీటిని వెతకడమే: జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి



చిన్నారెడ్డికి వినతిపత్రం అందిస్తున్న జేఏసీ ప్రతినిధులు

సాక్షి, హైదరాబాద్: ఉద్యోగి చందా (కంట్రిబ్యూషన్)తో అమలు చేసే కొత్త పింఛను విధానం తమకు వద్దని, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరికీ పాత పింఛను విధానాన్ని వర్తింపజేయాలని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ కోరింది. ఈ మేరకు శనివారం ప్రజాభవన్‌లో ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డిని కలసి వినతిపత్రం అందజేసింది. పాత పింఛను విధానంలో సర్వీస్ ఆధారంగా పింఛను, గ్రాట్యుటీ, కమ్యూటేషన్‌తో పాటు ఫ్యామిలీ పింఛనుకు అవకాశం ఉంటుందని అదే కొత్త విధానంలో అవేమీ లేవని వినతిపత్రంలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు ఆసరా పేరుతో ఇచ్చే పింఛను కంటే ఉద్యోగులకు తక్కువ పింఛను ఇవ్వడం సరికాదన్నారు. ఇందుకు స్పందించిన చిన్నారెడ్డి కంట్రిబ్యూటరీ పింఛను విధానం(సీపీఎస్)లో ఉన్న ఉద్యోగుల సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

ఆమోదం కాదు కాబట్టే పోరాడుతున్నాం: జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి

కొత్త పింఛను విధానం తమకు ఆమోదయోగ్యం కాదు కాబట్టే ఏళ్ల తరబడి ఉద్యోగులు పోరాడుతున్నారని ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన ఏకీకృత పింఛను (యూపీఎస్) కూడా తమకు వద్దని, 1980 పింఛను నిబంధనల ప్రకారం పాత పింఛను విధానాన్ని పునరుద్ధరించాలన్నదే ఉద్యోగుల ఏకైక డిమాండ్ అని స్పష్టం చేశారు. తాము సర్వీసులో ఉన్నంత కాలం పింఛను కోసం కట్టిన చందాను షేర్‌మార్కెట్‌లో పెట్టి ఆ షేర్‌మార్కెట్‌పై ఆధారపడి తమకు పింఛను ఇవ్వడమంటే ఎండమావిలో నీటిని వెతకడమేనని అభిప్రాయపడ్డారు.

పిచ్చికుక్క స్వైరవిహారం

- పది మందికి గాయాలు



పిచ్చికుక్క దాడిలో గాయపడిన పద్మ

పెద్దఅడిశర్లపల్లి: నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలం మల్లాపురంలో పిచ్చికుక్క పది మందిని కరిచి గాయపరిచింది. శుక్రవారం సాయంత్రం ఇద్దరిని, శనివారం ఉదయం ఎనిమిది మందిని కరిచింది. బాధితులను దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుల్లో మారుపాకుల పద్మ అనే మహిళ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. దీంతో గ్రామంలో భయాందోళనలు నెలకొన్నాయి. పిచ్చికుక్క గ్రామస్తులతో పాటు వీధికుక్కలను సైతం గాయపరిచింది.

గుర్రంగడ్డ.. కష్టాల అడ్డా!

రాష్ట్రంలోని ఏకైక దీవిలో ప్రజల దీనగాథ | **కృష్ణానది మధ్యలో ఉన్న గ్రామం** | **విద్య, వైద్యం, నిత్యావసరాలు ఏది కావాలన్నా నది దాటాల్సిన పరిస్థితి** | **వంతెన లేక అష్టకష్టాలు పడుతున్న జనం**

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: చుట్టూ కృష్ణా నది.. మధ్యలో ఊరు.. విద్య, వైద్యం, నిత్యావసరాలు ఏది కావాలన్నా, ఏదైనా ఆరోగ్య సమస్య వచ్చినా పడవలో నది దాటాల్సిందే. నది ఉప్పొంగే సమయంలో అయితే.. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సిందే.. తెలంగాణలోనే ఏకైక ద్వీపంగా పేరు పొందిన గుర్రంగడ్డ వాసుల పరిస్థితి ఇది. పాలకులు మారుతున్నా తమ బాధలు తీరడం లేదని.. వంతెన నిర్మాణం చేపట్టినా ఏళ్లకేళ్లుగా సాగుతూనే ఉందని గ్రామస్తులు వాపోతున్నారు.

సాహసం చేయాల్సిందే..

జోగుళాంబ గద్వాల జిల్లా పరిధిలో కృష్ణానది మధ్యలో గుర్రంగడ్డ ఉంది. గద్వాల నుంచి 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ దీవి వైశాల్యం సుమారు 2,400 ఎకరాలు. ఇక్కడ సుమారు 200 కుటుంబాలు నివసిస్తుండగా, జనాభా వెయ్యికి పైనే ఉంటుంది. గ్రామస్తులు ఇక్కడి 1,500 ఎకరాల్లో వేరుశనగ, వరి వంటి పంటలు సాగు చేస్తున్నారు. ఇక్కడ ప్రాథమిక పాఠశాల మాత్రమే ఉంది. ఆపై చదువుకోవాలన్నా, ఏదైనా అనారోగ్యానికి గురైనా, నిత్యావసరాలు కావాలన్నా, చివరికి రేషన్ సరుకుల కోసం కూడా.. నది దాటి వెళ్లాల్సిందే. ఏటా వానాకాలం మొదలై నదిలో ప్రవాహం పెరిగాక కష్టాలు మరింతగా పెరుగుతాయి. దీనితో ఇక్కడి పిల్లలు చదువుకు దూరమవుతున్నారు. ఇక ప్రతిదానికీ నది దాటాల్సి రావడంతో ఈ ఊరు పిల్లలను పెళ్లి చేసుకునేందుకు గానీ, ఊరి వారికి పిల్లను ఇచ్చేందుకు గానీ వెనుకాడే పరిస్థితి ఉందని.. ప్రస్తుతం 40 మందికి పైగా పెళ్లికాకుండా ఉన్నారని స్థానికులు అంటున్నారు.




బీరెల్లి నుంచి గుర్రంగడ్డకు వెళ్తున్న ప్రయాణికులు
గుర్రంగడ్డ గ్రామం

6 ఏళ్లుగా పిల్లర్ల దశలోనే వంతెన

గుర్రంగడ్డకు సుమారు ఆరేళ్ల కింద వంతెన మంజూరైంది. అప్పటి నుంచి నిర్మాణం సాగుతూనే ఉంది. ఏటా వానాకాలం ముందు పనులు ప్రారంభించడం, వరద పెరగగానే నిలిపివేయడం కాంట్రాక్టర్‌కు పరిపాటిగా మారిందని గ్రామస్తులు మండిపడుతున్నారు. పనుల్లో జాప్యంపై కాంట్రాక్టర్‌కు ఐదుసార్లు నోటీసులిచ్చామని, వచ్చే ఏడాది వానాకాలంలోపు వంతెన నిర్మాణం పూర్తిచేస్తామని ఇరిగేషన్ ఈఈ జుబేర్ అహ్మద్ తెలిపారు.



ఈ ఫొటోలోని మహిళ పేరు పద్మమ్మ. గుర్రంగడ్డకు చెందిన ఆమెకు అయిజ మండలం ఉప్పలకు చెందిన వెంకటేశ్‌తో 20 ఏళ్ల క్రితం వివాహమైంది. పుట్టింటికి రావాలంటే నది దాటాలి. దాంతో ఎప్పుడు వచ్చినా భర్తతో కలిసి వస్తుంది. నదికి వరద పోటెత్తితే.. బోట్లు నడవక కొన్నిరోజులు గ్రామంలోనే ఉండిపోవాల్సి వస్తుందని.. అందుకే ఎప్పుడో ఓసారి మాత్రమే వస్తున్నానని ఆవేదన వ్యక్తం చేస్తోంది.



ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని దాటుతున్నాం

గ్రామంలో ఆస్పత్రి లేదు. ఏ చిన్న చికిత్స కోసమైనా గద్వాలకు వెళ్లాలి. గర్భిణిగా ఉన్నప్పుడు, డెలివరీ అయ్యాక చెకప్ కోసం చిన్నారిని ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు.. ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని బోట్‌లో నది దాటాల్సి వచ్చింది. వరద వచ్చినప్పుడు ఏ సమస్య వచ్చినా కష్టమే.
- సంధ్య, గ్రామ మహిళ

బీసీలకు 42% రిజర్వేషన్లపై కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదు

బీఆర్‌ఎస్ నేతల ధ్వజం

సాక్షి, హైదరాబాద్: గ్రామపంచాయతీ, జిల్లా, మండల పరిషత్ ఎన్నికలకు బీసీ ఓటర్ల జాబితా రూపొందించకుండా..బీసీలకు 42% రిజర్వేషన్లపై కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ గురించి తేల్చకుండా..రాష్ట్ర ప్రభుత్వం మభ్యపెట్టే ప్రయత్నం చేస్తోందని బీఆర్‌ఎస్ నేతలు భరత్‌కుమార్ గుప్తా, పి.శశిధర్‌రెడ్డి, దూదిమెట్ల బాలరాజ్‌యాదవ్ విమర్శించారు. శనివారం ఎస్ఈసీ కార్యాలయంలో జరి గిన సమావేశ అనంతరం మీడియాతో మాట్లాడారు.

బీఆర్‌ఎస్ పనిగట్టుకొని విమర్శిస్తోంది : కాంగ్రెస్ నేత నిరంజన్

బీసీ రిజర్వేషన్ల కల్పనపై కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదంటూ బీఆర్‌ఎస్ నేతలు ప్రభుత్వాన్ని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని కాంగ్రెస్‌నేత గోపిశెట్టి నిరంజన్ మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పనకు కట్టుబడి ఉందని తెలిపారు.

42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి : బీజేపీ నేత చింతల

సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీకి అనుగుణంగా కులగణన నిర్వహించి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని బీజేపీ నేత చింతల రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. ఒకే ఇంటిలోని ఓట్లు ఒకే పోలింగ్ స్టేషన్‌లో, ఒకవార్డు ఓట్లు దాని పరిధిలోనే ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

- స్థానికసంస్థల ఎన్నికలపై సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రస్థాయి అఖిలపక్ష భేటీ నిర్వహించి అన్ని అంశాలపై స్పష్టత ఇవ్వాలని సీపీఐ నేత పల్లా వెంకటరెడ్డి తెలిపారు.

‘పంచాయతీ’ రిజర్వేషన్లు మారుతాయి

రాష్ట్రవ్యాప్తంగా 12,966 జీపీలు, 1,14,620 వార్డుల్లో ఎన్నికలు

స్థానిక ఎన్నికలపై రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సి.పార్థసారథి



సాక్షి, హైదరాబాద్: త్వరలో జరగబోయే గ్రామపంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్లు మారుతాయని రాష్ట్ర ఎన్నికల కమిషన్ రాజకీయ పార్టీలకు స్పష్టం చేసింది. వాస్తవానికి రెండు టర్మ్‌ల వరకు రిజర్వేషన్లు మారకుండా గత ప్రభుత్వం చట్టం చేసిన విషయం తెలిసిందే. అయితే కొత్త ఓటర్ల జాబితాలకు అనుగుణంగా మళ్లీ రిజర్వేషన్లు మారుతాయని, సామాజికవర్గాల రిజర్వేషన్లు మాత్రం సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం.. 50 శాతం మించరాదనే విషయంలో స్పష్టత ఉందని చెప్పింది. అయితే స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్ల ఖరారు అంశం రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోనిది అని, ప్రభుత్వపరంగా ఇచ్చే రిజర్వేషన్లను తాము అమలు చేయాల్సి ఉంటుందని తెలిపింది. క్షేత్రస్థాయిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ జనాభా దామాషాకు అనుగుణంగా రిజర్వేషన్లు ఖరారు చేయాలన్న ట్రిపుల్ టెస్ట్ పేరిట సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా రిజర్వేషన్ల మార్పులు చోటు చేసుకుంటాయని చెప్పింది. శనివారం రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయంలో పంచాయతీ ఎన్నికలకు సంబంధించి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి సమావేశ మయ్యారు. ఈ సందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ రాష్ట్రంలోని 12,966 గ్రామ పంచాయతీలు, వాటి పరిధిలోని 1,14,620 వార్డుల్లో ఎన్నికలకు ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల ఓటర్ల జాబితా ఆధారంగా ఎలాంటి మార్పులు లేకుండా గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితాను వార్డుల వారీగా తయారు చేసి సెప్టెంబర్ 6న ముసాయిదా జాబితాను గ్రామపంచాయతీల్లో ప్రకటిస్తారని వెల్లడించారు. 7వ తేదీ నుంచి 13 వరకు ముసాయిదా ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు స్వీకరించి, 19వతేదీలోగా జిల్లా పంచాయతీ అధికారి పరిష్కరించి.. 21న గ్రామ పంచాయతీ తుది ఓటర్ల జాబితాను వార్డుల వారీగా ప్రకటిస్తారని తెలిపారు. ఓటర్ల జాబితా ప్రచురణకు ఇచ్చిన ప్రకటనలో పేర్కొన్న విధంగా 9న జిల్లా స్థాయిలో, 10న మండల స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఓటరు ముసాయిదాలో లోపాలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తారని చెప్పారు.

కిలోమీటర్ పరిధిలోనే పోలింగ్ కేంద్రాలు ఉండాలి : పార్టీల ప్రతినిధులు

పోలింగ్‌స్టేషన్లు ఒక కిలోమీటర్ పరిధిలో ఉండేలా చూడాలని, ఓటర్ల జాబితాను గ్రామపంచాయతీలోని వార్డులుగా విభజించేటప్పుడు ఒకే కుటుంబానికి చెందిన వ్యక్తులు ఒకే వార్డులో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని రాజకీయ పార్టీల ప్రతినిధులు సూచించారు. అనుబంధ ఓటర్ల జాబితాలోని ఓటర్లను సంబంధిత వార్డుకు మాత్రమే అనుసంధానిస్తామని, కానీ చివరివార్డుకు కాదని కమిషనర్ తెలిపారు. గ్రామ, మండల స్థాయిలోని ప్రజాప్రతినిధులు ఓటర్లకు తగిన సూచనలు, సలహాలు చేసి వారితో అభ్యంతరాలు క్లెయిమ్ చేయించి.. వారిని ఓటు హక్కు వినియోగించుకోవాల్సిందిగా అవగాహన కల్పించాలని కోరారు. రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి అశోక్‌కుమార్ రాజకీయపార్టీ ప్రతినిధుల సందేహాలపై వివరణ ఇచ్చారు. ఈ సమావేశంలో గోపిశెట్టి నిరంజన్, పి.రాజేశ్‌కుమార్(కాంగ్రెస్), భరత్‌కుమార్ గుప్తా, పి.శశిధర్‌రెడ్డి, దుదిమెట్ల బాలరాజ్‌యాదవ్ (బీఆర్‌ఎస్) చింతల రామచంద్రారెడ్డి, రామారావు (బీజేపీ), పల్లా వెంకటరెడ్డి, ఎన్.బాలమల్లేష్ (సీపీఐ), ఎస్.నర్సింహారెడ్డి, నర్సింగరావు (సీపీఎం) బండ సురేందర్‌రెడ్డి (ఏఐఎఫ్‌బీ), ఇతర పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



మీతో సాక్షి

సమాజంలో ఇంటాబయట రకరకాల వేధింపులు ఎదుర్కొంటున్న మహిళలకు బాసటగా నిలిచేందుకు సాక్షి నిర్వహించిన ప్రత్యేక క్యాంపెయిన్ ‘మీతో సాక్షి’కి అనూహ్య స్పందన వచ్చింది. పెద్ద సంఖ్యలో బాధిత మహిళలు సమస్యలను ‘సాక్షి’ దృష్టికి తీసుకొచ్చారు. ఆ సమస్యల్లో కొన్నింటికి మహిళా భద్రత విభాగం డీజీ శిఖాగోయల్ నేరుగా సమాధానాలిచ్చారు.
- సాక్షి, హైదరాబాద్

మీ భద్రతకు మాది భరోసా

‘మీతో సాక్షి’తో మహిళా భద్రత విభాగం డీజీ శిఖాగోయల్

పలువురు మహిళలు అడిగిన ప్రశ్నలు, వాటికి శిఖాగోయల్ ఇచ్చిన సమాధానాలు..

ప్రశ్న: కోల్‌కతాలో ఓ జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం నేపథ్యంలో రాష్ట్రంలోని ఆసుపత్రుల్లో మహిళా డాక్టర్ల భద్రతతో పాటు మహిళా రోగులు, వారి సహాయకుల భద్రతకు మీరు తీసుకుంటున్న చర్యలు ఏమిటి?
- (అనురాధరావు, బాలలహక్కుల సంఘం)

జవాబు: ఆస్పత్రుల్లో భద్రతాపరమైన మౌలికవసతుల కల్పనపై దృష్టి పెట్టాం. అన్ని ఆస్పత్రుల వద్ద ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారా లేదా తెలుసుకొనేందుకు స్థానిక పోలీసుల ద్వారా సెక్యూరిటీ ఆడిట్‌లు నిర్వహిస్తున్నాం. ఆస్పత్రుల్లో ఇప్పటికే ఉన్న సీసీ కెమెరాలు పనిచేసేలా చర్యలు తీసుకుంటాం. ఆస్పత్రుల్లో భద్రత ప్రమాణాలు మెరుగుపర్చేందుకు తీసుకోవాల్సిన చర్యలపై త్వరలోనే కొన్ని మార్గదర్శకాలు విడుదల చేయనున్నట్లు కేంద్ర హోంశాఖ నుంచి మాకు సమాచారం అందింది. ఆ నిబంధనలు రాగానే ఆరోగ్య శాఖ అధికారులతో కలిసి వాటి అమలుకు చర్యలు తీసుకుంటాం. ఆస్పత్రుల వద్ద సెక్యూరిటీ సిబ్బందికి తగిన శిక్షణ ఇచ్చేలా యాజమాన్యాలతో సమన్వయం చేసుకుంటున్నాం. విమెన్ సేఫ్టీ వింగ్‌లో అత్యంత క్రియాశీలకంగా పనిచేసే సాహస్ మాడ్యూల్ ద్వారా పోష్ యాక్ట్ (ప్రివెన్షన్, ప్రొహిబిషన్ అండ్ రిడ్రెస్సల్)పై ప్రచారం కల్పిస్తున్నాం. ఆస్పత్రుల్లో లైంగిక వేధింపులను కట్టడిచేసేందుకు ‘సాహస్’ మాడ్యూల్ ద్వారా చర్యలు తీసుకుంటాం.



ప్రశ్న: హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనరేట్ల పరిధిలో గతంలో ఆటోలు, క్యాబ్‌లకు ప్రత్యేక నంబర్ ఇచ్చి అది ఆ వాహనం వెనుక డిస్‌ప్లే అయ్యేలా చేశారు. ఈమధ్య అది కనిపించట్లేదు. ఆటోలు, క్యాబ్‌ల డ్రైవర్ల వివరాలు పోలీసుల దృష్టిలో ఉండేలా మహిళా భద్రత విషయంలో ఏం చర్యలు తీసుకుంటారు?
- (హిమజ, ఓ కార్పొరేట్ కంపెనీ ఎండీ హైదరాబాద్)

జవాబు: రాష్ట్రంలోని అనేక జిల్లాలు, నగర యూనిట్లలో ‘మై ఆటో ఈజ్ సేఫ్’ ప్రచారం ఉంది. ఆటో డ్రైవర్ల వివరాలు పోలీసులు తనిఖీ చేసి ధ్రువీకరిస్తారు. ఆటోలలో పోలీసుల ఫోన్ నంబర్లు ఉండేలా చూస్తున్నాం. మై ఆటో ఈజ్ సేఫ్ కార్యక్రమం అంతటా అమలయ్యేలా చర్యలు తీసుకుంటాం. మీరు మీ ప్రయాణ సమయంలో సురక్షితంగా ఉండేలా డయల్ 100కు కాల్ చేసి అందులో 8 నొక్కడం ద్వారా ‘టీ–సేఫ్’ను ఎంచుకుంటే మీ ప్రయాణం పూర్తయ్యే వరకు పోలీసు పర్యవేక్షణ ఉంటుంది. https://womensafetywing. telang ana. gov. in/ women& safety& apps/ tsafe/ వెబ్‌సైట్‌లో లేదా టీ–సేఫ్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకొని అందులో మీ ప్రయాణ వివరాలు నమోదు చేసినా కూడా పోలీసులు మీ ప్రయాణం సురక్షితంగా పూర్తయ్యే వరకు పర్యవేక్షిస్తారు. ఏ సమస్య ఉన్నా వెంటనే రంగంలోకి దిగుతారు. టీ–సేఫ్ యాప్‌లో ఎస్ఓఎస్ బటన్ నొక్కినా వెంటనే పోలీసులు అప్రమత్తమవుతారు.

ప్రశ్న: ఆఫీసుల్లో మహిళా ఉద్యోగుల హక్కులు, వారి భద్రత వంటి అంశాలపై చర్చించేందుకు తరచూ సమావేశాలు నిర్వహించాలన్న నిబంధన ఉన్నా మా కార్యాలయంలో అలాంటి సమావేశాలు నిర్వహించట్లేదు. వర్క్ ప్లేస్‌లో వేధింపులు, టీజింగ్‌పై ఫిర్యాదు చేసేందుకు మహిళలు వెనకాడుతున్నారు. ఈ విషయంలో ఎవరిని సంప్రదించాలి?
- (నీలిమ, ఓ ఐటీ సంస్థ ప్రాజెక్టు మేనేజర్, గచ్చిబౌలి)

జవాబు: పనిప్రదేశాల్లో లైంగిక వేధింపులను నిరోధించేందుకు తెచ్చిన పోష్ యాక్ట్–2013 ప్రకారం ప్రతి కంపెనీలో ఇంటర్నల్ కమిటీ (ఐసీ) ఉండాలి. అందులో ప్రిసైడింగ్ అధికారి, ఆ కార్యాలయ సభ్యులు సహా బయటి నుంచి ఒక నిపుణుడితో కలిసి కమిటీ పనిచేయాలి. మీ కార్యాలయంలో ఆ కమిటీ పని చేయకపోతే మీరు మమ్మల్ని సంప్రదించొచ్చు. రాష్ట్రంలోని ఏ కార్యాలయంలోని సిబ్బంది అయినా ఫిర్యాదులు చేసేందుకు, శిక్షణ, అవగాహన కార్యక్రమాల నిర్వహణ కోసం మీరు మహిళా భద్రత విభాగంలోని సాహస్ మాడ్యూల్ సిబ్బందిని సంప్రదించొచ్చు. మీ అభ్యర్థన మేరకు నిపుణులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం.

ప్రశ్న: ఐడీఎఫ్‌సీ బ్యాంక్‌లో మాకు తెలిసిన వాళ్లు లోన్ తీసుకొని నా పేరు ష్యూరిటీగా పెట్టారు. ఆ డబ్బులు ఇప్పుడు మీరే కట్టాలని మూడు నంబర్ల నుంచి ఫోన్ చేసి విపరీతంగా వేధిస్తున్నారు. బూతులు మాట్లాడుతున్నారు. నాతోపాటు నా మరదలికి కూడా 9281162832, 6303523981, 6303249649 నంబర్ల నుంచి ప్రతిరోజూ కాల్స్ వస్తున్నాయి. మమ్మల్ని వేధిస్తున్న వ్యక్తులను కనిపెట్టి వారిపై చర్యలు తీసుకోవాలని మనవి.
- (ప్రియాంక)

జవాబు: మీరు వెంటనే మీ సమీప పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయండి. సైబర్ క్రైం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా వాళ్లు మీకు తగిన సాయం చేస్తారు.

ప్రశ్న: హైదరాబాద్‌లో స్వాగ్ అనే ఒక ఆఫీస్ (అది ఫేక్ కంపెనీ)లో జాబ్ ఉందని మా సిస్టర్ కాల్ చేస్తే ఉద్యోగం కోసం వెళ్లా. అక్కడ శ్యామ్ అనే వ్యక్తి నన్ను గదిలోకి తీసుకెళ్లి రేప్ చేశాడు. ఇప్పుడు నేను ఐదు నెలల గర్భవతిని. ఈ విషయం మా ఇంట్లో చెప్పాను. మా అమ్మ అతడితో మాట్లాడితే దబ్బిస్తా.. ప్రెగ్నెన్సీ తీయించాలని చెబుతున్నాడు. నన్ను మోసం చేసినట్లే శ్యామ్ ఎందరో ఆడపిల్లల జీవితాలతో ఆడుకుంటున్నాడు. నాకు ఇప్పుడు చావు తప్ప వేరే దారి లేదు. నాకు న్యాయం చేయండి..?
- (శ్రీజ)

జవాబు: మీరు వెంటనే మీ దగ్గరిలోని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయండి. మీకు మా నుంచి సహాయం కావాలంటే లక్డీకాపూల్‌లోని మహిళా భద్రత విభాగం కేంద్ర కార్యాలయంలో సంప్రదించండి. మీకు తగిన సూచనలతో పాటు న్యాయపరమైన అంశాల్లో సాయం అందిస్తాం.

ప్రశ్న: నాకు పెళ్లి అయ్యింది. ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈమధ్య ఎవరో ఒక వ్యక్తి నా భర్త మొబైల్‌కు నా గురించి చెడుగా మెసేజ్‌లు పంపుతున్నాడు. వాటిని నమ్మి నా భర్త వారం నుంచి నాతో గొడవపడుతున్నాడు. అవతలి వ్యక్తి ఎవరో కూడా నాకు తెలియదు. రోజూ గుర్తు తెలియని ఫోన్ నంబర్ల నుంచి నా భర్తకు ఫోన్లు చేసి నా గురించి చెడుగా చెబుతున్నాడు. దయచేసి చర్యలు తీసుకోగలరు..?
- (చందన, హనుమకొండ జిల్లా)

జవాబు: మీ సమస్యను మా అధికారులు పరిశీలిస్తున్నారు. తగిన చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: గుర్తుతెలియని ఈ–మెయిల్ ఐడీ ద్వారా నన్ను వేధిస్తున్నారు. నా వ్యక్తిత్వాన్ని దిగజార్చేలా సోషల్ మీడియాలో నా ఫ్రెండ్స్‌కు కూడా పోస్టులు పెడుతున్నారు. తగిన చర్యలు తీసుకోగలరు. (నిహారిక)

జవాబు: మహిళా భద్రత విభాగం మీ ఫిర్యాదును తీసుకుంది. వివరాల కోసం మా షీ–టీమ్స్ అధికారి సంప్రదిస్తారు.

ప్రశ్న: నాకు వివాహేతర సంబంధం అంటగట్టి వేధిస్తుంటే నా భర్తపై జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశా. పోలీసులు నా భర్తకు కౌన్సెలింగ్ ఇచ్చి పంపినా ఏదో రకంగా వేధిస్తున్నాడు. మా ఇంట్లో హిడెన్ కెమెరాలు పెట్టినట్టు నా అనుమానం. ఈ సమస్యల నుంచి బయటపడేలా నాకు పరిష్కారం చూపగలరు.
(హరిణి)

జవాబు..: మా టీం మిమ్మల్ని సంప్రదించినా హిడెన్ కెమెరాలకు సంబంధించి తగిన వివరాలు ఇవ్వలేకపోయారు.

అన్నం, పప్పులో పురుగులొస్తున్నా

సీఎంకు పట్టదా?

- విద్యార్థినులు రోడ్డెక్కి ధర్నా చేసినా రేవంత్ స్పందించకపోవడం సిగ్గుచేటు
- గతంలో కేసీఆర్ సన్న బియ్యం పెడితే ప్రస్తుతం గొడ్డుకారంతో భోజనం పెడుతున్నారు
- ఫెయిల్యూర్ సీఎంతోనే విద్యార్థులకు కష్టాలు: హరీశ్‌రావు
- సబితారెడ్డితో కలిసి పాల్మాకుల కేజీబీవీ సందర్శన.. విద్యార్థినుల సమస్యలపై ఆరా


విద్యార్థినులతో మాట్లాడుతున్న హరీశ్. చిత్రంలో సబిత, కార్తీక్

శంషాబాద్ రూరల్: ‘అన్నం, పప్పులో పురుగులు వస్తున్నాయని ఆడపిల్లలు రెండు కి.మీ. నడిచి జాతీయ రహదారిపై ధర్నా చేస్తే ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు స్పందనలేదు. విద్యార్థుల కన్నీళ్లు చూస్తుంటే ఏడుపొస్తోంది. దీనికి సీఎంరేవంత్‌రెడ్డి సిగ్గుపడాలి. ఫెయిల్యూర్ సీఎం కారణంగా రాష్ట్రంలో గురుకులాలు, మైనారిటీ విద్యా వ్యవస్థ కుంటుపడింది’ అని మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలంలోని పాల్మాకులలో ఉన్న కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని మాజీ మంత్రి పి.సబితారెడ్డితో కలిసి ఆయన సందర్శించారు. పాఠశాలలో నెలకొన్న సమస్యల గురించి విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. హరీశ్, సబిత రాకతో పిల్లలు వారి బాధలు చెప్పుకొని ఏడ్చారు. అనంతరం మీడియాతో వారు మాట్లాడారు.

కడుపు నిండా భోజనం పెట్టట్లేదు..

‘విద్యార్థినులకు కడుపు నిండా భోజనం లేదు. పుస్తకాలు, బోధన, కనీస సౌకర్యాలు లేవని విద్యార్థినులు బాధ పడుతున్నారు. ఆరో తరగతి వారికి ఒక జత యూనిఫాం మాత్రమే వచ్చినట్లు విద్యార్థినులు చెబుతున్నారు. ఇప్పటికీ పూర్తి స్థాయిలో పుస్తకాలు ఇవ్వలేదు. సమస్యల గురించి చెబితే వారిపట్ల ఉపాధ్యాయులు వ్యవహరించిన తీరు బాధాకరం. గతంలో కేసీఆర్ సన్న బియ్యంతో అన్నం పెడితే ప్రస్తుతం గొడ్డు కారంతో భోజనం పెడుతున్నారు. మెనూ ప్రకారం పిల్లలకు గుడ్లు, మాంసం పెట్టట్లేదు. సీఎం వద్ద విద్య, సాంఘిక సంక్షేమ శాఖలున్నా సమీక్షల్లేక అంతా అస్తవ్యస్తంగా మారింది. ఈ ప్రభు త్వం వచ్చాక కస్తూర్బా, గురుకులాలు, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ పాఠశాలలను నిర్లక్ష్యం చేస్తున్నారు’ అని హరీశ్‌రావు విమర్శించారు.

ప్రభుత్వానిది మొద్దునిద్ర..

సంక్షేమ పాఠశాలల్లో విషాహారం తిని 500 మంది పిల్లలు ఆస్పత్రులపాలైతే 38 మంది పిల్లలు చనిపోయారని హరీశ్‌రావు ఆరోపించారు. ఓవైపు ఎలుకలు, మరోవైపు పాముకాట్లకు పిల్లలు గురవుతుంటే ప్రభుత్వం మొద్దు నిద్రలో ఉందని మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో గురుకులాలు దేశానికి ఆదర్శంగా ఉండేవన్నారు. ముఖ్యమంత్రి మాటలు కాకుండా విద్యార్థుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. పాల్మాకులలో ఉపాధ్యాయులందరినీ బదిలీ చేసి పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెంచాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

విద్యావ్యవస్థను గాలికొదిలేశారు: సబితారెడ్డి

విద్యావ్యవస్థను ప్రభుత్వం గాలికొదిలేసిందని మాజీ మంత్రి పి.సబితారెడ్డి ఆరోపించారు. ఎంత బాధ ఉంటే పిల్లలు రోడ్డుపైకి వస్తారో ప్రభుత్వం ఆలోచించాలన్నారు. కలెక్టర్ ఇటువైపు చూసే తీరిక లేకుండా ఉన్నారని విమర్శించారు. ఈ ప్రభుత్వం వచ్చిన 8 నెలల్లో 800 వరకు పాఠశాలలు ఉపాధ్యా యుల్లేక మూతపడినట్లు వార్తలు వచ్చాయన్నారు. అంతకు ముందు మాజీ మంత్రులు పాఠశాలలోని వంటగది, తరగతి గదులను పరిశీలించారు. చక్రధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పాఠాలొద్దు.. ప్రాణాలే ముద్దు..

శిథిలమైన పాఠశాల భవనంలో ఎప్పుడే ప్రమాదం జరుగుతుందో తెలియడం లేదని కొడంగల్‌లోని దుద్యాల మండలం హస్నాబాద్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు వారు శుక్రవారం తరగతులు బహిష్కరించి పాఠశాల ఆవరణలో ఆందోళన చేపట్టారు. కనీ సం వర్షాకాలం ముగిసేవరకైనా.. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని చేతు లు జోడించి మొక్కుతూ వినూత్న నిరసన తెలిపారు. నిజాం రాజుల కాలంలో సుమారు వందేళ్ల క్రితం నిర్మించిన భవనం వర్షాలకు కారుతోందని వివరించారు. గోడలు తడిసి, గదుల నిండా నీళ్లు నిండుతున్నాయని వాపోయారు. తమ సమస్యను అనేకసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని వాపోయారు. ఆరు నుంచి పది తరగతులకు చెందిన 234 మంది ఈ పాఠశాలలో చదువుతున్నారు. వర్షం కురిస్తే ఎలాగూ తరగతులు జరగవనే ఉద్దేశంతో చాలామంది పాఠశాల వైపు కూడా రాకపోవడం గమనార్హం. –దుద్యాల

కేజీబీవీలో విద్యార్థులతో కలెక్టర్ భోజనం

సాక్షి, రంగారెడ్డి జిల్లా: శంషాబాద్ మండలం పాలమాకులలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని (కేజీబీవీ) కలెక్టర్ శశాంక శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థినులను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. వారికి అందిస్తున్న ఆహారంలో నాణ్యతను పరిశీలించారు. విద్యార్థినులతో కలిసి ఆయన భోజనం చేశారు. విద్యార్థినులు చెబుతున్న సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ వెంట జిల్లా విద్యాధికారి సుశీందర్ రావు ఉన్నారు.

800 బోగస్ సంస్థలు!

- వ్యాపారం చేయకుండా ఇన్‌వాయిస్‌లు పెట్టి ఐటీసీ కొట్టేస్తున్న డీలర్లు
- బోగస్ వ్యాపార సంస్థల కట్టడికి స్పెషల్‌డ్రైవ్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో 800 వరకు బోగస్ వ్యాపార సంస్థలు నడుస్తున్నాయని వాణిజ్య పన్నుల శాఖ గుర్తించింది. వీటిని అనుమానాస్పద డీలర్ల జాబితాలో చేర్చింది. ఎలాంటి వ్యాపార లావాదేవీలు నిర్వహించకుండానే బోగస్ ఇన్‌వాయిస్‌లు సృష్టించి ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) కొట్టేస్తున్న ఈ దొంగ డీలర్లను నియంత్రించేందుకు వాణిజ్య పన్నుల శాఖ చర్యలు చేపట్టింది. ఇందుకోసం ఆగస్టు 16వ తేదీన ప్రారంభించిన స్పెషల్ డ్రైవ్‌ను అక్టోబర్ 15 వరకు కొనసాగించాలని నిర్ణయించింది. జాయింట్ కమిషనర్ స్థాయి అధికారి నేతృత్వంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి బోగస్ వ్యాపార సంస్థల కట్టడికి చర్యలు తీసుకుంటోంది. కేంద్ర జీఎస్టీ పోర్టల్‌కు నెలవారీగా అప్‌లోడ్ చేసే రిటర్నుల ఆధారంగా ఈ బోగస్ సంస్థలను గుర్తించిన వాణిజ్య పన్నుల శాఖ, సదరు జాబితాలను సర్కిల్ అధికారులకు పంపిందని, ప్రతిసంస్థను జీఎస్టీ అధికారులు తనిఖీ చేసి, లభ్యమైన సమాచారం ఆధారంగా ఆయా సంస్థల డీలర్ షిప్ లైసెన్సులను రద్దు చేయడంతో పాటు క్రిమినల్ కేసులను నమోదు చేయాలని వాణిజ్య పన్నుల కమిషనర్ రిజ్వీ ఆదేశాలు జారీ చేశారని తెలిసింది. బోగస్ ఇన్‌వాయిస్‌లు ఇచ్చిన డీలర్లపై అపరాధ రుసుము కూడా విధించాలని ఆ ఆదేశాల్లో పేర్కొన్నారని సమాచారం.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.


● రజనీకాంత్

ఎర పడాల్సిందే!

గురి పెడితే... ఎర పడాల్సిందే అంటున్నాడు వేట్టయాన్. రజనీకాంత్ హీరోగా 'జై భీమ్' ఫేమ్ టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలో రూపొందిన సినిమా 'వేట్టయాన్'. ఈ చిత్రంలో అమితాబ్ బచ్చన్, ఫాహద్ ఫాజిల్, రానా, మంజు వారియర్ ఇతర లీడ్ రోల్స్‌లో నటించారు. ఈ చిత్రంలో పోలీసాఫీసర్‌గా రజనీకాంత్ నటించగా, లాయర్ పాత్రలో అమితాబ్ బచ్చన్ కనిపిస్తారని కోలీవుడ్ సమాచారం. ఇక ఈ చిత్రం ఫేక్ ఎన్‌కౌంటర్స్ నేపథ్యంలో ఉంటుందని, అందుకే ఈ సినిమాకు 'వేట్టయాన్' (తెలుగులో 'వేటగాడు' అని అర్థం) అనే టైటిల్ పెట్టారని తెలుస్తోంది. తాజాగా 'వేట్టయాన్' సినిమా డబ్బింగ్ పనులను ప్రారంభించారు రజనీకాంత్. ఆయన డబ్బింగ్ చెబుతున్న వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేసింది చిత్రబృందం. ఇక దసరా పండగ సందర్భంగా తమిళ, తెలుగు, హిందీ, కన్నడ భాషల్లో 'వేట్టయాన్' చిత్రం అక్టోబరు 10న రిలీజ్ కానుంది.

38 ఏళ్ల తర్వాత....



రజనీకాంత్, సత్యరాజ్ కలిసి నటించిన చిత్రం 'మిస్టర్ భారత్'. 1986లో విడుదలైన ఈ సినిమాలో రజనీకాంత్, సత్యరాజ్ తండ్రీకొడుకులుగా నటించారు. ఆ తర్వాత మళ్లీ ఈ ఇద్దరూ కలిసి మరో సినిమాలో నటించలేదు. కాగా 38 ఏళ్ల తర్వాత 'కూలీ' సినిమాలో రజనీకాంత్, సత్యరాజ్ మళ్లీ స్క్రీన్ షేర్ చేసుకున్నారు. 'కూలీ' సినిమాలోని రాజశేఖర్ పాత్రలో సత్యరాజ్ నటిస్తున్నట్లుగా వెల్లడించి, ఆయన ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. ఇక ఈ సినిమాలో సైమన్‌గా నాగార్జున, ప్రీతిగా శ్రుతీహాసన్ కనిపిస్తారు. లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో సన్ పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది రిలీజ్ కానుంది.

మస్తీ.. మస్తీ...

విజయ్ హీరోగా నటించిన తాజా చిత్రం 'జీవోఏటీ: ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్'. విజయ్ ద్విపాత్రాభినయంలో నటించిన ఈ సినిమాలో మీనాక్షీ చౌదరి హీరోయిన్‌గా నటించారు. వెంకట్ ప్రభు దర్శకత్వంలో ఏజీఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ నిర్మించిన ఈ సినిమా సెప్టెంబరు 5న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమాలోని 'మస్తీ మస్తీ రాజా మస్తీ


● విజయ్

కాలరెత్తాడంటే సీనే జాస్తి ... మస్తీ మస్తీ రాజా మస్తీ....' అంటూ సాగే 'మస్తీ మస్తీ' పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు మేకర్స్. ఈ తెలుగు వెర్షన్ పాటకి రామజోగయ్య శాస్త్రి లిరిక్స్ రాయగా, యువన్ శంకర్ రాజా, షేన్ బాగరాజ్, వేలు, సామ్, నారాయణ్ రవిశంకర్ గాత్రం ఇచ్చారు. ప్రశాంత్, ప్రభుదేవా, అజ్మల్ అమీర్ ఇతర లీడ్ రోల్స్‌లో నటించిన ఈ సినిమాకు యువన్ శంకర్ రాజా సంగీతం అందించారు.

బాలీవుడ్ నుంచి ఎక్కువగా హీరోయిన్లు టాలీవుడ్‌కి వస్తుంటారు. ఈసారి పలువురు నటులు తెలుగు తెరకు పరిచయం కానున్నారు. ఈ ఏడాది ఇప్పటికే కొందరు నటులు, నటీమణులు కనిపించగా... త్వరలో రానున్న బాలీవుడ్ స్టార్స్ గురించి తెలుసుకుందాం.

బాలీ టు టాలీ వుడ్


● జాన్వీ కపూర్
● అక్షయ్ కుమార్
● బాబీ డియోల్
● ఇమ్రాన్ హష్మి

కన్నప్పతో ఎంట్రీ

బాలీవుడ్ స్టార్ హీరో అక్షయ్ కుమార్ హిందీలో వరుస సినిమాలతో ఫుల్ బిజీగా దూసుకెళుతున్నారు. ఆయన తొలిసారి తెలుగులో ఎంట్రీ ఇస్తున్న చిత్రం 'కన్నప్ప'. హీరో మంచు విష్ణు కలల ప్రాజెక్టుగా ప్రతిష్ఠాత్మకంగా రూపొందుతోన్న చిత్రమిది. ఈ మూవీకి 'మహాభారత్' సిరీస్ ఫేమ్ ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నారు. అవా ఎంటర్‌టైన్‌మెంట్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ బ్యానర్‌లపై మంచు మోహన్‌బాబు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న ఈ మూవీలో పలు భాషలకు చెందిన స్టార్ హీరోలు, ప్రముఖ నటీనటులు నటిస్తున్నారు. ప్రభాస్, మోహన్‌బాబు, మోహన్ లాల్, శరత్‌కుమార్, బ్రహ్మానందం, కాజల్ అగర్వాల్, మధుబాల, ప్రీతీ ముకుందన్ వంటి వారు ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. కాగా 'కన్నప్ప' చిత్రంలో అక్షయ్ కుమార్ కీలకమైన అతిథి పాత్రలో నటించారు. ఇప్పటికే తన పాత్రకు సంబంధించిన చిత్రీకరణ కోసం హైదరాబాద్‌కి వచ్చి, తన పాత్ర షూటింగ్‌ని అక్షయ్ కుమార్ పూర్తి చేసి వెళ్లారు. అక్షయ్ వంటి స్టార్ హీరో 'కన్నప్ప'లో భాగస్వామ్యం కావడంతో ఈ సినిమాపై బాలీవుడ్ లోనూ ఆసక్తి నెలకొంది. అయితే అక్షయ్ కుమార్ ఏ పాత్రలో నటించారు? అనే విషయాన్ని చిత్రయూనిట్ ఇప్పటి వరకూ స్పష్టం చేయలేదు. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో రూపొందుతోన్న 'కన్నప్ప' డిసెంబరులో ప్రేక్షకుల ముందుకు రానుంది.

వీరమల్లుతో పోరాటం

గత కొన్నేళ్లుగా బాబీ డియోల్ కెరీర్ ఆశాజనకంగా సాగడం లేదు. అయితే సందీప్ రెడ్డి వంగా దర్శకత్వం వహించిన 'యానిమల్' (2023) సినిమా తర్వాత ఈ బాలీవుడ్ నటుడి క్రేజ్ ఒక్కసారిగా ఊపందుకుంది. ఆ సినిమాలో ఆయన నటించిన విలన్ పాత్రకి అద్భుతమైన పేరు రావడంతో విపరీతమైన డిమాండ్ పెరిగింది. హిందీలోనే కాదు.. తెలుగు, తమిళ భాషల నుంచి కూడా అవకాశాలు వెతుక్కుంటూ వెళుతున్నాయి. ఆయన నటిస్తున్న తొలి స్ట్రయిట్ తెలుగు చిత్రం 'హరి హర వీరమల్లు'. పవన్ కల్యాణ్, నిధీ అగర్వాల్ జంటగా నటిస్తున్నారు. క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో ఈ మూవీ ప్రారంభమైంది. అయితే ఈ ప్రాజెక్టు ఆలస్యం అవుతుండటంతో ఆయన తప్పుకున్నారట. దీంతో నిర్మాత ఏఎమ్ రత్నం తనయుడు జ్యోతికృష్ణ దర్శకత్వ బాధ్యతలు చేపట్టారని సమాచారం. ఏఎమ్ రత్నం, ఎ. దయాకర్ రావు నిర్మిస్తున్న ఈ సినిమా పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా రూపొందుతోంది. 17వ శతాబ్దం నాటి మొఘలాయిలు, కుతుబ్ షాహీల శకం నేపథ్యంలో సాగే ఈ సినిమాలో మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు పాత్రలో బాబీ డియోల్ నటిస్తున్నారు. ఈ సినిమా ఈ ఏడాది డిసెంబరులో విడుదల కానుందని టాక్. ఇదిలా ఉంటే బాలకృష్ణ హీరోగా బాబీ (కేఎస్ రవీంద్ర) దర్శకత్వం వహిస్తున్న 'ఎన్‌బీకే 109' (వర్కింగ్ టైటిల్) సినిమాలోనూ బాబీ డియోల్ నటిస్తున్నారు.

ఓమీ భాయ్

బాలీవుడ్ సీరియల్ కిస్సర్‌గా పేరు తెచ్చుకున్నారు ఇమ్రాన్ హష్మీ. హీరోయిన్లతో ముద్దు సన్నివేశాలు, రొమాంటిక్ సన్నివేశాల్లో నటిస్తూ తనకంటూ ప్రత్యేకమైన ఫాలోయింగ్‌ని సొంతం చేసుకున్న ఆయన తొలిసారి తెలుగులో నటిస్తున్న చిత్రం 'ఓజీ'. పవన్ కల్యాణ్, ప్రియాంకా అరుళ్ మోహన్ జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి సుజీత్ దర్శకత్వం వహిస్తున్నారు. డీవీవీ దానయ్య నిర్మిస్తున్న ఈ సినిమాలో పవర్‌ఫుల్ విలన్ పాత్రలో నటిస్తున్నారు ఇమ్రాన్ హష్మీ. మార్చిలో ఇమ్రాన్ హష్మీ పుట్టినరోజుని పురస్కరించుకుని, ఈ చిత్రంలో ఆయన చేస్తున్న ఓమీ భాయ్ పాత్రని పరిచయం చేస్తూ, ఫస్ట్ లుక్‌ని విడుదల చేసింది చిత్రబృందం. తన లుక్‌పై ఇమ్రాన్ హష్మీ 'ఓజీ' సినిమాలోని ఓ డైలాగ్‌తో స్పందించారు. 'గంభీరా... నువ్వు తిరిగి బాంబే వస్తున్నావని విన్నా. ప్రామిస్... ఇద్దరిలో ఒకరి తలే మిగులుతుంది' అంటూ ట్వీట్ చేశారాయన. ఇక గూఢచారితోనూ తెరపై కనిపించనున్నారు ఇమ్రాన్. అడివి శేష్ నటించిన హిట్ మూవీ 'గూఢచారి' (2018)కి సీక్వెల్‌గా రూపొందుతోన్న చిత్రం 'జీ 2' (గూఢచారి 2). వినయ్ కుమార్ సిరిగినీడి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని టీజీ విశ్వప్రసాద్, అనీల్ సుంకర, అభిషేక్ అగర్వాల్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాలోనూ ఇమ్రాన్ హష్మీ నటిస్తున్నారు. ఆయన నటిస్తున్న రెండో తెలుగు చిత్రం 'జీ 2'. ఈ మూవీలో ఆయన ఏ పాత్రలో నటిస్తున్నారు? అనేది తెలియాల్సి ఉంది. ఈ ఏడాదిలోనే ఈ సినిమా రిలీజ్ కానుందని టాక్.

దేవరతో జోడీ

అతిలోక సుందరి శ్రీదేవి తెలుగు ప్రేక్షకుల మదిలో ఎప్పటికీ గుర్తుండిపోయే పాత్రలు చేశారు. ఆమె కుమార్తె జాన్వీ కపూర్ బాలీవుడ్‌లో సినిమాలు చేస్తున్నారు. అయితే ఆమె తెలుగు సినిమాల్లో నటిస్తే చూడాలని ఉందని శ్రీదేవి అభిమానులు ఎప్పటి నుంచో వేచి చూస్తున్నారు. వారి నిరీక్షణ ఫలించనుంది. 'దేవర' చిత్రం ద్వారా తెలుగులో హీరోయిన్‌గా పరిచయమవుతున్నారు జాన్వీ కపూర్. ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందుతోంది. నందమూరి కల్యాణ్‌రామ్ సమర్పణలో మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ .కె నిర్మిస్తున్న ఈ సినిమా రెండు భాగాలుగా రూపొందుతోంది. ఈ చిత్రం నుంచి విడుదలైన 'చుట్టమల్లే చుట్టేస్తాంది తుంటరి చూపు..' పాటలో జాన్వీ కపూర్ ఫుల్ గ్లామరస్‌గా కనిపించడంతో ఈ సాంగ్ ఇప్పటికే ఫుల్ ట్రెండింగ్‌లో ఉంది. మరి సినిమా విడుదల తర్వాత జాన్వీకి ఎంతమంది ఫ్యాన్స్ అవుతారో వేచి చూడాలి. కాగా 'దేవర' తొలి భాగం సెప్టెంబరు 27న విడుదల కానుంది. ఈ సినిమా నిర్మాణంలో ఉండగానే జాన్వీకి మరో తెలుగు సినిమాలో నటించే అవకాశం వచ్చింది. వెండితెరపై చిరంజీవి–శ్రీదేవిలది సూపర్ జోడీ. వారి వారసులు చిరంజీవి–జాన్వీ కపూర్ తొలిసారి జంటగా నటిస్తున్న చిత్రం 'ఆర్‌సీ 16' (వర్కింగ్ టైటిల్). 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ సినిమాలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. తెలుగులో ఆమెకు ఇది రెండవ చిత్రం. ఒకప్పటి హిట్ జోడీ అయిన చిరంజీవి–శ్రీదేవిల వారసులు రామ్‌చరణ్–జాన్వీ కపూర్ నటిస్తున్న ఈ పాన్ ఇండియా సినిమాపై ఇండస్ట్రీ వర్గాల్లో, సినీ అభిమానుల్లో ఫుల్ క్రేజ్ నెలకొంది.

బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ కూడా ప్రస్తుతం తెలుగు సినిమాలపై దృష్టి పెట్టారు. 1998లో విడుదలైన హీరో నాగార్జున 'చంద్రలేఖ' సినిమాలో తొలిసారి అతిథి పాత్రలో కనిపించారు సంజయ్ దత్. దాదాపు ఇరవైఆరేళ్ల తర్వాత ఆయన పూర్తి స్థాయిలో నటించిన తెలుగు సినిమా 'డబుల్ ఇస్మార్ట్'. పూరి జగన్నాథ్ దర్శకత్వంలో రామ్ హీరోగా నటించిన ఈ చిత్రం ఆగస్టు 15న విడుదలైంది. విలన్ బిగ్ బుల్ పాత్రలో తనదైన నటనతో ఆకట్టుకున్నారు సంజయ్ దత్. ఆయన నటిస్తున్న మరో తెలుగు చిత్రం 'రాజా సాబ్'. ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలోనూ ఆయన కీలక పాత్రలో నటిస్తున్నారు. ఇదిలా ఉంటే 'ఆదిపురుష్' (తెలుగు–హిందీ) సినిమాతో తెలుగులో పరిచయమైన సైఫ్ అలీఖాన్ ప్రస్తుతం ఎన్టీఆర్ హీరోగా నటిస్తున్న 'దేవర' చిత్రంలో నటిస్తున్నారు. అలాగే బాలీవుడ్ బ్యూటీ దీపికా పదుకోన్ టాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చిన చిత్రం 'కల్కి 2898 ఏడీ'. ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం తొలి భాగం జూన్ 27న విడుదలైంది. ఈ సినిమా రెండో భాగంలోనూ దీపిక నటించనున్నారు. వెర్సటైల్ యాక్టర్‌గా పేరొందిన నవాజుద్దీన్ సిద్ధిఖీ కూడా ఈ ఏడాది 'సైంధవ్' చిత్రం ద్వారా తెలుగుకి పరిచయమయ్యారు. వికాస్ మాలిక్‌గా విలన్ పాత్రలో తనదైన శైలిలో అలరించారాయన. ఇలా ఈ ఏడాది ఇప్పటికే పలువురు బాలీవుడ్ స్టార్స్ తెలుగుకి పరిచయం కాగా... మరెందరో రానున్నారు.


పదేళ్లు అవకాశాలు రాకుండా చేశారు
– కంగనా రనౌత్


● కంగనా రనౌత్

"సినిమా పరిశ్రమలో దాదాపు పదేళ్ల పాటు నాకు అవకాశాలు రాకుండా కొంతమంది కుట్రలు చేశారు. వారి వేధింపులు తట్టుకోలేక ఆ సమయంలో దేశం విడిచిపెట్టి వెళ్లాలనుకున్నాను" అని నటి, మండీ లోక్‌సభ ఎంపీ కంగనా రౌత్ అన్నారు. ఆమె లీడ్ రోల్‌లో నటించి, దర్శకత్వం వహించిన తాజా చిత్రం 'ఎమర్జెన్సీ'. ఈ నెల 6న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ చిత్రం ప్రమోషన్‌లో భాగంగా తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న కంగనా రనౌత్ తన కెరీర్‌లో ఎదుర్కొన్న ఇబ్బందుల గురించి కీలక విషయాలు వెల్లడించారు. "సినిమా పరిశ్రమ అంటే నాకు చిన్నప్పటి నుంచి ఎంతో ఇష్టం. ఎప్పటికైనా మంచి హీరోయిన్ కావాలనే ఆశతో 2004లో ముంబైకి వచ్చాను. 2005–06లో 'గ్యాంగ్‌స్టర్', 'వో లమ్హే' సినిమాల్లో నటించాను. మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన సూపర్ మోడల్, గ్యాంగ్‌స్టర్ వంటి ఎన్నో పాత్రలు పోషించాను. నా నటనకు మంచి ప్రశంసలు దక్కాయి. పొగడ్తలు పక్కన పెడితే దాదాపు పదేళ్ల పాటు నాకు అవకాశాలు లేక ఇబ్బందులు ఎదుర్కొన్నా. ఎన్నో ప్రయత్నాలు చేసినా ఛాన్సులు దొరకలేదు. నాకు అవకాశాలు రాకపోవడానికి కారణం బాలీవుడ్ మాఫియా అని అర్థం అయ్యింది. ఒకానొక సమయంలో దేశమే నన్ను బహిష్కరించిందనిపించింది.. విదేశాలకు వెళ్లిపోవాలనుకున్నాను. అమెరికాకు వెళ్లిపోయి ఓ షార్ట్ ఫిలిం కూడా తీశాను. అయితే 2014లో విడుదలైన 'క్వీన్' సినిమా నా కెరీర్‌ను మలుపు తిప్పింది" అని కంగనా తెలిపారు. ఇంకా ఆమె మాట్లాడుతూ– "నాకు నటించడం సులభం. కానీ, నటిగా చేయడం పెద్దగా ఇష్టం లేదు. డైరెక్టర్‌గా ఉండటం ఇష్టం. నటిగా ఉంటే సెట్స్‌లో ఏం జరుగుతుందో పూర్తిగా తెలియదు. అదే డైరెక్టర్‌గా ఉంటే పూర్తి విషయాలు తెలుస్తాయి. పైగా సెట్స్‌లో డైరెక్టర్‌కు ఎక్కువ గౌరవం ఉంటుంది" అన్నారు.

మళ్లీ భయపెట్టడానికి...

గత హిట్ చిత్రాలు రీ రిలీజ్‌ల రూపంలో మళ్లీ ప్రేక్షకుల ముందుకు వస్తున్న విషయం తెలిసిందే. అలా బాలీవుడ్ హారర్ మూవీ 'తుంబాడ్' మళ్లీ విడుదల కానుంది. రాహీ అనిల్ బార్వే దర్శకత్వంలో ఈ చిత్రాన్ని సోహమ్ షా, ఆనంద్ ఎల్. రాయ్, అమిత్ షా... ఇలా నలుగురైదుగురు కలిసి నిర్మించారు. ఆర్థిక సమస్యలతో డబ్బు దొరికినప్పుడల్లా షూటింగ్ చేసి, దాదాపు ఆరేళ్ల పాటు నిర్మించారు. 2018లో విడుదలైన ఈ హారర్ మూవీ ప్రేక్షకులను ఎంత భయపెట్టాలో అంత పెట్టింది. ఆ తర్వాత కరోనా లాక్‌డౌన్‌లో ఓటీటీలో విడుదలై, మంచి వ్యూస్ రాబట్టుకుంది. ఇప్పుడు ఈ చిత్రం మళ్లీ విడుదల కానుంది. ఈ నెల 13న దేశంలోని పలు చోట్ల 'తుంబాడ్' విడుదల కానుంది.



కశ్మీర్‌లో ఆల్ఫా


● శార్వరి

ఆలియా భట్, శార్వరీ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న స్పై యాక్షన్ ఫిల్మ్ 'ఆల్ఫా'. శివ్ రవైల్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. వైఆర్‌ఎఫ్ (యశ్ రాజ్ ఫిలింస్) స్పై యూనివర్స్‌లో భాగంగా ఈ మూవీని ఆదిత్యా చోప్రా నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ కశ్మీర్‌లో జరుగుతోంది. ఆలియా, శార్వరీ పాల్గొనగా కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ముఖ్యంగా యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారని బాలీవుడ్ సమాచారం. అంతేకాదు... ఈ సినిమాలో హృతిక్ రోషన్ ఓ అతిథి పాత్ర చేయనున్నారని, ఆయన పాత్ర తాలూకు సన్నివేశాల చిత్రీకరణను కూడా ఈ షూటింగ్ షెడ్యూల్‌లోనే ప్లాన్ చేశారని బాలీవుడ్ టాక్. ఈ సినిమాను వచ్చే ఏడాది రిలీజ్ చేయాలనుకుంటున్నారు.

బిజినెస్ రీల్

గ్రామీణ విద్యకు వాయిస్ టెక్నాలజీ దన్ను

అమెజాన్ ఇండియా డైరెక్టర్ దిలీప్



న్యూఢిల్లీ: గ్రామీణ ప్రాంతాల్లో విద్యా బోధనలో వాయిస్ టెక్నాలజీ కీలక పాత్ర పోషించగలదని అమెజాన్ ఇండియా డైరెక్టర్ (అలెక్సా) ఆర్ఎస్ దిలీప్ తెలిపారు. అయితే, ఇప్పటికీ దీని ఉపయోగం గురించి చాలా మందికి తెలియదని, ఈ నేపథ్యంలోనే అవగాహన కల్పన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. నాగాలాండ్‌లోని కొన్ని ప్రభుత్వ పాఠశాల్లో అలెక్సా ఎనేబుల్డ్ ఎకో స్మార్ట్ స్పీకర్లను ఉపయోగిస్తుండటమనేది వాయిస్ టెక్నాలజీ వల్ల చేకూరే ప్రయోజనాలను తెలుసుకునేందుకు తోడ్పడగలదని చెప్పారు. చదువుపై విద్యార్థుల్లో ఆసక్తి పెరగడానికి కూడా ఈ సాంకేతికత దోహదపడుతోందని దిలీప్ పేర్కొన్నారు. వాయిస్ టెక్నాలజీ మెరుగుపడే కొద్దీ విద్యారంగంలో మరిన్ని వినూత్న సాధనాలు అందుబాటులోకి రాగలవని, గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభ్యాసం రూపురేఖలు మార్చగలవని ఆయన చెప్పారు.

నెట్‌వర్క్ విస్తరిస్తున్న పాలసీబజార్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: బీమా ఉత్పత్తులను పంపిణీ చేసేందుకు పాయింట్ ఆఫ్ సేల్స్ పర్సన్స్ (పీవోఎస్‌పీ) అడ్వైజర్ల నెట్‌వర్క్‌ను పెంచుకుంటున్నట్లు పాలసీబజార్.కామ్ తెలిపింది. కంపెనీకి పీబీపార్ట్‌నర్స్ పేరుతో ఇప్పటికే దేశవ్యాప్తంగా 1,35,000 పైచిలుకు పీవోఎస్‌పీలు ఉన్నారు. వీరిలో తెలుగు రాష్ట్రాల్లో 12,000కుపైగా అడ్వైజర్స్ ఉన్నారని పీబీపార్ట్‌నర్స్ మోటార్ ఇన్సూరెన్స్ అసోసియేట్ డైరెక్టర్, సేల్స్ హెడ్ అమిత్ భడోరియా తెలిపారు. 2029–30 నాటికి దేశవ్యాప్తంగా వీరి సంఖ్యను 8 లక్షలకు పెంచుకుంటామని వెల్లడించారు. ఇందులో 5 లక్షల మంది చిన్న పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల నుంచి ఉంటారని వివరించారు. పీవోఎస్‌పీ నెట్‌వర్క్‌ను భారత్‌లో అన్ని పిన్‌కోడ్స్‌కు విస్తరించాలన్నది లక్ష్యమని తెలిపారు. బీమా ఉత్పత్తులను ప్రజలకు చేర్చడంలో పీవోఎస్‌పీలు ముఖ్య భూమిక పోషిస్తున్నారని అన్నారు.

టయోటా వాహనాలకు యూనియన్ బ్యాంక్ రుణం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ సంస్థ టయోటా కిర్లోస్కర్ మోటార్ తాజాగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా టయోటా వాహనాల కొనుగోలుకై కస్టమర్లకు సమగ్ర రుణ సౌకర్యాన్ని బ్యాంకు కల్పించనుంది. ఆన్‌రోడ్ ధర్పై 90 శాతం వరకు లోన్ సమకూరుస్తారు. యూనియన్ వెహికిల్ స్కీమ్ కింద 84 నెలల వరకు ఈఎంఐ సౌకర్యం ఉంది. యూనియన్ పరివాహన్ స్కీమ్‌లో భాగంగా వాణిజ్య వాహనాలకు 60 నెలల వరకు వాయిదాలు ఆఫర్ చేస్తారు. అన్ని రకాల టయోటా వాహనాలకు కొత్త స్కీమ్ వర్తిస్తుందని కంపెనీ తెలిపింది.

బజాజ్ అలయంజ్ లైఫ్ ఏయూఎం

రూ. 1.17 లక్షల కోట్లకు

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో ప్రైవేట్ రంగ జీవిత బీమా సంస్థ బజాజ్ అలయంజ్ లైఫ్ ఇన్సూరెన్స్ మెరుగైన ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. క్యూ1లో ఇండివిడ్యువల్ రేటెడ్ న్యూ బిజినెస్ (ఐఆర్ఎన్‌బీ) 26 శాతం పెరిగి రూ. 1,028 కోట్ల నుంచి రూ. 1,294 కోట్లకు చేరింది. నిర్వహణలోని అసెట్స్ పరిమాణం 23 శాతం వృద్ధి చెంది రూ. 1,16,966 కోట్లకు పెరిగింది. లాభం రూ. 97 కోట్లుగా నమోదైంది. దేశవ్యాప్తంగా 545 శాఖలు, 1.53 లక్షల మంది ఏజెంట్లు, పాతిక వేల మంది పైగా ఉద్యోగులతో కస్టమర్లకు విస్తృతంగా సేవలు అందిస్తున్నట్లు సంస్థ ఎండీ తరుణ్ చుగ్ తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

1-9-2024	
విశాఖ	515–00
చిత్తూరు	508–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	505–00
విజయవాడ	505–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	495–00
వరంగల్	497–00
రిటైల్ ధర	5.55

వేతనాల్లో..ఐటీ కన్నా జీసీసీలే మిన్న!

- 12-20 శాతం అధికంగా వార్షిక ప్యాకేజీలు
- జీసీసీల్లో సిబ్బంది సంఖ్య 16 లక్షల పైనే
- వచ్చే ఐదేళ్లలో మరో 800 కొత్త సెంటర్ల ఏర్పాటు
- ద్వితీయ శ్రేణి నగరాలపైనా ఫోకస్

విదేశీ కంపెనీలు భారత్‌లో పోలోమంటూ ఏర్పాటు చేస్తున్న గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు (జీసీసీలు).. అదిరిపోయే వేతన ప్యాకేజీలతో టెక్ సిబ్బందిని ఆకర్షిస్తున్నాయి. భారీ విస్తరణ బాట నేపథ్యంలో టెక్ నిపుణులకు జీసీసీల నుంచి డిమాండ్ పెరుగుతోంది. మరోపక్క, జీతాల విషయంలో జీసీసీలతో పోలిస్తే సంప్రదాయ ఐటీ సేవల కంపెనీలు వెనుకబడుతుండటం గమనార్హం.



దేశంలో ప్రస్తుతం 1,600కు పైగా గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు (జీసీసీ) కార్యకలాపాలు సాగిస్తున్నాయి. వాటిలో 16.6 లక్షల మందికి పైగానే నిపుణులు పనిచేస్తున్నారు. ఐటీ కంపెనీల్లోని టెకీలతో పోలిస్తే అవే విధుల్లో పనిచేస్తున్న జీసీసీ ఉద్యోగులకు 12–20 శాతం మేర అధిక వేతనాలు లభిస్తున్నాయి. అంతేకాదు, టెక్నాలజీ యేతర కంపెనీల్లో పనిచేస్తున్న నిపుణులతో పోల్చినా కూడా జీసీసీల్లోనే భారీ వేతన ప్యాకేజీలు దక్కుతుండం విశేషం. టీమ్‌లీజ్ డిజిటల్ నివేదిక ప్రకారం సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్–ఇంజినీరింగ్, సైబర్ సెక్యూరిటీ, నెట్‌వర్క్ అడ్మినిస్ట్రేషన్, డేటా మేనేజ్‌మెంట్–ఎనలిటిక్స్, క్లౌడ్ సొల్యూషన్స్, ఎంటర్‌ప్రైజ్ అప్లికేషన్స్ తదితర విభాగాల్లో ఎంట్రీ, మిడ్, సీనియర్ స్థాయిల్లో కూడా జీసీసీలు ప్యాకేజీల్లో 'టాప్' లేపుతున్నాయి. మెరుగైన జీతాల నేపథ్యంలో జీసీసీల్లోకి వలసలు కూడా భారీగా పెరిగేందుకు దారితీస్తోంది. ఉదాహరణకు సాఫ్ట్‌వేర్ డెవలపర్, ఏఐ/ఎంఎల్ ఇంజినీర్స్ జాబ్స్‌నే తీసుకుంటే, జీసీసీల్లో ఎంట్రీ లెవెల్ ఉద్యోగి వార్షిక వేతనం రూ.9.7 లక్షలు కాగా, సీనియర్ లెవెల్ సిబ్బంది ప్యాకేజీ రూ.43 లక్షల్లో ఉంది. ఐటీ కంపెనీలను పరిశీలిస్తే, అవే విధులకు గాను ఎంట్రీ లెవెల్ ప్యాకేజీ రూ.5.7 లక్షల నుండి సీనియర్లకు గరిష్ఠంగా 17.9 లక్షలుగా ఉండడటం గమనార్హం.


విస్తరణ జోరు..

2025 నాటికి జీసీసీల సంఖ్య 1900కు పెరగనుంది. సిబ్బంది 20 లక్షలను మించుతారని అంచనా. ముఖ్యంగా జెనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (జెన్ ఏఐ), మెషిన్ లెర్నింగ్/ఏఐ, డేటా ఎనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్ కంప్యూటింగ్ వంటి విభాగాల్లో భారీగా నిపుణుల అవసరం ఉంటుందని టీమ్‌లీజ్ చెబుతోంది. గ్లోబల్ టెక్ హబ్‌గా భారత్ ప్రాధాన్యత అంతకంతకూ పెరుతుండటంతో వచ్చే 5–6 ఏళ్లలో ఏకంగా 800 కొత్త జీసీసీలు భారత్‌లో కొలువుదీరే అవకాశం ఉంది. ఇవి కేవలం మెట్రోలు, బడా నగరాలకే పరిమితం కాకుండా ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలకూ విస్తరించే సన్నాహల్లో ఉండటం పరిశ్రమలో కొత్తగా అడుగుపెట్టే టెకీలకు కలిసొచ్చే అంశమని విశ్లేషకులు భావిస్తున్నారు.

చిన్న నగరాల్లోనూ నిపుణులకు డిమాండ్

జీసీసీలు టెకీలకు భారీగా వేతన ప్యాకేజీలు ఇస్తున్న నగరాల్లో ఢిల్లీ, ముంబై, బెంగళూరు, గురుగ్రామ్, హైదరాబాద్, చెన్నై వంటివి ఉన్నాయి. అయితే, జైపూర్, ఇండోర్, కోయంబత్తూరు తదితర ద్వితీయ శ్రేణి నగరాల్లో కూడా జీసీసీలు, డేటా సెంటర్లు శరవేగంగా దూసుకొస్తున్న నేపథ్యంలో అక్కడ డేటా సైన్స్, ప్రోడక్ట్ మేనేజ్‌మెంట్, డేటా ఇంజినీరింగ్ నిపుణులకు డిమాండ్ భారీగా ఉందని పరిశ్రమ చెబుతోంది. 'జీసీసీలు ప్రధానంగా జెన్ ఏఐ, ఏఐ/ఎంఎల్, డేటా ఎనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్ కంప్యూటింగ్ వంటి విభాగాలపై ఫోకస్ చేస్తున్నాయి. దీంతో డిజిటల్ మార్పులకు దన్నుగా నిలవడంతో పాటు నవకల్పనల్లో కొత్త ప్రమాణాలను నెలకొల్పుతున్నాయి' అని టీమ్‌లీజ్ డిజిటల్ వైస్-ప్రెసిడెంట్ కృష్ణ విజ్ పేర్కొన్నారు. సాంప్రదాయ ఐటీ కంపెనీలతో పోలిస్తే జీసీసీల్లో 12–20 శాతం అధిక ప్యాకేజీలు, డిజిటల్ స్కిల్స్‌కు ఎంత డిమాండ్ ఉందనేదుకు నిదర్శనమని ఆమె అభిప్రాయపడ్డారు.

– సాక్షి, బిజినెస్ డెస్క్



ఈ–కామర్స్ ఎగుమతులకు భారీ అవకాశాలు

ఆసక్తిగల కంపెనీలతో త్వరలో డీజీఎఫ్‌టీ భేటీ



న్యూఢిల్లీ: ఈ–కామర్స్ ఎగుమతులకు భారీ అవకాశాలున్నట్లు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారీన్ ట్రేడ్ (డీజీఎఫ్‌టీ) ఉన్నతాధికారి ఒకరు ప్రకటించారు. ప్రస్తుతం చైనా నుంచి ఈ–కామర్స్ ఎగుమతులు 300 బిలియన్ డాలర్లుగా ఉంటే, భారత్‌నుంచి కేవలం 5 బిలియన్ డాలర్లే ఉన్నట్లు వెల్లడించారు. కనుక రానున్న సంవత్సరాల్లో భారత్ నుంచి ఈ–కామర్స్ ఎగుమతులను 50–100 బిలియన్ డాలర్లకు చేర్చే సామర్థ్యాలున్నట్లు వివరించారు. టెక్స్‌టైల్స్, హ్యాండ్లూమ్, రత్నాభరణాల వంటి వేగంగా అమ్ముడయ్యే ఉత్పత్తులను (ఎఫ్ఎంజీ) సమీకరించే సామర్థ్యం ఉన్న కంపెనీలు ఈ–కామర్స్ ఎగుమతుల కేంద్రాలు ఏర్పాటు చేసుకోవచ్చని సూచించారు. కాకపోతే ఈ ఉత్పత్తులను సమీకరించే చక్కని నెట్‌వర్క్, లాజిస్టిక్స్ సదుపాయాలు, గోదాముల వసతులు అవసరమన్నారు. ఈ కామర్స్ ఎగుమతుల కేంద్రాల ఏర్పాటుకు ఆసక్తి కలిగిన కంపెనీల నుంచి ప్రతిపాదనలను ఆహ్వానించగా.. త్వరలో ఆయా కంపెనీలతో డీజీఎఫ్‌టీ సమావేశం కానున్నట్లు చెప్పారు. 4–5 రోజుల్లో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహిస్తామని తెలిపారు. "ఏ అగ్రిగేటర్ అయినా లేదా సంస్థ.. ఫాస్ట్ మూవింగ్ ఈ–కామర్స్ గూడ్స్ అయిన టెక్స్‌టైల్స్, రత్నాభరణాలు, చేనేత ఉత్పత్తులు, ఆయుష్, వెల్‌నెస్ ఉత్పత్తులను డిమాండ్‌కు అనుగుణంగా డెలివరీ చేయగలిగే సామర్థ్యాలు ఉంటే ఎగుమతుల కేంద్రాలు ఏర్పాటు చేసుకోవచ్చు"అని వివరించారు. ఈ తరహా ఎగుమతుల కేంద్రాల ఏర్పాటుకు తగిన సామర్థ్యాలు షిప్‌రాకెట్, డీహెచ్ఎల్ సంస్థలకు ఉన్నట్లు చెప్పారు.

రూ. 350 కోట్ల సమీకరణలో ముథూట్ ఫిన్‌కార్ప్

త్రివేంద్రం: నాన్–కన్వర్టబుల్ డిబెంచర్ల (ఎన్‌సీడీ) జారీ ద్వారా రూ. 350 కోట్ల వరకు నిధులను సమీకరిస్తున్నట్లు నాన్–బ్యాంకింగ్ ఫైనాన్స్ సంస్థ ముథూట్ ఫిన్‌కార్ప్ వెల్లడించింది. ఇందుకు సంబంధించిన సబ్‌స్క్రిప్షన్ విండో సెప్టెంబర్ 10 వరకు తెరిచి ఉంటుందని సంస్థ తెలిపింది. ఈ ఎన్‌సీడీల ముఖ విలువ రూ. 1,000గా ఉంటుంది. 24 నెలల నుంచి 92 నెలల వరకు కాలపరిమితి ఉంటుంది. వార్షికంగా ఎఫెక్టివ్ ఈల్డ్ (రాబడి) 9.38 శాతం – 10.10 శాతంగా ఉంటుందని సంస్థ వివరించింది. ఎన్‌సీడీలను బీఎస్ఈ డెట్ మార్కెట్ సెగ్మెంట్‌లో లిస్ట్ చేస్తారు. సమీకరించిన నిధులను రుణ కార్యకలాపాలు, ఇతరత్రా కార్పొరేట్ అవసరాల కోసం కంపెనీ ఉపయోగించుకోనుంది.

ఇమామీ చేతికి హీలియోస్ లైఫ్‌స్టైల్



న్యూఢిల్లీ: ఎఫ్ఎంసీజీ దిగ్గజం ఇమామీ తాజాగా హీలియోస్ లైఫ్‌స్టైల్‌లో 49.6 శాతం వాటా కైవసం చేసుకుంది. పురుషుల ఖరీదైన సౌందర్య సాధనాల ఉత్పత్తుల బ్రాండ్ ద మ్యాన్ కంపెనీని ప్రమోట్ చేస్తున్న హీలియోస్‌లో ఇప్పటికే ఇమామీకి 50.4 శాతం వాటా ఉంది. తాజా డీల్‌తో ఇమామీకి హీలియోస్ లైఫ్‌స్టైల్ 100 శాతం అనుబంధ కంపెనీగా అవతరించింది. డిజిటల్ ప్రధాన వేదికగా వేగంగా వృద్ధి చెందుతున్న పురుషుల సౌందర్య ఉత్పత్తుల రంగంలో తాజా నిర్ణయంతో ఇమామీ స్థానం మరింత పదిలం అవుతుందని కంపెనీ శనివారం తెలిపింది. ద మ్యాన్ కంపెనీ సుగంధ పరిమళాలు, స్కిన్ కేర్, హెయిర్ కేర్, బాడీ కేర్ విభాగాల్లో ఉత్పత్తులను ఆఫర్ చేస్తోంది. ఫెయిర్ అండ్ హ్యాండ్సమ్ బ్రాండ్ కింద పురుషుల సౌందర్య సాధనాల రంగంలో ఇమామీ ఇప్పటికే ఉంది. కాగా, అలోఫ్రూట్, క్రీమ్21, జండు బ్రాండ్లను గతంలో ఇమామీ దక్కించుకుంది. ఇలా కొనుగోలు చేసిన బ్రాండ్స్ నుంచి ఆదాయం 2023–24లో 45 శాతం సమకూరిందని ఇటీవల కంపెనీ ప్రకటించింది. నవరత్న, బోరోప్లస్, కేశ్ కింగ్, డెర్మికూల్ బ్రాండ్లు సైతం ఇమామీకి చెందినవే. గత ఆర్థిక సంవత్సరంలో కంపెనీ రూ.2,921 కోట్ల టర్నోవర్ సాధించింది.

ఐదేళ్లలో రూ.లక్ష కోట్ల ఏయూఎం

- ఐటీఐ మ్యూచువల్ ఫండ్ లక్ష్యం
- చీఫ్ బిజినెస్ ఆఫీసర్ మయూక్ దత్తా




న్యూఢిల్లీ: ఐటీఐ మ్యూచువల్ ఫండ్ వచ్చే ఐదేళ్లలో తన నిర్వహణలోని ఆస్తులను (ఏయూఎం) రూ.లక్ష కోట్లకు చేర్చుకోవాలనే లక్ష్యంతో ఉంది. జూలై చివరికి ఈ సంస్థ ఏయూఎం రూ.8,791 కోట్లుగా ఉంది. 2023 మార్చి నాటికి ఉన్న రూ.3,698 కోట్లతో పోల్చి చూస్తే 16 నెలల్లోనే 2.4 రెట్లు పెరిగిందని సంస్థ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ మయూక్ దత్తా వెల్లడించారు. సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) ఎంపిక చేసుకునే ఇన్వెస్టర్లలో గణనీయ పెరుగుదల కనిపిస్తున్నట్టు చెప్పారు. సిప్ ఖాతాలు 9.34 కోట్ల మేర ఉన్నట్టు తెలిపారు. సిప్ నిర్వహణ ఆస్తులు రూ.13.09 లక్షల కోట్లుగా ఉన్నట్టు వెల్లడించారు. "దేశవ్యాప్తంగా 74.67 కోట్ల పాన్ హోల్డర్లు ఉండగా.. ఇందులో 60.5 కోట్లు పాన్-ఆధార్ లింక్ అయి ఉన్నాయి. కానీ, మ్యూచువల్ ఫండ్స్ పరిశ్రమలో 4.80కోట్ల యూనిక్ పాన్ ఇన్వెస్టర్లే ఉన్నారు. ఇది 10% లోపే. కనుక మరింత మంది ఇన్వెస్టర్లు మ్యూచువల్ ఫండ్స్ పరిశ్రమలోకి రావాల్సి ఉంది"అని వివరించారు.

మెరుగైన స్థానం..

ప్రపంచంలో భారత్ మెరుగైన స్థానంలో ఉన్నట్టు దత్తా తెలిపారు. 'ఎన్నో ఆర్థిక వ్యవస్థలతో పోల్చితే బలమైన వృద్ధి నమోదు చేస్తోంది. ఇది మ్యూచువల్ ఫండ్స్ పరిశ్రమకు వినూత్న అవకాశాలు కల్పిస్తుంది. ఈ అవకాశాలను సొంతం చేసుకోవడం ద్వారా వచ్చే ఐదేళ్లలో రూ.లక్ష కోట్ల నిర్వహణ ఆస్తుల లక్ష్యాన్ని సాధిస్తాం. దేశంలోని టాప్–250 కంపెనీలు ఇన్వెస్టర్లకు ఆకర్షణీయ అవకాశాలు కల్పిస్తున్నాయని' అని చెప్పారు.

భారత ఈక్విటీల్లో యూబీఎస్ ఏజీ వరుస అమ్మకాలు

- ఏడు కంపెనీల్లో వాటాల విక్రయం
- వీటి విలువ రూ.4,961 కోట్లు



న్యూఢిల్లీ: స్విట్జర్లాండ్‌కు చెందిన ఆర్థిక సేవల కంపెనీ యూబీఎస్ గ్రూప్ ఏజీ.. శుక్రవారం ఒక్క రోజే (30వ తేదీన) ఏకంగా భారత ఈక్విటీల్లో భారీ అమ్మకాలకు దిగింది. ఏడు కంపెనీల్లో రూ.4,961 కోట్ల విలువ చేసే షేర్లను ఓపెన్ మార్కెట్ లావాదేవీల రూపంలో విక్రయించింది. యూబీఎస్ ప్రిన్సిపల్ క్యాపిటల్ ఏషియా రూపంలో బల్క్‌డీల్స్ ద్వారా అమ్మకాలు చేసినట్టు ఎన్ఎస్ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఆయిల్ ఇండియాలో రూ.972 కోట్లు, డిక్సన్ టెక్నాలజీస్‌లో రూ.904 కోట్లు, ఆర్‌వీఎన్ఎల్‌లో రూ.797 కోట్లు, జైడస్ లైఫ్‌సైన్సెస్‌లో రూ.756 కోట్ల విలువ చేసే షేర్లను అమ్మేసింది. అలాగే, వొడాఫోన్ ఐడియా, ఒరాకిల్ ఫైనాన్షియల్ సర్వీసెస్, ప్రెస్టీజ్ ఎస్టేట్స్ ప్రాజెక్ట్స్‌లోనూ రూ.1,531 కోట్ల విలువైన షేర్లను విక్రయించింది. మరోవైపు బంధన్ బ్యాంక్‌లో రూ.384 కోట్ల విలువ చేసే 1.92 కోట్ల షేర్లను యూబీఎస్ ప్రిన్సిపల్ క్యాపిటల్ కొనుగోలు చేసింది.

ఎఫ్అండ్‌వో చర్చాపత్రంపై సెబీకి భారీగా ఫీడ్‌బ్యాక్



ముంబై: ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్అండ్‌వో) ట్రేడింగ్‌కి సంబంధించి విడుదల చేసిన చర్చాపత్రంపై దాదాపు 6,000కు పైగా పరిశ్రమవర్గాల నుంచి సలహాలు, సూచనలు వచ్చాయని మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ చీఫ్ మాధవి పురి బచ్ తెలిపారు. ఆ ఫీడ్‌బ్యాక్ మొత్తాన్ని టెక్నాలజీ ద్వారా వేగవంతంగా ప్రాసెస్ చేసినట్లు ఆమె చెప్పారు. నిఘా, ప్రాసెసింగ్‌ను మెరుగుపర్చేందుకు పలు కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత సాంకేతికతలపై సెబీ పని చేస్తోందని మాధవి వివరించారు. ఎఫ్అండ్‌వో ట్రేడింగ్‌కి సంబంధించి ఇన్వెస్టర్ల ప్రయోజనాలను పరిరక్షించేందుకు, డెరివేటివ్ మార్కెట్లలో స్థిరత్వం తెచ్చేందుకు తీసుకోతగిన చర్యలపై జూలైలో సెబీ చర్చాపత్రాన్ని విడుదల చేసింది. కనీస కాంట్రాక్టు సైజును పెంచడం, పొజిషన్ లిమిట్స్‌ను ఇంట్రా–డేలో పర్యవేక్షించడం, స్ట్రైక్ ప్రైస్‌లను క్రమబద్ధీకరించడం, నియర్ కాంట్రాక్ట్ ఎక్స్‌పైరీ మార్జిన్‌ను పెంచడం తదితర ప్రతిపాదనలు ఇందులో ఉన్నాయి.

భారత్‌లో మజరాటీ గ్రాన్‌టూరిజ్మో

న్యూఢిల్లీ: లగ్జరీ కార్ల తయారీలో ఉన్న ఇటలీ కంపెనీ మజరాటీ భారత్‌లో గ్రాన్‌టూరిజ్మో మోడల్‌ను ప్రవేశపెట్టింది. ఎక్స్‌షోరూంలో ఈ గ్రాండ్ టూరర్ ధర రూ.2.72 కోట్ల నుంచి ప్రారంభం. 3.0 లీటర్ వీ6 ట్విన్ టర్బో నెట్టూన పెట్రోల్ ఇంజన్ పొందుపరిచారు. 550 హెచ్‌పీ పవర్, 650 ఎన్ఎం గరిష్ట టార్క్ అందిస్తుంది. ట్రోఫియో వేరియంట్ గరిష్ట వేగం గంటకు 320 కిలోమీటర్లు. 3.5 సెకన్లలో గంటకు 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుంది. మోడెనా వేరియంట్ గరిష్ట వేగం గంటకు 302 కిలోమీటర్లు. 3.9 సెకన్లలో గంటకు 100 కిలోమీటర్ల వేగాన్ని చేరుకుంటుంది. ఆల్ వీల్ డ్రైవ్ ట్రాన్స్‌మిషన్‌తో రూపుదిద్దుకుంది. మజరాటీ ఇంటెలిజెంట్ అసిస్టెంట్ మల్టీమీడియా సిస్టమ్, 12.2 అంగుళాల డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్, 12.3 అంగుళాల సెంట్రల్ ఇన్ఫోటైన్‌మెంట్ స్క్రీన్, 8.8 అంగుళాల టచ్‌స్క్రీన్ కంట్రోల్స్ పొందుపరిచారు. గ్రాన్‌టూరిజ్మో ఫోల్గొరే ఎలక్ట్రిక్ కారు 2025లో భారత్‌లో అడుగుపెట్టనుంది. తమ కంపెనీకి టాప్–10 మార్కెట్లలో ఒకటిగా నిలిచే అవకాశం భారత్‌కు ఉందని మజరాటీ ఓవర్సీస్ మార్కెట్స్ హెడ్ ఫిలిప్ క్లావరోల్ తెలిపారు.

టెక్నాలజీతోపాటు మానవ ప్రమేయం అవసరం

కోటక్ ఏఎంసీ ఎండీ నీలేష్ షా

ముంబై: మ్యూచువల్ ఫండ్స్ విషయంలో పూర్తిగా టెక్నాలజీకే ప్రాధాన్యం ఇవ్వడం కాకుండా, మానవ ప్రమేయం కూడా అవసరమని కోటక్ అస్సెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ (ఏఎంసీ) ఎండీ నీలేష్ షా అభిప్రాయపడ్డారు. టెక్నాలజీని ఇష్టపడే ఇన్వెస్టర్లు, మానవ ప్రమేయాన్ని కోరుకునే పెట్టుబడిదారుల మధ్య సమతూకం అవసరమన్నారు. డిజిటల్ ఉచ్చు లేదా డిజిటల్ మోసాల బారిన పడకుండా చూడాలని పరిశ్రమకు సూచించారు. గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ 2024 కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా మాట్లాడారు. "టెక్నాలజీని వినియోగించుకోవాల్సిన అవసరం ఉంది. కానీ, అన్ని నమూనాల్లోనూ మానవ ప్రమేయం కూడా ఉండాలి. ఈ రెండింటి మధ్య సమతూకం అవసరం. ప్రతి ఒక్కరి చేతిలో స్మార్ట్‌ఫోన్ లేదు. ప్రతి ఒక్కరూ స్మార్ట్ అవ్వాలని లేదు. టెక్నాలజీ రెండు వర్గాల వారికీ పనిచేయాలి. ఇప్పటికీ భౌతికంగా దరఖాస్తులు నింపే వారున్నారు. సమాజంలోని ప్రతి వర్గానికీ చేరువ కావాలి. అదే విధంగా టెక్నాలజీ సాయంతో అందరికీ ఆర్థిక విషయాలు తెలిసేలా చూడాలి" అని పేర్కొన్నారు.

పరిశ్రమలకు రెట్టింపు బ్యాంకు రుణాలు

- జూలై నెలలో నమోదు
- వ్యవసాయం, అనుబంధానికి 18%



ముంబై: దేశీ పరిశ్రమలకు బ్యాంక్ రుణాలు జూలై నెలలో రెట్టింపు స్థాయికి చేరాయి. జూలైలో బ్యాంకులు మంజూరు చేసిన మొత్తం రుణాల్లో 10.2 శాతం పరిశ్రమలకు దక్కాయి. ఏడాది క్రితం ఇదే నెలలో పరిశ్రమలకు మంజూరైన రుణాలు 4.6 శాతంగానే ఉన్నాయి. వ్యవసాయం, దాని అనుబంధ రంగాలకు సైతం 18.1 శాతం రుణాలు లభించాయి. ఏడాది క్రితం ఇదే నెలలో వ్యవసాయం, అనుబంధ రంగాలకు మంజూరైన రుణాల వాటా 16.7 శాతంగా ఉంది. జూలై నెలలో రంగాల వారీ బ్యాంక్ రుణాలపై ఆర్‌బీఐ గణాంకాలను పరిశీలించగా.. కెమికల్స్, ఫుడ్ ప్రాసెసింగ్, పెట్రోలియం, బొగ్గు, అణు ఇంధనాలు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు రుణాల్లో మెరుగైన వృద్ధి నమోదైంది. బేసిక్ మెటల్స్, మెటల్స్, టెక్స్‌టైల్స్ రంగాలకు రుణాల మంజూరు మోస్తరుగా ఉంది. జూలై నెలలో బ్యాంకు మొత్తం రుణాల్లో సేవల రంగం వాటా 15.4 శాతంగా ఉంది. ఏడాది క్రితం ఇదే నెలలో ఉన్న 19.7 శాతంతో పోల్చితే తగ్గినట్టు తెలుస్తోంది. వాణిజ్య రియల్ ఎస్టేట్, పర్యాటకం, హోటళ్లు, రెస్టారెంట్లు, కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ కంపెనీలకు మాత్రం రుణాల్లో వృద్ధి కనిపించింది. వ్యక్తిగత రుణాల వాటా 17.8 శాతంగా ఉంది. ఏడాది క్రితం ఇదే నెలలో ఇది 18.4 శాతంగా ఉండడం గమనార్హం. వ్యక్తిగత రుణాల్లో అధిక వాటా కలిగిన ఇంటి రుణాల్లో మాత్రం మెరుగుదల కనిపించింది.

ఫిన్‌ఫ్లుయెన్సర్లకు కఠిన నిబంధనలు

సవరణలు చేపట్టిన సెబీ



న్యూఢిల్లీ: క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ తాజాగా రిజిస్టర్‌కాని ఫైనాన్షియల్ ఇన్‌ఫ్లుయెన్సర్ల(ఫిన్‌ఫ్లుయెన్సర్ల)ను నియంత్రణ పరిధిలోకి తీసుకువచ్చేందుకు ఉపక్రమించింది. ఇందుకు అనుగుణంగా నిబంధనలను సవరించింది. ఇటీవల అన్‌రిజిస్టర్డ్ ఫిన్‌ఫ్లుయెన్సర్లతో పెరుగుతు న్న రిస్కులపై ఆందోళనల కారణంగా సెబీ నిబంధనలను కఠినతరం చేసింది. విడిగా జారీ చేసిన మూడు నోటిఫికేషన్ల ద్వారా రిజిస్టర్డ్ సంస్థలు, రిజిస్టర్‌కాని వ్యక్తుల మధ్య సహకారంపై పరిమితులు విధించింది. ఈ అంశాలపై ప్రతిపాదనలను గత నెలలోనే సెబీ బోర్డు అనుమతించింది. ప్రస్తుత నోటిఫికేషన్ల ప్రకారం సెబీ నియంత్రణలోని ఏజెంట్లు, సంబంధిత వ్యక్తులపై ఆంక్షలు వర్తించనున్నాయి. సొమ్ము సంబంధ ఎలాంటి లావాదేవీలు, క్లయింట్‌కు రిఫర్ చేయడం, ఏ ఇతర వ్యక్తులతోనూ ఐటీ సిస్టమ్స్‌తో జత కలవడం తదితరాలు నిషిద్ధం. అంతేకాకుండా వీరు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా సలహాలు, రికమండేషన్లు, స్పష్టమైన రిటర్నుల క్లెయిములు తదితరాలను చేపట్టకూడదు. సెబీ వద్ద రిజిస్టరైన లేదా బోర్డు అనుమతిస్తే తప్ప నియంత్రణలోలేని సంస్థలు, సంబంధిత ఏజెంట్లు సైతం ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఇవేమీ చేపట్టేందుకు అనుమతి ఉండదు. ఫిన్‌ఫ్లుయెన్సర్లు సెబీ వద్ద రిజిస్టర్‌కావలసి ఉంటుంది. అంతేకాకుండా వీటికి సంబంధించిన మార్గదర్శకాలకు కట్టుబడవలసి ఉంటుంది. ఇందుకు నైపుణ్యాలు, జవాబుదారీతనం వంటి అంశాలలో సెబీ ప్రమాణాలకు తెరతీసినట్లు ఈ సందర్భంగా మార్కెట్ విశ్లేషకులు పేర్కొన్నారు. వెరసి ఫిన్‌ఫ్లుయెన్సర్లతో మ్యూచువల్ ఫండ్ సంస్థలు, రీసెర్చ్ నిపుణులు, రిజిస్టర్డ్ పెట్టుబడి సలహాదారులు, స్టాక్ బ్రోకర్లు జత కట్టేందుకు వీలుండదు.

ఎన్‌బీసీసీ బోనస్ షేర్లు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ ఎన్‌బీసీసీ (ఇండియా) 1:2 నిష్పత్తిలో బోనస్ షేర్లను జారీ చేసేందుకు బోర్డు అంగీకారం తెలిపింది. ఇందుకోసం రూ.90 కోట్లు వెచ్చించనున్నట్టు కంపెనీ శనివారం వెల్లడించింది. 90 కోట్ల బోనస్ షేర్లను జారీ చేయనుంది. అక్టోబర్ 7ను రికార్డ్ డేట్‌గా నిర్ణయించింది.

పాకిస్తాన్ 274 ఆలౌట్



మిరాజ్‌కు సహచరుల అభినందన

బంగ్లాదేశ్‌తో రెండో టెస్టు

రావల్పిండి: టెస్టు క్రికెట్ చరిత్రలో తొలిసారి బంగ్లాదేశ్ చేతిలో ఓడిన పాకిస్తాన్ క్రికెట్ జట్టు... రెండో టెస్టులోనూ భారీ స్కోరు చేయలేకపోయింది. వర్షం కారణంగా తొలి రోజు ఆట పూర్తిగా తుడిచి పెట్టుకుపోగా.. శనివారం రెండో రోజు టాస్ గెలిచిన బంగ్లాదేశ్ మొదట బౌలింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్‌కు దిగిన పాకిస్తాన్ తొలి ఇన్నింగ్స్‌లో 85.1 ఓవర్లలో 274 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ షాన్ మసూద్ (69 బంతుల్లో 57; 2 ఫోర్లు), అయూబ్ (110 బంతుల్లో 58; 4 ఫోర్లు, 2 సిక్సర్లు), ఆగా సల్మాన్ (95 బంతుల్లో 54; 3 ఫోర్లు, 2 సిక్సర్లు) అర్ధ శతకాలతో రాణించగా... బాబర్ ఆజమ్ (31), మొహమ్మద్ రిజ్వాన్ (29) ఫర్వాలేదనిపించారు. బంగ్లాదేశ్ పేలవ ఫీల్డింగ్ కారణంగా అందివచ్చిన అవకాశాలను కూడా పాక్ ఉపయోగించుకోలేకపోయింది. బంగ్లా ఫీల్డర్లు ఏకంగా నాలుగు క్యాచ్‌లు వదిలేయడం విశేషం. బంగ్లాదేశ్ బౌలర్లలో ఆఫ్‌స్పిన్నర్ మెహదీ హసన్ మిరాజ్ 5 వికెట్లతో అదరగొట్టగా.. తస్కిన్ అహ్మద్ మూడు వికెట్లు తీశాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన బంగ్లాదేశ్... ఆట ముగిసే సమయానికి రెండు ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 10 పరుగులు చేసింది. ఓపెనర్లు షాద్‌మన్ ఇస్లామ్ (6 బ్యాటింగ్), జాకీర్ హసన్ (0 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. ఇన్నింగ్స్ తొలి బంతికే షాద్‌మన్ ఇచ్చిన సునాయాస క్యాచ్‌ను స్లిప్‌లో షకీల్ వదిలేయడంతో బంగ్లాకు నష్టం జరగలేదు. రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా రావల్పిండిలోనే జరిగిన తొలి టెస్టులో పాకిస్తాన్‌పై 10 వికెట్ల తేడాతో గెలిచిన బంగ్లాదేశ్ 1–0తో ఆధిక్యంలో ఉంది.

రఫ్ఫాడించిన రూట్

టెస్టు ఫార్మాట్‌లో 34వ సెంచరీ

- కుక్‌ను అధిగమించిన జో రూట్
- విజయానికి చేరువైన ఇంగ్లండ్
- రెండో ఇన్నింగ్స్‌లో 251 ఆలౌట్
- శ్రీలంక లక్ష్యం 483; ప్రస్తుతం 53/2

ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ జో రూట్ మరో సెంచరీతో కదం తొక్కాడు. లార్డ్స్ టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో శతక్కొటిన రూట్... రెండో ఇన్నింగ్స్‌లోనూ అదే జోరు కనబరుస్తూ ఇంగ్లండ్ తరఫున సుదీర్ఘ ఫార్మాట్‌లో అత్యధిక (34) సెంచరీలు చేసిన ప్లేయర్‌గా రికార్డుల్లోకెక్కాడు. రూట్ దూకుడుతో శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్టులో ఇంగ్లండ్ విజయానికి చేరువైంది. 483 పరుగుల విజయ లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన శ్రీలంక మూడో రోజు ఆట ముగిసే సమయానికి 53/2తో నిలిచింది.


రూట్

లండన్: శ్రీలంకతో రెండో టెస్టులో ఇంగ్లండ్ జట్టు విజయానికి చేరువైంది. మాజీ కెప్టెన్ జో రూట్ (121 బంతుల్లో 103; 10 ఫోర్లు) రెండో ఇన్నింగ్స్‌లోనూ సెంచరీతో చెలరేగడంతో ఓవర్‌నైట్ స్కోరు 25/1తో శనివారం ఆట కొనసాగించిన ఇంగ్లండ్ 251 పరుగులకు ఆలౌటైంది. గత మూడేళ్లుగా వరస సెంచరీలతో రెచ్చిపోతున్న రూట్... ప్రస్తుతం ఆటలో కొనసాగుతున్న వారిలో అత్యధిక సెంచరీలు చేసిన ప్లేయర్‌గా తన స్థానాన్ని మరింత పదిలం చేసుకున్నాడు. రూట్ 34 సెంచరీలతో టాప్‌లో ఉంటే.. న్యూజిలాండ్ ప్లేయర్ కేన్ విలియమ్సన్, ఆ్రస్టేలియా దిగ్గజం స్టీవ్ స్మిత్ చెరో 32 సెంచరీలతో రెండో స్థానంలో ఉన్నారు. భారత స్టార్ విరాట్ కోహ్లి 29 సెంచరీలతో మూడో ప్లేస్‌లో కొనసాగుతున్నాడు. రూట్ శతకం బాదినా... కెప్టెన్ ఒలీ పోప్ (17), బెన్ డకెట్ (24), హ్యారీ బ్రూక్ (37), జేమీ స్మిత్ (26) ఎక్కువసేపు నిలువలేకపోయారు. శ్రీలంక బౌలర్లలో అషిత ఫెర్నాండో, లహీరు కుమార చెరో మూడు వికెట్లు పడగొట్టగా.. మిలాన్ రత్నాయకే, ప్రభాత్ జయసూర్య రెండేసి వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన శ్రీలంక వెలుతురులేమి కారణంగా మూడో రోజు ఆట నిలిచే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 20 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 53 పరుగులు చేసింది. నిషాన్ మధుషనక (13), పతుమ్ నిశాంక (14) ఔట్ కాగా.. దిముత్ కరుణరత్నె (23 బ్యాటింగ్), ప్రభాత్ జయసూర్య (3 నాటౌట్) క్రీజులో ఉన్నారు. మరో రెండు రోజుల ఆట మిగిలి ఉండగా.. చేతిలో ఎనిమిది వికెట్లు ఉన్న శ్రీలంక విజయానికి ఇంకా 430 పరుగులు చేయాల్సి ఉంది.

34 టెస్టు క్రికెట్‌లో రూట్‌కు ఇది 34వ సెంచరీ. ఇంగ్లండ్ తరఫున అత్యధిక సెంచరీలు చేసిన ఆటగాళ్ల జాబితాలో రూట్ అగ్ర స్థానానికి చేరాడు. మాజీ కెప్టెన్ అలిస్టర్ కుక్ 33 సెంచరీలతో రెండో స్థానంలో ఉన్నాడు.

5 టెస్టు క్రికెట్‌లో అత్యధిక సెంచరీలు చేసిన ప్లేయర్ల జాబితాలో రూట్ (34) ఐదో స్థానానికి చేరాడు. సచిన్ టెండూల్కర్ (భారత్: 51), జాక్ కలిస్ (దక్షిణాఫ్రికా: 45), రికీ పాంటింగ్ (ఆస్ట్రేలియా: 41), కుమార సంగక్కర (శ్రీలంక: 38), రాహుల్ ద్రవిడ్ (భారత్: 36) ముందున్నారు. రూట్‌తో పాటు సునీల్ గవాస్కర్ (భారత్), మహేలా జయవర్ధనే (శ్రీలంక), యూనిస్ ఖాన్ (పాకిస్తాన్) 34 సెంచరీలు సాధించారు.

4 లార్డ్స్ టెస్టులో రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ సెంచరీ చేసిన నాలుగో ప్లేయర్‌గా రూట్ నిలిచాడు. అంతకుముందు జార్జ్ హెడ్లీ (వెస్టిండీస్: 1939లో ఇంగ్లండ్‌పై), గ్రాహం గూచ్ (ఇంగ్లండ్: 1990లో భారత్‌పై), మైకేల్ వాన్ (ఇంగ్లండ్: 2004లో వెస్టిండీస్‌పై) ఈ ఘనత సాధించారు.

1 టెస్టు క్రికెట్‌లో రూట్‌కు ఇదే వేగవంతమైన (111 బంతుల్లో) శతకం. అంతకుముందు 2022లో న్యూజిలాండ్‌పై రూట్ 116 బంతుల్లో మూడంకెల స్కోరు చేశాడు. టెస్టు మ్యాచ్ రెండు ఇన్నింగ్స్‌ల్లో సెంచరీ చేయడం కూడా రూట్‌కు ఇదే తొలిసారి.



అనాహత్‌కు టైటిల్


హెచ్‌సీఎల్ స్క్వాష్ టూర్

కోల్‌కతా: భారత టీనేజ్ సంచలనం అనాహత్ సింగ్ హెచ్‌సీఎల్ స్క్వాష్ టూర్ పీఎస్‌ఏ టైటిల్ చేజిక్కించుకుంది. శనివారం జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో 16 ఏళ్ల అనాహత్11-5, 11-3, 11-7తో జేమ్యా అరిబాడో (ఫిలిప్పీన్స్)పై విజయం సాధించింది. ఆసియా క్రీడల్లో కాంస్య పతకం నెగ్గిన అనాహత్... తుది పోరులో ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా చెలరేగిపోయింది. పురుషుల సింగిల్స్‌లో శ్రీలంక ప్లేయర్ రవిందు లక్సిరి 11-7, 13-11, 11-3తో అమర్ అల్టామిమీ (కువైట్)పై గెలిచి టైటిల్ ఖాతాలో వేసుకున్నాడు. తుది పోరుకు ముఖ్యఅతిథిగా హాజరైన భారత మాజీ ఆటగాడు సౌరవ్ ఘోషల్ విజేతలను అభినందించాడు. 'భారత్‌లో పీఎస్‌ఏ టోర్నమెంట్‌లు నిర్వహించడం బాగుంది. ఇలాంటి టోర్నీలు ఎక్కువ జరుగుతుంటే ప్లేయర్లలో పోటీతత్వం పెరుగుతుంది. ప్రతిభను వెలికితీసేందుకు కూడా ఉపయోగపడతాయి' అని సౌరవ్ అన్నాడు.

నోరిస్‌కు పోల్ పొజిషన్

ఇటాలియన్ గ్రాండ్‌ప్రి

మోన్జా (ఇటలీ): ఫార్ములావన్ ఇటాలియన్ గ్రాండ్‌ప్రిలో మెక్‌లారెన్ డ్రైవర్ లాండో నోరిస్ పోల్ పొజిషన్ సాధించాడు. శనివారం జరిగిన క్వాలిఫయింగ్ ఈవెంట్‌లో ఈ బ్రిటన్ డ్రైవర్ అందరికంటే ముందుగా, వేగంగా వేగంగా రేసును పూర్తి చేశాడు. ఆదివారం జరగనున్న ప్రధాన రేసును నోరిస్ పోల్ పొజిషన్‌తో ప్రారంభించనున్నాడు. మెక్‌లారెన్ మరో డ్రైవర్ పియాస్ట్రి, మెర్సిడెస్ రేసర్ రసెల్ వరుసగా ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. ప్రపంచ డ్రైవర్స్ చాంపియన్‌షిప్‌లో అగ్రస్థానంలో ఉన్న రెడ్‌బుల్ డ్రైవర్ మ్యాక్స్ వెర్‌స్టాపెన్ ఏడో స్థానంలో నిలవగా... బ్రిటన్ స్టార్ లూయిస్ హామిల్టన్ (మెర్సిడెస్) ఆరో స్థానంతో క్వాలిఫయింగ్ రేసును ముగించాడు. గత వారం డచ్ గ్రాండ్‌ప్రిలో విజయం సాధించి జోరుమీదున్న నోరిస్... ఇటలీ గ్రాండ్‌ప్రిలో కూడా టైటిల్ నెగ్గితే.. డ్రైవర్స్ టేబుల్‌లో వెర్‌స్టాపెన్‌కు మరింత చేరువ కానున్నాడు. తాజా సీజన్‌లో మరో 9 రేసులు మిగిలి ఉన్నాయి. ప్రస్తుతం వెర్‌స్టాపెన్ 295 పాయింట్లతో టాప్‌లో ఉండగా.. నోరిస్ 225 పాయింట్లతో రెండో స్థానంలో కొనసాగుతున్నాడు.



'మరోసారి పోల్ పొజిషన్ సాధించడం ఆనందంగా ఉంది. ఇది చక్కటి అవకాశం. వెర్‌స్టాపెన్‌ను అధిగమించడం గొప్పగా అనిపించింది' అని రేసు అనంతరం నోరిస్ అన్నాడు. వరుసగా రెండు గ్రాండ్‌ప్రిల్లో పోల్ పొజిషన్ సాధించడం నోరిస్‌కు ఇదే తొలిసారి కాగా... కెరీర్‌లో ఓవరాల్‌గా అతడికి ఐదో పోల్ పొజిషన్.

ద్రవిడ్ వారసుడు వచ్చాడు...

తొలిసారి భారత అండర్–19 జట్టులో సమిత్ ద్రవిడ్

న్యూఢిల్లీ: భారత మాజీ కెప్టెన్ రాహుల్ ద్రవిడ్ బాటలో అతని కుమారుడు కూడా వేగంగా సీనియర్ క్రికెట్ వైపు అడుగులు వేస్తున్నాడు. ఈ క్రమంలో ద్రవిడ్ కొడుకు సమిత్ ద్రవిడ్ తొలి సారి ఏజ్ గ్రూప్ క్రికెట్‌లో టీమిండియాకు ప్రాతినిధ్యం వహించే అవకాశం దక్కించుకున్నాడు. ఆస్ట్రేలియా అండర్–19 టీమ్‌తో రెండు వేర్వేరు ఫార్మాట్‌లలో జరిగే సిరీస్‌ల కోసం ఎంపిక చేసిన భారత అండర్–19 టీమ్‌లోకి పేస్ బౌలింగ్ ఆల్‌రౌండర్ సమిత్ ఎంపికయ్యాడు. ఇరు జట్ల మధ్య ఈ నెల 21, 23, 26 తేదీల్లో మూడు వన్డేలు, సెప్టెంబర్ 30 నుంచి 2 నాలుగు రోజుల మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ రెండు జట్లలో కూడా అతనికి స్థానం లభించడం విశేషం. దేశవాళీ క్రికెట్‌లో గత కొంత కాలంగా ఆకట్టుకునే ప్రదర్శనతో 18 ఏళ్ల సమిత్ అందరి దృష్టినీ ఆకర్షించాడు. ఈ ఏడాది కూచ్ బెహార్ ట్రోఫీలో 8 మ్యాచ్‌లాడి 362 పరుగులు చేయడంతో పాటు 16 వికెట్లు తీసిన సమిత్ ద్రవిడ్... కర్ణాటక జట్టు తొలిసారి టైటిల్ సాధించడంలో కీలక పాత్ర పోషించాడు. ప్రస్తుతం సీనియర్ స్థాయి క్రికెట్‌లో తన తొలి టి20 టోర్నీ 'మహారాజా ట్రోఫీ'లో సమిత్ మైసూర్ వారియర్స్ తరఫున ఆడుతున్నాడు.



సిక్సులే సిక్స్‌లు!

- ఇన్నింగ్స్‌లో బదోని 19 సిక్సర్లు
- ప్రియాన్ష్ ఒకే ఓవర్లో 6 సిక్స్‌లు
- ఢిల్లీ ప్రీమియర్ లీగ్‌లో పరుగుల మోత



ప్రియాన్ష్



బదోని

న్యూఢిల్లీ: ఢిల్లీ ప్రీమియర్ లీగ్ (డీపీఎల్)లో సిక్సర్ల మోత మోగింది. సౌత్ ఢిల్లీ సూపర్‌స్టార్స్ జట్టు బ్యాటర్లు ఆయుష్ బదోని (55 బంతుల్లో 165; 8 ఫోర్లు, 19 సిక్స్‌లు), ప్రియాన్ష్ ఆర్య (50 బంతుల్లో 120; 10 ఫోర్లు, 10 సిక్స్‌లు) విధ్వంసమే సృష్టించారు. దీంతో శనివారం నార్త్ ఢిల్లీ స్ట్రయికర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో సౌత్ ఢిల్లీ 112 పరుగుల తేడాతో జయభేరి మోగించింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన సౌత్ ఢిల్లీ సూపర్‌స్టార్స్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 308 పరుగుల భారీస్కోరు చేసింది. ఐపీఎల్‌లో లక్నో సూపర్‌జెయింట్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న బదోని మంచినీళ్ల ప్రాయంలా సిక్సర్లు బాదేశాడు. ఇప్పటివరకు టి20ల్లో అత్యధికంగా క్రిస్ గేల్, సాహిల్ చౌహాన్‌లు ఇన్నింగ్స్‌లో 18 సిక్స్‌ల చొప్పున కొట్టారు. అయితే బదోని 19 సిక్సర్లతో వారిని అధిగమించాడు. ఆయుశ్ బదోని తన సిక్సర్ల జడివానతో 39 బంతుల్లోనే సెంచరీ పూర్తిచేసుకోగా, మరో వైపు ఒకే ఓవర్లో 6 సిక్స్‌లు బాదిన ప్రియాన్ష్ 40 బంతుల్లో శతకాన్ని సాధించాడు. ఇన్నింగ్స్ 12వ ఓవర్ వేసిన మనన్ భరద్వాజ్ బౌలింగ్‌లో ప్రియాన్ష్ వరుసగా 6, 6, 6, 6, 6, 6లుగా దంచేశాడు. ఇద్దరు రెండో వికెట్‌కు 286 పరుగుల భాగస్వామ్యాన్ని జోడించారు. తర్వాత కొండంత లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన నార్త్ ఢిల్లీ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 196 పరుగులు చేసింది.

శరత్ కమల్ గెలిచినా...

- గోవా చేతిలో చెన్నై ఓటమి
- అల్టిమేట్ టేబుల్ టెన్నిస్



చెన్నై: అల్టిమేట్ టేబుల్ టెన్నిస్ (యూటీటీ) లీగ్‌లో గోవా చాలెంజర్స్ రెండో విజయాన్ని నమోదు చేసింది. శనివారం జరిగిన మ్యాచ్‌లో గోవా 9-6తో చెన్నై లయన్స్‌పై గెలుపొందింది. సొంతగడ్డపై శరత్ కమల్ 2-1 (11-6, 11-10, 6-11)తో మిహయి బొబొసికాపై గెలుపొందినప్పటికీ సహచరుల వైఫల్యంతో చెన్నైకి నిరాశ తప్పలేదు. మహిళల సింగిల్స్‌లో సకుర మొరి 2-1 (11-9, 11-9, 9-11)తో యాంగ్జీ లియూ (గోవా)పై గెలిచి చెన్నై ఆధిక్యాన్ని రెట్టింపు చేసింది. కానీ తర్వాతి మ్యాచ్‌ల్లో చెన్నై ప్లేయర్లు వరుసగా ఓడిపోయారు. రెండో పురుషుల సింగిల్స్ మ్యాచ్‌లో హర్మీత్ దేశాయ్ (గోవా) 2-1 (6-11, 11-7, 11-5)తో జులెస్ రోలండ్‌పై గెలిచాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో శరత్-సకుర జోడీ 0-3 (9-11, 10-11, 7-11)తో హర్మీత్ దేశాయ్-యాంగ్జీ లియూ (గోవా) జంట చేతిలో ఓడిపోయింది. రెండో మహిళల సింగిల్స్‌లో యశస్విని ఘోర్పడే (గోవా) 2-1 (11-5, 11-8, 3-11)తో మౌమ దాస్‌పై గెలుపొందడంతో చెన్నై ఓటమిపాలైంది. మరో పోరులో బెంగళూరు స్మాషర్స్ 9-6తో అహ్మదాబాద్ ఎస్‌జీ పైపర్స్‌పై గెలిచింది. పురుషుల సింగిల్స్‌లో ఆంథోని అమల్‌రాజ్ (బెంగళూరు) 1-2 (9-11, 10-11, 11-10)తో లిలియన్ బార్డెట్ చేతిలో, మహిళల సింగిల్స్‌లో మనిక బత్రా (బెంగళూరు) 1-2 (11-7, 9-11, 7-11)తో బెర్నడెట్ సాక్స్ చేతిలో కంగుతిన్నారు. తర్వాత మిక్స్‌డ్ డబుల్స్‌లోనూ అల్వరొ రొబెల్స్-మనిక జోడీ 1-2 (3-11, 11-7, 8-11)తో మనుశ్ షా-బెర్నాడెట్ సాక్స్ జంట చేతిలో ఓడిపోయింది. ఈ దశలో పురుషుల సింగిల్స్‌లో అల్వరో రొబెల్స్ (బెంగళూరు) 3-0 (11-8, 11-7, 11-8)తో మనుశ్ షాపై, మహిళల సింగిల్స్‌లో లిలి జాంగ్ (బెంగళూరు) 3-0 (11-5, 11-8, 11-10)తో క్రిత్విక సిన్హా రాయ్‌లపై ఒక్క గేమ్ కూడా ఓడిపోకుండా గెలుపొందడంతో బెంగళూరు విజయం సాధించింది.




4 అడుగుల 4 అంగుళాలు

7 ఒలింపిక్ స్వర్ణాలు

ట్యునీషియాకు చెందిన రౌవా తిలీ షాట్‌పుట్ ఎఫ్41 విభాగంలో స్వర్ణ పతకాన్ని గెలుచుకుంది. వరుసగా ఐదో పారాలింపిక్స్‌లో ఆమె పసిడి పతకం గెలవడం విశేషం. ఓవరాల్‌గా ఆమెకు ఇది ఏడో ఒలింపిక్ స్వర్ణం . దీంతో పాటు మరో 2 రజతాలు కూడా ఆమె సాధించింది. 2008లో డిస్కస్ త్రోలో స్వర్ణం సాధించిన రౌవా, 2012లో షాట్‌పుట్‌లో బంగారు పతకాన్ని అందుకుంది. ఆ తర్వాత 2016, 2020లలో అటు షాట్‌పుట్‌లో, ఇటు డిస్కస్‌లో రెండేసి స్వర్ణాల చొప్పున నెగ్గింది. ఇప్పుడు 34 ఏళ్ల వయసులో మళ్లీ పసిడితో మెరిసింది.


'సిట్టింగ్ వాలీబాల్' మ్యాచ్‌లో భాగంగా తలపడుతున్న బ్రెజిల్, జర్మనీ జట్లు



ఫ్లెర్ జాంగ్ దూకితే...

నెదర్లాండ్స్‌కు చెందిన ఫ్లెర్ జాంగ్ 17 ఏళ్ల వయసులో బ్యాక్టీరియల్ బ్లడ్ ఇన్‌ఫెక్షన్‌కు గురైంది. దాంతో కుడి మోకాలినుంచి కింది భాగం మొత్తం కోల్పోయింది. దీంతో పాటు ఎనిమిది చేతివేళ్ల పైభాగం కూడా కోల్పోవాల్సి వచ్చింది. ఆ తర్వాత మిగిలిన ఒక కాలను సమర్థంగా వాడలేకపోతున్నానంటూ డాక్టర్లకు చెప్పి తన ఎడమ మోకాలి కింది భాగాన్ని కూడా తొలగించుకుంది. పారాలింపిక్స్‌లో మహిళల లాంగ్‌జంప్ టి64 ఈవెంట్‌లో పోటీ పడిన ఆమె స్వర్ణపతకాన్ని సొంతం చేసుకుంది. గత టోక్యో ఒలింపిక్స్‌లో కూడా ఫ్లెర్ జాంగ్ ఇదే విభాగంలో పసిడి నెగ్గింది.



లావోస్‌లో సైబర్ బానిసలు..

సైబర్ నేరాల ముఠాల చేతుల్లో చిక్కుకొని విలవిల

47 మంది భారతీయులను రక్షించిన అధికారులు

న్యూఢిల్లీ: విదేశాల్లో ఉద్యోగం అంటే ఎవరికైనా సంబరమే. మంచి జీతం, జీవితం లభిస్తాయన్న నమ్మకంతో విదేశాలకు వెళ్తుంటారు. ఇండియా నుంచి చాలా మంది ఇలాగే లావోస్‌కు చేరుకొని, సైబర్ నేరాల ముఠాల చేతుల్లో చిక్కుకొని అష్టకష్టాలు పడుతున్నారు. సైబర్ బానిసలుగా మారుతున్నారు. కొన్ని ముఠాలు ఉద్యోగాల పేరిట యువతపై వల విసిరి లావోస్‌కు తీసుకెళ్తున్నాయి. అక్కడికెళ్లాక వారితో బలవంతంగా సైబర్ నేరాలు చేయిస్తున్నాయి. ఇండియాలోని జనానికి ఫోన్లు చేసి, ఆన్‌లైన్‌లో డబ్బులు కొల్లగొట్టడమే ఈ సైబర్ బానిసల పని. మాట వినకపోతే వేధింపులు, దాడులు తప్పవు. లావోస్‌లో బొకియో ప్రావిన్స్‌లోని గోల్డెన్ ట్రయాంగిల్ ప్రత్యేక ఆర్థిక మండలి(సెజ్)లో ఏర్పాటైన సైబర్ స్కామ్ సెంటర్లలో చిక్కుకున్న 47 మంది భారతీయులను అక్కడి అధికారులు శనివారం రక్షించారు. వీరిని లావోస్‌లోని భారత రాయబార కార్యాలయంలో అప్పగించారు. బాధితుల్లో 30 మందిని క్షేమంగా స్వదేశానికి తరలించినట్లు రాయబార కార్యాలయం అధికారులు చెప్పారు. మిగిలినవారిని సాధ్యమైనంత త్వరగా తరలించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు.

ఉచ్చులోకి యువత

ఉద్యోగం కోసం ఆశపడి ఉచ్చులో చిక్కుకున్న యువకులను సైబర్ నేరగాళ్లు లావోస్‌కు పంపిస్తున్నారు. అక్కడికి చేరగానే పాస్‌పోర్టు లాక్కుంటారు. బయటకు వెళ్లనివ్వరు. స్కామ్ సెంటర్లలో ఉండిపోవాల్సిందే. యువతుల మాదిరిగా గొంతు మార్చి ఫోన్లలో మాట్లాడాల్సి ఉంటుంది. నకిలీ యాప్‌లలో, ఫేక్ సోషల్ మీడియా ఖాతాల్లో అందమైన యువతుల ఫొటోలు పెట్టి జనాన్ని బురిడీ కొట్టించాలి. రోజువారీ లక్ష్యాలు ఉంటాయి. నిర్దేశించినంత డబ్బు కొల్లగొట్టకపోతే కఠినమైన శిక్షలు విధిస్తారు.

జాబ్ ఆఫర్ అంటే గుడ్డిగా అంగీకరించొద్దు

ఉద్యోగాల కోసం లావోస్ వెళ్లి, సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకున్న 635 మంది భారతీయులను అధికారులు గతంలో రక్షించారు. గత నెలలో ఇండియన్ ఎంబసీ 13 మందిని కాపాడింది. వారిని భారత్‌కు తిరిగి పంపించింది. లావోస్, కాంబోడియా జాబ్ ఆఫర్లు వస్తే గుడ్డిగా అంగీకరించవద్దని, చాలావరకు సైబర్ మోసాలకు సంబంధించినవే ఉంటాయని, యువత అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు. భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ గత నెలలో లావోస్‌లో పర్యటించారు. నేరగాళ్ల ముఠాలు భారతీయ యువతను లావోస్ రప్పించి, బలవంతంగా సైబర్ నేరాలు చేయిస్తుండడంపై లావోస్ ప్రధానమంత్రితో చర్చించారు. సైబర్ ముఠాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

కాళ్లలో మొత్తం పరాన్నజీవులే

ఉడకని పంది మాంసం తిన్న ఫలితం

అమెరికాలో భయానక పరిస్థితిని ఎదుర్కొన్న రోగి ● సీటీస్కాన్‌తో వెలుగులోకి

వాషింగ్టన్: కాళ్ల నుంచి నడుము దాకా నొప్పితో బాధపడుతూ ఆస్పత్రిలో చేరిన రోగికి సిటీ స్కాన్ చేసి ఆ రిపోర్ట్ చూశాక అవాక్కవడం వైద్యుల వంతయింది. అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ ఫ్లోరిడా హెల్త్ జాక్సన్‌విల్లే వైద్యకళాశాలలో ఈ ఘటన చోటుచేసుకుంది. పలు అంశాలపై ప్రజలకు ఆన్‌లైన్‌లో అవగాహన కల్పించే ఒక వైద్యుడి ద్వారా ఈ విషయం వెల్లడైంది. రోగికి తీసిన సీటీ స్కాన్ రిపోర్ట్‌లను చూపిస్తూ పరాన్న జీవులతో ఇబ్బందిపడ్డ ఆ రోగి వివరాలను సామాజిక మాధ్యమం 'ఎక్స్' ద్వారా డాక్టర్ శామ్ ఘలీ వెల్లడించారు. ''అత్యవసర చికిత్స నిమిత్తం ఆగస్ట్ 25వ తేదీన ఆ రోగిని మా ఎమర్జెన్సీ రూమ్‌లో చేర్పించారు. వెంటనే నేను సీటీ స్కాన్ తీయించా. ఆ సీటీ స్కాన్ రిపోర్ట్‌చూశాక నాకు నోట మాటరాలేదు. కాళ్లలో ఎక్కడపడితే అక్కడ పరాన్నజీవులు తిష్టవేశాయి. సరిగా ఉడకని పంది మాంసం తినడం వల్ల రోగి శరీరంలోకి పంది నులిపురుగులు ప్రవేశించి రెండు కాళ్ల కండరాలను మొత్తం ఆక్రమించేశాయి. ఈ విషమ పరిస్థితిని టేనియా సోలియం లేదా సిస్టిసెర్కోసిస్‌గా వ్యవహరిస్తారు.

ఏమిటీ సిస్టిసెర్కోసిస్?

సరిగా ఉడకని, పచ్చి పంది మాసం తినడం వల్ల ఆ మాంసంలోని నులిపురుగులు మానవ శరీరంలోకి ప్రవేశిస్తాయి. దాని లార్వాలు మెదడు, కండరాల్లోకి చొరబడితే ఆరోగ్య పరిస్థితి మరింత దారుణంగా తయారవుతుంది. చర్మం కింద గడ్డలు, తలనొప్పితోపాటు ఇన్ఫెక్షన్ మెదడు, వెన్నుపూస దాకా చేరితే మూర్ఛ వ్యాధి రావొచ్చు. కలుషిత ఆహారం, కలుషిత నీరు, అశుభ్రమైన చేతులు, మనిషి మలం ద్వారా కూడా ఈ నులిపురుగులు వ్యాపిస్తాయి. ఉడికీఉడకని పంది మాంసం ద్వారా లార్వాలు మనిషి పేగుల్లోకి, అక్కడి నుంచి రక్తంలో కలుస్తాయి. రక్తంతోపాటు శరీరమంతా తిరుగుతూ ఎక్కడపడితే అక్కడ లార్వాలు తిష్టవేస్తాయి. తొలి దశలోనే సిస్టిసెర్కోసిస్‌ను గుర్తిస్తే నివారణ చాలా సులభం. ఆలస్యం చేస్తే మాత్రం మరణం ఖాయం. ప్రపంచవ్యాప్తంగా ఏటా 5 కోట్ల మంది ఈ వ్యాధి బారినపడుతున్నారు. అయితే కొందరు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో వ్యాధి ముదిరి ఏటా 50,000 మంది చనిపోతున్నారు. ''యాంటీ-పారాసైట్ థెరపీ, స్టెరాయిడ్లు, న్యూరోసిస్టీసెర్కోసిస్ కోసం యాంటీ-ఎపిలెప్టిక్స్, సర్జరీ ద్వారా ఈ వ్యాధికి చికిత్స చేసుకోవచ్చు. తొలి దశలో సీటీ స్కాన్ చేయిస్తే స్కానింగ్‌లో తెల్ల బియ్యంలాగా ఇవి కనిపిస్తాయి. దాంతో వీటిని గుర్తించవచ్చు. ఇన్ఫెక్షన్ సోకిన 5-12 వారాల్లోగా అవి నులిపురుగులుగా మారతాయి. అప్పుడు సమస్య మరింత జఠిలమవుతుంది. అందుకే తినేటప్పుడు శుభ్రంగా చేతులు కడుక్కోండి'.





బ్రెజిల్‌లో 'ఎక్స్'పై నిషేధం

ప్రతినిధిని నియమించాలంటూ సుప్రీంకోర్టు ఆదేశాలు

ఆ సంస్థ యజమాని ఎలాన్ మస్క్ పట్టించుకోని ఫలితం

సావో పాలో: ఎలాన్ మస్క్‌కు చెందిన సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్'ను నిషేధించేందుకు బ్రెజిల్ యంత్రాంగం నడుం బిగించింది. శనివారం నుంచి ఇంటర్నెట్‌తోపాటు మొబైల్ యాప్ ద్వారా కూడా 'ఎక్స్' అందుబాటులో లేకుండా పోయింది. బ్రెజిల్‌లో 'ఎక్స్'కు న్యాయ ప్రతినిధిని నియమించాలంటూ సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ అలెగ్జాండర్ డీ మొరెస్ ఇచ్చిన ఆదేశాలపై నెల రోజులుగా వివాదం నడుస్తోంది. వాక్ స్వాతంత్ర్యం, దుష్ప్రచారం, అతివాదులు దుర్వినియోగం చేస్తుండటం వంటి కారణాలపై జడ్జి 'ఎక్స్'ను తప్పుబట్టారు. నెల రోజులుగా బ్రెజిల్‌లో 'ఎక్స్'కు ప్రతినిధంటూ ఎవరూ లేకపోవడమేంటని ప్రశ్నించారు. 24 గంటల్లోగా ప్రతినిధిని నియమించకుంటే దేశంలో 'ఎక్స్'ను నిషేధిస్తామని జడ్జి బుధవారం రాత్రి అల్టిమేటం జారీ చేశారు. 'బ్రెజిల్ సార్వభౌమాధికారం, ప్రత్యేకించి న్యాయవ్యవస్థ పట్ల ఏమాత్రం గౌరవం లేనట్లుగా ఎలాన్ మస్క్ వ్యవహరిస్తున్నారు. తనను తాను అత్యున్నతంగా, దేశాల చట్టాలకు అతీతుడిగా భావించుకుంటున్నారు'అని డీ మోరెస్ శుక్రవారం వెలువరించిన ఉత్తర్వుల్లో తీవ్రంగా వ్యాఖ్యానించారు. 'నా ఉత్తర్వులను అమలు చేసేదాకా నిషేధం కొనసాగుతుంది. కాదని ఎవరైనా వీపీఎన్‌ల ద్వారా 'ఎక్స్'ను వాడుకునేందుకు చూస్తే రోజుకు రూ.7.47 లక్షల జరిమానా విధిస్తాం'అని ఆయన స్పష్టం చేశారు. ఎలాన్ మస్క్‌కే చెందిన స్టార్‌లింక్ ఆస్తులను స్తంభింపజేయాలని కూడా గత వారం జడ్జి ఆదేశాలిచ్చారు. జరిమానాలు చెల్లించేందుకు 'ఎక్స్' ఖాతాల్లో చాలినంత డబ్బు లేనందున, ఒకే యాజమాన్యంలోని స్టార్‌లింక్‌పై ఈ మేరకు చర్యలు తీసుకుంటున్నట్లు ప్రకటించారు. స్టార్ లింక్‌కు బ్రెజిల్‌లో 2.50లక్షల మంది ఖాతాదారులున్నారు. కాగా, శనివారం అర్ధరాత్రిలోగా కోర్టు ఉత్తర్వులను అమలు చేయాలని టెలి కమ్యూనికేషన్ల నియంత్రణ విభాగం అనాటెల్ దేశంలోని టెలికం సంస్థలకు స్పష్టం చేసింది. 'ఎక్స్'కున్న అతిపెద్ద మార్కెట్లలో బ్రెజిల్ ఒకటి. దేశ జనాభాలో ఐదో వంతు, సుమారు 4 కోట్ల మంది దీనిని వాడుతున్నారు. నిషేధం అమలు చేయడంతో వేలాది మంది బ్రెజిల్ యూజర్లు వీపీఎన్‌ల ద్వారా ఎక్స్‌ను వాడుకునే పనిలో పడ్డారు. ఇటువంటి వారిని గుర్తించి, జరిమానా వసూలు చేయడమెలాగనే ప్రశ్న తాజాగా అధికారులను వేధిస్తోంది.

తీవ్రంగా స్పందించిన ఎలాన్ మస్క్

బ్రెజిల్ సుప్రీంకోర్టు ఆదేశాలపై 'ఎక్స్' యజమాని ఎలాన్ మస్క్ తీవ్రంగా స్పందించారు. జడ్జి ముసుగులో కొనసాగుతున్న అత్యంత తీవ్ర నేరగాడు అంటూ డీ మొరెస్‌పై నిప్పులు చెరిగారు. ఈ వ్యవహారం కొలిక్కి వచ్చేవరకు తమ స్టార్ లింక్ బ్రెజిల్ వినియోగదారులకు ఉచితంగా ఇంటర్నెట్ అందిస్తుందన్నారు.



దొంగతనం చేశాడంటూ..

కారు బోయ్‌నెట్‌కు కట్టేసి తిప్పారు!

గోధ్రా: దుకాణంలో దొంగతనం చేశాడనే ఆరోపణలపై ఓ వ్యక్తిని చితకబాదడంతోపాటు కారు బోయ్‌నెట్‌పై కట్టేసి తిప్పారు. గుజరాత్ రాష్ట్రం పంచ్‌మహల్ జిల్లా గోధ్రా తాలూకా కంకు థంబ్లా గ్రామంలో ఆగస్ట్ 29న ఈ ఘటన చోటుచేసుకుంది. బాధితుడిని కారు బోయ్‌నెట్‌పై తాడుతో కట్టేసి, మార్కెట్ ఏరియాలో తిప్పుతున్నట్లుగా ఉన్న వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరలయ్యింది. ఈ మేరకు బాధితుడు సుర్జన్ భాభ్రి (30)పై పోలీసులు దొంగతనం యత్నం కింద కేసు నమోదు చేశారు. అతడిని కారుపై కట్టేసి తిప్పినందుకు గాను గణపతి సిన్హ్ పర్మార్, మనుభాయ్ చరణ్‌లపై వివిధ సెక్షన్ల కింద కేసులు పెట్టారు. రూ.30 విలువైన విత్తనాల ప్యాకెట్లు మూడింటిని కొనుగోలు చేసి దుకాణదారుకు రూ.500 నోటు ఇవ్వగా తనకు తిరిగి రూ.470 ఇచ్చాడని, అయినప్పటికీ దొంగతనం నేరం మోపి కొట్టారని భాభ్రి అంటున్నాడు. దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

22 మందితో హెలికాప్టర్ అదృశ్యం

మాస్కో: రష్యాలోని సుదూర కంచట్కా ప్రాంతంలోని వచ్‌కజెట్స్ అగ్ని పర్వతం సమీపంలో ఒక హెలికాప్టర్ అదృశ్యమైంది. శనివారం 22 మందితో టేకాఫ్ తీసుకున్న హెలికాప్టర్ గమ్యస్థానానికి చేరుకోలేదని ఫెడరల్ విభాగం తెలిపింది. ఇందులో 19 మంది ప్రయాణికులు, ముగ్గురు సిబ్బంది ఉన్నారని వివరించింది. రెండు ఇంజిన్లుండే ఎంఐ-8 రకం హెలికాప్టర్లను రష్యాలో ఎక్కువగా వినియోగంలో ఉన్నాయి. ఆగస్ట్ 12వ తేదీన 16 మంది పర్యాటకులతో బయలుదేరిన ఇదే రకం హెలికాప్టర్ కంచట్కాలోని ఓ సరస్సు సమీపంలో కూలిపోయింది.

ప్రజలందరికీ సౌకర్యవంతమైన ప్రయాణమే లక్ష్యం

రైల్వే వ్యవస్థ రూపురేఖలు మార్చేస్తున్నాం

- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టీకరణ
- మూడు నూతన వందేభారత్ రైళ్ల ప్రారంభం

న్యూఢిల్లీ: సమాజంలో అన్ని వర్గాలకు ప్రజలకు సౌకర్యవంతమైన ప్రయాణం అందించేందుకు అంకితభావంతో కృషి చేస్తున్నామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. రైల్వేలకు సంబంధించి సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కారమవుతున్నాయని తెలిపారు. ప్రజలందరికీ మెరుగైన ప్రయాణ సదుపాయాలు అందుబాటులోకి వచ్చే దాకా ఈ పరుగు ఆగదని స్పష్టంచేశారు. మూడు నూతన వందేభారత్ రైళ్లను ప్రధాని మోదీ శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. ఇవి మీరట్-లక్నో, మధురై-బెంగళూరు, చెన్నై-నాగర్‌కోయిల మధ్య రాకపోకలు సాగించనున్నాయి. వందేభారత్ రైళ్ల ఆధునీకరణ, విస్తరణ ద్వారా 'వికసిత్ భారత్' అనే లక్ష్య సాధన దిశగా భారత్ దూసుకెళ్తోందని ప్రధానమంత్రి చెప్పారు. ప్రతి ఒక్కరికీ సౌకర్యవంతమైన ప్రయాణానికి ఇండియన్ రైల్వే ఒక గ్యారంటీగా మారాలన్నదే తమ ధ్యేయమని, అది నేరవేరేదాకా తమ కృషి ఆగదని స్పష్టంచేశారు. భారత రైల్వే శాఖ సాగిస్తున్న అభివృద్ధి ప్రయాణం తమ ప్రభుత్వ అంకితభావానికి ఒక ఉదాహరణ అని వ్యాఖ్యానించారు. వికసిత్ భారత్ దార్శనికతకు ఆధునిక రైల్వే మౌలిక సదుపాయాలు ఒక బలమైన మూలస్తంభమని ఉద్ఘాటించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో రైల్వేశాఖకు రూ.2.5 లక్షల కోట్లకుపైగా కేటాయించినట్లు గుర్తుచేశారు. మన రైల్వే వ్యవస్థ రూపురేఖలు మార్చేస్తున్నామని, హై-టెక్ సేవలతో అనుసంధానిస్తున్నామని వివరించారు.



వర్చువల్‌గా రైళ్లను ప్రారంభించి జెండా ఊపుతున్న మోదీ

దక్షిణాది అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యం

'అభివృద్ధి చెందిన భారత్' అనే మన ఆశయ సాధనకు దక్షిణాది రాష్ట్రాల వేగవంతమైన ప్రగతి చాలా కీలకమని ప్రధాని మోదీ పేర్కొన్నారు. దక్షిణాదిన నిపుణులకు, వనరులకు, అవకాశాలకు కొదవ లేదని చెప్పారు. సౌత్ ఇండియా అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. తమిళనాడు, కర్ణాటక సహా దక్షిణాది రాష్ట్రాల్లో రైళ్ల సంఖ్యను పెంచడానికి బడ్జెట్ కేటాయింపులు ఎన్నో రెట్లు పెంచామని వివరించారు. రైల్వే ట్రాకులు మెరుగుపరుస్తున్నామని, విద్యుదీకరణ వేగం పుంజుకుందని, రైల్వే స్టేషన్లను ఆధునీకరిస్తున్నామని పేర్కొన్నారు. నూతనంగా ప్రవేశపెట్టిన వందేభారత్ రైళ్లతో ప్రయాణ సమయం గణనీయంగా తగ్గిపోతుందని, ప్రయాణికులకు మేలు జరుగుతుందని ప్రధానమంత్రి వెల్లడించారు.

హెలికాప్టర్‌ను కిందికి వదిలేశారు

- మరమ్మతుల కోసం ఐఏఎఫ్ చాపర్‌తో తరలిస్తుండగా ఘటన
- ప్రాణనష్టం సంభవించలేదన్న అధికారులు

రుద్రప్రయాగ(ఉత్తరాఖండ్): దాదాపు మూడు నెలలుగా మరమ్మతుల కోసం ఎదురు చూస్తున్న ఓ హెలికాప్టర్‌ను తరలించేందుకు చేపట్టిన ప్రయత్నం విఫలమైంది. బ్యాలెన్స్ తప్పడంతో ప్రమాదాన్ని శంకించిన వైమానిక దళ(ఐఏఎఫ్) ఎంఐ-17 చాపర్ పైలట్ ఆ హెలికాప్టర్‌ను కొద్దిదూరం వెళ్లాక కిందికి వదిలేయాల్సి వచ్చింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదని అధికారులు తెలిపారు. ఉత్తరాఖండ్‌లోని కేదార్‌నాథ్‌లో శనివారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. క్రిస్టల్ ఏవియేషన్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థకు చెందిన హెలికాప్టర్ మే 24వ తేదీన కేదార్‌నాథ్‌కు తీర్థయాత్రికులతో వచ్చింది. సాంకేతిక సమస్య తలెత్తడంతో ఆ హెలికాప్టర్ గిరికీలు కొడుతూ హెలిప్యాడ్‌కు సమీపంలో ల్యాండయ్యింది. అదృష్టవశాత్తూ అందులోని యాత్రికులు, పైలట్ సహా ఏడుగురు సురక్షితంగా బయటపడ్డారు. అప్పటి నుంచి ఆ హెలికాప్టర్ అక్కడే ఉండిపోయింది. దానిని మరమ్మతుల కోసం గౌచార్‌కు తరలించాలని అధికారులు భావించారు. వైమానిక దళానికి చెందిన ఎంఐ -17 రకం చాపర్ శనివారం ఉదయం దానిని తీసుకుని బయలుదేరింది. గాల్లోకి లేచి ముందుకు సాగిన కొద్దిసేపటికే బ్యాలెన్స్ తప్పింది. హెలికాప్టర్ బరువెక్కువగా ఉండటంతోపాటు, కొండప్రాంతం కావడంతో పైలట్ ప్రమాదాన్ని శంకించారు. అధికారుల సూచనలతో థారు క్యాంప్‌కు సమీపంలోని కొండ ప్రాంతంలో జన సంచారం లేని చోట హెలికాప్టర్‌ను వదిలేశారు. ఈ ఘటనలో ఎటువంటి ప్రాణనష్టం సంభవించలేదని అధికారులు తెలిపారు. ఆ హెలికాప్టర్‌లో ఎటువంటి కూడా సామగ్రి లేదన్నారు. ఘటనాస్థలికి నిపుణుల బృందం చేరుకుని, పరిశీలన చేపట్టినట్లు చెప్పారు. హెలికాప్టర్ కూలిందంటూ వస్తున్న వార్తలను నమ్మొద్దని ప్రజలను కోరారు.

ఖర్కీవ్‌పై రష్యా క్షిపణి దాడి

మాస్కో: ఉక్రెయిన్ నగరం ఖర్కీవ్‌పై రష్యా ప్రయోగించిన క్షిపణి ఆటస్థలంలో పడటంతో 14 ఏళ్ల బాలిక మృత్యువాత పడింది. సరిహద్దులకు సమీపంలోని ఖర్కీవ్‌పైనే జరిపిన మరో దాడిలో 12 అంతస్తుల నివాస భవనం ధ్వంసమయింది. ఘటనలో ఐదుగురు చనిపోగా మరో 59 మంది గాయాలపాలయ్యారు. వీరిలో 9 మంది చిన్నారులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. క్షతగాత్రుల్లో 20 మంది పరిస్థితి విషమంగా ఉందన్నారు. ఘటనలో భవనంలో పెద్ద ఎత్తున మంటలు, దట్టమైన పొగలు వ్యాపించాయి. భవనం వెలుపలి గోడ తీవ్రంగా దెబ్బతింది. సమీపంలో పార్కు చేసిన కార్లు ధ్వంసమయ్యాయి. ఇలా ఉండగా, సరిహద్దులకు సమీపంలోని బెల్గొరోడ్ ప్రాంతంపై ఉక్రెయిన్ ఆర్మీ జరిపిన దాడుల్లో ఐదుగురు చనిపోయినట్లు రష్యా ప్రకటించింది. కాగా, డొనెట్స్క్ రీజియన్‌లోని చాసివ్ యార్ పట్టణంపై రష్యా జరిపిన దాడుల్లో ఏడుగురు మృతి చెందారు. పట్టణంలోని పౌరులందరూ ఖాళీ చేసి వెళ్లిపోవాలని ఆ ప్రాంత గవర్నర్ కోరారు. ఉక్రెయిన్ బలగాల మౌలిక వనరుల రవాణాకు కీలకంగా ఉన్న పొక్రొవ్‌స్క్ నగరానికి అతి సమీపంలో రష్యా బలగాలు తిష్టవేశాయి.

ఎయిర్ ఫోర్స్ చీఫ్ తొలగింపు: ముందుకు చొచ్చుకు వస్తున్న రష్యా బలగాలను నిలువరించి, ఎదురు దాడులు చేయడంలో అమెరికా మిత్ర దేశాలు అందించిన ఎఫ్-16 యుద్ధ విమానాలను ఉక్రెయిన్ కీలకంగా భావిస్తోంది. అయితే, సోమవారం ఒక ఎఫ్-16 యుద్ధ విమానాన్ని రష్యా ఆర్మీ కూల్చి వేసింది. అందులోని పైలట్ కూడా చనిపోయారు. ఘటనను అధ్యక్షుడు జెలెన్‌స్కీ సీరియస్‌గా తీసుకున్నారు. వైమానిక దళం చీఫ్ మికోలా ఒలెశ్‌చుక్‌ను బాధ్యతల నుంచి తొలగిస్తూ శనివారం ఆదేశాలు జారీ చేశారు. అయితే, ఇందుకు కారణాలను మాత్రం ఆయన వెల్లడించలేదు. సైనికుల భద్రతకు ఆయనదే పూర్తి బాధ్యతని మాత్రమే వ్యాఖ్యానించారు.

15మంది ఐఎస్ మిలిటెంట్లు హతం

బాగ్దాద్: ఇస్లామిక్ స్టేట్(ఐఎస్) మిలిటెంట్లే లక్ష్యంగా ఇరాక్, అమెరికా బలగాలు సంయుక్తంగా చేపట్టిన భారీ దాడిలో 15 మంది మిలిటెంట్లు హతమయ్యారు. వీరిలో ఐఎస్ ముఖ్యులున్నట్లు అమెరికా మిలటరీ సెంట్రల్ కమాండ్ తెలిపింది. ఇరాక్ పశ్చిమాన ఉన్న అన్బార్ ఎడారిలో గురువారం చేపట్టిన ఆపరేషన్ సందర్భంగా భారీగా ఆయుధాలు, గ్రెనేడ్లు, ఆత్మాహుతి బెల్టులు బయటపడ్డాయని వెల్లడించింది. ఐఎస్ స్థావరాలను నేలమట్టం చేసి, రవాణా వ్యవస్థలను, ఆయుధాలను ధ్వంసం చేశామని, ఆత్మాహుతి బెల్టులను సురక్షిత ప్రాంతంలో పేల్చేశామని తెలిపింది. ఐఎస్ స్థావరాల నుంచి కీలక పత్రాలను, పలు ఆధారాలను స్వాధీనం చేసుకున్నామంది. అదే సమయంలో తమ సైనికులు ఏడుగురు గాయపడినట్లు వెల్లడించింది.వీరికి ప్రాణాపాయం లేదని వివరించింది. ఇరాకీలతోపాటు అమెరికా మిత్రపక్షాల ప్రముఖులపై దాడులు చేపట్టేందుకు ఐఎస్ చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకుంటూనే ఉంటామని పేర్కొంది. తమ తాజా దాడిలో పౌరులెవరూ చనిపోలేదని స్పష్టం చేసింది. తాము ఐఎస్ స్థావరాలపై వైమానిక దాడులు చేపట్టినట్లు ఇరాక్ సైన్యం తెలిపింది. అయితే, అమెరికా బలగాలతో సంయుక్త ఆపరేషన్ చేపట్టిన విషయం మాత్రం వెల్లడించలేదు. ఇరాక్‌లోని అమెరికా స్థావరంలో ప్రస్తుతం 2,500 సైనికులున్నారు. ఈ విషయం ఇరాక్‌లో రాజకీయ దుమారం రేపుతోంది.

అమెరికా సారథ్యంలోని 80కి పైగా దేశాలు కలిసికట్టుగా జరిపిన పోరులో ఇరాక్, సిరియాల్లో స్వాధీనం చేసుకున్న భూభాగాలను ఐఎస్ కోల్పోయింది. అయినప్పటికీ, సిరియా, ఇరాక్‌ల్లోని అన్బార్ ఎడారిలో ఈ సంస్థ మిలిటెంట్లు నేటికీ కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు.

రోజూ రోటీయేనా?

- కోడిగుడ్డు చామీన్ పెట్టండి
- జైల్లో జూనియర్ వైద్యురాలి రేప్ కేసు నిందితుడు సంజయ్ రాయ్ డిమాండ్

కోల్‌కతా: దేశమంతటా కలకలం సృష్టించిన కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలి హత్యోదంతంలో నిందితుడు సంజయ్ రాయ్ జైల్లోనూ తన మొండితనం చూపిస్తున్నాడు. ప్రతి రోజూ చపాతి ఏం తింటామని జైలు అధికారులపైనే ఆగ్రహం వ్యక్తంచేశాడు. అయితే జైలు నిబంధనల ప్రకారం ఖైదీలతోపాటే విచారణ ఖైదీలకు ఒకేరకమైన భోజనం వడ్డిస్తారు. వైద్యురాలి హత్యకేసులో అరెస్ట్‌చేశాక పోలీసులు సంజయ్‌ను కోల్‌కతాలోని ప్రెసిడెన్సీ కారాగారంలో పడేశారు. అయితే కస్టడీలో ఉన్నప్పటి నుంచి ఒకే తరహా చపాతి, కూరనే రోజూ వడ్డిస్తున్నారని సంజయ్ ఆగ్రహంగా మాట్లాడారు. '' రోజూ రోటీయేనా?. నాకు కోడిగుడ్డు ఫ్రైడ్‌రైస్‌లాంటి ఎగ్ చామీన్ పెట్టండి' అని జైలు సిబ్బందిని బెదిరించినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.



అయితే విచారణ ఖైదీ తనకిష్టమొచ్చింది తింటానని తెగేసి చెప్పడంపై జైలు యాజమాన్యం సీరియస్ అయింది. అతి చేయొద్దని హెచ్చరించి అధికారులు సంజయ్ నోరు మూయించారు. దీంతో పెట్టింది తింటానని సంజయ్ వ్యాఖ్యానించినట్లు సమాచారం . అయితే జైలుకు వచ్చిన కొత్తలో తనకు నిద్ర పట్టట్లేదని, నిద్ర సరిపోవడం లేదని, నన్ను కాస్తంత పడుకోనివ్వండి అని సంజయ్ తెగ ఫిర్యాదులు చేసేవాడని ఇప్పుడు సాధారణ స్థాయికి వచ్చాడని తెలుస్తోంది.

ట్రంప్ ర్యాలీలో మరో భద్రతావైఫల్యం

వాషింగ్టన్: అమెరికా మాజీ అధ్యక్షుడు, అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ ప్రచార ర్యాలీలో మరోసారి భద్రతావైఫల్యం వెలుగుచూసింది. మనిషికి స్వల్ప కరెంట్‌షాక్ ఇచ్చి కుప్పకూల్చే టేజర్ గన్‌తో వచ్చిన ఒక యువకుడిని పోలీసులు అరెస్ట్‌చేశారు. పెన్సిల్వేనియా రాష్ట్రంలోని జాన్స్‌టౌన్ పట్టణంలో మామ్స్ ఫర్ లిబర్టీ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో శుక్రవారం ఈ ఘటన జరిగింది. ట్రంప్ ఇండోర్‌స్టేడియంలో వేదికపై మాట్లాడుతుండగా మీడియా కోసం కేటాయించిన గ్యాలరీ పైకి ఎక్కేందుకు ఒక ఆగంతకుడు ప్రయత్నించాడు. అతడి వద్ద టేజర్‌ను గుర్తించారు. అతడిని రిపబ్లికన్ పార్టీ కార్యకర్తలు అడ్డుకోబోయారు. భద్రతా బలగాలు అతడిని కిందకు దింపేశారు. అయినాసరే అతను అందరినీ తోసేసేందుకు ప్రయత్నించడంతో పోలీసులు బేడీలు వేసి అదుపులోకి తీసుకున్నారు.


అమెరికాలో నేపాల్ యువతి కాల్చివేత

- భారత సంతతి వ్యక్తి అరెస్టు

వాషింగ్టన్: అమెరికాలో నేపాల్ విద్యార్థిని మునా పాండే(21)ను కాల్చి చంపిన కేసులో భారత సంతతికి చెందిన బాబీ సింహ్ సిన్హా(52)ను పోలీసులు అరెస్టు చేశారు. ఈ సంఘటన ఆగస్టు 26న సాయంత్రం 5.30 గంటలకు జరిగిందని చెప్పారు. ఈ కేసు వివరాలను ఆగస్టు 31న వెల్లడించారు. నేపాల్ యువతి మునా పాండే హూస్టన్‌లో కమ్యూనిటీ కాలేజీలో చదువుకుంటూ ఓ అపార్టుమెంట్‌లో ఉంటోంది. తన ఫ్లాట్‌లో ఆమె రక్తపు మడుగులో పడి ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దాంతో పోలీసులు ఫ్లాట్‌కు చేరుకొని పరిశీలించారు. మునా పాండే అప్పటికే మరణించిట్లు గుర్తించారు. తూటా గాయాల వల్లే ఆమె మృతిచెందినట్లు తేల్చారు. దర్యాప్తు వేగవంతం చేశారు. సీసీటీవీ కెమెరాల్లో రికార్డయిన దృశ్యాలను జల్లెడ పట్టారు. అపార్టుమెంట్ నుంచి బయటకు వెళ్తున్న ఓ వ్యక్తి ఫొటో కెమెరాకు చిక్కింది. మునా పాండేను అతడే హత్య చేసినట్లు అనుమానించారు. రోడ్డుపై ట్రాఫిక్ సిగ్నల్ వద్ద ఆగి ఉండగా అదుపులోకి తీసుకొని ప్రశ్నించారు. తన పేరు బాబీ సింహ్ సిన్హా అని, నేపాల్ యువతిని తానే హత్య చేశానని విచారణలో అంగీకరించాడు. దొంగతనం చేయడానికి మునా పాండే ఫ్లాట్‌కు వెళ్లానని, ఆమె ప్రతిఘటించడంతో తుపాకీతో కాల్చి చంపానని అన్నాడు. మునా పాండే అంత్యక్రియలు అమెరికాలోనే నిర్వహించాలని, ఆమె తల్లిని నేపాల్ నుంచి రప్పించాలని అమెరికాలోని నేపాల్ సంఘం సభ్యులు నిర్ణయించారు.



మునా పాండే



బాబీ సింహ్ సిన్హా

హెల్మెట్ ధారణ.. ప్రాణాలకు రక్షణ



విజయనగరం జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ పోలీసులు శనివారం భారీ బైక్ ర్యాలీ చేపట్టి హెల్మెట్ ధారణపై ప్రజలకు అవగాహన కల్పించారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

వర్షంలోనూ లాగాలి.. బతుకు 'బండి'



నెల్లూరు మూలపేటలో శనివారం వర్షం పడుతున్న సమయంలో కుటుంబసభ్యులకు గొడుగు ఏర్పాటు చేసి సిపాయి బండిపై వెళ్తున్న కార్మికుడు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

స్విమ్మింగ్ పూల్ కాదు... స్టేడియమే



శనివారం విజయవాడలో కురిసిన భారీ వర్షానికి విజయవాడ ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో నిలిచిన వర్షపు నీరు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

చంద్రబాబు వెన్నుపోటుకు 29 ఏళ్లు

1995 సెప్టెంబర్ 1.. మామ ఎన్టీఆర్‌ను పదవీచ్యుతుడిని చేసి సీఎం పీఠం ఎక్కిన చంద్రబాబు

- ఎన్టీఆర్‌ని కుటుంబానికి దూరం చేసి, ఏకాకిని చేసి పార్టీని లాక్కున్న చరిత్ర
- అల్లుడు చేసిన ద్రోహం, అవమానాలు తట్టుకోలేక ఆత్మ క్షోభతో చనిపోయిన ఎన్టీఆర్
- 40 ఏళ్ల రాజకీయ జీవితంలో తన ఎదుగుదలలో అన్నీ కుట్రలు, కుతంత్రాలే
- వెన్నుపోటు, నయవంచన, కల్లబొల్లి కబుర్లే చంద్రబాబు విజయ సోపానాలు
- పైకి మాత్రమే విజనరీ, లోపల రాజకీయ బేహారి
- తెలుగు రాష్ట్రాల్లో రాజకీయాలను భ్రష్టు పట్టించిన వ్యక్తి బాబు
- వంగవీటి రంగా హత్యలోనూ కీలక పాత్ర
- బషీర్‌బాగ్ కాల్పుల ఘటన బాబు పైశాచికత్వానికి పరాకాష్ట
- రాష్ట్ర విభజన తర్వాత అమరావతిలో అంతర్జాతీయ స్థాయి కుంభకోణం



సాక్షి, అమరావతి: వెన్నుపోటుకు చంద్రబాబే ప్రపంచ బ్రాండ్. ఆయనకు ఈ ఘనత వచ్చి నేటితో సరిగ్గా 29 ఏళ్లు నిండింది. 30వ సంవత్సరంలోకి అడుగిడుతోంది. పిల్లనిచ్చిన సొంత మామ ఎన్టీఆర్‌నే అధికార దాహంతో వెన్నుపోటు పొడిచి, ఆయనపై చెప్పులేయించి, 1995 సెప్టెంబర్ 1న చంద్రబాబు సీఎం పీఠాన్ని ఎక్కారు. అప్పటి నుంచి తన అస్థిత్వాన్ని కాపాడుకోవడానికి రాజకీయాలను భ్రష్టు పట్టించారు. రాజకీయాలను డబ్బు మయం చేసి, కుట్రలు, కుతంత్రాలతో 3 దశాబ్దాలుగా నాయకుడిగా చలామణి అవుతున్నారు. అప్పటి వెన్నుపోటుకు మూడు దశాబ్దాలు పూర్తవుతున్న సందర్భంగా తనను గొప్పగా కీర్తిస్తూ ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా సంబరాలు జరపాలని టీడీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

చంద్రబాబును దశమ గ్రహంతో పోల్చిన ఎన్టీఆర్

చంద్రబాబుకు ఎన్టీఆర్ తన కుమార్తెను ఇచ్చి పెళ్లి చేస్తే.. ఆయన మామ ఎన్టీఆర్‌కే వెన్నుపోటు పొడిచి రిటర్న్ గిఫ్ట్ ఇచ్చారు. ఎన్టీఆర్ కుటుంబ సభ్యులను ట్రాప్‌లో పడేసి వెన్నుపోటు ప్రహసనంలో పావులుగా వాడుకున్నారు. ఎన్టీఆర్‌కు ద్రోహం చేసి పదవి నుండి తప్పించారు. ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీని, గుర్తును సొంతం చేసుకున్నారు. ఈ తిరుగుబాటులో ఎమ్మెల్యేలంతా చంద్రబాబు మాయలో పడ్డారని గ్రహించిన ఎన్టీఆర్.. పార్టీ ఎమ్మెల్యేలను ఒప్పించడానికి వైస్రాయ్ హోటల్‌కు వెళ్తే చంద్రబాబు దగ్గరుండి ఎన్టీఆర్‌పై చెప్పులు వేయించి దాడి చేశారు. ఈ ఘోరమైన అవమానాన్ని ఎన్టీఆర్ తట్టుకోలేకపోయారు. ఆత్మ గౌరవానికి అత్యధిక ప్రాధాన్యతనిచ్చే ఎన్టీఆర్ తనకు జరిగిన అవమానంతో కుంగిపోయారు. ఆ క్షణమే తాను చచ్చిపోయినట్లు లెక్క అని కంటతడి పెట్టి ఆక్రోశించారు. అక్కడితో ఆగకుండా ఎన్టీఆర్ బ్యాంకు ఖాతాను చంద్రబాబు ఫ్రీజ్ చేయించారు. ఎన్టీఆర్ కుర్చీని కబ్జా చేసిన చంద్రబాబు అసెంబ్లీలోనూ ఆయన్ని అవమానించారు. సినిమాల్లో, రాజకీయాల్లోనూ తనదైన శైలిలో ఒక వెలుగు వెలిగిన ఎన్టీఆర్ తన జీవిత చరమాంకంలో సొంత మనుషుల చేతుల్లోనే ఘోరమైన అవమానాలు పొంది కంట తడి పెట్టుకున్నారు. చంద్రబాబుని ఎన్టీఆర్ దశమ గ్రహంగా, ఔరంగజేబుగానూ పోల్చారు. చంద్రబాబు పరివారం పెట్టిన మానసిక క్షోభతోనే ఎన్టీఆర్ కన్ను మూశారన్నది చరిత్ర చెప్పే విషయం. ఎన్టీఆర్ మరణానంతరం ఆయన ఆనవాళ్లు లేకుండా చేసేందుకు చంద్రబాబు అనేక నిర్ణయాలు తీసుకున్నారు. ఎన్టీఆర్ తెచ్చిన మద్య నిషేధం, రెండు రూపాయల బియ్యం పథకాలను ఎత్తివేశారు. రైతులకు నీటి రాయితీని తొలగించారు. అటు పార్టీలోనూ ఎన్టీఆర్ జ్ఞాపకాలు లేకుండా చెరిపేశారు. ఇలా అనేక చర్యలతో ఎన్టీఆర్‌ను ప్రజలకు దూరం చేసేందుకు ప్రయత్నించారు. ఎన్టీఆర్‌ను అడుగడుగునా అవమానాలకు గురి చేస్తూ అనుక్షణం క్షోభ పెట్టిన చంద్రబాబు.. రాజకీయ అవసరాలకు మాత్రం ఎన్టీఆర్ పేరు, బొమ్మ వాడేసుకుంటారు. ఎన్టీఆర్ గురించి గొప్పగా చెబుతూ నిజ జీవితంలో ఎన్టీఆర్‌ను మించిన మహానటుడి పాత్ర పోషిస్తున్నారు. అప్పట్లో ఎన్టీఆర్‌కు వ్యతిరేకంగా అన్ని దారుణాలు చేసిన చంద్రబాబు ఇప్పుడు అదే ఎన్టీఆర్‌ను ఆకాశానికి ఎత్తేలా పొగడడం రాజకీయ వైచిత్రేనంటారు రాజకీయ విశ్లేషకులు.

బాబు హయాంలో అనేక నేరాలు, ఘోరాలు

1995లో ఎన్టీఆర్‌ను ద్రోహపూరితంగా గద్దె దించి, తాను పీఠమెక్కింది మొదలు చంద్రబాబు రాజకీయం, పరిపాలన మొత్తం కుట్రలు, కుతంత్రాలు, స్వార్థ ప్రయోజనాలే. 1995 – 2004 మధ్య కాలంలో ఉమ్మడి ఏపీని ప్రపంచ బ్యాంకుకు తాకట్టు పెట్టారనే విమర్శలున్నాయి. »ప్రపంచ బ్యాంకు జీతగాడు, చంద్రబాబు మాయగాడు« అంటూ అప్పట్లో కమ్యూనిస్టులు ప్రత్యేక పాటలు రచించి ప్రచారం చేశాయంటే ఆయన ఏ స్థాయిలో ప్రజలను వంచించారో అర్థం చేసుకోవచ్చు. హైటెక్ సిటీ నిర్మాణం పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసి కోట్లు కూడగట్టారు. ఏలేరు స్కాం, తెల్గీ స్టాంపులు, మద్యం ముడుపులు, పనికి ఆహార పథకం వంటి కుంభకోణాలు అనేకం వెలుగు చూశాయి. అప్పట్లోనే 'చంద్రబాబు జమానా–అవినీతి ఖజానా' అని సీపీఎం పార్టీ ఒక పుస్తకాన్ని విడుదల చేసి రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం చేసింది. రాజకీయాల్లో ప్రత్యర్థులను వర్గ శత్రువులుగా పరిగణించి రాయలసీమలో ఫ్యాక్షన్ ను రాజేశారు. అనంతపురం జిల్లాలో ప్రత్యర్థి రాజకీయ పార్టీకి చెందిన వందలాది మందిని వెంటాడి వేటాడి చంపేయడంలో కీలక భూమిక పోషించారనే విమర్శలు అప్పట్లో బలంగా వినిపించాయి. విద్యుత్ ఛార్జీలను అడ్డగోలుగా పెంచడంతో ప్రజలు ఉద్యమించి శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే 2000 సంవత్సరంలో వారిపై కాల్పులు జరిపించిన చరిత్ర చంద్రబాబుది. ఈ ఘటనలో ముగ్గురు చనిపోవడం అప్పట్లో తీవ్ర సంచలనంగా మారి చంద్రబాబు రాక్షసత్వాన్ని బయటపెట్టింది. అంతకు ముందు తణుకు సమీపంలోని కాల్ధరి రైల్వేస్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న రైతులపై కాల్పులు జరిపించి ఒక రైతు మృతికి కారకుడయ్యారు. వీటన్నింటిపైనా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అలుపెరగని పోరాటం చేశారు. దాని పర్యవసానమే 2004 ఎన్నికల్లో చంద్రబాబు చిత్తుగా ఓడిపోయి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అధికారంలోకి వచ్చారు.

రంగా హత్యలోనూ తెరవెనుక పాత్ర!

రాష్ట్రంలో 1985 ఎన్నికల్లో విజయవాడ తూర్పు నియోజకవర్గం నుంచి భారీ మెజార్టీతో గెలుపొందిన వంగవీటి మోహన రంగా తిరుగులేని నాయకుడిగా ఆవిర్భవించారు. రంగాను అడ్డు తొలగించుకోకపోతే కోస్తాలో రాజకీయ మనుగడ ఉండదని చంద్రబాబు భావించారని చెబుతారు. అందుకే అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌కు తెలియకుండా కుట్ర చేసి.. 1988 డిసెంబర్ 26న ప్రజా సమస్యల పరిష్కారం, వ్యక్తిగత భద్రత కోసం ఆమరణ దీక్ష చేస్తున్న రంగాను అతి దారుణంగా హత్య చేయించడంలో చంద్రబాబు కీలక పాత్ర పోషించారని సీనియర్ నేత చేగొండి హరిరామజోగయ్య తన ఆత్మకథలో రాశారు.

రాష్ట్ర విభజన తర్వాత మళ్లీ కుంభకోణాలు

రాష్ట్ర విభజన తర్వాత ప్రజలను ఏమార్చి దొంగ హామీలతో 2014లో మళ్లీ అధికారంలోకి వచ్చిన చంద్రబాబు రాష్ట్రాన్ని అవినీతి మయం చేశారు. జన్మభూమి కమిటీల పేరుతో ప్రజలను పీక్కు తిన్నారు. అమరావతి రాజధాని పేరుతో చేసిన అంతర్జాతీయ కుంభకోణంతో ప్రపంచమే ఆశ్చర్యపోయింది. రాజధాని కోసం రైతులపై దౌర్జన్యాలకు పాల్పడి బలవంతపు భూసమీకరణ చేశారు. అసైన్డ్ భూములను లాక్కోవడం, ఇన్‌సైడర్ ట్రేడింగ్, ఇన్నర్ రింగు రోడ్డు అలైన్‌మెంట్ మార్పు, స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం, విశాఖలో లక్ష ఎకరాల భూ కుంభకోణం, నీరు–చెట్టు కార్యక్రమంలో అవినీతి వంటి లెక్కలేనన్ని వ్యవహారాలు బయటకు వచ్చాయి. ఈ నేపథ్యంలో 2019 ఎన్నికల్లో ప్రజలు చంద్రబాబుని మరోసారి చిత్తుగా ఓడించారు. ఆ తర్వాత స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో ఏకంగా అరెస్టయి జైలుకు వెళ్లారు. ప్రజలను మాయ చేసి కనీవినీ ఎరుగని అబద్ధాలు, దొంగ హామీలతో ఇటీవల జరిగిన ఎన్నికల్లో చంద్రబాబు మళ్లీ అధికారంలోకి వచ్చారు. వెన్నుపోట్లు, మోసం, నయవంచనతో రాజకీయ జీవితాన్ని నిర్మించుకున్న చంద్రబాబు తనను ఒక విజనరీగా చూపించేందుకు ఎల్లో మీడియాను ఉపయోగించుకున్నారు. చంద్రబాబు చెప్పుచేతల్లో ఉండే ఈ మీడియా ఆయన్ని అవతార పురుషుడిగా, అభివృద్ధి ప్రదాతగా కీర్తిస్తూ నిత్యం ప్రజలను ఏమారుస్తూనే ఉంటుంది. మీడియా హైప్, సొంత డబ్బా కొట్టుకోవడంలోనే ఆయన విజన్ కనిపిస్తుంది తప్ప నిజానికి చంద్రబాబు ఒక దారి తప్పిన, మోసపూరిత నాయకుడు. అలవికాని హామీలు ఇచ్చి అధికారంలోకి రావడం, ఆ తర్వాత వంచించడం ఆయన నైజం. వీటన్నింటినీ దాచి చంద్రబాబును గొప్ప నేతగా టీడీపీ శ్రేణులు, ఎల్లో మీడియా కీర్తించడంపై రాజకీయ విశ్లేషకులు పెదవి విరుస్తున్నారు.

క్లుప్తంగా...

సమగ్రమైన కౌలు చట్టం చేయాలి

కౌలు రైతు సంఘాల నేతల డిమాండ్

సాక్షి, అమరావతి/ గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): గ్రామసభల్లోనే నేరుగా కౌలు రైతులను గుర్తించి భూ యజమాని సంతకంతో సంబంధం లేకుండా గుర్తింపు కార్డులు జారీ చేసేలా రాష్ట్ర ప్రభుత్వం నూతన కౌలు చట్టం తేవాలని వివిధ రైతు, కౌలు రైతు సంఘాల నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విజయవాడ ప్రెస్ క్లబ్‌లో ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం ఆధ్వర్యంలో కౌలు చట్టం రూపకల్పనపై శనివారం రాష్ట్రస్థాయి చర్చాగోష్టి కార్యక్రమం ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాటమయ్య అధ్యక్షతన జరిగింది. తొలుత కౌలురైతుల రక్షణ సంక్షేమం కోసం ఆంక్షలు, ఆటంకాలు లేని సమగ్రమైన కౌలు చట్టం తీసుకు రావాలని డిమాండ్ చేస్తూ ఏపీ కౌలురైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. చట్టం తెచ్చే ముందు క్షేత్రస్థాయిలో రైతులు, కౌలురైతుల సంఘాల ప్రతినిధులతో చర్చలు జరిపి వారి అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు.

'షూటర్లు భారత జాతికే గర్వకారణం'

విజయవాడ స్పోర్ట్స్: భారత షూటర్లు దేశానికే గర్వకారణమని రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఆర్.పి.సిసోడియా అన్నారు. 24వ రాష్ట్ర స్థాయి రైఫిల్ షూటింగ్ పోటీల్లో పతకాలు సాధించిన 180 మంది క్రీడాకారులకు విజయవాడ క్లబ్‌లో శనివారం సాయంత్రం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన పతకాలు, సర్టిఫికెట్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ పతకాలతో పాటు ఒలింపిక్ పతకాలు సాధించిన భారత షూటర్లను క్రీడాకారులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

కృష్ణాజలాల వివాదంపై అఖిలపక్షం నిర్వహించాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు



సాక్షి, అమరావతి: కృష్ణా జలాల పంపిణీ వివాదం నేపథ్యంలో అఖిల పక్ష సమావేశం జరపాలని, రాష్ట్ర దీర్ఘకాల ప్రయోజనాల రీత్యా అన్ని రాజకీయ పార్టీలు, రైతు సంఘాల అభిప్రాయాలను తీసుకొని ముందుకు వెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. విజయవాడ మొగల్రాజపురంలో కొండచరియలు విరిగిపడి ఐదుగురు మృతి చెందడం విచారకరమన్నారు. మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రభుత్వం రూ.25 లక్షల చొప్పున నష్టపరిహారం ప్రకటించాలని డిమాండ్ చేశారు.

చంద్రబాబు.. ఎన్డీయేకు మద్దతు ఉపసంహరించుకో

సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ



తిరుపతి కల్చరల్: నియంతలా వ్యవహరిస్తున్న ప్రధాని మోదీకి ఏపీ సీఎం చంద్రబాబు మద్దతు ఉపసంహరించుకోవాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ డిమాండ్ చేశారు. ఏపీలో పెరిగిన భూ అక్రమాలపై నిష్పక్షపాతంగా విచారణ చేయాలని, యాప్ రుణాల పేరుతో వేధించే వారిని కట్టడి చేయాలని కోరారురు. కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం సంక్షోభంలో పడిందని మోదీని మార్చాలని బీజేపీ నేతలే అంటున్నారని చెప్పారు. శనివారం తిరుపతిలోని సీపీఐ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 2019లో బీజేపీకి 300కు పైగా సీట్లు వచ్చాయని, 2024 ఎన్నికల్లో బీజేపీ సొంతంగా 400 సీట్లు సాధిస్తామని మోదీ ఢంకా మోగించినా చివరకు 240కే పరిమితం కావాల్సి వచ్చిందన్నారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు



తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 17 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధ రాత్రి వరకు 65,080 మంది స్వామివారిని దర్శించుకోగా 27,394 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.80 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్లో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది.

నేటి నుంచి యజుర్వేద పారాయణం

లోక కళ్యాణార్థం టీటీడీ నిర్వహిస్తున్న చతుర్వేద పారాయణంలో భాగంగా సెప్టెంబర్ 1 నుంచి తిరుమల శ్రీవారి ఆలయంలో 4వ విడత శుక్ల యజుర్వేద పారాయణం ప్రారంభం కానుంది. చతుర్వేద పారాయణంలో భాగంగా జూలై 1న ప్రారంభమైన సామవేద పారాయణం ఆగస్టు 31న ముగిసింది. శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో ప్రతిరోజు ఉదయం 9 నుంచి 10 గంటల మధ్య వేద పండితులు శుక్ల యజుర్వేదం పారాయణం చేయనున్నారు.

వర్షంలోనూ పోటెత్తిన భక్తులు

సాక్షి, నెట్‌వర్క్: ఓ వైపు జోరుగా వర్షాలు కురుస్తున్నా రాష్ట్రంలోని ప్రధాన ఆలయాల్లో భక్తుల రద్దీ మాత్రం తగ్గలేదు. అన్నవరం, సింహాచలం, ఇంద్రకీలాద్రి, ద్వారకాతిరుమల, ఒంటిమిట్ట, మంగళగిరి, ద్రాక్షారామం, శ్రీకూర్మం, శ్రీముఖలింగం తదితర క్షేత్రాల్లో మూలవరులను దర్శించుకోవడానికి భక్తులు భారీగా తరలివచ్చారు.



వైభవంగా మహా పూర్ణాహుతి



ద్వారకాతిరుమల: ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల శ్రీవారి క్షేత్రానికి దత్తత దేవాలయమైన లక్ష్మీపురం ఆలయంలో 3 రోజులుగా జరుగుతున్న శ్రీనివాసుని దివ్య పవిత్రోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఆలయంలో పవిత్రావరోహణ, పూర్ణాహుతి, మహా శాంతి హోమాన్ని అర్చకులు, పండితులు వైభవంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఉంచి ప్రత్యేక పుష్పాలంకారాలు చేశారు. ఆలయ పండితులు, అర్చకులు స్నపన, తిరుమంజనాలను జరిపి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి మూలవిరాట్, పద్మావతి, ఆండాళ్ అమ్మవార్లపై, ఇతర దేవతామూర్తులపై ఉంచిన దివ్య పవిత్రాలను తొలగించారు. యాగశాలలో మహా పూర్ణాహుతి వేడుకను వైభవోపేతంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆలయ డీఈవో బాబూరావు, సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

నందనందనా గోవింద



ఆత్రేయపురం: వాడపల్లి క్షేత్రం శనివారం భక్తజన సంద్రమైంది. కలియుగ దైవంగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామివారి దివ్యక్షేత్రం భక్తులతో పోటెత్తింది. ఉదయం నుంచి వర్షం కురుస్తున్నా రద్దీ ఎక్కడా తగ్గలేదు. దీంతో విశిష్ట, వీఐపీ, ఉచిత దర్శనాల క్యూ లైన్లు పోటెత్తాయి. 40 వేల మంది స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి దర్శనాలకు అనుమతి ఇచ్చారు.

3న చిత్తూరులో ఉద్యోగ మేళా

చిత్తూరు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ


చిత్తూరు కలెక్టరేట్: చిత్తూరు జిల్లాలోని నిరుద్యోగులు ఉద్యోగ మేళా ను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో ఉద్యోగ మేళా పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 3న జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల, పలమనేరులోని ఎస్వీసీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఉద్యోగమేళా నిర్వహిస్తారన్నారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, డీఆర్‌డీఏ సంయుక్తంగా ఉద్యోగ మేళా నిర్వహిస్తారని తెలపారు. ఈ ఉద్యోగమేళాలో 10 కంపెనీలు పాల్గొంటాయని చెప్పారు. పదవ తరగతి నుంచి డిగ్రీ వరకు పాస్, ఫెయిల్ అయిన అభ్యర్థులు ఉద్యోగ మేళా పాల్గొనవచ్చన్నారు. 18–35 సంవత్సరాల మధ్య వయసు ఉన్న వారు అర్హులని తెలిపారు.

దివ్యాంగులకు ఉద్యోగ అవకాశాలు

చిత్తూరు కలెక్టరేట్: చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని దివ్యాంగులకు డ్రీం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ శ్రీనివాస్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో దివ్యాంగుల కోసం డ్రీం ఫౌండేషన్ ఆధ్వర్యం లో శిక్షణా కేంద్రాన్ని స్థాపించడం జరిగిందన్నారు. ఈ శిక్షణా కేంద్రంలో వివిధ రకాల కోర్సులకు ఉచితంగా శిక్షణ ఇచ్చి తద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామ ని చెప్పారు. బీపీఓ, కంప్యూటర్ అసిస్టెంట్, డీటీపీ, మ్యానుఫ్యాక్చరింగ్, రీటైల్, హోటల్ మేనేజ్‌మెంట్, ఈ కామర్స్, స్పోకెన్ ఇంగ్లీష్ శిక్షణ తరగతులు, టైపింగ్, పర్సనల్ డెవలప్‌మెంట్ లో శిక్షణ ఇస్తామన్నారు. ఈ శిక్షణకు పది పాస్, ఫెయిల్ అయిన వారు అర్హులన్నారు. 18–32 ఏళ్ల వరకు వయస్సు కలిగి 40 శాతం వికలత్వం తో సదరం సర్టిఫికెట్ గల వారు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న వారు ఈ నెల 4న తిరుపతి జిల్లా కేంద్రంలోని రాస్ కార్యాలయంలో హాజరుకావాలన్నారు.

ఎనర్జీ సోర్సెస్‌పై అంతర్జాతీయ సదస్సు

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో శనివారం రీన్యూవబుల్ ఎనర్జీ సోర్సెస్ అండ్ అప్లికేషన్స్‌పై అంతర్జాతీయ సదుస్సు నిర్వహించారు. ప్రధానంగా ఇవొల్యూషన్ ఆఫ్ బ్యాటరీస్, సోలార్ థిన్‌ఫిలిమ్స్ అనే అంశాలపై సదస్సులో చర్చించారు.



ఓఆర్ఐ నూతన వెబ్‌సైట్ ప్రారంభం

తిరుపతి సిటీ: ఎస్వీయూ ఓరియంటల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఓఆర్ఐ) కోసం వీసీ డాక్టర్ సీహెచ్ అప్పారావు శనివారం నూతన వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ఓఆర్ఐ అనేది అమూల్యమైన తాళపత్రాలు, గత తరాల జ్ఞానాన్ని భద్రపరిచే రచనల నిధి అని చెప్పారు. నూతన వెబ్‌సైట్ ప్రపంచంలోని పండితులకు, పరిశోధకులకు, ఔత్సాహికులకు విస్తారమైన జ్ఞానాన్ని అందిస్తుందన్నారు. భారతీయ జ్ఞాన సంపదను ప్రపంచానికి అందించడమే ఈ వెబ్‌సైట్ లక్ష్యమన్నారు. రాత పత్రాలను సేకరించడం, డిజిటలైజ్ చేసి ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచాలనే ఉద్దేశంతోనే నూతన వెబ్‌ను ప్రారంభించామన్నారు. మరిన్ని విషయాలపై అవగాహన పెంచుకునేందుకు WWW.SVUORI.COM వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.

సాక్షి ప్లస్
ఆదివారం । 1-9-2024

అత్యంత కఠిన లోహం టంగ్‌స్టన్

మన పూర్వీకుల లోహశాస్త్ర ప్రావీణ్యానికి ప్రతీక ఢిల్లీలోని ఇనుప స్తంభం. గత 1600 ఏళ్లుగా అది తుప్పు పట్టలేదు. దాని తయారీలో పాస్ఫరస్ శాతాన్ని పెంచి సల్ఫర్, మెగ్నీషియం లేకుండా చూడటమే అది తుప్పు పట్టకపోవడానికి కారణం. సాధారణంగా తీర ప్రాంతాల్లో తేమ ఎక్కువగా ఉంటుంది. దీనివల్ల ఇనుము త్వరగా తుప్పు పడుతుంది. కానీ ఒడిశా తీరప్రాంతంలోని కోణార్క్ సూర్యదేవాలయంలో వాడిన ఇనుప దూలాలు, పశ్చిమ తీరంలో కొల్లూర్‌లో ఉన్న మూకాంబికా ఆలయంలోని ఇనుప స్తంభం తుప్పు పట్టలేదు. వాటి తయారీలో వాడిన ఐరన్ మిశ్రమ లోహంలో పాస్ఫరస్ గాఢత ఎక్కువగా ఉండటమే దీనికి కారణమని పరిశోధనలో తేలింది.

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
రసాయన శాస్త్రం

మిశ్రమ లోహాలు

రెండు లేదా అంతకంటే ఎక్కువ లోహాలు లేదా ఒక లోహంతోపాటు ఇతర మూలకాల సజాతీయ మిశ్రమమే మిశ్రమ లోహం. శుద్ధ లోహాలతో పోల్చినప్పుడు మిశ్రమ లోహాల ధర్మాలు కాస్త భిన్నంగా ఉంటాయి.


మిశ్రమ లోహాలు -ఇతరాంశాలు

- ఇనుము ఒక అనుఘటకంగా ఉన్న మిశ్రమ లోహాలను ఫెర్రస్ మిశ్రమ లోహాలు అంటారు. ఉదా: స్టెయిన్‌లెస్ స్టీలు (ఐరన్ + కార్బన్ + క్రోమియం)
- ఐరన్ లేని మిశ్రమ లోహాలను నాన్ ఫెర్రస్ మిశ్రమ లోహాలు అంటారు. ఉదా: జర్మన్ సిల్వర్ (కాపర్ + జింక్ + నికెల్)
- పాదరసం(మెర్క్యురీ)ఒక అనుఘటకంగా ఉన్న మిశ్రమ లోహాన్ని అమాల్గం అంటారు. ఉదా: సోడియం అమాల్గం (మెర్క్యురీ + సోడియం)
- ఐరన్, ప్లాటినం లోహాలు అమాల్గంను ఏర్పరచవు.
- దంతాల్లోని రంధ్రాలను ఫిల్లింగ్ చేయడానికి డెంటల్ అమాల్గంను ఉపయోగిస్తారు. ఇది మెర్క్యురీ,సిల్వర్,టిన్, కాపర్‌ల మిశ్రమ లోహం.
- సాంకేతికంగా మిశ్రమ లోహాన్ని ఘనరూపంలో ఉన్న ద్రవంగా పరిగణించవచ్చు.
- మిశ్రమ లోహాల వల్ల పదార్థ గట్టిదనం పెరుగుతుంది.
- వీటి సాగే గుణం తక్కువగా ఉంటుంది.
- ద్రవీభవన స్థానం తక్కువ.
- తుప్పు పట్టే గుణం తగ్గుతుంది.
- విద్యుత్ వాహకత తగ్గుతుంది.
- లోహ కాంతిని, రంగును మెరుగుపర్చవచ్చు.
- చర్యాశీలత మార్చవచ్చు.
- ఆమ్లాలను, క్షారాలను తట్టుకునే గుణం పెరుగుతుంది.
- బంగారు ఆభరణాల స్వచ్ఛతను క్యారెట్ ప్రమాణాల్లో కొలుస్తారు.
- 24 క్యారెట్ల బంగారంలో 100శాతం బంగారం ఉంటుంది. xక్యారెట్ల బంగారంలో (x×100)/24 శాతం బంగారం ఉంటుంది. ఒక క్యారెట్ 100/24 శాతం బంగారానికి సమానం. 18 క్యారెట్ల బంగారు ఆభరణాల్లో (18×100)/24=75 శాతం బంగారం, మిగతా 25 శాతం రాగి ఉంటుంది. 22 క్యారెట్ల బంగారు ఆభరణాలు 91.6 శాతం స్వచ్ఛత కలిగి ఉంటాయి. మిగతా 8.4 శాతం రాగి ఉంటుంది.

తుప్పు పట్టడం: లోహం తుప్పు పట్టడమనేది ఆక్సీకరణ ప్రక్రియ. ఉదా: ఇనుము తుప్పు పట్టినప్పుడు ఆక్సీకరణం చెంది ఐరన్ ఆక్సైడ్ (ఫెర్రిక్ ఆక్సైడ్) ఏర్పడుతుంది. ఈ ప్రక్రియలో దాని బరువు పెరుగుతుంది. సాధారణంగా గాలిలో తేమ ఎక్కువగా ఉండే తీరప్రాంతాల్లో తుప్పుపట్టడం వేగంగా జరుగుతుంది.

గాల్వనైజేషన్: ఇనుము లాంటి లోహాలు తుప్పు పట్టకుండా వాటిపై జింక్ లాంటి లోహాలతో పూత పూయడాన్నే గాల్వనైజేషన్ అంటారు. గాల్వనైజేషన్ చేయడం వల్ల ఇనుము క్షయం కాకుండా నివారించవచ్చు. గాల్వనైజేషన్ చేయడానికి ఎక్కువ చర్యాశీలత ఉన్న లోహాన్ని తీసుకుంటారు. ఉదా: జింక్ క్రియాశీలత ఎక్కువ కాబట్టి దీంతో ఇనుముపై పూత పూయడం వల్ల ఇది క్షయం చెంది ఐరన్‌ను పరిరక్షిస్తుంది.

- ఎలక్ట్రోప్లేటింగ్‌లో కావాల్సిన లోహపు పూతను విద్యుద్విశ్లేషణ పద్ధతిలో వేస్తారు. ఏ లోహంపై పూత పూయాలో దాన్ని కాథోడ్ (రుణధ్రువం)గా, పూతపూయాల్సిన లోహమున్న లవణ ద్రావణాన్ని విద్యుద్విశ్లేష్యం (ఎలక్ట్రోలైట్)గా తీసుకుంటారు. ఉదా: కారు విడిభాగాలు,కుళాయిలు,గ్యాస్ బర్నర్‌లపై క్రోమియం ప్లేటింగ్ చేస్తారు. దీనివల్ల తుప్పు పట్టవు. మన్నిక పెరుగుతుంది. నకిలీ నగల తయారీలో కూడా ఈ పద్ధతిని ఉపయోగిస్తారు.
- మెర్క్యురీ తప్ప మిగతా లోహాలన్నీ ఘన పదార్థాలే. పాదరసం(మెర్క్యురీ) మాత్రం ద్రవం. గాలియం అతి తక్కువ ఉష్ణోగ్రత వద్ద కరిగే లోహం.
- లిథియం, సోడియం, పొటాషియం, రుబీడియం, సీసియం లాంటి క్షారలోహాలు మెత్తని లోహాలు. ఇవి కత్తితో కోయగలిగేంత మృదువైనవి.
- లోహాలు మంచి విద్యుత్ వాహకాలు. స్వేచ్ఛా ఎలక్ట్రాన్లు విద్యుత్‌ను మోసుకెళ్తాయి(ఎలక్ట్రాన్ కండక్టర్). లోహాలన్నింటిలో సిల్వర్ మంచి విద్యుత్ వాహకం. గృహావసరాల కోసం రాగి వైర్లను వాడితే, విద్యుత్ పంపిణీ సంస్థలు అల్యూమినియం వైర్లను ఉపయోగిస్తాయి.
- అనాది నుంచి నాణేల తయారీలో ఉపయోగించిన బంగారం, సిల్వర్, కాపర్ లోహాలను కాయినేజ్ మెటల్స్ అంటారు.
- బంగారానికి రేకులుగా సాగే గుణం ఎక్కువ. దీనిపై గీతలు పడవు. ఆభరణాలను తయారుచేసేటప్పుడు గట్టిదనం కోసం బంగారానికి రాగిని కలుపుతారు.
- అత్యంత తేలికైన లోహం లిథియం. అత్యంత మృదువైన లోహం సీసియం.
- అత్యంత కఠిన లోహం టంగ్‌స్టన్.
- మానవుడు విరివిగా వాడే లోహం ఇనుము. మన రక్తంలోని హిమోగ్లోబిన్‌లో ఐరన్ (ఫెర్రస్) అయాన్లు ఉంటాయి.
- మొక్కల్లోని పత్రహరితంలో మెగ్నీషియం, విటమిన్ B_{12} (సయనోకోబాలమిన్)లో కోబాల్ట్ లోహాల అయాన్లు ఉంటాయి.
- భూమి పొరల్లో అత్యధికంగా లభించే లోహం అల్యూమినియం. దీనికి బాక్సైట్ గనులు ఆధారం. సిల్వర్ పెయింట్‌లో సిల్వర్ ఉండదు. అల్యూమినియం ఉంటుంది. గోల్డ్ పెయింట్‌లో కాపర్ ఉంటుంది.
- కండరాల సంకోచానికి సోడియం అయాన్లు అవసరం.
- ట్రాన్సిస్టర్ల తయారీలో ప్రధానమైంది జెర్మేనియం.
- సహజ సిద్ధంగా లభించే భారాత్మక లోహం యురేనియం.
- ఉప్పునీటి కాఠిన్యానికి కారణమైన ప్రధాన లోహ అయాన్లు కాల్షియం, మెగ్నీషియం.
- తేలికగా ఉండి, గట్టిదనం కోసం విమాన విడిభాగాల తయారీలో మెగ్నీషియంను ఉపయోగిస్తారు.
- బంగారాన్ని లోహాల రాజుగా పిలుస్తారు.



- మన శరీరంలో ఎక్కువగా ఉండే లోహం కాల్షియం.
- ద్విస్వభావం(ఆంఫోటరిక్) ఉన్న అర్ధలోహాలు ఆర్సెనిక్, జెర్మేనియం, ఆంటిమొని, జింక్.
- లిథియం, సోడియం లాంటి లోహాలు గాలిలోనూ అత్యంత చర్యాశీలత చూపుతాయి. అందుకే వీటిని కిరోసిన్ లేదా పారాఫిన్ నూనెలో నిల్వచేస్తారు.
- సోడియం అయాన్లు రక్తపోటును పెంచుతాయి. పొటాషియం అయాన్లు అధిక రక్తపోటును నియంత్రిస్తాయి.
- బాణసంచా తయారీలో విరివిగా వాడే లోహాలు మెగ్నీషియం(మిరుమిట్లు గొలిపే తెలుపు), స్ట్రాన్షియం(సింధూర ఎరుపు).
- ఇమిటేషన్ జ్యువెలరీలో వాడే నికెల్–సిల్వర్‌లో కాపర్,నికెల్,జింక్ ఉంటాయి. సిల్వర్ ఉండదు.

ముఖ్య మిశ్రమ లోహాలు - ఉపయోగాలు

మిశ్రమ లోహం	సంఘటనం	అనువర్తనాలు
ఇత్తడి (బ్రాస్)	కాపర్ + టిన్	పాత్రలు, యంత్రభాగాలు, బుల్లెట్లు
కంచు (బ్రాంజ్)	కాపర్ + టిన్	విగ్రహాలు, పాత్రలు
బెల్ మెటల్	కాపర్ + టిన్ (తగరం)	గంటల తయారీ
మాగ్నాలియం	మెగ్నీషియం + అల్యూమినియం	విమాన, మోటార్ వాహన భాగాలు
గన్‌మెటల్	కాపర్ + టిన్ + జింక్	గేర్లు, బేరింగ్‌లు, తుపాకీ పరిశ్రమ
జర్మన్ సిల్వర్	కాపర్ + జింక్ + నికెల్	పాత్రలు, నగలు, నిరోధక చుట్టలు
స్టెయిన్‌లెస్ స్టీల్	ఐరన్ + కార్బన్ + క్రోమియం + నికెల్	పాత్రలు, బ్లేడ్లు, బాల్ బేరింగ్‌లు, సర్జికల్ పరికరాలు
మాంగనీస్ స్టీల్	ఐరన్ + కార్బన్ + మాంగనీస్	హెల్మెట్లు, రైల్వేట్రాక్, రోడ్ రోలర్లు, రాళ్లను పగులగొట్టే యంత్రాలు
టంగ్‌స్టన్ స్టీల్	ఐరన్ + కార్బన్ + టంగ్‌స్టన్ + కోబాల్ట్ + క్రోమియం	శాశ్వత అయస్కాంతాలు
క్రోమ్ స్టీల్	ఎక్కువ క్రోమియం ఉన్న స్టీల్	వంటపాత్రలు
నిక్రోమ్	ఐరన్ + క్రోమియం + నికెల్	ఇస్త్రీపెట్టెలోని ఫిలమెంట్, ఫ్యూజులు, నిరోధక తీగెలు,
డ్యూరాల్యుమిన్	మెగ్నీషియం + అల్యూమినియం	విమాన భాగాలు
అల్యూమినియం బ్రాంజ్	కాపర్ + అల్యూమినియం+టిన్	ఆభరణాలు, నాణేలు
సోల్డర్	టిన్ + లెడ్	సోల్డరింగ్
డౌమెటల్	మెగ్నీషియం + అల్యూమినియం + జింక్	కార్లు, జలాంతర్గాములు, విమానాల తయారీలో

గత పరీక్షల్లో అడిగిన ప్రశ్నలు

1. ఇత్తడి దేని మిశ్రమం? (Gr-I, 2010)
1) రాగి, అల్యూమినియం
2) రాగి, తగరం (టిన్)
3) రాగి, తుత్తునాగం(జింక్)
4) రాగి, నికెల్
2. 22 క్యారెట్ల బంగారంలో రాగి శాతం? (Gr-I, 2010)
1) 8.4 2) 10.2 3) 11.4 4) 12.6
3. ఇనుము తుప్పు పట్టినప్పుడు దాని బరువు? (AEE, 2011)
1) తగ్గుతుంది 2) పెరుగుతుంది
3) ఒకేలా ఉంటుంది 4) పైవేవీ కావు
4. విద్యుత్ తంతువులో ఉపయోగించే మూలకం? (Gr-I, 2010)
1) అల్యూమినియం 2) రాగి
3) టంగ్‌స్టన్ 4) ఇనుము

సమాధానాలు

1) 3; 2) 1; 3) 2; 4) 3.

మాదిరి ప్రశ్నలు

1. కిందివాటిలో మిశ్రమ లోహం ఏది?
1) గ్రాఫైట్ 2) వజ్రం
3) నిక్రోమ్ 4) తామ్రం
2. సోల్డరింగ్ పనిలో సోల్డర్‌గా ఉపయోగించే పదార్థం ఏ మూలకాల మిశ్రమం?
1) ఇనుము, టిన్ (తగరం) 2) సీసం, తగరం
3) అల్యూమినియం, సిల్వర్
4) అల్యూమినియం, ఐరన్
3. గన్ మెటల్‌లో ఉండే లోహాలు?
1) రాగి 2) తగరం (స్టానస్)
3) జింక్ 4) పైవన్నీ
4. స్టెయిన్‌లెస్ స్టీల్‌లోని లోహాలు?
1) ఐరన్ 2) కార్బన్
3) క్రోమియం 4) 1, 2, 3
5. క్విక్ సిల్వర్ అని దేనికి పేరు?
1) మెర్క్యురీ 2) సిల్వర్
3) ప్లాటినం 4) గోల్డ్
6. విద్యుత్ క్రేన్‌లలో ఉపయోగించే బలమైన అయస్కాంతాల తయారీకి ఉపయోగించేది?
1) స్టీల్ 2) చేత ఇనుము
3) పోత ఇనుము 4) దుక్క ఇనుము
7. అత్యంత స్థితిస్థాపకత(ఎలాస్టిసిటీ) కలిగింది?
1) రబ్బరు 2) స్టీలు
3) సిల్వర్ 4) బంగారం
8. జతపర్చండి.

A
i) 22 క్యారెట్ల బంగారంలో రాగి
ii) 18 క్యారెట్ల బంగారంలో రాగి
iii) ఒక క్యారెట్ బంగారం
iv) 24 క్యారెట్ల బంగారం


B
ఎ) 25 శాతం బి) 2 క్యారెట్లు
సి) 100 శాతం డి) 100/24 శాతం

	i	ii	iii	iv
1)	ఎ	బి	సి	డి
2)	బి	సి	ఎ	డి
3)	బి	ఎ	డి	సి
4)	బి	ఎ	సి	డి

సమాధానాలు

1) 3; 2) 2; 3) 4; 4) 4;
5) 1; 6) 2; 7) 2; 8) 3.

'విజ్ఞాన శాస్త్రంలో కృత్యాలు లేనిదే పాఠ్యాంశం లేదు'



డీఎస్సీ- ప్రత్యేకం
సైన్స్ మెథడాలజీ

మాదిరి ప్రశ్నలు

1. విజ్ఞానశాస్త్ర ఉపాధ్యాయుడు 'Love for the profession, for the subject, for the students' అనే మూడు లక్షణాలు కలిగి ఉండాలని పేర్కొన్న వారెవరు?
1) కొఠారి 2) సర్వేపల్లి రాధాకృష్ణన్
3) మహాత్మా గాంధీ 4) సోక్రటీస్
2. విజ్ఞానశాస్త్ర బోధకులకు వృత్యంతర శిక్షణ అవసరమని సూచించింది ఎవరు?
1) కొఠారి 2) రాధాకృష్ణన్
3) NPE - 1986 4) NCF-2005
3. ఒక ఉపాధ్యాయుడు సి.వి. రామన్‌ను ఆదర్శంగా తీసుకొని బోధన కొనసాగిస్తే కింది వాటిలో దేన్ని అత్యుత్తమైందిగా తీర్చిదిద్దాలి?
1) ప్రయోగశాలను
2) విజ్ఞానశాస్త్ర తరగతి గదిని
3) విజ్ఞానశాస్త్ర క్లబ్‌ను
4) విజ్ఞానశాస్త్ర వస్తు ప్రదర్శనశాలను
4. క్రికెట్ ఆటగాడు బంతిని విసరడానికి దాన్ని తన దుస్తులకు ఎందుకు అనేకసార్లు రుద్దుతాడో విద్యార్థి కారణాలను విశ్లేషిస్తే ఈ స్థాయి 5E నమూనాలో దేనికి చెందుతుంది?
1) విస్తరణ 2) వివరించడం
3) విశ్లేషణ లేదా శోధన 4) మూల్యాంకనం
5. 'సరి చూడగల విజ్ఞాన రాశి' అని విజ్ఞాన శాస్త్రం దేన్ని పేర్కొంది?
1) నియమం 2) సత్యం
3) యదార్థం 4) ప్రయోగం
6. 'పర్యావరణాన్ని కాపాడటమే సమస్త జీవులకు రక్ష' అని వివరించడంలో విద్యార్థి చేరుకున్న వర్గం?
1) వ్యవస్థాపనం 2) శీలస్థాపనం
3) ప్రతిస్పందించడం 4) విలువ కట్టడం
7. విద్యార్థి ప్రావీణ్యం ఉన్నత స్థాయికి చేరుకోవడం ఏ దశలో జరుగుతుంది?
1) అనుకరణ 2) సునిశితత్వం
3) సమన్వయం 4) సహజీకరణ
8. 'నైపుణ్యాలు అనేవి స్వభావంగా మారడం, మానసిక శక్తుల ప్రమేయం లేకుండానే కార్యాలు నిర్వహించడం' అనేది ఏ లక్షణం?
1) సునిశితత్వం 2) అనుకరణ
3) సహజీకరణ 4) సమన్వయం
9. 'జింక్ ముక్కలు.. హైడ్రోక్లోరిక్ ఆమ్లంతో రసాయన స్థానభ్రంశ చర్య జరిపి జింక్ క్లోరైడ్‌ను, హైడ్రోజన్ అనే వాయువును ఏర్పరుస్తాయి' అని విద్యార్థి విజ్ఞానశాస్త్ర పదజాలంలో చెప్పడం ఏ నైపుణ్యం?
1) పరిశీలనా నైపుణ్యం
2) అభివ్యంజన నైపుణ్యం
3) హస్త నైపుణ్యం 4) ప్రయోగ నైపుణ్యం
10. 'విజ్ఞాన శాస్త్రంలో కృత్యాలు లేనిదే పాఠ్యాంశం లేదు' అనే దృఢ విశ్వాసం వెలిబుచ్చిన వారెవరు?
1) పియాజే 2) వైగోట్స్కీ
3) నోవాక్ 4) పోస్నర్
11. యదార్థానికి సంబంధించి కింది వాటిలో సరైంది ఏది?
ఎ) వివాద రహితంగా, మారనివిగా ఉండాలి
బి) యదార్థాలన్నీ శాస్త్రీయ సత్యాలు కావు
సి) ప్రత్యక్షంగా పరిశీలించదగినదై, తగిన ఆధారాలతో రుజువు చేయాలి
డి) యదార్థాలన్నీ శాస్త్రీయ సత్యాలు
1) ఎ, బి, డి 2) బి, సి, డి
3) ఎ, సి, డి 4) ఎ, బి, సి
12. యదార్థాల నుంచి తార్కికంగా ఒక విషయాన్ని నిగమనం చేయడాన్ని ఏమంటారు?
1) ప్రయోగం 2) అనుమితి
3) సూత్రం 4) నియమం
13. భావనలను నియమ బద్ధం చేసి వివరిస్తే అవి?
1) సూత్రాలు 2) నియమాలు
3) సాధారణీకరణాలు 4) సిద్ధాంతం
14. సప్రమాణత కలిగి ఉండి, రెండు యదార్థాల మధ్య సంబంధాన్ని వివరించేవి?
1) భావనలు 2) నియమాలు
3) సాధారణీకరణాలు 4) సిద్ధాంతాలు
15. విద్యార్థి 'మొక్కలను పుష్పించే మొక్కలు, పుష్పించని మొక్కలు అని రెండు రకాలుగా వర్గీకరించారు' అని పేర్కొంటే అతడు సాధించిన లక్ష్యం?
1) జ్ఞానం 2) వినియోగం
3) నైపుణ్యం 4) అవగాహన
16. కింది వాటిలో సరైంది ఏది?
ఎ) మానవ నాగరికత మెసొపొటేమియా, ఈజిప్ట్ మరికొన్ని ప్రదేశాల్లో ప్రారంభమైంది
బి) చైనా నాగరికత మెసొపొటేమియా నాగరికత తర్వాత అభివృద్ధి చెందింది
సి) రోమన్‌లు అనువర్తిత విజ్ఞానశాస్త్రంలో కుతూహలం చూపారు
డి) అణువుల గురించి, భూమి ఏర్పడిన విధానం గురించి భారత్‌లో ముండకోపనిషత్‌లో వివరించారు
1) ఎ, బి, డి 2) బి, సి, డి
3) ఎ, సి, డి 4) ఎ, బి, సి
17. కింది వాటిలో సరికానిది ఏది?
1) 1916లో థామస్ రిపోర్ట్ ఫలితంగా విజ్ఞాన శాస్త్రంలో అత్యున్నత కోర్సులు ప్రారంభించారు
2) ఈజిప్షియన్లు గోడ గడియారం, నీటి గడియారం, నీడ గడియారాలను కనుగొన్నారు
3) గెలిన్ క్రీ.శ. 131-201లో జంతువుల విచ్ఛేదనం చేసి, వాటి లోపలి భాగాలను వివరించాడు
4) 1905లో డార్విన్ థియరీ ఆఫ్ రిలేటివిటీని కనుగొన్నారు
18. శాస్త్రవేత్తలకు సంబంధించి కింది వాటిలో సరైంది ఏది?
ఎ) B9, ఫోలిక్ ఆమ్లాలను విశ్లేషించి అనీమియా వ్యాధికి చికిత్స కనుగొన్నవారు - సుబ్బారావు
బి) ఆంత్రాక్స్ వ్యాధికి ఔషధాన్ని కనుగొన్న వారు - పాశ్చర్
సి) కొత్త పరికరాలు తయారు చేసే మంత్రగాడిగా పేరొందినవారు - ఐన్‌స్టీన్
డి) 1945లో పరమాణు బాంబుల తయారీకి ఉపయోగపడిన సిద్ధాంతం- థియరీ ఆఫ్ ఆటమ్
1) ఎ, డి మాత్రమే 2) బి, సి మాత్రమే
3) బి, డి మాత్రమే 4) ఎ, బి మాత్రమే
19. శాస్త్రీయ పద్ధతిలో మొదట దత్త సేకరణకు ప్రాకల్పనల రూపకల్పనకు తోడ్పడే సోపానం ఏది?
1) దత్తాంశాల ప్రతిక్షేపణ
2) సమస్యలను నిర్వచించడం
3) ప్రాకల్పనలను ప్రతిపాదించడం
4) సమస్య విశ్లేషణ లేదా లక్ష్య నిర్ధారణ
20. 'విజ్ఞానశాస్త్రం మనం ఎలా ఉండాలో నేర్పే జ్ఞాన రాశి' అని పేర్కొన్నవారు?
1) ఐన్‌స్టీన్ 2) ఎ.డబ్ల్యూ. గ్రీన్
3) కార్ల్ పియర్సన్ 4) లెక్సికన్ వెబ్ డిక్షనరీ
21. కింది వాటిలో విజ్ఞాన శాస్త్ర లక్షణాల్లో షో ఆల్టర్ ప్రతిపాదనలో లేనిది ఏది?
ఎ) శాస్త్రీయ జ్ఞానం మానవీయమైంది
బి) శాస్త్రీయ జ్ఞానం అనుభవాత్మకమైంది
సి) వివిధ ప్రదేశాల్లో నిశ్చలంగా ఉంటుంది
డి) శాస్త్రీయ జ్ఞానం పరిమాణాత్మకం, దిశాత్మకం, కృత్యాత్మకం
1) ఎ, డి 2) బి, డి
3) ఎ, బి 4) సి, డి
22. విజ్ఞాన శాస్త్రం అంటే 'ఫలితం' అనే అర్థం ఏర్పడినప్పుడు అది ఏ దృష్టిని కలిగి ఉంటుంది?
1) స్తబ్దదృష్టి 2) గతిశీల దృష్టి
3) హ్రస్వ దృష్టి 4) దీర్ఘ దృష్టి
23. కింది వాటిలో శాస్త్రీయ సత్యం కానివి ఏవి?
ఎ) మొక్కలు నీటిని పీల్చుకుంటాయి
బి) వేడి చేస్తే పదార్థాలు వ్యాకోచిస్తాయి
సి) లోహాలు ఘన స్థితిలో ఉంటాయి
డి) అలోహాలు తమ గుండా విద్యుత్‌ను ప్రవహించనీయవు
1) ఎ, డి మాత్రమే 2) బి, డి మాత్రమే
3) సి, డి మాత్రమే 4) ఎ, సి మాత్రమే
24. విజ్ఞానశాస్త్ర నిర్మాణానికి మూలం?
1) పరిశీలన 2) ప్రయోగం
3) పరికల్పన 4) అన్వేషణ
25. కర్బన రసాయన శాస్త్ర పితామహుడు ఎవరు?
1) కె. కులే 2) జేమ్స్ బెంజిమన్
3) క్రిస్టఫర్ ఐలర్ 4) ఫ్రెడరిక్ ఓలర్
26. 'విజ్ఞానశాస్త్రం వల్లనే నేటి మానవుడి సగటు ఆయుః ప్రమాణం పెరిగింది' ఈ వాక్యాన్ని సమర్థించే విజ్ఞాన శాస్త్ర విలువ?
1) ఉపయోగిత 2) సృజనాత్మక
3) బౌద్ధిక 4) క్రమశిక్షణ విలువ
27. 'ప్రయోగ శాలలో ఫలితాలు ఎల్లవేళలా సౌకర్యవంతగా ఉండవు అయినా శాస్త్రవేత్తలు తమ ప్రయత్నాలు వదిలిపెట్టరు' ఈ లక్షణం ఏ విలువలోనిది?
1) సృజనాత్మకత 2) బౌద్ధిక
3) నైతిక 4) క్రమశిక్షణ
28. పాఠ్య ప్రణాళికను విద్యార్థి నిజ జీవితానికి, నేర్చుకునే పాఠ్యాంశాలకు మధ్య వ్యత్యాసం లేకుండా నిర్మిస్తే అది ఏ సూత్రం పాటించనట్లు అవుతుంది?
1) సృజనాత్మకత
2) మొత్తం అనుభవాల సూత్రం
3) ఉపయోగిత సూత్రం
4) జీవిత కేంద్రిత సూత్రం
29. పోర్ట్‌ఫోలియోలను మదింపు చేయడానికి విద్యార్థి వేటిని ఉపయోగిస్తారు?
ఎ) రూబ్రిక్స్ బి) శోధన సూచిక
సి) నిర్ధారణ మాపని
డి) సంఘటన రచనావళి
1) ఎ, సి 2) బి, డి
3) ఎ, బి 4) బి, సి
30. ప్రవర్తనా వికాసం నమోదు సాధనం?
1) రేటింగ్ స్కేల్ 2) పోర్ట్ ఫోలియో
3) రూబ్రిక్స్ 4) శోధన సూచిక
31. తార్కిక శక్తిని పెంచడంలో ఏ ప్రశ్నలు ఎన లేనివి?
1) సాదృశ్య ప్రశ్నలు 2) బహుళైచ్ఛికాలు
3) బహుళ ప్రతి స్పందనలు
4) జతపరిచే ప్రశ్నలు
32. 'సిస్మోగ్రాఫ్‌ను ఉపయోగించి కొలిచే అంశం ____' పై ప్రశ్న ద్వారా విజ్ఞాన శాస్త్రంలో ఏ విద్యా ప్రమాణాన్ని సాధించవచ్చు?
1) AS_1 2) AS_2 3) AS_3 4) AS_4
33. ఢిల్లీలో బస్సులన్నీ సీఎన్జీతో నడుస్తున్నాయి. ఇది పర్యావరణానికి శ్రేయస్కరం అనడానికి కారణం ఏమిటి? ఈ ప్రశ్న ద్వారా రాబట్టే విద్యా ప్రమాణం?
1) ప్రశ్నించడం - పరికల్పన
2) సమాచార సేకరణ 3) విషయావగాహన
4) ప్రశంస, విలువలు, నిజ జీవిత వినియోగం
34. 1931లో ప్రారంభించి, ప్రస్తుతం ఉదయ్‌పూర్, 14 ఉదయ్‌పూర్ పరిసర ప్రాంతాల్లో విస్తరించి, ఉపాధ్యాయ శిక్షణ, విద్యా సంబంధ పరిశోధనలకు ఉపయోగపడుతున్న సంస్థ?
1) విక్రమశిల 2) శిక్ష మిత్ర
3) జోడో జ్ఞాన్ 4) విద్యా భవన్
35. తరగతి గదిలోని సమస్యకు ఆచరణీయమైన పరిష్కారాలను కనుగొనడానికి ఉపయోగపడుతున్న సంస్థ?
1) జోడో జ్ఞాన్ 2) విక్రమశిల
3) విద్యా భవన్ 4) ఖాన్ అకాడమీ
36. ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులను దృష్టి లో ఉంచుకొని 1989లో ఏర్పాటు చేసిన పత్రిక ఏది?
1) జోడో జ్ఞాన్ 2) ఖాన్ అకాడమీ
3) టీచర్ ప్లస్ 4) విక్రమశిల
37. మొగ్గ పువ్వుగా విడివడే సందర్భం, పిండం శిశువుగా అభివృద్ధి చెందడం లాంటి అంశాల బోధనకు చక్కగా ఉపయోగపడేది?
1) ఉపన్యాసం 2) ఉపన్యాస ప్రదర్శన
3) సిమ్యులేషన్ అండ్ గేమింగ్
4) ప్రయోగశాల
38. కింది వాటిలో ఏవి థారన్‌డైక్ అభ్యసన సూత్రమైన సంసిద్ధతా నియమాన్ని తృప్తి పరుస్తాయి?
1) కంప్యూటర్ 2) చలన చిత్రం
3) పునశ్చరణ చిత్రాలు 4) ఫిల్మ్ స్ట్రిప్స్
39. బోధనలో వస్తువులకు, చిత్రాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించిన వారు?
ఎ) ప్రొబెల్ బి) పెస్టాలజీ
సి) కొమెనియస్ డి) రూసో
1) ఎ, సి 2) బి, సి 3) ఎ, డి 4) ఎ, బి
40. ప్రాంతీయ విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు ప్రారంభమైన సంవత్సరం?
1) 1967-68 2) 1968-69
3) 1965-66 4) 1964-65
41. మ్యూజియానికి సంబంధించి కింది వాటిలో సరైన అంశాలేవి?
ఎ) ఇది మౌసీన్ అనే గ్రీక్ పదం నుంచి ఉద్భవించింది
బి) వస్తు ప్రదర్శన శాలలు విద్యార్థుల్లో సహజమైన కుతూహలాన్ని కలిగిస్తాయి
సి) పాఠశాలల్లో ప్రయోగశాలల్లో చేయని ప్రయోగాలను మ్యూజియంలో చేయవచ్చు
డి) పాఠ్య పుస్తకాలు అదించలేని జ్ఞానాన్ని ప్రదర్శన శాలలు అందిస్తాయి
1) ఎ, బి, డి 2) ఎ, బి, సి
3) బి, సి, డి 4) ఎ, సి, డి
42. 'అందరూ నన్ను ఒక గుడ్ టీచర్ అంటారు! అందులో నిజం లేదు. నేను చేసిందల్లా విద్యార్థులను ఆలోచించేలా తీర్చిదిద్దడమే' అని వ్యాఖ్యానించిన వారు?
1) సర్వేపల్లి రాధాకృష్ణన్
2) కొఠారి 3) సోక్రటీస్
4) సి.వి. రామన్
43. విద్యార్థులకు వారి అభ్యసనా స్థాయిని మెరుగుపరుచుకోవడానికి అవకాశం కల్పించే 5Eలోని దశ?
1) నిమగ్నం 2) శోధన
3) వివరణ 4) విస్తరణ
44. 'అన్వేషణ పద్ధతి ద్వారా విద్యార్థికి విజ్ఞాన సముపార్జన కంటే శాస్త్రీయ విధానానికి ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు' అని పేర్కొన్న వారు?
1) ఆర్మ్‌స్ట్రాంగ్ 2) బెస్ట్
3) వేబెస్ట్ 4) వెస్ట్ వే
45. సాధారణీకరణాలు అనేవి రాబట్టడానికి కావలసినన్ని ఉదాహరణలు లేదా సమాచారం అవసరం. దీనికి అనువైన విధానం ఏది?
1) ఆగమనం 2) నిగమనం
3) సర్వే 4) ప్రాజెక్ట్
46. వేగానికి ప్రమాణాలు మీ./సె. అని విద్యార్థి తెల్పితే అతడు సాధించిన లక్ష్యం?
1) అవగాహన 2) జ్ఞానం
3) వినియోగం 4) నైపుణ్యం
47. జాతీయ పాఠ్యప్రణాళిక - 2005 ప్రకారం పాఠ్యాంశాలను ఏ ప్రాతిపదికపై రూపొందించారు?
1) విజ్ఞానం కోసం విద్య
2) అనుభవం ద్వారా విద్య
3) కృత్యం ద్వారా విద్య
4) శాంతి కోసం విద్య
48. విద్యార్థి పద్ధతులను నేర్చుకోవడం అనేది ఎలాంటి ఉపగమం?
1) నిగమన 2) ఆగమన
3) సంశ్లేషణ 4) 5E మోడల్
49. ప్రయోగశాల పద్ధతిలో ఏ విధానంలో ప్రతీ విద్యార్థి బాధ్యతాయుతంగా పని చేస్తారు?
1) డివిజన్ లేదా భాగ పద్ధతి
2) సమూహ పద్ధతి లేదా రొటేషన్ పద్ధతి
3) క్లాస్ ఫ్రంట్ మెథడ్
4) హోల్ క్లాస్ మెథడ్
50. RCEM ప్రకారం ప్రస్తుతం ఉపయోగిస్తున్న సోపానాల్లో విద్యార్థి జ్ఞానేంద్రియాలకు పని కల్పించే దశ?
1) ప్రవేశ వ్యాసక్తి 2) వికాస వ్యాసక్తి
3) అంత్యదశ వ్యాసక్తి
4) పూర్వ ప్రారంభ వ్యాసక్తి

సమాధానాలు

1) 2 2) 3 3) 2 4) 1 5) 4
6) 2 7) 2 8) 3 9) 2 10) 1
11) 4 12) 2 13) 3 14) 2 15) 1
16) 4 17) 4 18) 4 19) 4 20) 1
21) 4 22) 1 23) 3 24) 4 25) 1
26) 1 27) 4 28) 4 29) 4 30) 4
31) 1 32) 1 33) 2 34) 4 35) 1
36) 3 37) 3 38) 2 39) 4 40) 4
41) 1 42) 3 43) 3 44) 4 45) 3
46) 1 47) 4 48) 2 49) 1 50) 2

భారతరత్న పురస్కారం పొందిన తొలి గాయని?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ

మాదిరి ప్రశ్నలు

1. స్వామి వివేకానంద ఎప్పుడు జన్మించారు?
   1) 1861 జనవరి 12 2) 1863 జనవరి 21
   3) 1862 జనవరి 16 4) 1863 జనవరి 12
2. జతపరచండి.
   జాబితా-I
   i) 1875 ii) 1866 iii) 1839 iv) 1833
   జాబితా-II
   a) తత్వబోధిని సభ స్థాపన
   b) దివ్యజ్ఞాన సమాజం స్థాపన
   c) రాజా రామ్మోహన్ రాయ్ మరణం
   d) రామకృష్ణ పరమహంస మరణం
   1) i-d, ii-c, iii-b, iv-a
   2) i-b, ii-d, iii-a, iv-c
   3) i-a, ii-b, iii-c, iv-d
   4) i-c, ii-a, iii-d, iv-b
3. రాజా రామ్మోహన్ రాయ్ జీవిత చరిత్రను ప్రచురించిందెవరు?
   1) సోఫియా డాబ్సన్ కోలెట్
   2) వాలంటైన్ చిరోల్ 3) జాన్ డిగ్బీ
   4) విలియం ఆడమ్ డాబ్సన్
4. కింది వాటిలో సరికాని జత ఏది?
   1) దీనబంధు - సి.ఆర్. దాస్
   2) మహామాన్య - మదన్ మోహన్ మాలవ్యా
   3) దేశభక్తుల్లో రాజు - బాలగంగాధర్ తిలక్
   4) భారతదేశ సాంస్కృతిక రాయబారి - స్వామి వివేకానంద
5. థియోడర్ బెక్ అనే ఆంగ్లేయుడు పని చేసిన కళాశాల ఏది?
   1) కాశీ విద్యాపీఠ్
   2) మదనపల్లి జాతీయ కళాశాల
   3) అలీగఢ్ కళాశాల
   4) రాజమండ్రి కళాశాల
6. షెడ్యూల్డ్ కులాల ఫెడరేషన్‌ను అంబేడ్కర్ ఎప్పుడు నెలకొల్పారు?
   1) 1924 2) 1932 3) 1938 4) 1942
7. కింది వాటిలో సరికాని జత ఏది?
   1) వైకోం సత్యాగ్రహం - ఇ.వి. రామస్వామి నాయకర్
   2) 'ఇషారా' గ్రంథం - జ్యోతిరావ్ పూలే
   3) అలీగఢ్ ఉద్యమం-ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్
   4) దివ్యజ్ఞాన సమాజం - మేడం బ్లావట్స్కీ
8. జవహర్‌లాల్ నెహ్రూ రాసిన 'డిస్కవరీ ఆఫ్ ఇండియా' గ్రంథాన్ని 'భారతదేశం' అనే పేరుతో తెలుగులోకి అనువదించిందెవరు?
   1) మద్దూరి అన్నపూర్ణయ్య
   2) క్రొవ్విడి లింగరాజు
   3) బులుసు సాంబమూర్తి
   4) బ్రహ్మజోస్యుల సుబ్రహ్మణ్యం
9. గాంధీజీ భారత్‌లో జరిగిన ఏ ఉద్యమాన్ని 'రక్తరహిత విప్లవం' అని ప్రశంసించాడు?
   1) కూలీ - బెగార్ ఉద్యమం (కమావ్)
   2) క్విట్ ఇండియా ఉద్యమం (బొంబాయి)
   3) శాసనోల్లంఘన ఉద్యమం
   4) చంపారాన్ సత్యాగ్రహం
10. శారదా దేవి ఏ ప్రముఖుడి తల్లి?
    1) స్వామి వివేకానంద
    2) బంకించంద్ర ఛటర్జీ
    3) రవీంద్రనాథ్ ఠాగూర్ 4) భగత్ సింగ్
11. 'సత్యానికి అంకితం' అనే నినాదం ఏ యూనివర్సిటీకి చెందింది?
    1) కలకత్తా 2) బొంబాయి
    3) మద్రాస్ 4) ఢిల్లీ
12. కింది వాటిలో సరికాని జత?
    1) భగవద్గీత (ఆంగ్లీకరణ) - సర్ ఛార్లెస్ విల్కిన్స్
    2) అభిజ్ఞాన శాకుంతలం (ఆంగ్లీకరణ) - సర్ విలియం జోన్స్
    3) అశోకుడి శిలాశాసనాల అధ్యయనం - రాబర్ట్ బ్రూస్ ఫుట్
    4) వేమన పద్యాలు (ఆంగ్లీకరణ) - సర్ సి.పి. బ్రౌన్
13. షేక్ నాజర్ అనే బుర్రకథ కళాకారుడి జీవిత చరిత్ర గ్రంథం ఏది?
    1) అనంతం 2) యాత్ర
    3) పింజారీ 4) మట్టి మనిషి
14. జతపరచండి.
    జాబితా-I
    i) జనవరి 4 ii) ఏప్రిల్ 6
    iii) జూన్ 21 iv) అక్టోబర్ 16
    జాబితా-II
    a) యోగా దినోత్సవం
    b) అఖిల భారత ఖైదీల దినోత్సవం
    c) బెంగాల్ శోకదినం
    d) రౌలత్ సత్యాగ్రహ దినోత్సవం
    1) i-c, ii-a, iii-d, iv-b
    2) i-b, ii-d, iii-a, iv-c
    3) i-d, ii-c, iii-b, iv-a
    4) i-a, ii-b, iii-c, iv-d
15. 'ఆకాశంలో సగం' నవల రాసిందెవరు?
    1) ఓల్గా 2) గోగు శ్యామల
    3) జయప్రభ 4) వకుళాభరణం లలిత
16. జతపరచండి.
    నృత్యం:
    i) భరత నాట్యం ii) మోహినీ అట్టం
    iii) కూచిపూడి iv) సత్రియ
    జాబితా-II
    a) కేరళ b) తమిళనాడు
    c) అసోం d) ఆంధ్రప్రదేశ్
    1) i-d, ii-a, iii-c, iv-b
    2) i-c, ii-b, iii-a, iv-d
    3) i-a, ii-c, iii-d, iv-b
    4) i-b, ii-a, iii-d, iv-c
17. 1923లో భారత జాతీయ కాంగ్రెస్ వార్షిక సమావేశం ఎక్కడ నిర్వహించారు?
    1) విజయవాడ 2) హైదరాబాద్
    3) జోగిపేట 4) కాకినాడ
18. తొలి తెలుగు టాకీ చిత్రం ఏది?
    1) భీష్మ ప్రతిజ్ఞ 2) మాలపిల్ల
    3) రైతుబిడ్డ 4) భక్త ప్రహ్లాద
19. 'జనగణమన'ను తొలిసారిగా ఏ ఐఎన్‌సీ సమావేశంలో ఆలపించారు?
    1) 1891 - కలకత్తా 2) 1911 - కలకత్తా
    3) 1916 - లక్నో 4) 1924 - బెల్గాం
20. కింది వాటిలో సరికాని జత ఏది?
    1) మధ్యయుగ భారతదేశ కారల్ మార్క్స్ - కబీర్
    2) ఇండియన్ ఐన్‌స్టీన్ - చరకుడు
    3) ఇండియన్ నెపోలియన్ - సముద్ర గుప్తుడు
    4) దక్షిణ భారతదేశ గోఖలే - మోచర్ల రామ చంద్రరావు
21. జతపరచండి.
    గ్రంథం:
    i) దండియాత్ర ii) మాటల మడుగు
    iii) ఆకు కదలని చోటు
    iv) చిట్టగాంగ్ విప్లవ వనితలు
    రచయిత:
    a) మెర్సీ మార్గరేట్ b) చైతన్య పింగళి
    c) బాల సుధాకర్ మౌళి
    d) కుందుర్తి ఆంజనేయులు
    1) i-b, ii-c, iii-d, iv-a
    2) i-a, ii-d, iii-b, iv-c
    3) i-d, ii-a, iii-c, iv-b
    4) i-a, ii-b, iii-d, iv-c
22. కింది వాటిలో సరైన జత ఏది?



    1) నానా సాహెబ్ - దొండూ పండిట్
    2) తాంతియా తోపే-రామచంద్ర పాండురంగ
    3) ఝాన్సీ లక్ష్మీబాయి - మణికర్ణిక
    4) పైవన్నీ సరైనవే
23. 1998లో సంగీత రంగానికి చేసిన సేవలకు భారతరత్న పురస్కారం పొందిన తొలి గాయని?
    1) లతా మంగేష్కర్
    2) ఎం.ఎస్. సుబ్బులక్ష్మి
    3) పి. సుశీల 4) ఎస్. జానకి
24. కింది వాటిలో ఏ నిర్మాణం హిందూ-ముస్లిం వాస్తు శైలిని అనుసరించి నిర్మించారు?
    1) చార్మినార్ 2) కమలపు మందిరం
    3) కుతుబ్ మినార్ 4) వేయి స్తంభాల గుడి
25. జతపరచండి.
    పత్రిక:
    i) అల్ హిలాల్ ii) ఇమ్రోజ్
    iii) ఇంక్విలాబ్ iv) కామ్రేడ్
    స్థాపకులు:
    a) షోయబుల్లా ఖాన్
    b) గులాం హుస్సేన్ c) మహమ్మద్ అలీ
    d) మౌలానా అబుల్ కలాం ఆజాద్
    1) i-d, ii-c, iii-b, iv-a
    2) i-a, ii-b, iii-c, iv-d
    3) i-d, ii-a, iii-b, iv-c
    4) i-c, ii-a, iii-d, iv-b
26. దాదాభాయ్ నౌరోజీ జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నిసార్లు వ్యవహరించారు?
    1) 3 2) 4 3) 5 4) 6
27. భారత స్వాతంత్రోద్యమంలో జరిగిన సంఘటనల వరుసక్రమాన్ని అనుసరించి కింది వాటిలో సరైంది ఏది?
    1) సైమన్ కమిషన్ వ్యతిరేకోద్యమం, శాసనోల్లంఘనోద్యమం, హోంరూల్ ఉద్యమం
    2) హోంరూల్ ఉద్యమం, సహాయ నిరాకరణోద్యమం, క్విట్ ఇండియా ఉద్యమం
    3) క్విట్ ఇండియా ఉద్యమం, సహాయ నిరాకరణ ఉద్యమం, వ్యక్తి సత్యాగ్రహం
    4) సహాయ నిరాకరణోద్యమం, హోంరూల్ ఉద్యమం, క్విట్ ఇండియా ఉద్యమం
28. బ్రిటిష్ ప్రధాని అట్లీ భారత్‌కు స్వాతంత్ర్యాన్ని ప్రకటిస్తున్నట్లు ఏ తేదీన ప్రకటించాడు?
    1) 1947 జనవరి 16 2) 1947 ఫిబ్రవరి 20
    3) 1947 మార్చి 23 4) 1947 ఏప్రిల్ 29
29. సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ ఎప్పుడు జన్మించారు?
    1) 1883 సెప్టెంబర్ 16 2) 1885 అక్టోబర్ 31
    3) 1874 నవంబర్ 11 4) 1875 అక్టోబర్ 31
30. చిట్టగాంగ్ ఆయుధ కర్మాగార దోపిడీ చేసిందెవరు?
    1) సూర్యసేన్ 2) చంద్రశేఖర్ ఆజాద్
    3) రాస్ బిహారీ బోస్ 4) ఉద్ధం సింగ్
31. కింది వాటిలో సరైన జత ఏది?
    1) సివిల్ మ్యారేజ్ యాక్ట్ - 1872
    2) శాంతినికేతన్ స్థాపన - 1921
    3) పూనా ఒప్పందం - 1932
    4) పైవన్నీ సరైనవే
32. 1857 సిపాయిల తిరుగుబాటు సమయంలో ఢిల్లీ ముట్టడిలో బ్రిటిషర్లు సాగించిన దారుణ హింసాకాండను వర్ణించిన ఉర్దూ కవి?
    1) మీర్జా గాలిబ్ 2) బడే గులాం అలీ
    3) అల్తాఫ్ హుస్సేన్ అలీ
    4) హస్రత్ మోహానీ
33. హైదరాబాద్‌లో రవీంద్ర భారతిని ఎప్పుడు ప్రారంభించారు?
    1) 1959 2) 1961 3) 1964 4) 1966
34. జలియన్ వాలాబాగ్ స్మారక స్తూపం నిర్మించిన ఆర్కిటెక్ట్ ఎవరు?
    1) జార్జి విటెట్టెట్ 2) జాన్ బెగ్
    3) బెంజిమన్ పోల్క్ 4) ఫ్రాన్సిస్ లోర్న్
35. లార్డ్ రిప్పన్ భారత్‌ను వదిలి వెళ్లాల్సిన పరిస్థితికి కారణం?
    1) స్థానిక స్వపరిపాలనా చట్టం
    2) కర్మాగార చట్టం
    3) సామాన్య సేవా నియుక్త చట్టం
    4) ఇల్బర్ట్ బిల్లు వివాదం
36. కింది వాటిలో సరైంది ఏది?
    1) సామంత సంబంధ నిరోధ విధానం - మార్క్వెస్ ఆఫ్ హేస్టింగ్స్
    2) ప్రాంతీయ భాషా పత్రికల నిషేధ చట్టం - లార్డ్ లిట్టన్
    3) శాశ్వత శిస్తు నిర్ణయ పద్ధతి - లార్డ్ కారన్ వాలిస్
    4) పైవన్నీ సరైనవే
37. క్రీ.పూ. 6వ శతాబ్దంలో 60 రోజుల్లో వర్షాకాలంలో వరి పంటను పండించే విధానాన్ని ఏమంటారు?
    1) కుసుదిన్ 2) శతమాన
    3) స్వస్తిక 4) భోజక
38. శివాజీకి సంబంధించి కింది వాటిలో సరైన జత ఏది?
    1) సంరక్షకుడు - దాదాజీ కొండదేవ్
    2) ఆధ్యాత్మిక గురువు - సమర్థ రామదాసు
    3) కుమారుడు - శంభాజీ
    4) పైవన్నీ సరైనవే
39. కింది వాటిలో సరికాని జత ఏది?
    1) మహాసముద్ర సంగమం - ధారాషుకోవ్
    2) పండితారాధ్య చరిత్ర - పాల్కురికి సోమనాథుడు
    3) రాయవాచకం - స్థానపతి
    4) చతుర్వర్గ సారం - అమోఘవర్షుడు
40. జతపరచండి.
    జాబితా-I
    i) రెండో అరిస్టాటిల్
    ii) ఇండియన్ మాఖియవెల్లి
    iii) దేవనాం ప్రియ iv) శీలాదిత్య
    జాబితా-II
    a) కౌటిల్యుడు b) అశోకుడు
    c) హర్షుడు d) రెండో మహమ్మద్ షా
    1) i-b, ii-c, iii-d, iv-a
    2) i-d, ii-a, iii-b, iv-c
    3) i-d, ii-a, iii-c, iv-b
    4) i-a, ii-b, iii-d, iv-c
41. 'భారత సేవకుల సంఘం'ను స్థాపించింది ఎవరు?
    1) సురేంద్రనాథ్ బెనర్జీ
    2) గోపాల కృష్ణ గోఖలే
    3) మహాదేవ గోవింద రనడే
    4) బాలగంగాధర తిలక్
42. 'దివాన్-ఇ-రియాసత్' అనే శాఖను ఢిల్లీ సుల్తాన్‌లు దేని నిర్వహణ కోసం ఏర్పాటు చేశారు?
    1) మార్కెట్ ధరల నియంత్రణకు
    2) దాన ధర్మాల నిర్వహణకు
    3) బానిసలను పోషించడానికి
    4) వ్యవసాయాన్ని అభివృద్ధి పరచడానికి

సమాధానాలు

1) 4	2) 2	3) 1	4) 1	5) 3
6) 4	7) 3	8) 2	9) 1	10) 3
11) 4	12) 3	13) 3	14) 2	15) 1
16) 4	17) 4	18) 4	19) 2	20) 2
21) 3	22) 4	23) 2	24) 2	25) 3
26) 1	27) 2	28) 2	29) 4	30) 1
31) 4	32) 1	33) 2	34) 3	35) 4
36) 4	37) 3	38) 4	39) 4	40) 2
41) 2	42) 1			

The author of the Passage mentions..

MODEL QUESTIONS

Directions (Q.No. 1-5): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

1. Some fans feel that sports events are exciting (1)/ only when the competitors (2)/ were of equal ability, (3)/ making the outcome of the game uncertain. (4)/ No error (5)
2. The consumer advocate claimed that (1)/ while drug manufacturers tout the supposed advantages of their proprietary brands, (2)/ generic versions of the same medications (3)/ are often equally efficacy. (4)/ No error (5)
3. The politician's speech to the crowd (1)/ was composed of nothing but, (2)/ diatribes a bitter railing (3)/ against the party's opponents. (4)/ No error(5)
4. Favoring economy of expression in writing, (1)/ the professor urged students (2)/ toward a spare rather than (3)/ a ornate prose style. (4)/ No error (5)
5. Researchers are experimenting with various techniques (1)/ for preventing the accumulation off water (2)/ of high levels of nitrogen, (3)/ which can kill plants and animals. (4)/ No error (5)

Directions: (Q.No. 6 - 10) Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

6. It was his winning that bothered me, not my lost.
   1) not my loss 2) not my loose
   3) not my losing
   4) not him losing
   5) no correction required
7. Talking to him was one thing, but to reprimand him was entirely another!
   1) Talk to him was one thing, but to reprimand him was entirely another!
   2) Talking to him was one thing, but reprimand to him was entirely another!
   3) Talking to him was one thing, but reprimand him was entirely another!
   4) Talking to him was one thing, but reprimanding him was entirely another!
   5) No correction required
8. The Republic will likely fall.
   1) The Republic is likely to fall.
   2) The Republic liking to fall.
   3) The Republic likely is to fall.
   4) The Republic is likely falling.
   5) No correction required
9. The bird had flown for miles before it landed.
   1) flown for miles before it landed
   2) has flown for miles before it landed
   3) had been flown for miles before it landed
   4) flew for miles before it landed
   5) No correction required
10. In recent years, Satish has tried to lose its excess weight through numerous diets.
    1) In recent years, Satish had tried to lose its excess weight through numerous diets.
    2) In recent years, Satish has tried to lose his excess weight through numerous diets.
    3) In recent years, Satish have tried to lose his excess weight through numerous diets.
    4) In recent years, Satish tried to lose its excess weight through numerous diets.
    5) No correction required

Directions (Q. No. 11-15): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

11. Harish's ____ tone endeared him to his comical friends, but _____ his serious father.
    1) aloof, motivated
    2) jesting, irritated
    3) grave, forced
    4) earnest, annoyed
    5) conservative, grave
12. Balaraj's pale Irish skin was ____ to burn if he spent too much time in the sun.
    1) prone 2) urbane
    3) eminent 4) erect
    5) daunted
13. A _______ of historical fiction, Josthna is now reading a novel about slavery in the _______ South.
    1) buff, decorous
    2) devotee, rogue
    3) supporter, droll
    4) fan, antebellum
    5) follower, onerous
14. Over the years the Wilsons slowly _____ upon the Jacksons' property, moving the stone markers that divided their lots farther and farther onto the Jacksons' land.
    1) encroached 2) jettisoned
    3) conjoined 4) repudiated
    5) teemed
15. Mary became ______ at typing because she practiced every day for six months.
    1) dexterous 2) reflective
    3) dormant 4) redundant
    5) valiant

Directions (Q.No. 16-20): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A) When I was twelve, my mother took cooking classes and learned to make French and Italian dishes.
B) We ate pansit lug-lug (a noodle dish) and my father put patis (salty fish sauce) on everything.
C) Food has always been considered one of the most salient markers of cultural traditions.
D) When I was in high school, we ate chicken marsala and shrimp fradiablo more often than Filipino dishes like pansit lug-lug.
E) However, even this connection lessened as I grew older. As my parents became more acculturated, we ate less typically Filipino food.



F) When I was a small child, food was the only thing that helped identify my family as Filipino American.

16. What is the FIRST sentence after rearrangement?
    1) A 2) B 3) C
    4) D 5) E
17. What is the LAST sentence after rearrangement?
    1) A 2) B 3) D
    4) F 5) E
18. What is the SECOND sentence after rearrangement?
    1) A 2) B 3) D
    4) E 5) F
19. What is the THIRD sentence after rearrangement?
    1) B 2) A 3) C
    4) D 5) E
20. What is the FOURTH sentence after rearrangement?
    1) A 2) B 3) C
    4) D 5) E

Directions (Q.No. 21-25): Read the following passage carefully and answer the questions given below it. Certain words have been printed in bold to help you locate them while answering some of the questions.

Generations of science-fiction movies have conditioned us to consider bug-eyed monsters, large-brained intellectual humanoids, and other rather sophisticated extraterrestrial creatures as typical examples of life outside Earth. The reality, however is that finding any kind of life at all, even something as simple as bacteria, would be one of the most exciting discoveries ever made. The consensus within the scientific community seems to be that we eventually will find not only life in other parts of the galaxy but also intelligent and technologically advanced life. I have to say that I disagree. While I believe we will find other forms of life in other solar systems (if not in our own), I also feel it is extremely unlikely that a large number of advanced technological civilizations are out there, waiting to be discovered. The most succinct support for my view comes from Nobel laureate physicist Enrico Fermi, the man who ran the first nuclear reaction ever controlled by human beings. Confronted at a 1950 luncheon with scientific arguments for the ubiquity of technologically advanced civilizations, he supposedly said, "So where is everybody?" This so-called Fermi Paradox embodies a simple logic. Human beings have had modern science only a few hundred years, and already we have moved into space. It is not hard to imagine that in a few hundred more years we will be a star faring people, colonizing other systems. Fermi's argument maintains that it is extremely unlikely that many other civilizations discovered science at exactly the same time we did. Had they acquired science even a thousand years earlier than we, they now could be so much more advanced that they would already be colonizing our solar system. If, on the other hand, they are a thousand years behind us, we will likely arrive at their home planet before they even begin sending us radio signals. Technological advances build upon each other, increasing technological abilities faster than most people anticipate. Imagine, for example, how astounded even a great seventeenth-century scientist like Isaac Newton would be by our current global communication system, were he alive today. Where are those highly developed extraterrestrial civilizations so dear to the hearts of science-fiction writers? Their existence is far from a foregone conclusion.

21. The author of the Passage mentions 'monsters,' 'humanoids,' and 'creatures' primarily to
    1) question the literary value of science fiction
    2) contrast fictional notions with a scientific perspective
    3) offer examples of the human fear of the unknown
    4) criticize science fiction for being unduly alarmist
    5) suggest that scientific research has been influenced by science fiction
22. 'ran' most nearly means:
    1) Fled 2) Accumulated
    3) Traversed 4) Managed
    5) Incurred
23. The Passage suggests that the Fermi Paradox depends most directly on which assumption?
    1) Extraterrestrial civilizations may not wish to be discovered by human beings.
    2) Extraterrestrial civilizations would most likely have discovered technology at about the same time human beings discovered it.
    3) Extraterrestrial technology would develop at roughly the same rate as human technology.
    4) Extraterrestrial civilizations would inevitably use technology for aggressive ends.
    5) Science is a more powerful form of human knowledge than are art and literature.
24. The author of the Passage mentions Isaac Newton in order to
    1) emphasize the rapid rate of technological innovation
    2) acknowledge the impact of a profound thinker
    3) criticize the inflexibility of Newton's contemporaries
    4) speculate about Newton's influence on current research
    5) highlight the value of scientific curiosity
25. The antonym of foregone is:
    1) Unavoidable 2) Inescapable
    3) Inevitable 4) Uncertain
    5) Unpreventable

KEY

1) 3	2) 4	3) 5	4) 4	5) 2
6) 3	7) 4	8) 1	9) 5	10) 2
11) 2	12) 1	13) 4	14) 1	15) 1
16) 3	17) 3	18) 5	19) 1	20) 5
21) 2	22) 4	23) 3	24) 1	25) 4